RNI No. APTEL/2003/12253

# భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

ज्ञान-विज्ञान विमुक्तये
UGC
University Grants Commission
UGC Care List Group - 1
Journal Sl. No 34 under
Arts and Humanities
Category

# BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

Vol : 18 Issue No. 9 Monthly September 2021 ISSN No. : 2456-4702 Rs. : 15/-






మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao

E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

**Vol. 18 - Issue. 9 - September 2021 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-**



## EDITORIAL BOARD

*Chief Editor*

**PITTA SANTHI**

***M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,***

**C/o. Dr. Busi Venkataswamy**

Holy Homes Apartment, Postal colony ,

4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

## ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
   Dept. of Telugu,
   Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
   Dept. of Telugu,
   Sri Padmavathi Mahila University,
   Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
   Dept. of Telugu, Faculty of Arts,
   Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
   HOD & Research Guide, Dept. of Telugu
   PAS College, Pedanandipadu.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
   Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Dr. Ponnama Reddy Kumari Neeraja** M.A., Ph.D.
   HOD, Dept. of Telugu,
   Govt. Degree College, Puttur, Chittor Dist.

## ASSOCIATE EDITORS

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor,
   Dept. of Telugu & Comparative Literature,
   Sri Krishna Deva Raya University,
   Ananthapuram, Andhra Pradesh.
2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
   HOD, Dept. of Telugu,
   Madras University,
   CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor, Dept.of Hindi,
   Moulana Azad National Urdu University,
   HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
   Board of Studies Chairman,
   Telangana University, Dichpally,
   Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
   Dept. of Telugu & O.L.,
   Acharya Nagarjuna University,
   Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
   Associate Professor, Dept. of Telugu,
   Kakatiya University, Warangal District.
   Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr. D.ESWARA RAO,** M.A.,
Principal,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

14. **Dr. K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu, C.R. Reddy College,
West Godavari District. A.P.

15. **Dr. G. Swarnalatha,** M.A., PhD.
Asst. Proffesor, Dept. of Telugu,
Govt. Women's College (A), Guntur.

16. **Dr. V. Naga Rajyalakshmi,** M.A., PhD.
Rt Principal,Govt .Degree College,
Chebrole , Guntur, A.P.

17. **Dr. Guntupalli Gowri,** M.A., PhD.
Dept. of Telugu,
Govt. College for Women, Guntur - 522 002.

18. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
S.S.N. College, Narasaraopet - 522 601.

19. **Dr. K. Pushpamma,** M.A., PhD.
HOD, Dept. of Telugu,
SVRM College,
Nagaram - 522 035.

20. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Andhra University, Visakhapathan.

21. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

22. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, Nellore.

23. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

24. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

25. **Dr. M. Prasad,** M.A., M.A.(San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

26. **Dr. V. Triveni**
Head & Assistant Professor,
Dept. of Telugu Studies,
Telangana University, Dichpally, Nizamabad.

27. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

**LEGALADVISER**

**Dr. A. GURAVAIAH**, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

**DTP & PRINTING**

**TENALI PRAKASH**, G.L.S. GRAPHICS, LEMALLE, Guntur. 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet, GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.

BHAVAVEENA
Vol. 18, Issue. 9, September 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# చిలకమర్తి లక్ష్మీనరసింహం

తొలి తెలుగు నవలా రచయితల్లో ముఖ్యుడు చిలకమర్తి లక్ష్మీనరసింహం. కవి, రచయిత, నాటకకర్త, పాత్రికేయుడు, సంఘ సంస్కర్త, విద్యావేత్త. లక్ష్మీ నరసింహం 1867 సెప్టెంబర్ 26న పశ్చిమ గోదావరి జిల్లా పెరవలి మండలంల ఖండవల్లి గ్రామంలో వెంకయ్య, రత్నమ్మ దంపతులకు జన్మించాడు. ఆయన విద్యాభ్యాసమంతా వీరవాసరం, నరసాపురం పట్టణాల్లో సాగింది. 1889 సంవత్సరంలో ఆర్య పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేశారు. సాహిత్యాభిమానంతో సరస్వతి పత్రికను స్థాపించారు.

పాఠశాల స్థాయి నుండే చిలకమర్తి పద్యాలు వ్రాయటం ప్రారంభించారు. కీచకవధ ఆయన మొదటి నాటకం. ద్రౌపదీ పరిణమం, గయోపాఖ్యానం, శ్రీరామ జననం, సీతాకల్యాణం, పారిజాతపహరణం వంటి నాటకాలు రచించాడు. గయోపాఖ్యాన నాటకంలో టంగుటూరి ప్రకాశం పంతులు అర్జునుడి వేషం వేశాడు. చిలకమర్తి నవలలో రామచంద్ర విజయం, హేమలత, అహల్యాభాయి, సుధాశరచ్చంద్రము, సౌందర్య తిలక, పార్వతీ పరిణయం, గణపతి (హాస్య నవల) ప్రసిద్ధమైనవి.

భారత స్వాతంత్ర్యోద్యమ ప్రచారసభలో చిలకమర్తి అశువుగా పలికిన 'భరత ఖండంబు చక్కని పాడి మావు' అన్న పద్యం స్వాతంత్ర్య పోరాలు సమరంలో ప్రముఖ స్థానం పొందింది. చిలకమర్తి వారి బిరుదులు మహాకవి, కళాప్రపూర్ణ. చికలమర్తి ఇరవై రెండేళ్ళ వయసులో ఆయన రచించిన 'గయోపాఖ్యానం' అనే నాటకం ప్రతులు లక్షకుపైగా అమ్ముడు పోవడం తెలుగు సాహిత్య చరిత్రలో అరుదైన విషయం. చిలకమర్తి వారు 1946 జూన్ 17న కీర్తిశేషులయ్యారు.

# బోయి భీమన్న

బోయి భీమన్న సామాజిక చైతన్యాన్ని ఆశించి రచనలు చేసి, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన కవి, రచయిత. 'భీమన్న నిజమైన కవి ఆర్తి ఆయన కవిత్వానికి ప్రాణం వ్యంగ్యం జీవకళ' అని ఆచార్య ఎన్.గోపి వ్యాస నవమిలో భీమన్న గురించి ప్రశంసించారు. భీమన్న 1911 సెప్టెంబర్ 19 తూర్పుగోదావరి జిల్లా మామిడి కుదురు గ్రామంలో దళిత పాలేరు దంపతులైన నాగమ్మ, పుల్లయ్యలకు ద్వితీయ సంతానంగా జన్మించారు. పుల్లయ్య తన మగపిల్లలకు వరుసగా ధర్మరాజు, భీమన్న, అర్జునుడు, నకులుడు, సహదేవుడు అని పంచపాండవుల పేర్లు పెట్టాడు. భీమన్న 1935 బి.ఏ పూర్తిచేసి బి.ఇడి పూర్తి చేశారు. ఉపాధ్యాయుడిగా జీవన గమనాన్ని ప్రారంభించాడు. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడైనా ప్రవృత్తి రీత్యా రచయిత. దాదాపు 70కి పైగా పుస్తకాలు రచించారు. చిన్ననాటి నుండి కులవివక్షకు గురై వాటినే తన రచనలకు ఇతివృత్తాలుగా మలిచాడు. బోయి భీమన్న అంబేడ్కర్ ఆశయాలను కీర్తిస్తూ 'జయ.. జయ.. జయ అంబేడ్కర్!' అనే గేయం రచించారు. ఈ గేయం నేటికి దళితులకు జాతీయ గేయమై ఊరూర ప్రార్ధనా గీతంగా మార్మోగుతోంది. భీమన్న కులమతాల కంటే మానవత్వాన్నే ఆశించిన జాతీయవాది. భీమన్న రచనలు పాలేరు, రాగవాసిష్ఠం, గుడిసెలు కాలిపోతున్నాయి, ధర్మవ్యాధుడు, వేదవ్యాసుడు, చండాలిక, అంబేడ్కరిజం, అంబేడ్కర్ మతం మొదలగు వీరి ప్రసిద్ధ రచనలు. అంబేడ్కర్ వ్రాసిన కుల నిర్మూలన పుస్తకాన్ని బోయి భీమన్న తెలుగులోకి అనువదించారు. భీమన్న దళితుల అభ్యుదయాన్ని ఉన్నతిని కోరారు. మృదు స్వభావి. దళిత జనోద్ధరణకు కృషి చేస్తూ 2005 డిసెంబర్ 16వ తేదీన కీర్తిశేషులయ్యారు. భీమన్న ప్రసిద్ధ రచన గుడిసెలు కాలిపోతున్నాయి రచనకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. 2001 సంవత్సరంలో భారత ప్రభుత్వం భీమన్నను పద్మభూషణ్ బిరుదుతో సత్కరించింది.

- సంపాదకవర్గం

# Contents (విషయ సూచిక)

| | | |
|---|---|---|
| 1. పిల్లల కథలు - ప్రయోజనాలు | - డా॥. గెంజి అరుణ | 5 |
| 2. తెలుగు కథ - కమ్యూనికేషన్ వ్యవస్థల చిత్రణ | - డా॥. ఎవివికె. చైతన్య | 8 |
| 3. పాల వెంకటసుబ్బయ్య జీవితం - రచనలు | - డా॥. ఎల్లే విజయానందరాజు | 14 |
| 4. తెలుగు కవయిత్రులు-ప్రపంచీకరణ ప్రతిఘటన స్వరాలు | - డా॥. వి. పవన్ కుమార్ రెడ్డి & - డా॥. పల్లా కృష్ణ | 17 |
| 5. గురజాడ అడుగుజాడ నిత్యస్మరణీయం | - డా॥. కడివెండి మమత | 22 |
| 6. గురజాడ వారి బుచ్చమ్మ | - కొండయ్య కోసూరు | 25 |
| 7. స్త్రీ ఔన్నత్యం | - యమ్. అనంతలక్ష్మి | 29 |
| 8. శ్రీమద్భాగవతం - వామనుడు | - జి. శ్రీమతి | 33 |
| 9. విమర్శ - విమర్శకుడు - వివేచనా దృక్పథం | - ఎరికంబట్టు రాజేష్ | 37 |
| 10. తెలంగాణ ఉద్యమ కయిత | - జె. శంకర్ | 42 |
| 11. విశ్వనరుడు గుర్రం జాషువా | - డా॥. పెండ్యాల లావణ్య & డా॥. బూసి వెంకటస్వామి | 48 |
| 12. స్థిత ప్రజ్ఞురాలు ద్రౌపది | - యం. అనిత | 52 |
| 13. భాగవతంలో ధ్రువుని వైశిష్ట్యం | - కె. నరేష్ | 55 |
| 14. తెలంగాణ సజీవ కథలు "లొట్టపీసు పూలు" | - Md. గౌస్ పాషా | 60 |
| 15. ఇందూరు సాహితీవనంలో 'సూరారం' గజల్‌ల జల్లు | - మున్నం శశి కుమార్ | 63 |
| 16. ఆచార్య ఇనాక్ 'పైమెట్టు' నవల-దళిత స్త్రీ అస్తిత్వ పోరాటం | - సురేఖ దుగులూరు & - డా॥. వై. సుభాషిణి | 65 |
| 17. తెలంగాణ సాంస్కృతిక చైతన్యంలో బతుకమ్మ గేయాలు - వైశిష్టం | - వి. వినయ్ కుమార్ | 69 |
| 18. తెలుగు సాహిత్యంలో కొత్తవేకువ - జగ్‌నే కీ రాత్ | - షేక్ హుస్సేన్ | 74 |
| 19. తెలుగు సినీగేయాల్లో వ్యక్తిత్వ వికాసం | - డా॥. చింతల రాకేశ్ భవానీ | 77 |
| 20. తండా కన్నీరు కారుస్తుంది! | - డా॥. మహ్మద్ హసేన | 81 |
| 21. సాహితీ స్రష్టల సాహితీ రూపాన్ని ఆవిష్కరించిన నియోగి | - నాగెల్లి ప్రభాకర్ | 85 |
| 22. తెలుగు వాఙ్మయం - కథాకావ్యాల వైశిష్ట్యం | - డా॥. ఎం.మునిరత్నం | 89 |
| 23. తెలుగు గజల్ స్వరూప స్వభావాలు | - డా॥. నందిరెడ్డి పురుషోత్తమ రెడ్డి | 91 |
| 24. సుందర వెలుతురు యాత్ర | - డా॥. పి.ఎ. సత్యనారాయణ | 93 |
| 25. స్నేహితుల్ని హత్తుకున్న స్మృతి కవిత్వం | - సుంకర గోపాలయ్య | 97 |
| 26. భాష - ఆధునీకరణ - సమస్యలు | - డా॥. డి. ఉదయ కుమారి | 100 |
| 27. వీరవల్లడు - మానవతామూర్తి | - డా॥. పి. విశ్వప్రసాదు | 102 |
| 28. పాలమూరు జిల్లాలో స్నేహలతా కవితా సంఘం ... | - డా॥. సి. నర్సింహులు | 105 |
| 29. కాకిపడిగెల కథన నైపుణ్యం | - డా॥. పుట్ట యాదేశ్ | 110 |
| 30. తెలంగాణ జీవన చిత్రం - కాళోజి కవిత్వం | - పులిగిల్ల ఉపేందర్ | 118 |
| 31. పి. సరళాదేవి జీవితం, సాహిత్యం - పరిచయం | - డా॥. సారిక విజయలక్ష్మి | 121 |
| 32. శ్రీ మహాభాగవతం – గంగన అర్థాలంకార సౌందర్యం | – డా॥. జి. శ్రీనివాసరావు | 124 |
| 33. Lights! Camera! Action! And the Birth of Historical Film | - Dr. Sebastian Joseph | 128 |
| 33. Reimagining Resources : A Note on Dalit Land... | - Joby Mathew | 136 |
| 33. Problems of Translating Cultural Elements ... | - Thoudam Jomita Devi | 141 |
| 33. The Place of Women in Indian Society | - Sahithi Modugula | 144 |
| 33. A Phonemic inventory of vowels in Thoti | - Dr. N. Susheel Kumar | 148 |

# పిల్లల కథలు – ప్రయోజనాలు

– డా॥. గెంజి అరుణ, ప్రొఫెసర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ లింగ్విస్టిక్స్, ఎస్.వి. యూనివర్శిటి, తిరుపతి.

పూర్వం పల్లెల్లో ఆరుబయట మంచాలు వేసుకొని అవ్వాతాతల దగ్గర కథలు చెప్పించుకొంటూ పిల్లలు నిద్రపోయేవాళ్లు. కథ చెప్పకపోతే మారాం చేసేవాళ్లు. మా చిన్నప్పుడు మా అమ్మకూడా మాకు చిన్న చిన్న కథలను చెప్పేది. ఇప్పటికాలంలో ఉరుకులు పరుగులు. ఎవరి దారి వారిది. పెద్దలు వ్యాపారాలు, ఉద్యోగాలతో పిల్లలు పాఠశాలలు, ట్యూషన్లతో యాంత్రిక జీవనం సాగిస్తున్నాం.

కథలు మానవ మేధస్సుకు పదును పెడ్తాయి. జీవిత పాఠాలను నేర్పుతాయి. బిడ్డకు తల్లి వద్దనుంచే బాల సాహిత్యం మొదలవుతుంది. తల్లిదండ్రులు లేదా గురువులు చెప్పే మాటలు పిల్లలు బాగా వింటారు. ఇప్పుడు పాఠశాలల్లో కథలు చెప్పేవారే కరువయ్యారు. పిల్లలకు కథలంటే చాలా మక్కువ. పాఠాలకన్నా కథలను పిల్లలు బాగా వినడానికి ఆసక్తి చూపుతారు. అందుకే కథలరూపంలో పాఠాలను పిల్లలకు చెప్పాలి. సైన్సు, పర్యావరణ శాస్త్రాలను కూడా కథలరూపంలో చెబితే వారిలో సృజనాత్మక శక్తి పెరుగుతుంది.

ప్రతి కథలోను అంతర్గతంగా నీతి దాగి ఉంటుంది. పిల్లల కథల్లో ఎక్కువగా జంతువులు, పక్షులు ఉంటాయి. వాటిమధ్య కథ సాగడం జరుగుతుంది. జంతువులు, పక్షులు మాట్లాడటం ఈ కథల్లో కనిపిస్తుంది.

పిల్లలు కథలు వినడం వల్ల, చదవడం వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయి.

### పిల్లల కథలు - ఉపయోగాలు :

**మంచి నడవడికను అలవరచుకొంటారు** : కథలు వినడం, చదవడం వల్ల పిల్లలు మంచినడవడికను అలవరచుకొంటారు. కథల్లోని పాత్రలో వారు మమేకమవుతారు. రాజు, రాణి కథలు చెప్తున్నప్పుడు మగపిల్లలయితే రాజుగా, ఆడపిల్లలయితే రాణిగా ఊహించుకొని ఆ కథలో వారు చేసే మంచిపనులను స్వయంగా వీళ్ల చేయాలని అనుకొని చేస్తారు.

**ఉత్సాహాన్ని కలిగిస్తాయి** : కథలు పిల్లలకు ఉత్సాహాన్ని నింపుతాయి. కథలోని పాత్రలను పిల్లలు ఎంతో ఇష్టంగా చదవడం, వినడం వల్ల వారిలో ఉత్సాహం రెట్టింపు అవుతుంది.

**ఆలోచనాశక్తిని పెంచుతాయి** : కథ చదవడం, వినడం వల్ల ఆలోచనాశక్తి పెరుగుతుంది. వాళ్లు ఎలా, ఎందుకు చేశారు దాన్ని, అలా ఎందుకు అయింది. ఇలా చేస్తే బాగుండేది కదా అని ఆలోచనావిధానాన్ని కల్పిస్తాయి.

**జ్ఞానాన్ని కలుగజేస్తాయి** : కథలు పిల్లలకు జ్ఞానాన్ని కలుగజేస్తాయి. కథలు సృజనాత్మకత, కల్పితాలు, వాస్తవాలు అన్నీ కలిగి ఉంటాయి. కాబట్టి వాటిని ఆలోచించి జ్ఞానాన్ని పెంపొందేందుకు కథలు ఉపయోగపడుతాయి.

**మానసిక ఉల్లాసం** : ఒక మంచి కథ చదివినప్పుడు మనస్సు తేలిక అవుతుంది. చదవడం, వినడం చేసేటప్పుడు ధ్యాస అంతా కథపై ఉంటుంది. మనస్సులో ఏదన్నా బాధ ఉంటే అది మరచిపోయేటట్లు చేసి మనస్సును ఉల్లాసంగా ఉంచేటట్లు చేస్తాయి.

**ఏకాగ్రత పెరుగుతుంది** : కథలు చదవడం వల్ల పిల్లల్లో ఏకాగ్రత పెరుగుతుంది. ఏకాగ్రత పెరగటం వల్ల చదువుపై వారికి శ్రద్ధ కూడా పెరుగుతుంది.

**ప్రశ్నించే గుణాన్ని కలుగజేస్తాయి** : కథలు పిల్లల్లో ప్రశ్నించే గుణాన్ని కలుగజేస్తాయి. కథ వినేటప్పుడు, చదివేటప్పుడు కలిగే ఆలోచనల వల్ల వారిలో ఎలా, ఎందుకు, ఏమిటి అనే ప్రశ్నలు ఉదయించి దానికి జవాబులు అడుగుతారు. అలా వారి తరగతి గదిలో

కూడా వారి అనుమానాలను, ప్రశ్నలను అడిగి జవాబులు తెలుసుకొనే ధైర్యం వారికి కలుగుతుంది.

**సమస్యలను పరిష్కరించే సామర్థ్యం అలవడుతుంది:** పిల్లల్లో కథల్లోని సమస్యలు వాటి నివృత్తి చేసే విధానాన్ని తెలుసుకోవడం వల్ల వాస్తవ జీవితంలో వారికి ఏదయినా సమస్య వచ్చినప్పుడు వాటిని పరిష్కరించుకొనే సామర్థ్యం కలిగి ఉంటారు.

**ఉదా** : పాఠశాలలో పిల్లలను జంతుప్రదర్శనశాలకు పిక్‌నిక్ తీసుకొనివెళ్తారు. అందులో ఒకరు తప్పిపోతారు. వాళ్లు భయపడకుండా ఆ పిక్‌నిక్‌లో ఉన్న పార్కు నిర్వాహకుడి దగ్గరకు వెళ్లి ఫోన్ నెంబర్ ఇచ్చి వారితో మాట్లాడటం, పలానాచోట ఉన్నాం అని తెలుపడం వంటివి చేస్తారు. ఇవి కథలో వాళ్లు ఎప్పుడో విని ఉంటారు. అందుకే ఆ పిల్లవాడు అలా ధైర్యంగా చేస్తాడు.

**తెలియని పదాలకు అర్థాలు** : కథ చదవడం, వినడం వల్ల తెలియని పదాలకు అర్థాలు తెలుస్తాయి. కథ సాగుతున్నప్పుడు కథానుగుణంగా దాని అర్థాలు తెలిసే అవకాశం ఉంటుంది.

**వ్యాకరణం తెలుసుకొంటారు** : కథలు చదవటం వల్ల అందులోని నామవాచకాలు, సర్వనామాలు, విశేషణాలు, క్రియలు, కామాలు, చుక్కలు, ఆశ్చర్యార్థకపు గుర్తులు, సంభోధనాంశాలు జంటపదాలు, సామెతలు వంటివి ఎన్నో తెలియకనే తెలుసుకొంటారు.

**భాష సరళత ఏర్పడుతుంది** : కథలు చదవటం వల్ల పిల్లల్లో భాష సరళత ఏర్పడుతుంది. కథ ఎలా చదవాలి అనేది కూడా పిల్లలు నేర్చుకుంటారు.

## పిల్లలు కథలు చదవటానికి తీసుకోవలసిన చర్యలు :

**పుస్తకాలు కొని ఇవ్వాలి** : పిల్లలకు వారికి నచ్చిన పుస్తకాలు కొని ఇవ్వాలి. దానివల్ల నచ్చిన పుస్తకం కొన్నప్పుడు తప్పకుండా దాన్ని ఆసక్తిగా చదువుతారు. పుస్తకాలు పెన్నులు, పెయింటింగ్ రంగులు, పేపర్లు వంటివి పిల్లలు ఆశపడి కొనుక్కోవాలని అనుకొంటారు. కొంతమంది తల్లిదండ్రులు దానికి ఇష్టపడరు. సంవత్సరంలో కొత్త బట్టలు ప్రతి పండుగకు వేలు ఖర్చుపెట్టి కొనిపెడతారు. వాటిని సంవత్సరానికి ఒకటి రెండు సార్లకంటే ఎక్కువ తొడగరు. వేలు ఖర్చుపెట్టి విహారయాత్రలకు, వినోద యాత్రలకు వెళ్తారు. సినిమాలు, హొటళ్లకు వెళ్లి భోజనాలు చేసి ఖర్చుపెడతాము. కాని యాభై, వంద రూపాయలు పెట్టి పిల్లలకు పుస్తకం కొనిపెట్టం. తల్లిదండ్రుల మనసు మారాలి. పిల్లలకు పుస్తకాలు కొనిపెట్టాలి.

**పిల్లలు అడిగితే కథ తప్పక చెప్పాలి** : తల్లిదండ్రులను పిల్లలు కథ చెప్పమని అడిగితే వాళ్లు తెలియదు, సమయం లేదు, ఇప్పుడు కాదు అని దాటవేయకూడదు. వారికి కథ తెలియకపోతే కథలను చదువుకొని, తెలుసుకొని కథలను పిల్లలకు చెప్పాలి. ఒక వాణిజ్య ప్రకటనలో ఒక పిల్లవాడు వాడి తల్లిని రాత్రి నిద్రపోయేటప్పుడు కథ చెప్పమని అడుగుతాడు. తనకు కథలు తెలియదు. అందుకు వెంటనే పిల్లవాడి నాన్నమ్మకు, ఫోనుచేసి పిల్లవాడికి కథ చెప్పిస్తుంది. అప్పుడు కథ విని పిల్లవాడు నిద్రపోతారు. ఎంత విచిత్రమో చూడండి. ఇప్పటి తరాల వారికి నిజంగా కథలు తెలియవు. తెలుసుకోవాలనే సమయం వారికి ఉండదు.

**తీరిక సమయాలు** : తీరిక సమయాల్లో పిల్లలకు కథలు చెప్పాలి లేదా పిల్లలకు తీరిక సమయాల్లో వారికి నచ్చిన కథను సొంతంగా రాయమని చెప్పాలి. అలా చేయడం వల్ల వారిలో సృజనాత్మకశక్తి అలవడుతుంది. ఆలోచనలో పడతారు.

అలా కథల గురించి అన్ని పుస్తకాలు తిరగేస్తున్నప్పుడు ఒక పుస్తకంలో పాఠశాల విద్యార్థులు రాసే కథల్లో కాల్పనికతకన్నా సృజనాత్మక శక్తి మరియు వాస్తవికత రెండూ కనిపించాయని ఉంది. అందుకు నేను మా పాపతో నీ సొంతంగా ఒక కథను నీకు నచ్చిన విధంగా రాయమని

చెప్పాను. మా పాప ఇప్పుడు ఏడవ తరగతి చదువుతోంది. తాను కాసేపు ఆలోచించి కథ రాయడం మొదలుపెట్టి, కథ రాసి నాకు ఇచ్చింది. ఆ కథపేరు 'ప్రయత్నం' అని పెట్టింది. అందులోని పాత్ర ఒక పక్షి. వస్తువు ఇల్లు కట్టుకోవాలనే కోరిక. కథ ఇలా సాగింది -

ఒక ఊరికి దగ్గర ఒక చిన్న అడవి. అందులో ఓ పక్షి ఒక చెట్టుపై నివసిస్తూ ఉండేది. ఆ పక్షికి ఒకరోజు గూడు కట్టుకోవాలి అనే కోరిక కలిగింది. గూడు కడదామని అనుకొనేలోపే ఆ పక్షి కాలికి ఒక సన్నని కొమ్మ గుచ్చుకొని పెద్ద దెబ్బ తగిలింది. ఏమి చెయ్యాలో తెలియని స్థితిలో ఆ పక్షి చాలా బాధపడింది. అప్పటికే చాలాకాలం గడిచింది. వానాకాలం రాబోతుంది. బాధపడి ప్రయోజనం లేదని చిన్నచిన్నగా అడుగులు వేసింది ఆ చిన్నపక్షి. అలా కొద్దిరోజులకు అది బాగానే నడుస్తున్నది. ఇప్పుడు ఎగుర టానికి మొదలుపెట్టింది. కాలినొప్పికి మొదటిసారి ఎగరలేకపోయింది. రెండోసారి ప్రయత్నించింది. అడుగు వేసి చిన్నగా రెక్కవిప్పింది. రెండోసారి కూడా కిందపడింది. అలా ఇరవైసార్లు ప్రయత్నించింది. ఇప్పుడు ఇరవై ఒకటోసారి ఎగరటానికి ప్రయత్నించింది. ఈసారి కింద పడకుండా పైకిలేచి ఎగిరింది. పక్షి సంతోషానికి అవధులు లేవు. తాను అనుకొన్న విధంగా కొద్దిరోజులకు గూడు కట్టుకుంది. ప్రయత్నం చేస్తే తప్పులేదు. ప్రయత్నం ఎప్పుడూ ఓడిపోదు. ఈ పక్షి మంచిగా పట్టుదలతో ప్రయత్నించి ఆత్మస్థైర్యం కోల్పోకుండా విజయం సాధించింది. అలాగే మనం కూడా కష్టాలు కలిగినప్పుడు ధైర్యంగా ఎదుర్కొని అనుకొన్న పనిని వదలకుండా ప్రయత్నించి గెలవాలి.

**నీతి :** ప్రయత్నం చేయగా సాధించవచ్చు. ప్రయత్నం ఎప్పుడయినా గెలుస్తుంది.

ఇలా తన కథను రాసి నాకు చూపించింది. ఆ కథలో తన సృజనాత్మక శక్తితోపాటుగా వాస్తవికతను జోడించి చెప్పడంతో నాకు ఆశ్చర్యం కలిగింది.

**సెల్‌ఫోన్లు చూడటం మాన్పించాలి :** సెల్‌ఫోన్ రేడియేషన్ వల్ల పిల్లలు అనారోగ్యపాలవుతారు. మోని టర్‌లో వచ్చే వెలుగువల్ల కంటి సమస్యలు రావచ్చు. పుస్తకాల వల్ల అలాంటి ఇబ్బంది కలగదు. కథల పుస్తకాలు చదవటం ఇష్టపడితే పిల్లలు వారి పాఠ్యపుస్తకాలు చదవడానికి కూడా బాగా ఇష్టపడతారు. పాఠ్యపుస్తకాలు చదవడం వల్ల వారికి వారి సబ్జెక్ట్‌లో జ్ఞానం బాగా పెరుగు తుంది.

**గ్రంథాలయం :** వీలయితే కొన్ని ఇష్టమయిన పుస్తకాలను కొని ఇంటిలోనే గ్రంథలయాన్ని పెట్టుకొని ఇష్టం వచ్చినప్పుడు వాటిని చదివే అలవాటు పిల్లలకు చేయాలి. లేదా పాఠశాలలో ఒక పీరియడ్ గ్రంథాలయా నికి తీసుకొని వెళ్లాలి. ఇంకా తల్లిదండ్రులు పిల్లలను బయటి గ్రంథాలయాలకు కూడా తీసుకొని వెళ్లి అక్కడ ఉన్న పుస్తకాలను వారికి పరిచయం చేయవచ్చు.

**నిద్రపోయేటప్పుడు :** పిల్లలు నిద్రపోయేటప్పుడు, టి.వి. సీరియల్స్, సెల్‌ఫోన్ గేమ్స్ ఆడటం కంటే ఒక పుస్తకం చదివే అలవాటు చేస్తే వారు ప్రశాంతంగా నిద్రపోతారు.

**ఆధార గ్రంథాలు :**

1) చిన్ని చిన్ని కథలు - ఎమ్.వి.వి. సత్యనారాయణ.
2) పంచతంత్ర కథలు - యువమిత్ర
3) పిల్లల నీతికథలు - వాగుమూడి లక్ష్మీరాఘవరావు
4) మర్యాదరామన్న కథలు - శీతం రాజు.

# తెలుగు కథ – కమ్యూనికేషన్ వ్యవస్థల చిత్రణ

- డా॥. ఎవివికె. చైతన్య

కమ్యూనికేషన్‌ను తెలుగులో సంవాదం, అభివ్యక్తి, వ్యక్తీకరణ, సంభాషణ అన్న పేర్లతో పిలుస్తున్నారు. John Donne అన్న పదిహేడవ శతాబ్దపు ఇంగ్లీషు కవి "No man is an island, entire of itself; every man is a piece of the continent, a part of the main" (Anthony Raspa (Ed.), Donne, J. 2+15) అన్నారు. మనిషి ఒంటరిగా చుట్టూ సముద్రం ఆవరించిన ద్వీపం కాదు, అతను ఒక ఖండంలోని అంతర్భాగం; అంటే మనిషి ఒంటరిగా జీవించలేడు, తను బతకడానికి చుట్టూ ఉన్న మనుషులతో సంబంధాలు ఏర్పరచుకోవడం మనిషికి అవసరం. ఈ అవసరాన్ని తీర్చే ముఖ్యమైన సాధనం కమ్యూనికేషన్ లేదా అభివ్యక్తి. మరో విధంగా చెప్పాలంటే మనిషిని ఏకాకి కాకుండా చేసే సాధనమే కమ్యూనికేషన్. ప్రకృతిలోని మిగిలిన ప్రాణుల కంటే మనిషికి ఎంతో అభివృద్ధి చెందిన కమ్యూనికేషన్ వ్యవస్థ ఉంది. భూమ్మీద ఉన్న జీవజాతులలో కన్నా మానవ జాతిని అభివృద్ధి చెందినదాన్నిగా చేసింది కమ్యూనికేషన్ వ్యవస్థే. కమ్యూనికేషన్ వ్యవస్థకు మానవ పరిణామంలో అధిక ప్రాధాన్యం ఉన్నప్పటికీ దానిని సరిగా వాడడంలో మాత్రం, మనిషి ఇంకా ఎంతో నేర్చుకోవలసిన అవసరం ఉంది. చాలా సందర్భాలలో మనం ఏమి అనుకుంటున్నామో దానిని చెప్పం, అలాగే ఏది చెప్పామో అది మనం నిజంగా అనుకున్నది కాదు. కొన్నిసార్లు ఎదుటివారు మనం చెప్పిన దానిని ఎంతవరకు అర్థం చేసుకున్నారు అన్నది కూడా ఆలోచించం. మరికొన్నిసార్లు వినేవారు తప్పుగా అర్థం చేసుకోవచ్చు. అంటే కమ్యూనికేషన్‌లో విషయాన్ని సరిగా అర్థం చేసుకోవడానికి వినేవారి దృష్టికోణం, మానసిక స్థితి కూడా ముఖ్యమే. భరతుడు తన నాట్యశాస్త్రంలో నాటకాన్ని చూసేవారు సహృదయులుగా ఉండాలి అన్నాడు. అంటే ప్రేక్షకుడిని నాటకం చూడడానికి మానసికంగా సిద్ధం చేయాలనేది భరతుని సిద్ధాంతం. అంటే ఎదుటి వ్యక్తి పరిస్థితిని అనుసరించి కమ్యూనికేషన్ చేయాలి. వినేవారిని దృష్టిలో పెట్టుకోకుండా కమ్యూనికేషన్ చేస్తే, ఎదుటివారు చెప్పిన దానిని వినేవాళ్ళు వాళ్ళకు నచ్చినట్టుగా అర్థం చేసుకుంటారు. ఇలాంటి సందర్భాలే అపార్థాలకి, గొడవలకి కారణం అవుతాయి. ఉదా: 1850లో రష్యాకు, బ్రిటిష్ తుపాకీ దళానికీ (Cavalry) మధ్య జరిగిన యుద్ధం. బ్రిటిష్ తుపాకీ దళానికి రష్యన్ సైన్యాన్ని ముట్టడించవద్దని ఆజ్ఞలు అందాయి. అయితే ఆ ఆజ్ఞలను మాటల ద్వారానే చేరవేశారు. దీనితో మధ్యలో ఎక్కడో సమాచార లోపం ఏర్పడి రష్యన్లను ఎదిరించాలనే ఆజ్ఞ అందింది. రష్యన్లు అప్పటికే దాడి జరగవచ్చు అన్న అనుమానంతో సిద్ధంగా ఉన్నారు. దీనితో యుద్ధం కాస్తా భీకరమైన హత్యాకాండ (Massacre) అయిపోయింది. ఎంతోమంది ప్రాణాలను కోల్పోయారు. మాటల ద్వారా సాగే ఇటువంటి కమ్యూనికేషన్‌లో అంతరాయం కలగకూడదనే వైదిక కాలం రుషులు వేద మంత్రాలను చదవడానికి క్రమ, జట, ఘన వంటి నిర్దిష్టమైన పద్ధతులను, ఉదాత్త, అనుదాత్త, స్వరితాలనే స్వరస్థాయిలను ఏర్పరిచారు. మనుషుల కమ్యూనికేషన్ వ్యవస్థలో మాటలేకాక, శృతి (Intonation), తీవ్రత (Volume), ప్రతీకలు (Symbols), సంగీతం, హావభావాలు, శారీరిక చేష్టలు కూడా భాగంగా ఉంటాయి.

కమ్యూనికేషన్ అన్నది రెండు వైపుల నుండి సాగే ప్రక్రియ. ఇందులో ఒకవైపు నుండి ఆలోచనలు, సూచనలు వంటివి ప్రయాణిస్తే, రెండవవైపు నుండి అభిప్రాయాలు (Feedback), నిర్ధారణలు (Evaluation) ఉంటాయి. కమ్యూనికేషన్‌లో చెప్పే విషయాన్ని సందేశం అనీ, చెప్పేవారిని లేదా రాసేవారిని వక్త అనీ, వినేవారు

లేదా చదివేవారిని గ్రహీత అనీ అంటారు. విషయాన్ని చెప్పదలుచుకున్నవారు తమ మనసులోని భావాలను మాటలుగానో, పాటలుగానో, చిత్రాలుగానో, రాతగానో మారుస్తారు. ఇలా జ్ఞానేంద్రియాలకు చేరేట్టుగా మనసులోని భావాలను మార్చడాన్ని Encoding అంటారు. ఎన్‌కోడ్ అయిన సందేశం గ్రహీతను చేరుతుంది. అప్పుడు గ్రహీత సందేశాన్ని Decode చేస్తాడు. అంటే సందేశంలోని మాటలు, చిత్రాలు, పాటలు ఏవి ఉన్నా వాటి ద్వారా వక్త చెప్పదలుచుకున్న విషయాన్ని గ్రహిస్తాడు. తరువాత గ్రహీత తన అభిప్రాయాలను చెబుతాడు. స్థూలంగా కమ్యూనికేషన్ నిర్మాణం ఇది. నేటి మానవ సమాజంలో కమ్యూనికేషన్ వ్యవస్థలకు అధిక ప్రాధాన్యం ఉంది. వార్తా పత్రికలు, రేడియో, టీ.వీ., చరవాణి, అంతర్జాలం వంటి సాధనాలన్నీ వివిధ రకాల సమాచారాన్ని/సందేశాన్ని అందించే కమ్యూనికేషన్ సాధనాలు. వ్యాపారం, రాజకీయాలు, సాహిత్యం వంటి ఏ రంగంలోనైనా గొప్పవారుగా పేరు తెచ్చుకున్న వ్యక్తులు, నాయకులకు మధ్య ఉన్న సామాన్య లక్షణం వారంతా తమ రంగాల్లో నైపుణ్యాలు కలవారేకాక, మంచి కమ్యూనికేషన్ (సంభాషణ) సామర్థ్యం కలిగినవారు.

మనుషుల కమ్యూనికేషన్ వ్యవస్థలో మాటలు, రాత ప్రధానంగా కనిపిస్తాయి. ఇవికాక, శృతి, తీవ్రత, ప్రతీకలు, సంగీతం, హావభావాలు, శారీరిక చేష్టలు, చిత్రాలు, స్పర్శ, వాసన వంటివి కూడా కమ్యూనికేషన్‌లో భాగంగా ఉంటాయి. ఇలా మాటలు, రాత లేకుండా భావాలను వ్యక్తం చేయడం, వాటిని గ్రహీతలు అర్థం చేసుకోవడం అన్న నేపథ్యాలను వాడి తెలుగు కథా రచయితలు నూతన కథా శిల్పాలను సాధించే ప్రయత్నం చేసారు. అటువంటి కథల పరిశీలనే ప్రస్తుత పత్ర ప్రధానోద్దేశం.

**దేవాంగుల మణి :**

ఈ కథ వంశీ రాసిన "మా పసలపూడి కథలు" కథా సంపుటి లోనిది. సాధారణంగా కథల్లో రచయిత వర్ణనాత్మకంగా కథను చెబుతాడు. లేదా పాత్రలతో మాట్లాడించి నాటకీయ శైలిలో కథను నడిపిస్తాడు. నాటకీయ శైలిలో సంభాషణలు ఎక్కువగా ప్రధాన పాత్రల మధ్యనే నడుస్తాయి. ఈ కథలోని ప్రధానపాత్ర దేవాంగుల మణి. అయినా కథలో మణి చాలా తక్కువగా మాట్లాడింది. కథలో కనిపించే ప్రధానాంశం ప్రధానపాత్ర/వక్త అంటే మణి ఏమి చెప్పింది అన్నది కాదు. ఇతర పాత్రలు అంటే గ్రహీతలు ఏమి గ్రహించారు అన్నది. కొందరు వ్యక్తులు నోటికి పనిచెప్పకుండా తమ అభిప్రాయాలను చెప్పడానికి తల ఊపడం, నవ్వడం, చేయి తిప్పడం వంటివి చేస్తుంటారు. ఇక్కడ వక్త ఏదో చెప్పాలన్న ఉద్దేశంతోనే అలాటి సైగలు చేస్తున్నాడు. అలాకాక ఏ సందర్భమూ లేకుండానే నవ్వడం, తనలో తనే మట్లాడుకోవడం, సైగలు చేయడం వంటివి చేసేవారు ఇతరులకు పిచ్చివారుగానో, చెడ్డవారుగానో కనపడతారు. నవ్వు నాలుగు విధాల చేటు, మౌనం అర్థాంగీకారం వంటి సామెతలు ఏర్పడటానికి ఇలాంటి మనుషులే కారణం అయి ఉంటారు. సమయం, సందర్భం లేకుండా ఎప్పుడూ నవ్వుతూ ఉండే ఒక వ్యక్తిని సమాజంలోని రకరకాల వ్యక్తులు ఎలా అర్థం చేసుకున్నారు అన్నదే దేవాంగుల మణి కథ. కథలో మణి పాత్ర నవ్వుతూ ఉంటుంది. అలా నవ్వడంలో ఆమెకు ఏ విధమైన ఉద్దేశమూ లేదు. నవ్వడం ఆమె సహజ లక్షణం. కానీ మణి నవ్వును చూసిన కలష్ణమాచారిగారికి ఆ నవ్వులో గుడిలోని అమ్మవారు కనిపించింది. పాస్టర్ ఏసుపాదం గారికి క్రీస్తులోని పవిత్రత కనిపించింది. ఉల్లిపాయల పంతులుగారి అబ్బాయికి తన చెలెలు కనిపించింది. మిషను కుట్టే త్యాగరాజుకి ప్రేయసి కనిపించింది. కథను బట్టి చూస్తే ఇక్కడ వక్త ఏ విధమైన సందేశాన్నీ, ఏ ఒక్కరి కోసమూ అందించలేదు. కానీ చాలా మంది గ్రహీతలకు మణి/వక్త నవ్వు భిన్న సందేశాలను అందించింది. ఇలా జరగటానికి కారణాలు రెండు. సందేశం స్పష్టంగా లేకపోవడం అంటే సాధారణంగా మనుషులు వాడే కమ్యూనికేషన్ వ్యవస్థ అయిన భాషను ఇక్కడ వాడలేదు.

అలాగే గ్రహీతలకు వారివారి మానసిక సంస్కారాలను బట్టి సందేశం అందింది. ఉదాహరణకు కూతురిని పోగొట్టుకొని బాధపడుతున్న భావరాజు మాస్టారికి మణి నవ్వులో వారి అమ్మాయి కనిపించింది. కథా వస్తువుకు ఆధారమైంది కూడా ఈ రెండు కారణాలే.

**నీరు నిలవదు :**

ఈ కథ శంకరమంచి సత్యం రాసిన అమరావతి కథలు సంపుటి లోనిది. మాటల ద్వారా జరిగే కమ్యూనికేషన్‌లో వక్త ఇచ్చిన సమాచారం అనేకమంది గ్రహీతలను దాటే సరికి ఎలా మారుతుంది అనడానికి ఉదాహరణ 'నీరు నిలవదు' కథ. ఈ కథ ఊహాగానం అన్న సంభాషణ విధానానికి చెందింది. అమరావతిలోని స్త్రీలంతా పొద్దున్నే కృష్ణానదిలో నీళ్ళు తీసుకువెళ్ళడానికి వచ్చి ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం కథలోని నేపథ్యం. అలా మాట్లాడుకోవడంలో ఊళ్ళో జరిగే మంచి చెడులన్నీ ఒకరితో ఒకరు చెప్పుకోవడం అలవాటు. అలాటి మాటల్లో ఒకరోజు రాజమ్మ కూతురు పెద్దమనిషైంది అన్న విషయం ఎవరో చెప్పారు. ఆ విషయం రేవులో ఆ చివరి నుండి ఈ చివరికి వచ్చేసరికి మారిపోయింది. "రాజమ్మ కూతురు పెద్ద మనిషైంది, కార్యం - రాజమ్మ కూతురికి కార్యమైంది - రాజమ్మ కూతురికి కడుపైంది" (సత్యం, శంకరమంచి. 13౦). ఇలా మరికొన్ని అంశాలు చేర్చుతూ పోయి/ చిలవలు పలవలు చేరుస్తూ అసలు విషయాన్ని మరుగు పరచడం లేదా వక్రీకరించడం మాటల ద్వారా సంభాషణలో సాధారణం. అందుకే న్యాయ సంబంధ విషయాలలో నోటి మాట కన్నా రాతలకు ప్రాధాన్యం ఎక్కువ అయింది. కథలో చివరకు రాజమ్మే వచ్చి అందరికీ కూతురు పెద్దమనిషైందని, సాయంత్రం పేరంటానికి పిలవడానికి వస్తానని చెప్పడంతో అసలు విషయమేమిటో అందరికీ తెలిసింది. గాసిప్ లేదా ఊహాగానం అంటే సంభాషణ ద్వారా ఒక విషయం ప్రసారం కావడం. అయితే ఇందులో ఒకరి నుండి మరొకరికి ప్రసారం అయ్యే విషయం పూర్తిగా నిజం కాకపోవచ్చు లేదా కొంత మాత్రమే నిజం ఉండవచ్చు. అంటే చెప్పే విషయం నిజమా? కాదా? అన్న దానికి తగిన ఆధారాలు ఉండవు. ఒకసారి ఊహాగానం విస్తరించడం మొదలైతే అంత త్వరగా ఆపడం కష్టం, ఎండాకాలం అడవికి నిప్పంటుకున్న మాదిరి వ్యాపిస్తూ పోతుంది. కొన్నిసార్లు ప్రజలను ఇబ్బందులకు, భయాందోళనలకు గురిచేస్తుంది కూడా. దీనిని సృష్టించేవాడు Rumor-monger అంటే ఊహాగానాన్ని అమ్మేవాడు. ఆ తరువాత ఊహాగాన ప్రసారకుడు Rumor-spreader, ఊహాగాన గ్రహీత Rumor-Receiver ఉంటారు. నీరు నిలవదు కథలో మూడు రకాల వ్యక్తులు కనిపిస్తున్నా ఎవరు ఎవరని చెప్పడం కష్టం. కారణం రచయిత ఎవరికీ ప్రత్యేకంగా పేర్లు ఇవ్వలేదు.

**అసుర సంధ్య :**

మల్లాది రామకృష్ణశాస్త్రి రాసిన కథ 'అసుర సంధ్య'. సాధారణంగా మనుషుల కమ్యూనికేషన్‌లో మాటలే ప్రధానం. వక్త లేదా గ్రహీతకు దృష్టిలోపం. వినికిడి సమస్య ఉన్నపుడు కమ్యూనికేషన్ కొంత కుంటుపడుతుంది. పుట్టుకతోనే వినికిడి సమస్య ఉన్నవారికి సాధారణంగా మాట్లాడడంలో కూడా సమస్య ఏర్పడుతుంది. కానీ అసుర సంధ్య కథలో ప్రధాన పాత్రలలో ఒకరికి చూపు లేదు, మరొకరికి మాటలేదు. మొదటి వ్యక్తి చూపులేకపోవడం రెండో వ్యక్తి మాటలేకపోవడానికి కారణం అయింది. ఎనభై ఏళ్ళ వయసులో సోమయ్యకు మళ్ళీ పెళ్ళి చేసుకోవాలనిపించి. ఆస్తి ఉన్నా పిల్లలు లేకపోవడం, బాగోగులు చూసే దిక్కు లేకపోవడంతో పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకుంటాడు సోమయ్య. పిల్లను వెతికి పెట్టే బాధ్యత తన లాయరుకు అప్పజెబుతాడు. అప్పటికే సోమయ్యకు చూపు పోయింది. ఈ ముసలివాడికిచ్చి ఆడపిల్ల బతుకును నాశనం చేయడం ఇష్టంలేని లాయరు తానే ఆడపిల్ల వేషం వేసుకొని సోమయ్యను పెళ్ళి చేసుకుంటాడు. మాట్లాడితే సోమయ్య తన గొంతు గుర్తుపడతాడు కనుక మూగపిల్లను ఇచ్చి పెళ్ళి చేస్తున్నట్టు చెబుతాడు లాయరు. ఈ కథలో కన్యాశుల్కంలోని

లుబ్ధావధాన్లు కథ కొంత కనిపిస్తుంది. అయితే కన్యాశుల్కంలో పెళ్ళి కూతురు వేషంలోని వెంకటేశం పెళ్లైన రాత్రే పారిపోవడంతో అతని వేషం బయటపడలేదు. ఈ కథలో పెళ్ళికూతురు సోమయ్య చనిపోయే వరకూ అతనితోనే ఉంది. అయినా రహస్యం బయటపడలేదు. కారణం పెళ్లి కొడుక్కి చూపు లేదు, పెళ్ళికూతురికి మాటలేదు. అయినా సోమయ్య భార్యతో సంభాషించేవాడు. దీనికి అతను ఎంచుకున్న సాధనం స్పర్శ సంభాషణ. సంభాషణలో సమాచార చేరవేతకు స్పర్శను వాహకంగా వాడినట్లయితే దానిని Haptic Communication అంటారు. విద్యార్థి ప్రతిభను గుర్తిస్తూ ఉపాధ్యాయుడు అతని వీపు తట్టడం, అభిమానం చాటుకోవడానికి స్నేహితులు ఆలింగనం చేసుకోవడం దీనికి ఉదాహరణలు. అనుభూతులను వ్యక్తీకరించడానికి ఈ సంభాషణా విధానం ఉపయోగపడుతుంది. సైనికులు, వైద్యులు ఎక్కువగా ఈ విధానాన్ని ఉపయోగిస్తారు. ఎదురుగా వచ్చే ప్రమాదాలను గురించి తెలియజేయడానికి సైనికులు వాడతారు. సెల్ ఫోన్ లలో ఐదు నెంబరు ఎత్తుగా ఉండడం, కరెన్సీ నోట్ల మీద అంధుల కోసం కొన్ని ఉబ్బెత్తు గుర్తులను ఇవ్వడం కూడా ఈ విధానంలో భాగాలే. భార్యను తాకుతూ ఆవిడ చేత్తో చేసే సైగలును అర్థం చేసుకుంటూ సోమయ్య మాట్లాడేవాడు. ఇలా చూపు, మాట లేని ఇద్దరు దంపతుల మధ్య జరిగే సంభాషణ నేపథ్యంగా కథా రచన చేశారు రామకఅష్ణశాస్త్రిగారు.

### అత్తగారు - అచ్చు తప్పులు :

డా. భానుమతీ రామకఅష్ణగారు రాసిన 'అత్తగారి కథలు' సంపుటిలోని కథ ఇది. కొన్ని సందర్భాలలో రచనకంటే ఎక్కువగా పాత్రలే పాఠకుల జ్ఞాపకాలలో మిగిలిపోవడం కనిపిస్తుంది. అలా తెలుగు కథా సాహిత్యంలో గుర్తుండిపోయే పాత్రలలో ఒకటి భానుమతి గారు సృష్టించిన అత్తగారు పాత్ర. అత్తగారు అంతగా చదువుకోలేదు, ప్రపంచజ్ఞానం తక్కువ. అయితే తన తెలియనితనాన్ని బయటపడకుండా నెట్టుకురావడానికి ప్రయత్నిస్తుంటుంది. ఈ ప్రయత్నాలే హాస్యాన్ని పుట్టిస్తాయి. వంటపని, ఇంటిపని దగ్గర నుండి ఇంట్లో జరిగే పనులన్నింటిలో తన పెత్తనమే సాగాలనేది ఆవిడ పట్టుదల. అయితే ఆవిడ చేసే పనులలో ఏదైనా తప్పు జరిగితే మాత్రం అక్కడ నుండి తప్పుకోవడమో, ఎదుటి వ్యక్తి మీదకి ఆ తప్పును నెట్టేయడమో చేస్తుంది. ఈ కథలో అలా తన రాతలో పొరపాట్లను ఇతరుల మీదికి ఎలా నెట్టి వేసిందన్న వస్తువును తీసుకొని కథ రాశారు. రాత లేదా లిపి అన్నది మాటల్లోని విషయాన్ని స్థలాతీతం, కాలాతీతం చేస్తుంది. అయితే అందులో ఏ కొంచెం తప్పు జరిగినా పూర్తి వ్యతిరేక అర్థం వచ్చే ప్రమాదమూ ఉంది. ఉదా: పై అధికారి వద్దని చెబుతూ Not permitted అని రాసిన విషయాన్ని కింది అధికారి Note, permitted గా మార్చి రాసాడు. అంటే ఒక్క అక్షరం అదనంగా చేర్చి పూర్తి అర్థాన్నే మార్చేశాడు. ఇలాంటి కథలే పంచతంత్రంలో కనిపిస్తాయి. ఇవే కాదు విరామ చిహ్నాలు సరిగా వాడకపోవడం, సరైన చోట ఖాళీ వదలక పోవడం వల్ల అర్థాలు మారిపోయే ప్రమాదం ఉంది. మాటల్లో అయితే గ్రహీతకు తను చెప్పే విషయం అర్థం కాలేదు అనుకుంటే వక్త మళ్ళీ అర్థమయ్యేలా చెప్పవచ్చు. కానీ రాతలో అలా కుదరదు. అందుకోసమే చాలా శాస్త్రాలలో రాతకు సంబంధించి నిర్దిష్టమైన భాష, శైలి వాడేలా శైలీ శాస్త్ర గ్రంథాలను ఏర్పరుచుకున్నారు. కానీ సాధారణంగా రాసేవారు, ఇటువంటి నియమాలను పాటించరు. గ్రహీత ఎంతవరకు అర్థం చేసుకుంటాడు అని ఆలోచించకుండానే రాస్తారు. మరొకొన్నిసార్లు వక్త తనకు తెలియకుండానే తప్పులు రాయవచ్చు. అలా వక్త రాతలోని తప్పులు విపరీత పరిణామాలకు ఎలా దారితీసాయో చిత్రించిన కథ అత్తగారు - అచ్చుతప్పులు. లోకజ్ఞానం లేకపోయినా గడుసుతనంతో తను చేసే పొరపాట్లను కప్పిపుచ్చుకోవడం భానుమతిగారు అత్తగారు పాత్రలోని ముఖ్య లక్షణాలలో ఒకటి. ఇంట్లో సరుకులు అయిపోయాయని పచారీ సామాన్ల లిస్టు తయారు చేస్తారు

అత్తగారు. పనివాడితోనూ, కోడలితోనూ మాట్లాడుతూ రాయడంలో తప్పులు రాస్తుంది. రెండు కిలోల చక్కెరకు బదులు రెండు బస్తాలు, బండెడు కట్టెలు ఇలా అన్ని సరుకులు సంవత్సరానికి సరిపోయేలా రాస్తుంది. కథ పేరు అచ్చు తప్పులు అని రాశారు కానీ నిజానికి అత్తగారు రాసేప్పుడు జాగ్రత్తగా రాయకపోవడం, రాసిన తరువాతైనా ఒకసారి చూసుకోక పోవడం అసలైన తప్పులు. ఇటువంటి అచ్చు తప్పులు ఈ మధ్యకాలపు పుస్తకాలలో ఎక్కువగా కనిపిస్తునాయి. ముఖ్యంగా పరిశోధక గ్రంథ రచనలో ఈ ముద్రణారాక్షసుడి/అచ్చుతప్పుల నుండి తప్పించుకోవడం అంత సులభం కాదు.

## కూతురి కాపురం :

మనుషుల కమ్యూనికేషన్ వ్యవస్థలలో ప్రధానమైనది మాటల ద్వారా జరిగే సంభాషణ. అయితే మాటలన్నీ ఒకే రకంగా ఉండవు. వీటిలో అంతరంగ సంభాషణలు, అంతర్గత సంభాషణలు, ఉపన్యాసాలు, చర్చలు వంటి అనేక రకాల సంభాషణలు ఉంటాయి. భారతీయ ఆలంకారికులు వీటిని యౌగిక, లక్షణ, వ్యంజన అనే ధ్వని రూపాలుగా చెప్పారు. నేరుగా మాట్లాడడం యౌగికం. ఒకటి చెబుతూ మరొక అంశం స్ఫురించేలా చేయడం లక్షణ. ఉదాహరణకు వాడు హరిశ్చంద్రుడు లాంటివాడు అన్న మాటకు యౌగికార్థంలో ఎప్పుడూ నిజమే మాట్లాడతాడని అర్థం. అదే లక్షణార్థంలో అబద్ధాలకోరు అని అర్థం చెప్పుకోవాలి. వ్యంజనలో ఒక అర్థం పైకి కనిపిస్తూనే లోపల మరొక అర్థం ధ్వనిస్తుంది. శ్లేషాలంకారం దీనికి మంచి ఉదాహరణ. ఈ అన్ని రకాల సంభాషణ విధానాలను నిత్య జీవితంలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక సందర్భంలో చేస్తూనే ఉంటారు. ప్రస్తుత సాధారణ సంభాషణల ద్వారా ఒక అసాధారణ అంశాన్ని చెప్పడం కనిపిస్తుంది. ఇది ప్రధానంగా వ్యంగ్యార్థ ధ్వని రూపానికి చెందింది. అదే సందర్భంలో అంతర్గత సంభాషణా విధానానికీ చెందుతుంది. రైలులో కలుసుకున్న ఇద్దరు స్త్రీల సంభాషణ ప్రధానంగా సాగే కథ ఇది. ఒక వయసైన స్త్రీ తన కూతురి కాపురాన్ని గురించి తోటి ప్రయాణికురాలికి వివరించి చెబుతుంటుంది. ఆవిడ చెప్పే సంగతులు సాధారణంగానే ఉంటాయి. రైలు ఆగిన తరువాత మీ కూతురు ఎవరంటే బెజవాడ కొండమీద ఉన్న కనకదుర్గమ్మ గుడిని చూపిస్తుంది. అప్పుడు మళ్ళీ ఒకసారి ఆవిడ తన కూతురి గురించి చెప్పిన విశేషాలను తలచుకుంటే అవి పార్వతీదేవికి సంబంధించిన సంగతులని అర్థం అవుతాయి. ఉదా: "అల్లుడుగారు మాత్రం భోళారాయుడే. పాదాలపైన పడే వాడికీ, నెత్తిన చెయ్యి పెట్టేవాడికి తేడా ఏమిటో తెలియదుగదా......... నారాయణమూర్తిగారని ఈయనగారికొక స్నేహితుదున్నాడులే. ఆయనవల్ల ఎన్నిసార్లు గడచి గట్టెక్కినాడో" (రాజారాం, మధురాంతకం. 2004: 308). పై వాక్యాలలో కనిపించేది శివుడు, విష్ణువుల గురించిన సంభాషణ. సంభాషణ/కమ్యూనికేషన్ నిర్మాణంలో భాగమైన డీకోడింగ్ అన్న విభాగం ఇక్కడ లోపించింది. వక్త చెప్పిన అభిప్రాయాలను శ్రోతలు (ఇక్కడ రైలులోని తోటి ప్రయాణికురాలు, పాఠకుడు కూడా) తమకు అలవాటయిన పద్ధతిలో అర్థం చేసుకున్నారు. అంటే వక్త మాటలను డీకోడ్ చేసుకున్నారు. ఈ డీకోడింగ్‌లో అంతరాయం కలిగించడం ద్వారా రచయిత కొత్త కథన శిల్పాన్ని సాధించగలిగారు. శ్రీవల్లీ రాధికగారు ఈమధ్య కాలంలో రాసిన "హేలగా ఆనంద లీలగా" కథా సంపుటిలోని 'సాన్నిధ్యం', 'నాన్న దగ్గరికి' కథల్లోనూ ఇటువంటి కథన శిల్పం కనిపిస్తుంది.

## ముగింపు :

కమ్యూనికేషన్ వ్యవస్థ ఎటువంటిదైనా దాని ప్రధాన ఉద్దేశం స్పష్టంగా, సులభంగా వక్త అనుకున్న భావాలను గ్రహీతకు చేరవేయడం. ఇలా చేరవేయడంలో ఏర్పడే అవరోధాలను శాస్త్రపరంగా Noise అంటారు. పైన పరిశీలించిన కథలన్నింటిలోనూ సారూప్యత కలిగిన అంశం చీఃఱంవ. కమ్యూనికేషన్ విధానాన్ని అనుసరించి, వక్త,

గ్రహీతలను, సందర్భాలను అనుసరించి Noise (అంతరాయం) అనేక విధాలుగా ఉంటుంది. అంటే అంతరాయలను నివారించడానికి తగిన పరిష్కారాలు కూడా అనేకం కావలిసి వస్తాయన్నది స్పష్టం. చరవాణి, అంతర్జాలం, రికార్డింగ్ యంత్రాలు వంటి సాంకేతిక పరిజ్ఞానం అంతా కమ్యూనికేషన్‌లోని అంతరాయాలను తగ్గించడానికి ఏర్పరుచుకున్నవే. అనువాదం కూడా భిన్న భాషల మధ్య అంతరాయాలను తగ్గించడానికి ఏర్పరుచున్న శాస్త్రమే. అయినా కూడా కమ్యూనికేషన్ సమర్ధంగా జరగడం లేదన్నది స్పష్టం (ఒకే భాషలోనూ, భిన్న భాషల మధ్య కూడా). కమ్యూనికేషన్ సరిగా జరగని సందర్భాలే పై రచయితలకు కథా వస్తువును అందించాయి. తద్వారా సమాజంలో కమ్యూనికేషన్ వ్యవస్థకు ఉన్న ప్రాధాన్యతను వివరించాయి.

**ఆధార గ్రంథాలు :**

1. భానుమతీ రామక్‌బ్రుష్ణ, పి. 2014. అత్తగారి కథలు. విజయవాడ : శ్రీమానస పబ్లికేషన్స్.
2. రాజారాం, మధురాంతకం. 2004. మధురాంతకం రాజారాం కథలు. హైదరాబాదు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
3. రామక్‌బ్రుష్ణ శాస్త్రి, మల్లాది. 2005. మల్లాది రామకఅష్ణశాస్త్రి కథలు. హైదరాబాదు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
4. వంశీ. 2018. మా పసలపూడి కథలు. విజయవాడ: ఎమెస్కో బుక్స్.
5. సత్యం, శంకరమంచి. 2008. అమరావతి కథలు. విజయవాడ: నవోదయ పబ్లిషింగ్ హౌస్.
6. Anthony Raspa(Ed.), John Donne. 2015. Devotions upon Emergent Occasions. New York: Oxford University Press.
7. Roger Cartwright. 2002. Communication. Oxford: Capstone Publishing.

BHAVAVEENA
Vol. 18, Issue. 9, September 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# పాల వెంకటసుబ్బయ్య జీవితం – రచనలు

– డా॥. ఎల్లే విజయానందరాజు, శ్రీ రుద్రపాక జితేంద్రకుమార్, తెలుగు ఉపన్యాసకులు,
పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ కళాశాల(స్వ.ప్ర), విజయవాడ.

రాయలసీమ ప్రాంతానికి చెందిన శ్రీ పాల వెంకట సుబ్బయ్య గారు 11-11-1913 సంవత్సరము కడవ జిల్లా రైల్వే కోడూరులో జన్మించారు.ఈయన కొంతకాలం ప్రభుత్వ సహకార శాఖలో ఉద్యోగం చేశారు. ఆ తరువాత మద్రాసు శాసనసభకు 1951లో ఎన్నికై 10 సం॥లు శాసనసభ్యులుగా పనిచేశారు.

చిన్నతనం నుండే శతకరచనలను ప్రారంభించిన సుబ్బయ్యగారు 40 పైగా పద్య కావ్యాలను, 10 గద్య కావ్యాలను, 4 నాటకాలను, 2 కథా సంపుటాలను, మరెన్నో ఖండికలను రచించినట్లు తెలుస్తుంది.ఈయన పాండిత్యాన్ని గుర్తించి కడప సాహితీప్రియులు1955 సెప్టెంబర్‌లో "మధుర కవి" అను బిరుదిచ్చి సన్మానించారు. ఢిల్లీ ఆంధ్రసంఘం వారు 'కవిరాజ హంస' అను బిరుదిచ్చి సత్కరించారు.

ఈయన "కలభాషిణి", "శ్రీశైలప్రభ" మొదలగు పత్రికలకు నిర్వాహకులుగాను, సంపాదకులుగాను వ్యవహరించారు. అంతేగాక "కవిరాజసింహ" గ్రంథ మాలను స్థాపించి తనకృతులను ఎన్నింటినో వెలుగులోకి తెచ్చారు.ఈ రచనలను గుర్రం జాషువాగారు మెచ్చి తన అముల్యాభిప్రాయాలను ఇచ్చినట్లు తెలుస్తున్నది.

'అనిల సందేశం' అను కావ్యంలో మేఘుడు కథా నాయకుడు. భూదేవి కథానాయిక. కరువు ప్రాంతమై రాయలసీమకు వర్షమిమ్మని కథానాయికయై భూదేవి కథానాయకుడైన మేఘుమునకు వర్తమానం పంపటం దీనిలోని ఇతివృత్తం. ఈ కావ్యం క్షామప్రాంతానికి దర్పణము పట్టిన ఒక దృశ్య కావ్యంగా చెప్పవచ్చు.

భార్య భూదేవి ఈ క్రింది విధంగా భర్తయైన మేఘునకు వాయుదేవుని ద్వారా సందేశం పంపుచున్నది.

సీ॥ కోటాను కోట్లు నీ కొమరులు నిలువున
గూలిపోయిరనును, కూడులేక
లక్షోప లక్షలు భిక్షాధికారులై
దుఃఖాన గుములుచు దూలిరనుమ
వేలకువేలు వస్త్రాలకు హీనులై
చింపిపాతలనె కైసేపి రనుమ
పచ్చనివల్వ నిప్పచ్చరంబున నీదు
దయితయు మాలిన్య ధామయనుమ !
తే॥గీ॥ నిలిచి కనువిచ్చి యొకమారు నిండుకూర్మి
జూడదలపెట్టి ప్రేమంపు జుట్టమవయి
సత్వరంబుగ రాకున్న సర్వసృష్టి
కాలసర్పవిషజ్వాల గ్రాగు ననుమ !

రైతుకష్టాలను, ప్రభుత్వంవారు రైతుకు అందించే సహాయసహకార పథకాలను వాటిని ఉపయోగించు కోవలసిన విధానాలను "మన రైతు" కావ్యంలో విపులంగా వర్ణించారు. సహకార సంఘములు రైతులపాలిట కల్ప వృక్షాలుగా భావించిన కవిగారు వాటి గురించి ఈ విధంగా వర్ణించారు.

ఉ॥ క్షామము బారదోలు,ధనకాంక్ష , గృషీవళులన్ విపత్తునన్
బాయెడు వడ్డి వర్తకుల, బ్రక్కకుదోలు, విచార భూతమౌ
లేమిడి నుక్కడంచు, పరుడీకొనజాలు ధనంబు నిచ్చు, పో
రాముల పోరు మాన్పనవురా ! సహకారము మించదేదిలన్ !

ప్రజాసేవకులుగా పేరు తెచ్చుకున్న ఈ కవికి ప్రజల పట్లేకాక ప్రజానాయకుల యెడల అమితమైన గౌరవ

భావాలున్నట్లు తెలుస్తుంది. భారత స్వాతంత్ర్య సముపార్జనకు ప్రాణాలర్పించిన మహాత్మాగాంధీ యెడల వీరికి అమితమైన భక్తి విశ్వాసాలున్నాయి. గాంధీజీ మరణానంతరం అతని గురించి వీరు వ్రాసిన ఈ క్రింది పద్యాన్ని బట్టి వారి పరితాపము తెలుస్తుంది.

సీ॥ సంసార సుఖముల - సర్వంబు విడనాడి
మానవ సేవకై - మనియెనెవరు ?
మృష్టాన్నములు వీడి - మేకపాలు, ఫలాలు
కృషికుల కొఱకు, భక్షించెనెవరు ?
ఒడనిండ వస్త్రంబు - గలుగని వాడయి
పేదల కొఱకు జీవించెనెవరు ?
ఆస్తి పాస్తులు లేక - నందందు భిక్షంబు
హరిజన నిధికిగా - నడిగెనెవరు ?

తె॥గీ॥ విధి విరామములేక గావించి కృషిని
దాస్య యోచనమును గన్న - దక్షులెవరు ?
అట్టి జాతీయపిత దివికరిగె మనల
దుఃఖసాగర మందున - ద్రోసికడకు !

వీరు రచించిన "భాగ్యమతి" "విజయ వివేకానందము" చారిత్రకకావ్యములు 'భాగ్యమతి' కావ్యంలో భాగ్యనగర నిర్మాణమే కథావస్తువు 'గొలకొండ' యువ రాజు ఒక సాధారణ నర్తకిని ప్రేమించుట, అది సహించని నవాబు అతనిని కోటలో బంధించుట, ఒకరోజు అర్థరాత్రి సమయంలో వరదతో పొంగిపోరలుతున్న మూసీనదిని ఎవరికీ తెలియకుండా యువరాజు దాటి అవతల గట్టున గల తన ప్రియురాలిని కలుసుకొనుట మొదలగు అంశాలను ఇందులో కవిగారు మనోహరముగా వర్ణించారు.

"విజయ వివేకానందము" ఆధ్యాత్మిక తత్త్వప్రబోధ కావ్యము. ఇందులో వివేకానందుని జననము - విద్యాభ్యాసము, మానసికపరివర్తనము, వివాహము, గురు దర్శనము, మొదలగు విషయాలు వర్ణించబడినవి. ఈ కథను వ్రాయుటలో కవిగారి అభిప్రాయము ఈవిధంగా ఉన్నది.

తే॥గీ॥ కాళరాత్రికి చంద్రుని - కాంతికరణి
వాడు తీవకు వర్షనం - పాతమట్లు
ధర్మమడుగంట - ప్రజలకు - ధర్మమిడగ
నమృత తుల్యంబుగాదె నీ - యమలగాథ !

ఈ దివ్యగాథ భారతీయులకే కాదు మానవాళికే అమృతతుల్యము. నరేంద్రుని తల్లి కుమారునకు ఈ విధంగా బోధచేయున్నది.

సీ॥ ప్రాణ భయము వాటిల్లిన - పలుక బోకు
మెపుడసత్యము , విడవకు మేయనువున
నైన మంచి యుద్ధేశము - నందఱియెడ
దయ బ్రకటనసేయు ! పుత్ర ! తొలగకెపుడు !

నరేంద్రుడు రామకృషుని దర్శనము చేసుకొని అతని కృపకు పాత్రుడయ్యాడు. రామకృష్ణ పరమహంసకు కూడ నరేంద్రునిపై విశ్వాసము కుదిరినది. నరేంద్రుడు వివేకానందుడయ్యాడు. అప్పుడు పరమహంస, నరేంద్రుని ఈ విధంగా ప్రశంసించుచున్నాడు.

అష్టదళ పద్మ మొకడు, పెంపారనీకడు
షోడశ దళ పద్మమగును - జూడునితడు
మహిని జను సహస్రదళ పద్మంబుకాగ
శిష్యవరులార, యీతని చెలిమి గనుడు !

ఈ పూర్వభాగపు కృతిని శ్రీ నీలం సంజీవరెడ్డిగారికి అంకితమిచ్చారు. ఈ వివేకానందపు' ఉత్తర భాగము ' వెలువడినదో లేదో తెలియుట లేదు.

ఈ కవిగారు పాశ్చాత్యసాహిత్యాన్ని అభ్యసించి కొన్ని ఆంగ్లకృతులను కూడా రచించారు. సంస్కృత భాషను చక్కగా నేర్చి కాళిదాసు 'శాకుంతలము 'ను గంగాదేవి రచించిన 'మధురావిజయము'ను తెలుగులోనికి అనువదించారు.ఈయన రచనలను చదివినప్పుడు వీరి హృదయమెంత సున్నితమైనదో మనకు అవగతమౌతుంది. వీరి భావాలు కుడా మహోన్నతముగా ఉంటాయి. ఈయన గొప్పతనం గురించి ఇతని గురువు గారైన శ్రీ వేదం వేంకటకృష్ణశర్మగారు "చిరంజీవి పాలా వెంకట

సుబ్బయ్య నా శిష్యుడు. నా వద్ద చదువు కొన్నాడు. అట్టి యెడ విద్యాసముపార్జన యందు చొఱవ చూపుచుండిన కొలదిమంది విద్యార్థులలో నీతడగ్రగణ్యుడు. నా మటుకు నాతని విశేషము, గ్రహణాసక్తి, జ్ఞాన సంపాదనాభిరుచి గాంచి మున్ముందీతడు, పేరు పెంపులతో ప్రకాశింపగలడని యువ్విళ్ళూరు చుండెడివాడను. ఈతని ధారణాశక్తి అనుపమానము పూవుపుట్టగానే దాని పరిమళము నలుదెసల వ్యాపించును గదా! అని ప్రశంసించడాన్ని బట్టి మధురకవి పాల వెంకటసుబ్బయ్య ప్రతిభా వ్యుత్పత్తులు తెలుస్తున్నాయి.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు సాహిత్యం - హరిజన రచయితలసేవ, డా॥. వై. విజయానందరాజు, అముద్రితం.
2. దళిత సాహిత్య చరిత్ర, డా॥ పిల్లి శాంసన్, 2000.
3. హరిజనాభ్యుదయం - ఆధునికాంధ్ర కవిత్వం, డా ॥ కల్లూరి ఆనందరావు, 1994.

# తెలుగు కవయిత్రులు – ప్రపంచీకరణ ప్రతిఘటన స్వరాలు

– డా॥. వి. పవన్ కుమార్ రెడ్డి
తెలుగు అధ్యాపకులు, సి.యస్.యస్.ఆర్ &
యస్.ఆర్.ఆర్.యం. డిగ్రీ & పి.జి. కళాశాల,
కమలాపురం, కడప.

– డా॥. పల్లె కృష్ణ
తెలుగు అధ్యాపకులు, సి.యస్.యస్.ఆర్ &
యస్.ఆర్.ఆర్.యం. డిగ్రీ & పి.జి. కళాశాల,
కమలాపురం, కడప.

ఇవాళ ప్రపంచీకరణ చుట్టుముట్టని రంగం కానీ, ప్రజానీకం కానీ లేదు. పెట్టుబడిదారీ విధానం యొక్క అత్యున్నత దశ సామ్రాజ్యవాదం. సామ్రాజ్యవాదం యొక్క పరాకాష్ఠ రూపం ప్రపంచీకరణ. ప్రపంచీకరణ అంటే ప్రపంచమంతా ఒకటి కావడం.ఒకటి కావడమంటే ప్రేమ, సహకారం, శాంతి మొదలగున అర్థాల్లో ఒకటి కావడం అని మాత్రం కాదు. ఏ దేశాల మధ్యనైనా ఎటువంటి ఆంక్షలూ లేకుండా వ్యాపారం కొనసాగించవచ్చునని అర్థం. దీనినే "స్వేచ్ఛా వాణిజ్యం" అని పిలుస్తారు.

వర్ధమాన దేశాలలో ప్రపంచీకరణ దుష్ప్రభావం వల్ల వ్యవసాయ రంగ సంక్షోభం, వృత్తుల విధ్వంసం, సంస్కృతి పతనం మొ॥ విపరీత పరిణామాలు నెలకొన్నాయి. మహిళలు కూడా ఇందుకు మినహాయింపు కాదు. పై పెచ్చు ప్రపంచీకరణ దుష్ఫలితాలు అన్నింటితో పాటు లింగ వివక్ష కూడా వీరికి తోడవుతున్నది.

1980 వ దశాబ్దంలో వెలువడ్డ స్త్రీవాద కవిత్వం ఆధునిక తెలుగు కవిత్వాన్ని సంపద్వంతం చేసింది. ఎంతో మంది తెలుగు కవయిత్రులు తమ పదునైన భావాల్ని కవిత్వంలో వ్యక్తీకరించారు. పురుషాధిత్య భావజాలంపై ఎంత బలంగా తమ కవితాస్త్రాలని సంధించారో అంతే బలంగా ప్రపంచీకరణ భావజాలంపై కూడా సంధించారు. 1991 లో నూతన ఆర్థిక విధానాల్ని మన దేశంలో ప్రవేశపెట్టారు. అప్పటినుంచీ ప్రపంచీకరణ అనే భావన ప్రచారంలోకి వచ్చింది. ప్రపంచీకరణ నేపథ్యంలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. స్త్రీలని ఒక సరుకుగా, మార్కెట్ ప్రచార కర్తలుగా జరిగింది. వీటన్నింటిని తెలుగు కవయిత్రులు మొదటి నుంచీ ప్రతిఘటిస్తూ వస్తున్నారు. వ్యవసాయం, సంస్కృతి అంశాలలో ప్రపంచీకరణ దుష్ప్రభావాన్ని తెలుగు కవయిత్రులు ప్రతిఘటించిన తీరును వివరించడం ఈ వ్యాసం యొక్క ఉద్దేశ్యం.

వ్యవసాయం - సరళీకృత ఆర్థిక విధానాలు మన దేశంలో ప్రవేశపెట్టడం మూలంగా వ్యవసాయరంగం అతలాకుతలమైంది. ఈ విషయాలపై తెలుగు కవులు స్పందిస్తూ వచ్చారు. ఇందులో స్త్రీలు కూడా ఉన్నారు. మన గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మహిళలు వెన్నెముక వంటి వారు. పశుపోషణ, ఇంటిపనితో పాటు పొలం పనుల్లో నాట్లు వేయడం, పంటకోతలు, నూర్పిడి, పశుగ్రాస సేకరణ, పాలు పితకటం వంటి పనుల్లో అధికశాతం మహిళల శ్రమ ఉంది.

వ్యవసాయ రంగంలో జన్యుమార్పిడి విధానాలతో, టెర్మినేటర్ విత్తనాలతో రైతులు కుదేలయ్యారు. ఇటువంటి కృత్రిమ విధానాల్ని తెలుగు కవయిత్రులు ప్రతిఘటించారు. "కొత్తా దేవుడండీ.." అనే కవితలో కవయిత్రి కల్పనా రెంటాల కృత్రిమ విధానాల్ని వ్యతిరేకించారు.

"మొక్కల చివుళ్లు
దూడలు తాగే అమ్మపాలు
ఇక అన్నీ జెనెటిక్ ఉత్పత్తులే
కడుపులో పిండాలకు
టెర్మినేటర్ విత్తనాలు చల్లండి
అన్నదాతల ఆత్మహత్యలకు
మోనోక్రోటోఫాస్ అమ్ముకోండి"

అంటూ కవయిత్రి నిరసన వ్యక్తం చేసింది. బహుళ జాతి సంస్థల ప్రచారం వ్యవసాయరంగాన్ని దెబ్బతీస్తున్నది. మోన్‌శాంటో కంపెనీ ప్రవేశపెట్టిన బి.టి. పత్తి రకం వల్ల సాగులో తెగుళ్ళ నివారణ జరగలేదు. దిగుబడులు పెరగలేదు. రైతులు ఆశించిన పంట చేతికి రాకపోవడంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ విధానాలు, బ్యాంకుల రుణాలు రైతుల ఖననానికి కారణాలు.

పత్తి రైతుల ఆత్మహత్యల నేపథ్యంలో ఓల్గా రాసిన "చావుని కాదు బతుకుని" అనే కవితలో సగటు రైతు భార్య కన్నీటి ఘోష వినిపిస్తుంది.

"విషంతో నీకు చావు దొరికింది
నా బతుకు చేదు విషం అయింది
పత్తి పంట నిన్న మొన్నటిదాయె
మన సంసారం యెన్నాళ్ళిది?"

అంటూ ప్రశ్నిస్తుంది. భర్త మరణించిన తర్వాత తనని, తన పిల్లల్ని గురించిన ఎరుకను కవయిత్రి చెబుతుంది.

"నీ పంట నాశనమవటమే చూశావు గానీ
నా కడుపు పంట సంగతి యేమాలోచించావు
పురుగు కొరుక్కుతినే పత్తికాయల్లా
వీళ్ళనెట్లా గాలికొదిలెయ్యను? ........
నోరు తెరిచి అడగాలయ్యా !
ఇదంతా యేమిటనీ
ఎందుకిట్లా జరుగుతోందనీ ?
"ముద్దకే కాదు
యుద్ధానికీ పిడికిలి బిగించాలని
నా పిల్లలకు నేర్పటానికి
నేను బతికి తీరతానయ్యా !"

అంటూ కవయిత్రి ధైర్యాన్నిస్తుంది. ప్రభుత్వ విధానాల పట్ల, రైతుల మరణానికి గల కారణాల పట్ల ప్రశ్నించమని, పోరాటానికి సిద్ధపడమని కవయిత్రి బతుకు పట్ల భరోసాని ప్రకటిస్తుంది.

భారతదేశంలో తొలిరకం బిటి వ్యవసాయ ఉత్పత్తి పత్తి. తాజాగా బిటి వంకాయకు అనుమతి లభించడంతో, ఇది తొలి బిటి ఆహారోత్పత్తి అవబోతోంది. ప్రపంచంలోనే తొలి జన్యుమార్పిడి కాయగూర ఇది. రైతులు, పర్యావరణ వేత్తలు, సామాజిక వేత్తలు, స్వచ్ఛంద సంస్థల అభ్యంతరాలను, ఆందోళనలను బేఖాతరు చేస్తూ ప్రపంచంలోనే తొలిసారిగా భారత్‌లో బిటి వంకాయ ఉత్పత్తికి ద్వారాలు తెరుచుకున్నాయి.

బిటి వంకాయలు మన తిండినీ, ఆరోగ్యాన్నీ ప్రభావితం చేస్తాయి. మన దేశంలో బహుళజాతి సంస్థలు 'బయో'త్పాతం సృష్టించకుండా అప్రమత్తంగా ఉండాలని కవయిత్రి పాటిబండ్ల రజని "మిత్తికి లొంగని విత్తనం" అనే కవితలో హెచ్చరించినది.

"కోళ్ళ కోసం నక్కిన బావల్లా -
వంగ తోటల్లో దూరే దొంగ బావలొస్తున్నారు
చెంగు దోపవే చెల్లెలా !
గుత్తి వంకాయల్లో మృత్యు మసాలా కూరేందుకు -
విదేశీ విషప్పురుగులు ఉవ్విళ్ళూరుతున్నాయట
అట్లకాడ కాల్చవే అక్కయ్యా ! ..... .....
సాఫల్య కేంద్రాల్లో శీతలీకరించే కణాల కంటే
నూరుపాళ్ళు నికార్సుగా, జీవాన్ని ఏడాది పాటు
పిడకల్లోనో, బూడిదలోనో దాచిపెట్టి
మానవ జాతికి మహా భోజనపు సంకేతంలా వీచే
తొలకరి మట్టివాసనకు పులకలెత్తి పోతూ,
కొత్త పెళ్ళికూతుర్లా చెంగుపట్టే నేలమ్మ నుదుట
విత్తనపు బొట్టెట్టి ఒడి నిండాలని దీవించే
నీ పచ్చని పందిట్లో బైసన్లను మేపుతారట !"

అంటూ కవయిత్రి బిటి వంకాయల్ని ప్రవేశపెట్టే విదేశీ కంపెనీల విషప్పురుగులు వస్తున్నాయని వాటిని వ్యతిరేకించాలని, జాగ్రత్త పడాలని సూచిస్తుంది. చీడ పేరు చెప్పి ఈ విదేశీ కంపెనీలు మన దేశంలో ప్రయోగాలు చేస్తున్నాయి. వీటి పట్ల సన్నద్ధంగా ఉండాలని కవయిత్రి ప్రజల్ని పోరాటోన్ముఖుల్ని చేస్తుంది.

"వీళ్ళకేం తెలుసులే 'వంకాయ్' అని, దొంగలు
దొంగలు కలిసి
మన వంగను పట్టుకుంటుంటే -
నాలుగు పక్షాలుగా చీల్చినా ఒక్కటిగా ఉండే
గుత్తొంకాయ తిన్న ఐకమత్యంతో,
మెట్టొంకాయలా పిడికిలి గట్టిగా బిగించి
మోన్‌శాంటో మొహాన గుద్దుదాం !
అంగరంగ వైభవంగా మన వంగను
ఊరూ వాడా నోరూరేలా ఊరేగిద్దాం !"

వంకాయ తెలుగు వారి ఆహారపు అలవాట్లలో ఒక భాగం. వంకాయ కూర లేకుండా ఏ శుభకార్యం జరగదు. మన గుత్తొంకాయకు అనాది నుండి ఎంతో ప్రాశస్త్యం ఉంది. అటువంటి మన వంకాయని మనదైన ఆహారపు రుచిని మనం కోల్పోకూడదు. మోన్‌శాంటో కంపెనీ తయారు చేసిన బిటి వంగసాగుని దేశంలోకి ప్రవేశించకుండా ప్రతిఘటించాలని కవయిత్రి పిలుపు నిచ్చింది.

**సంస్కృతి :**

ప్రపంచీకరణ ప్రభావంతో మనదైన సంస్కృతి పతనావస్థకు చేరుకొంది. మానవ జీవన విధానమే సంస్కృతి. ప్రపంచీకరణ రెండు రకాల సంస్కృతుల్ని తెచ్చి పెట్టింది. అవేమంటే వస్తు వ్యామోహ సంస్కృతి, వస్తు వినిమయ సంస్కృతి. మనుషుల కంటే మానవీయ విలువల కంటే వస్తువులకూ, సరుకులకూ ప్రాధాన్యం ఇవ్వడం, ఎక్కువగా వాటిమీదనే వ్యామోహం పెంచు కోవడం వస్తు వ్యామోహ సంస్కృతి. ఈనాటి మార్కెట్ ప్రపంచంలో వస్తువులు లేదా సరుకులే తమ వినియోగం కోసం మనుషుల్ని తయారు చేసుకుంటున్నాయి. ఇదే వస్తు వినిమయ సంస్కృతి.

కొండేపూడి నిర్మల రాసిన "జీవితం వర్సెస్ ట్రూప్ బజార్" అనే కవిత వస్తు వ్యామోహ సంస్కృతిని చిత్రించి నది.

"ఒక పింగాణీ అట్టహాసం
ఒక ప్లాస్టిక్ డబాయింపు
ఒక లోహపు డమ డమ
మనుషుల్ని తరిమికొడుతున్న మార్కెట్లో
మానవ విలువలు తక్కెడలో వున్నాయి
కొంటారా ? అమ్ముతారా ?"

అంటూ మానవ విలువల్ని వస్తు విలువలు ఆక్ర మించిన తరుణాన్ని గుర్తు చేశారు. అటువంటి వస్తు విలువలు మన జీవితంలోకి ప్రవేశించాక, ఇక మన మధ్య ఆ వస్తువుల గురించిన విషయాలు మాత్రమే కొనసాగు తాయని ఇదే కవితలో కవయిత్రి వ్యక్తం చేసింది.

"వస్తువు బరువుకి మాట అగాధంలో పడిపోవచ్చు
వస్తువు మోతకి జీవన సంగీతం మూగబోవచ్చు
ఖండాంతరాల దూరం నుంచి పుష్కరానికోసారి
పుట్టింటి కొచ్చిన మా అక్కా చెల్లెళ్ళ మధ్య
తరచుగా దొర్లేవి వస్తువుల గురించిన సంబరాలే"

ఇవాళ ఈ విషయాలన్నీ మన అనుభవంలోకి వచ్చాయి. వర్తమాన జీవితాన్ని ప్రతిఫలించినదీ కవిత. మానవ సంబంధాలు వస్తు సంబంధాలుగా పరిణమించిన తీరు కనబడుతున్నది.

అందాల పోటీల గురించిన విస్తృత ప్రచారం ద్వారా అందాన్ని గురించిన తప్పుడు భావనల్ని వ్యాపింపజేసి, తద్వారా సామ్రాజ్యవాద కంపెనీల తయారీ సౌందర్య సాధనాలను హెచ్చుగా వినియోగంలోకి తెచ్చి మార్కెట్ చేసుకోవాలనేది ముఖ్య లక్ష్యంగా ఉంది. మార్కెట్‌లో ఒక సరుకు అమ్మ బడాలంటే ఒక అందమైన స్త్రీ దాని విలువను ప్రచారం చేయవలసిన పరిస్థితి ఈనాడు వచ్చింది. దానిలో భాగంగా స్త్రీ శరీరాన్ని ఒక సౌందర్య మూర్తిగా మలచవలసి వచ్చింది. స్త్రీలు సౌందర్యం కోసం ప్రయత్నించడం అదొక హింస లాంటిదని విమల రాసిన "సౌందర్యాత్మక హింస" కవితలో వెల్లడించింది

"అందం పోటీయైన చోట
అందం 'సరుకై'న చోట
అందాల వ్యాపారాల్ని ద్వేషిద్దాం"

అని పిలుపునిచ్చింది. అందం అనే భావజాలం వెనుక మార్కెట్ చేసే ప్రచార కుట్రని తెలుగు కవయిత్రులు తేటతెల్లం చేశారు.

కొండేపూడి నిర్మల రాసిన "మల్టీ నేషనల్ ముద్దు" అనే కవిత అందాల పోటీల్ని నిరసించినది.

"అందాల గారడీ
నా ఇంటిల్లిపాదినీ బొమ్మలు చేసింది
అమ్మ బొమ్మ, కూతురి బొమ్మ, అమ్మమ్మ బొమ్మ
కుక్క పిల్ల బొమ్మ -
ఎవరి కన్ను మూసి తెరిచినా మిస్సిండియా కలలే"

ప్రపంచీకరణ తెచ్చిన ఈ సౌందర్య పిపాసకు వయసుతో సంబంధం లేదు. నేడు తామర తంపరగా పెరుగుతున్న బ్యూటీపార్లర్లు, కాస్మెటిక్ సర్జరీ హాస్పిటళ్లు కృత్రిమ అందాల వ్యామోహాల్ని సంతృప్తి పరుస్తున్నాయి. సౌందర్య మత్తు నుంచి బయటపడాలని కవయిత్రులు సూచిస్తున్నారు. కొండేపూడి నిర్మల ఇదే కవితలో అటువంటి ప్రయత్నం చేసింది.

"ఉగ్గబట్టిన సౌందర్యాన్నభినయించే ప్రతి గాయమూ
మారకపు విలువే తప్ప
మరేదీ కాదు .....
వెనకటి తరం శారీరక స్పృహ కంటే
అందాల వ్యాపారం కోసం
అందవిహీనమవుతున్న వ్యవస్థకి బానిసగా
ఈ సామాజిక స్పృహే నన్నెక్కువ దగా చేస్తోంది"

అంటూ వర్తమాన కాలపు వాస్తవ జీవితాన్ని గూర్చి చెప్పారు. అందం అనేదే ప్రపంచ స్థాయిలో పెద్ద పరిశ్రమగా రూపొందింది. వందల కోట్ల రూపాయల లాభాలను సులువుగా, నికరంగా పొందటానికి అందం అనే భావజాలమే పెద్ద పెట్టుబడిగా ఉపయోగపడుతోంది. అదే విధంగా ప్రపంచీకరణ నేపథ్యంలో పర్యాటక రంగ అభివృద్ధి పేరుతో సెక్స్ టూరిజాన్ని ప్రోత్సహిస్తున్నారు. మూడో ప్రపంచ దేశాల్లో ప్రత్యేకించి ఆగ్నేయాసియా దేశాల్లో 1970 తర్వాత అభివృద్ధి చెందుతున్న పరిశ్రమ సెక్స్ టూరిజం. ప్రధానంగా విదేశాల నుంచి వచ్చే సంపన్నుల విలాస అవసరాలు తీర్చడానికి తొమ్మిదేళ్ళ నుంచి పది పదిహేనేళ్ళ వయసున్న రెండువేల మంది అమ్మాయిలతో ఒక సెక్స్ టూరిజం పరిశ్రమ ఉత్తర బ్రెజిల్‌లో విస్తరిస్తున్నదని లాటిన్ అమెరికా పత్రిక ఒకటి రాసింది. ప్రపంచీకరణ, సరళీకరణ విధానాలే దీనంతటికీ కారణం.

పాటిబండ్ల రజని రాసిన "ఎర్రజాబిళ్ళ ఎరీనా!" అనే కవిత బాల వేశ్యల కోసమే సెక్స్ టూరిజం పేరిట మన దేశానికొచ్చే విదేశీ వింత పశువుల వికృతానందానికీ చలించి రాసినటువంటి కవిత.

"రండి బాబూ రండి
వెల్‌కమ్ టు ఇండియా
ఇప్పుడిది
మొగ్గ మెహందీల ఏరియా ! .....
తాజ్‌మహల్ చలువ పలకలు
మీ తాపం తగ్గించవని
తాజాగా తల్లి పేగు తెంచిన
తడి బొడ్లను తట్టల్లో పేర్చాం ! .....
మీ సెక్స్ బాత్ కోసం మా గోవాబీచ్
తడిదేరని పసితనువుల ఇసుక పర్రల్తో
తయారుగా పక్క పరచి ఉంచింది .....
పర్యాటక మారకం చెల్లించి నంతనే దక్కే
పసిగాయాల ఫలహారాలు -
ఇంకెక్కడైనా మీకు చిక్కేనా ?
అయ్యా !
అందుకే ఇది ఎర్రజాబిళ్ళ ఎరీనా !"

అంటూ కవయిత్రి ఆవేదనతో,ఆర్తితో వెల్లడించారు. ముక్కుపచ్చలారని పసిపిల్లల్ని బలిచేస్తున్న వికృత

సంస్కృతి ఇది. స్త్రీని సరుకుగా, అంగడి బొమ్మగా, మాంసం ముద్దగా చూసే సంస్క ృతికి ముద్దుపేరు పర్యాటక రంగం అభివృద్ధి. పర్యాటక రంగం ముసుగులో మానవ మాంస వ్యాపారానికి తలపడిన తలపడిన వింత సంస్కృతి ఇది. ఈ విధంగా తెలుగు కవయిత్రులు ప్రపంచీకరణ విధానాల మూలంగా చోటు చేసుకుంటున్న విపరిణామాలను అక్షరబద్ధం చేశారు. ప్రపంచీకరణ పట్ల తమదైన రీతిలో ప్రతిఘటన స్వరాలను వినిపించారు.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. నేను కనిపించే పదం - కల్పనా రెంటాల
2. రైతు కవిత - సంపా॥ పాపినేని శివశంకర్, బండ్ల మాధవరావు, ఎమ్వీ రామిరెడ్డి
3. కవిత 2010 - సంపా॥ పాపినేని శివశంకర్, దర్భశయనం శ్రీనివాసాచార్య
4. మల్టీ నేషనల్ ముద్దు - కొండేపూడి నిర్మల
5. ఎర్రజాబిళ్ళ ఎరీనా - పాటిబండ్ల రజని

**విమర్శ :**

1. వచన కవిత్వంలో వర్తమాన రైతు (వ్యాసం) - మేడిపల్లి రవికుమార్ ప్రస్థానం ప్రత్యేక సంచిక, హైదరాబాద్, 2008.
2. అమ్మకానికి ఆంధ్రప్రదేశ్ - ఎన్. వేణుగోపాల్, విశ్లేషణ ప్రచురణలు, హైదరాబాద్, 1999.

# గురజాడ అడుగుజాడ నిత్యస్మరణీయం

- డా॥. కడివెండి మమత, సహాయ ఆచార్యులు, బద్రుకా వాణిజ్య మరియు కళల కళాశాల, హైదరాబాద్.

ఆధునికాంధ్ర కవితా వైతాళికుడుగా విశ్వజనీన మానవతావాద ప్రతిపాదకుడుగా శ్రీ గురజాడ అప్పారావు గారు 1862 సంవత్సరం, సెప్టెంబరు 21వ తేదీన రాయవరంలో జన్మించారు.

గురజాడ కేవలం మహాకవి రచయిత సంస్కర్త మాత్రమే కాదు, సంపూర్ణ వ్యక్తిత్వం అవగాహన మూర్తీభ వించిన సామాజిక శాస్త్రజ్ఞుడు. తెలుగుభాష ఈ రూపంలో వుండటానికి సాహిత్య ప్రక్రియలైన కవితకథ నాటకం వగైరాలు ఇంతగా వికసించడానికి పునాదులు వేసిన మహనీయుడు గురజాడ.

తన రచనలలో శాస్త్రీయ అవగాహనను చాటి చెప్పి మూఢనమ్మకాలను చీల్చిచెండాడిన మహాకవి గురజాడ అప్పారావు. ఆయన రచనలు నేటికీ ప్రామాణికమైనవని, మార్గదర్శకమైనవని, గురజాడ సాహిత్యంలో స్త్రీ ద్వారా సమాజం మారుతుంది అనే సందేశమిచ్చారు. ఆధునిక తెలుగు సాహిత్యానికి పునాదులు వేసినవి మహాకవి గురజాడ రచనలు. కుల, మత, దురాభిమానాలను నిర్మూలించడానికి గురజాడ తన రచనల ద్వారా కృషి చేశాడని కుల-మత రహిత సమాజాన్ని నిర్మించడానికి మనమందరం కృషి చేయడమే ఆ మహాకవికి మనమివ్వ గల నివాళి. సామాజిక దురాచారాలను, వర్ణవ్యవస్థ కుటిల పన్నాగాలను తన పద్యాల ద్వారా చీల్చిచెండాడిన ప్రజాకవి.

వ్యక్తిలోని లోపాలను ద్వేషించాడే తప్ప వ్యక్తిని కాదు. వేశ్యావృత్తిని ద్వేషించాడు. కానీ వేశ్యలను కాదు. వృత్తిరీత్యా రాజాస్థానంలో ఉన్నా, రాచరిక వ్యవస్థను కాక ప్రజా స్వామ్యాన్ని ప్రేమించాడు. 'గురజాడ సాహిత్యం ఎప్పటికీ శిరోధార్యం'. ఆదర్శవంతమైన సమాజానికి, ఆమోద యోగ్యమైన సంస్కరణలకీ ఆయన ప్రతి రచనా మార్గదర్శిగా నిలుస్తుంది. ఏ దేశ ఆర్థిక, సామాజిక అస్థిత్వానికైనా గురజాడ దేశభక్తి గీతం నిలువెత్తు ప్రామాణికంగా నిలుస్తుందని. దేశ అస్థిత్వాన్ని కాపాడు కోవాలంటే గురజాడ దేశభక్తి గీతాన్ని అన్వయించు కోవాలని ప్రబోధించారు. దేశం ప్రస్తుతం అనేక రూపాలుగా అస్థిత్వాన్ని కోల్పోతోందని. అన్ని అవసరాలకు ఇతర దేశాలను ఆశ్రయిస్తుందని అన్నారు. జన బాహుళ్యంలోకి సజీవపాత్రలను తీసుకువచ్చి నాటకాన్ని ఉద్యమంగా మలచిన మహావ్యక్తి గురజాడని ప్రస్తుతించారు.

బాల్య వివాహాలు చెయ్యకూడదు. కన్యాశుల్కం వస్తుందనే దురాశతో పసిపిల్లను ముసలివాని కివ్వరాదు. ఎవరైనా అగ్నిహుత్రావధాని లాగా ఇవ్వడానికి పూనుకున్నా, లుబ్ధావధాని లాగా చేసుకోడానికి ఒప్పుకున్నా, సౌజన్యా రావు, కరటకశాస్త్రి, మధురవాణి వంటి అభ్యుదయ శక్తులేకమై అభివృద్ధి నిరోధకుల కుటిల ప్రయత్నాలను వమ్ముచెయ్యాలి. పిల్లలను ముసలివాళ్ళకిస్తే కష్టాలు వస్తాయి. ముసలివాళ్ళు తొందరగా చనిపోతారు. బాలికలు బాలవితంతువులవుతారు. వాళ్ళు దుఃఖిస్తూ ఇంట్లో కూర్చుంటారు. ఇంటివాళ్ళకు బాధ, సంఘానికి తీరని సమస్య బాలవితంతువులు. కామోత్కంఠలై అవినీతికి పాల్పడతారు. పడుపువృత్తి మంచిదికాదు. వేశ్యావృత్తి మానుకొని గౌరవనీయ వృత్తులను అవలంభించాలి. గిరీశం, రామప్పంతులు వంటి చెడ్డ వారిని దరిచేరనివ్వ రాదు. వాళ్ళు అనర్థాలు తెచ్చి పెడతారు. వాళ్ళకు తగిన బుద్ధి చెప్పాలి. ఇలాంటి సాంఘిక ప్రయోజనాలెన్నయినా కన్యాశుల్కం నాటకం నుండి ఉదాహరించవచ్చు.

గురజాడ కవిత్వంలో తెచ్చిన మార్పులు ముత్యాల సరాల రూపంలో క్రొమ్మెరుంగులు చియి. ఆయన ముత్యాల సరం ఛందస్సు కవిత్వ వ్యక్తీకరణ రూపాన్ని

సమూలం మార్చివేసింది. యీ నూతన ఛందస్సువల్ల వ్యర్థ పదాలకి, పాదపూరణ యెత్తుగడలకి ఉద్వాసన జరిగింది.

1896లో అప్పారావుగారు అనందగజపతిరాజు సంస్థానంలో 'శాసన పరిశోధకుని'గా చేరారు. మద్రాసు, బెంగుళూరు, బెజవాడ, శ్రీకాకుళం వంటి పట్టణాలు తిరిగి ఎంతో చరిత్ర సేకరించాడు.

గుత్తునా ముత్యాలసరములు
కూర్చుకొని తేటైన మాటలు
కొత్త పాతల మేలు కలయిక
క్రొమ్మెరంగులు జిమ్మగా'లి అంటూ 'ముత్యాల సరాలు' నూతనఛందః సృష్టికి నాందీగీతం పాడి రస గీతాలు విన్పించారు మహాకవి గురజాడ.

1) విశ్వమానవ సౌభ్రాతృత్వము, 2) సంఘ సంస్కరణ ప్రియత్వము, 3) మానవతా వాదము, 4) ప్రేమ తత్త్వము, 5) జాతీయ దృక్పథము, 6) దేశభక్తి గురజాడ వారి 'ముత్యాలసరాలు'లో పుష్కలంగా వున్నాయి.

'మలినదేహుల మాల లనుచును
మలినచిత్తుల కధిక కులముల
నెలవొసంగిన వర్ణధర్మమ
ధర్మ ధర్మంబే,
మంచి చెడ్డలు మనుజులందున
చూడగా, రెండె కులములు
మంచి యన్నది, మాలయైతే,
మానే అగుదున్!' (లవణరాజుకల) మహాత్మాగాంధీ హరిజనోద్యమం ప్రారంభం కాక ముందే రచించిన గేయమిది. ఈ గేయం ద్వారా గురజాడ సాహిత్యకారుడే కాక గొప్ప సంఘ సంస్కర్తగా కనిపిస్తాడు.

"మనిషి చేసిన రాయి రప్పకి
మహిమ కలదని సాగి మొక్కుతు
మనుషులంటే రాయి రప్పల కన్న కనిష్టం!
గానుచూస్తావేల బేలా?
దేవుడెకడో దాగెనంటూ
కొండకోనల వెతుకులాడేవేలా?
కన్ను తెరిచిన కానబడడో?
మనిషి మాత్రుడి యందు లేడో?
యెరిగి కోరిన కరిగి యీడో' - ముక్తి - చిల్లర రాళ్ళకు మొక్కుతూ, చైతన్యం కోల్పోయిన మానవుణ్ణి తట్టిలేపే రచన యిది. సాటి మనిషి హృదయంలో దేవుడున్నాడని, అతణ్ణి పూజించమని, అదే ముక్తి దాయకమని గురజాడ మనకిచ్చిన మహత్తర సందేశం.

దేశభక్తి గేయం సంకుచితమైన సరిహద్దులకు అతీతంగా ప్రపంచంలో ఏ దేశమైనా పాడుకోగలిగినంత విశాలమైన భావంతో రూపొందిందన్నారు. అందులో ప్రతి చరణంలోనూ ఒక సందేశం వుందని, నేటి దేశ పరిస్థితులు అందుకు పూర్తి భిన్నంగా తయారైనాయని వివరించారు. ప్రపంచీకరణ సాంస్కృతిక దాడికి దేశీయ భాషలు, సంస్కృతులు అంతరించిపోతున్న నేటి స్థితిలో గురజాడ అడుగుజాడ నిత్యస్మరణీయం నిత్యస్మరణీయం.

"దేశమును ప్రేమించుమన్నా
మంచి యన్నది పెంచుమన్నా
వొట్టి మాటలు కట్టిపెట్టాయి
గట్టిమేల్ తలపెట్టవోయి"

గురజాడవారు తెలుగుభాషకు యెన్నో కొత్త పద బంధాలను, నుడికారాలనూ సృష్టించి ఇచ్చారు. అందుకే ఆయన మార్గదర్శి అయ్యారు. మహాకవి అయ్యారు.

అప్పారావు గారి గేయ కథలలో: 1) కన్యక, 2) లవణ రాజు కల, 3) పూర్ణమ్మ కథ, 4) డామన్ - పిథియస్ ముఖ్యమైనవి.

'మేలిమి బంగరు మెలతల్లారా.
కలువల కన్నుల కన్నెల్లారా
తల్లుల గన్న పిల్లల్లారా
విన్నారమ్మా యీ కథను' -
అంటూ కథ ప్రారంభమవుతుంది.

'కన్నుల కాంతులు కలువల చేరెను
మేలిమి చేరెను మేలిపసల్
హంసల చేరెను నడకల బెడగులు
దుర్గను జేరెను పూర్ణమ్మ'

పూర్ణమ్మ కథను గూర్చి శ్రీశ్రీ 'ఒక మహాకావ్యాన్ని చదివిన అనుభూతి పూర్ణమ్మ కథ చదివాక మనకు మిగులుతుంది' అని అంటారు. ఇది అక్షరాలా నిజం.

'బ్రతికి చచ్చియు ప్రజలకెవ్వడు
ప్రీతి గూర్చునొ, వాడె ధన్యుడు' -

గురజాడ పైవాక్యాలు ఏ ఉద్దేశ్యంతో రాసినప్పటికీ, రాబోయే కాలంలో ఆయనకే అవి మరింత అన్వర్థ సార్థక మయ్యాయి.

'నాది ప్రజల ఉద్యమం. దాన్ని ఎవర్నీ సంతోష పెట్టడానికీ వదులుకోలేను' అన్న అప్పారావుగారి మాటల్లోని ఆత్మవిశ్వాస ప్రకటనం అనంతర రచయిత లకు ప్రాణవాయువు వంటిది. గురజాడ రాసిన వ్యాస చంద్రిక'!లో అరడజను వ్యాసాలు వాడుకభాషా వైశిష్ట్యాన్ని వివరించేవే.

1889 నుండి మాత్రమే 'మహాకవి డైరీలు' మనకు లభ్యమవుతున్నాయి. రవీంద్రనాథ ఠాగూరును స్వయంగా కలుసుకొని, ఆయనతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపారు. హరప్రసాద్ శాస్త్రి, అశుతోష్ ముఖర్జీ, గురుదాస్ బెనర్జీ వంటి ప్రముఖ రచయితలతో ఆయనకు స్నేహం ఉంది. గురజాడ అప్పారావుగారిని 'గురజాడవాల్మీకి' అని కీర్తించిన ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారు 'గురజాడ అప్పారావు తెలుగు సారస్వతానికి సరిహద్దు' - అన్నారు.

'కొత్త తరానికి గురువెవరంటే
గురజాడే అని నేనంటాను' అని డా॥ దాశరథి అన్నారు.

గురజాడ జీవితం సాహిత్యం మొత్తం గనుక పరిశీలిస్తే ఆయనలో మనకొక ద్రష్ట కనిపిస్తాడు. రాబోవు యుగం రూపు రేఖలూ, రాబోవు సమాజం స్వరూప స్వభావాలూ, రావాల్సిన మార్పులు, చేయాల్సిన చేర్పులూ, తెలుగు భాషను అభివృద్ధి పరచడానికి అవసరమైన చర్యలూ, ఉత్తమ మానవ విలువలుగల్గిన సమాజ స్థాపనా, మొదలైనవెన్నో ఆయన రచనల్లో, ఆయన ఊహల్లో మనకు కనబడ్డాయి. ఆనాటి ఛాందస వాతావరణం నుండి బయటపడి, ఎంతో ముందుచూపు ప్రసరించిన సాహితీ విప్లవకారుడు గురజాడ. కవితా కళకు మనం వొదిగి ఉండవలసిన వాళ్ళమే అయినా, మానవ సమాజం పట్ల మనకు మహత్తరమైన బాధ్యత ఉంది.

'జీవితంలో సమస్యలు వచ్చినపుడు వాటిని ఎదుర్కొ నేందుకు కొందరికి భయం. వాటిని తప్పించుకు తిరిగి నంత మాత్రాన అవి తొలగిపోవు. కష్టాలను ధైర్యంతో ఎదుర్కొన్నప్పుడు ఆనందం కలుగుతుంది'. -గురజాడ తన రచనల్లో పేర్కొన్నారు.

మూఢ విశ్వాసాల గాఢాంధకారంలో కొట్టుమిట్టాడు తున్న సమాజానికి తన మానవతా దృక్పథంతో హేతువాద తత్వంతో వెలుగురేఖల్ని విరజిమ్మిన మహాకవి గురజాడ. స్త్రీల పట్ల సంఘం, సంస్కృతి చూపుతున్న చిన్నచూపు, వివక్షత వారిపై సాగుతున్న ద్వేష్టాలకు ఆయన హృదయం చలించిపోయింది. వేశ్యలను సృష్టించిన సంఘం కంటె వేశ్యలు నీచులు కారన్నది ఆయన నిశ్చితాభిప్రాయం. పూర్ణమ్మ, కన్యక, కన్యాశుల్కం, సంస్కర్త హృదయం... ఇలా ఆయన రచనలన్నిటిలో స్త్రీ పాత్రలను ఎంతో విశిష్టమైనవిగా, శాశ్వతత్వం కలిగినవిగా ఆయన చిత్రించాడు. 'సానుభూతి అనేది సాహిత్య జీవికి విధిగా ఉండవలసిన గుణం' అని తన డైరీలో రాసుకున్నాడు. తన రచనల్లో పీడిత పాత్రలపట్ల సానుభూతిని ఆయన ప్రదర్శించాడు. 'ఆధునిక మహిళ చరిత్రను తిరగ రాస్తుంది' అని ఆయన ప్రకటించిన విశ్వాసం ఇంకా నెరవేరకపోయినా అది తథ్యమని ప్రపంచ వ్యాప్తంగా సాగిన, సాగుతున్న మహిళా ఉద్యమాలు, పోరాటాలు సాక్ష్యాలుగా మనముందున్నాయి.

ఆధునిక తెలుగు సాహిత్యానికి, తెలుగు భాషకు కొత్త వరవడి పెట్టిన మహావ్యక్తి గురజాడ అప్పారావు 159 వ జయంతి సందర్భంగా సెప్టెంబరు 21న ఆయన స్మృతికి మన నివాళులు సమర్పించాలి.

BHAVAVEENA
Vol. 18, Issue. 9, September 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# గురజాడ వారి బుచ్చమ్మ

**- కొండయ్య కోసూరు,** పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, మధురై కామరాజు విశ్వవిద్యాలయం, మధురై.

స్త్రీవాదులు వచ్చేదాకా తెలుగు సాహిత్యం కూడా గురజాడని స్త్రీల విషయంలో అందుకోలేక పోయింది. కన్యాశుల్కంలో మధురవాణి ఆకర్షించినంతగా విమర్శ కుల్ని బుచ్చమ్మ ఆకర్షించలేదు. ఒక అమాయక పాత్రగా మాత్రమే పరిగణించారు. ఓల్గాలాంటి మేధావులు కూడా గిరీశం మాటలకి ఔను కాబోలు.... అని అతనితో వెళ్లడం తప్ప బుచ్చమ్మ పాత్ర ఏమీ చేయలేనిదిగానే గుర్తించారు.

అయితే గురజాడ అసలు కన్యాశుల్కం నాటకం ఎవరికోసం రాశారు? అని ప్రశ్నించుకుంటే కన్యాశుల్కానికి బలైపోయిన బుచ్చమ్మలాంటి స్త్రీల కొరకే అనేది స్పష్టంగా తెలుస్తుంది. వారిపట్ల ఆర్ద్రతతోనే, వారి జీవితాలలో మార్పు కోసమే, వారి జీవన సమస్యల పరిష్కారం కొరకే కలం పట్టారు. ఇలాంటి స్థితి మారాలనే సుబ్బి పెళ్లి ఆపడమనే అంతర్నాటకాన్ని సృష్టించి పాఠకులకి కన్యాశు ల్కం పట్ల పూర్తి ఏహ్యాభావాన్ని కలిగించారు. కన్యాశు ల్కానికి బలైన ముగ్గురు విధవలు మీనాక్షి, పూటకూళ్లమ్మ, బుచ్చమ్మల ద్వారా కన్యాశుల్కం, బాల్యవివాహాల వలన స్త్రీలు ఎదుర్కొంటున్న లైంగిక అణచివేత, లైంగిక దోపిడి, అనారోగ్యం.... వీరిలో ఏర్పడిన మొరటుతనం చిత్రించి వైవిధ్య భరితమైన నాటి సామాజిక జీవనచిత్రాన్ని కళ్ల ముందుంచారు. మీనాక్షి ద్వారా గర్భస్రావాలు.... అనా రోగ్యం, అపహాస్యం, పోలీసుల బాధ...., పూటకూళ్లమ్మ పాత్ర ద్వారా మోసపోవడం.... దీనివలన ఏర్పడిన మొరటుదనం, బుచ్చమ్మలో ఆలోచనతో కూడిన బాధ్యత.... చూపించారు.

ముగ్గురూ ఒకే కులానికి చెందిన విధవ స్త్రీలే అయినా మానవనైజ పరిశీలనా శక్తితో వారిలో భిన్నపార్శ్వాలూ చూపించారు గురజాడ. బుచ్చమ్మ పాత్ర ద్వారానే స్త్రీలకి ఒక విశ్వజనీనమైన పరిష్కారాన్ని చూపించారు. రాచమల్లు రామచంద్రారెడ్డిలాంటి వారు మాత్రం కన్యాశుల్కంలో ఏ సమస్యకూ పరిష్కారం చూపలేదు అనడం ఆశ్చర్యమే. అలాగే శ్రీశ్రీలాంటి వారు కూడా దీనిని విషాదాంత నాటకంగా పరిగణించడం ఆశ్చర్యకరమే. సామాజిక విషాదం నాటకంలో హాస్యపూరితంగా చూపించారే గానీ ఇది విషాదాంత నాటకం కాదని బుచ్చమ్మ పాత్ర మొత్తం పరిశీలిస్తే స్పష్టమవుతుంది. అయితే మోదాంతం, లేదా విషాదాంతం.... అని రెండు విధాలైన నాటకాలే మనం గుర్తించాం. కానీ నిజానికి ఆధునికతత్వాన్ని జీర్ణింపచేసు కొన్న క్రాంతదర్శియైన గురజాడ 'చైతన్యద్యోతక నాటకం'గా దీన్ని తీర్చిదిద్దారు. బుచ్చమ్మకి, గిరీశానికి పెళ్లి చేసేస్తే బహుశా మోదాంత నాటకం అనేవారేమో! కానీ అది చాలా అన్యాయమైన ముగింపు. సౌజన్యారావు పంతులు గిరీశం గురించి మధురవాణిని అడిగినపుడు ఆమె నిజం చెప్పకుండ 'బతకనీయండి' అంటుంది. అపుడు సౌజన్యారావు "వీడు అవ్యక్తుడైతే పాపము ఆ బుచ్చమ్మ బతుకు చెడుతుంది. అది ఆలోచించావు కావు" అని చెప్పి నిజం తెలుసుకుంటాడు. అప్పుడు గిరీశాన్ని పిలిచి నిజస్వరూపం బయట పడినదని తెలుపుతూ "బుచ్చమ్మను పూనాలో విడోస్ హోమ్‌కు పంపమని నీ గురువుగారి పేర టెలిగ్రాం ఇస్తాను. ఆమె చదువుకొని ప్రాజ్ఞురాలై తన ఇష్టము వచ్చిన వారిని పెళ్లి చేసు కుంటారు. లేకుంటే మానతారు"..... అని చెప్పి "దుర్మార్గు డైన నీ చేతిలో పడకుండా బుచ్చమ్మని కాపాడింది" అని మధురవాణిని మెచ్చుకుంటారు.

స్త్రీలకి పెళ్లి విధాయకం కాదనే విషయాన్ని గురజాడ "నచ్చిన వారిని చేసుకుంటారు లేదా మానుకుంటారని" బుచ్చమ్మ పాత్ర ఆధారంగా స్పష్టం చేశారు. గురజాడ చెప్పిన ఈ విషయాన్ని స్త్రీవాదులు ముఖ్యంగా మన ఓల్గా వంటివారు పట్టుదలగా అందించారు కానీ అంతవరకు

మిగిలినవారు గ్రహింపలేరు. సినిమాలైతే మరీ ఘోరం. కన్యాశుల్కం సినిమాలో గిరీశంలాంటి దుర్మార్గుడికి బుచ్చమ్మని ఇచ్చి పెళ్లి చేసి ఆమె గొంతుకోసి విషాదాంతం చేశారు. నిజానికి ఆ పెళ్లి చేయడంతో ప్రేక్షకుడి మనసుకి హమ్మయ్య అని తాత్కాలికంగా అనిపించి అక్కడితో ఆ విషయాన్ని వదిలేస్తాడు. అదే గురజాడ ఇచ్చిన ముగింపు బుచ్చమ్మలాంటి జీవితాల పట్ల ఒక ఆలోచన కలుగుతుంది. ఆలోచనామృతమైన సాహిత్యం ఆలోచనని అందించాలి. అత్యాచారం చేసినా, మోసం చేసినా, దుష్టుడైనా, స్మగ్లరైనా వాడితోనే మౌనపోరాటాలు చేసో మరొకటి చేసో తాళి కట్టించడంలాంటి ముగింపు గురజాడలాంటి క్రాంతదర్శి ఇవ్వడు. వితంతు వివాహం అవలేదు కాబట్టి పరిష్కారం లేదని అనడం నిజంగా చాలా దారుణం. వితంతు సమస్య పరిష్కారానికి మూలమైన కన్యాశుల్కం, బాల్యవివాహం రద్దవడం, విద్యావంతురాలవడం మాత్రమే పరిష్కారంగానీ ఎవడికి పడితే వాడికి ఇచ్చి తాళికట్టించేయడం పరిష్కారం కాదనే స్పష్టమైన అవగాహన ఉంది. గురజాడకి విద్యావంతు రాలవడం కాదు. ప్రాజ్ఞురాలవ్వాలనేది నాటకలక్ష్యంగా తెలిపారు. మొదట అగ్నిహోత్రావధాన్లుతో సౌజన్యరావు మాట్లాడినపుడు బుచ్చమ్మ గురించి విద్యావంతురాలవుతుందని తర్వాత మధురవాణితో మాట్లాడిన పిమ్మట ప్రాజ్ఞురాలవుతుందని పేర్కొన్నారు. కేవలం డిగ్రీల విద్య లాభం లేదనీ సందర్భానుసారంగా తన జీవన సమస్యల్ని పరిష్కరించుకోగలిగి అస్తిత్వాన్ని నిలబెట్టుకో గలిగే శక్తి లేదా ప్రజ్ఞ స్త్రీలకి అవసరమని తెలిపారు. అంతేకాదు, స్త్రీకి సంపాదన ఉంటే హాయిగా దోపిడీ రహితంగా ఉండడానికి అవకాశం లేదని కూడా 'పూటకూళ్లమ్మ' పాత్రద్వారా చెప్పారు. నిజానికి పూటకూళ్లమ్మకి ఎలాంటి పరిష్కారం లేదు. ప్రస్తావన లేదు. నాటకం చివర పూటకూళ్లమ్మ నేటి భాషలో చెప్పాలంటే 'ఎంటర్ ప్రెన్యూర్'. తనకున్న నైపుణ్యాన్ని నాటి అవసరానికి తగినట్లుగా మార్చుకొని గిరీశంలాంటి వాళ్లని పోషించింది. కొత్తగా వచ్చిన ఉద్యోగి వర్గం, అప్పటికి ఇంకా వదులుకోలేని కుల నియమాలు వలన పూటకూళ్లమ్మ అవసరం నాటి సమాజానిది. గిరీశంలాంటి వ్యక్తి మోసం తెలిశాక వెతికిమరీ చీపురుకట్ట తిరగేసింది. పూటకూళ్లమ్మకి కుటుంబ అణిచివేతా లేదు. ఆమె గిరీశం నుండి కూడా బయటపడింది. పాత్ర సంచలనం ద్వారా తెలుస్తుంది ఈ విషయం. అయితే పరిస్థితుల వలన ఆమెలో మొరటుదనం కనిపిస్తుంది. ఒంటరిగా ఉన్న పూటకూళ్లమ్మ ఆ మొరటుదనం లేకపోతే ఆ మాత్రం బ్రతకలేదేమో!

బుచ్చమ్మ పాత్రలో మాత్రం సంచలనంద్వారానో, ఆమె సంభాషణద్వారానో చైతన్యం కనబరచలేదు. చైతన్యం అనేది పాత్ర స్థితినిబట్టి ఉంటుంది. గురజాడది వాస్తవిక దృష్టి అనంతరకాలంలోలాగా సిద్ధాంతం కోసమో, మరొకదాని కోసమో పాత్రచేత విపరీతంగా మాట్లాడించి, పోరాటపటిమనో, మరో చైతన్యాన్నో గురజాడ ప్రదర్శించరు. బుచ్చమ్మ కుటుంబ పరిధిలో విపరీతమైన అణచివేతకి గురి కాబడిన పాత్ర. అసలు బుచ్చమ్మ మొదలు దర్శనమీయదు. కరటకశాస్త్రి సంభాషణలో కనిపిస్తుంది. అగ్నిహోత్రావధాన్లు, కరటకశాస్త్రి సంభాషణలో ఆమెపట్ల అణచివేత ముఖ్యంగా తండ్రి ఏ విధంగా అణచివేస్తున్నాడో తెలుస్తుంది. అసలు అగ్నిహోత్రావధాన్లు ఎవరినైనా తృణీకరించే ఆధిపత్య ధోరణి కలవాడు. బుచ్చమ్మ ఉనికి ఏ మాత్రం సహించడు. ఆమెకి విలువీయడు.

ఒక సన్నివేశంలో బుచ్చమ్మ చైతన్యాన్ని అగ్నిహోత్రావధాన్లు అసలు భరింపలేడు. "నాన్నా, తమ్ముడికి పెళ్లి చేయాలంటే నా సొమ్ము పెట్టి పెళ్లి చేయండిగానీ దానికొంపముంచి లుబ్ధావధాల్లుకి ఇవ్వొద్దని" చెప్పింది. దానితో నీ తండ్రికి వెర్రికోపం వచ్చి ఉత్తరాపోశనం పట్టకుండానే ఆ పెరుగు అన్నం విస్తరి తీసుకెళ్లి దాన్నెత్తిన రుద్దేశాడు అని గిరీశం వెంకటేశ్వర్లుతో చెప్పాడు. అగ్నిహోత్రావధాన్లుతో నేరుగా "నా సొమ్ము పెట్టిచేయండి...." అని తన ఆస్తిహక్కుని వెల్లడించింది బుచ్చమ్మ. అసలు

భరింపలేడు అగ్నిహోత్రావధాన్లు నేటికి కూడా ఆపేక్షగా ఏదైనా చీరో, సారో ఇస్తారేమోగానీ హక్కుగా కోరే స్త్రీలని భరింపలేరు. గురజాడ ఇది గుర్తించారు.

ఆరవ అంకంలో అగ్నిహోత్రావధాన్లుతో సౌజన్యరావు "వితంతువుల మఠంలో విద్యాబుద్ధులు చెప్పించుతారు. ఆమె తాలూకు ఆస్తి తమ వద్ద ఉన్నది. ఆ పిల్లకి పంపించెయ్యండి" అని చెప్తే అగ్నిహోత్రావధాన్లు "ఫకీరు ముండ, రేపు ఇంటికి వెళ్లి ఘటాశ్రాద్ధం పెట్టేస్తాను.

"కనికరంగాకేం.... ఆస్తిగిస్తీ యిమ్మంటే మాత్రం ఇచ్చేవాణ్ని కాను. ఆ వెధవని పెళ్లి చేసుకోకుండా ఇల్లు చేరితే ఇంటబెట్టుకుంటాను" అని తన పెత్తందారీ స్వభావాన్ని, బుచ్చమ్మ పట్ల తీవ్ర తృణీకారాన్నీ వ్యక్తం చేస్తాడు.

"ఆస్తి ఇవ్వకపోతే దావా పడుతుంది..... అంటే" దావాగవా అని బెదిరించితే భయపడేవాణ్ని కాను. వెధవముండకి పెళ్లి చెయ్యడవుపోయీ కాలంపట్టా కుండేవి....." అని అగ్నిహోత్రావధాన్లు ఉద్రిక్తుడవుతాడు. ఇలా కుటుంబంలో విపరీతమైన అణచివేతకి గురవు తుంది బుచ్చమ్మ.

నిజానికి గురజాడే కుటుంబ అణచివేతని బయట పెట్టిన మొదటి వ్యక్తి. స్త్రీలకి ఆస్తి అనుభవం లేదని బయటపెట్టిన మొదటి వ్యక్తి. స్త్రీలకి ఆస్తిహక్కులు ఇచ్చినా వాటిని అమలు చేసుకొందుకి పోరాటం తప్పదని సూచించారు. సమానత్వాన్ని కోరిన కమ్యూనిస్టులు కూడా కుటుంబాన్ని ఒక యూనిట్‌గా తీసుకొన్నారేగానీ కుటుంబం లోపలికి తొంగి చూడలేదు. కుటుంబ అణచివేత నుండి బయటపడితే గానీ స్త్రీలు సామాజిక అభివృద్ధి సాధించ లేరనే నిజం గుర్తించారు గురజాడ.

బుచ్చమ్మ అణచివేతకి గురవుతున్న ఆలోచనా పరురాలు. ఆమె ఆలోచనని ఎలా అణచి వేస్తారో స్పష్టంగా తెలుస్తుంది.

వెంకటేశంతో బుచ్చమ్మ.

"గిరీశం గొప్ప వారట్ష"..... గొప్పవారనగానే "మరి ఉద్యోగం కాలేదేమి? నీకేం తెలియదు" అంటాడు. "ఆయనెందుకు పెళ్ళాడారు కాద్రా....."

"మరి ఉద్యోగం కాలేదేమి?" అని అడగగానే.

"నాన్సెన్స్, నువ్వు ఆడదానివి? నీకేం తెలియదు" అంటాడు. ఆయనెందుకు పెళ్లాడారు

కాద్రా....

"నీకెంత చెప్పినా తెలియదు.... అంటాడు"

ఇంకాస్తా అడిగే సరికి

ఆడ దానివి నీకెందుకయా భోగట్టా అంతాను...... అని ఆమెకి విలువనియ్యడు.

బుచ్చమ్మ పాత్ర స్వరూప స్వభావాలు మొత్తం గిరీశం స్వగతంలోనూ, సంభాషణలోనూ తెలుస్తుంది. గిరీశం స్వగతంగా ఈవిడ బ్యూటీ చూస్తే యేమీ తోచకుండా ఉన్నది. అయితే ఇది చెప్పినట్టల్లా వసమయ్యే మనిషి కాదు. పాత రస్తాలేం పనికిరాకుండా ఉన్నాయి.... దీనిని చెడగొట్టడానికి ప్రయత్నం చెయ్యకూడదు. చేసినా సాగేది కాదుకనక కొత్తదారీ కొంత న్యాయమైన దారీ తొక్కాలి. యేమిటయా అది? మాయోపాయం చేసి దీన్ని లేవ దీసుకుపోయి విడోమ్యారేజి చేసుకొంటినట్టయినా కీర్తి, సుఖం దక్కుతాయి. ఇదేవిటయ్యా బుచ్చమ్మ, సాక్షాత్తూ పరమ పవిత్రమైన విడో విత్ గిల్ట్ లెటర్స్.

దీన్నిబట్టి బుచ్చమ్మ గిరీశం మాట మీనాక్షి, పూట కూళ్లమ్మలా మోసపోయేది కాదు, లొంగిపోయేది కాదని స్పష్టమవుతుంది.

అలాగే గిరీశం వివిధ వివాహాల గురించి ఉపన్యసించి నపుడు "మా నేస్తం రాంబొట్లుగారి అచ్చమ్మ మీరు ఒప్పుకొంటే మిమ్మల్ని పెళ్ళాడతానంది అంటుంది. దీన్నిబట్టి బుచ్చమ్మ విధవా వివాహాల గురించి తన స్నేహితులతో చర్చిస్తున్నాదని ఆలోచిస్తున్నాదని.

బుచ్చమ్మ తన వ్యక్తిగత జీవితాన్ని నష్టపోయిందని స్పష్టంగా తెలుసుకొని ఆ విధంగా తన చెల్లి నష్ట పోకూడదని తన కుటుంబంతో శాంతిసౌఖ్యాలు కావాలని కోరుకున్న పాత్ర. గిరీశం ఆమె కళ్లముందు ఒక అందమైన స్వప్నాన్ని ఉంచుతాడు. "పసుపు కుంకుమ పెట్టుకొని మహాలక్ష్మిలాగ యింట్లో పెత్తనం చేసుకుంటే ఒకపిల్ల ఇటువేపు వచ్చి మెడ కౌగిలించుకునీ.... ఒకపిల్ల అటువైపు వచ్చి మెడ కౌగిలించుకునీ... అనిచెప్తూ....'మన వెంకటేశం మన దగ్గరే ఉండి చదువుకుంటాడు'' అంటాడు. అందులో తన సౌఖ్యానికి, స్థితికి స్పందించలేదు గానీ వెంకటేశం గురించి చెప్పగానే ఆనందంగా స్పందిస్తుంది. "అయి, అయితే మరి నాన్నకు ఖర్చుండదు. నాన్న అమ్మా వాడి చదువుకోసం దెబ్బలాడ్రు'' అని కుటుంబ శాంతిని కోరిన వ్యక్తి.

అంతేకాదు, చెల్లి బాల్యవివాహాన్ని తప్పించలేక పోయానని దుఃఖిస్తుంది. గిరీశం తప్పించ లేదని నిందిస్తుంది. అది సాధ్యం కాదని గిరీశం అంటే 'అయితే మీతో నాకేం పనీ? ఇంత సందడిగా పెళ్లిపనులు చేయిస్తున్నారు. మా నాన్నక్కూడా తోచకూఏడదా! ఈ బంధం కూడదనో! మీకు కూడా దాని మీద ఇంత కనికరం లేకపోవాలా లుబ్ధావధాన్లు మీ అన్నగారని కాబోలు....' అని సూటిగా అడుగుతుంది. తండ్రులు ఆడబిడ్డల నిజ దైన్యస్థితిని గుర్తించాలనీ, సామాజికంగా పురుషులకి స్త్రీల స్థితిపట్ల దయ కలగాలని కోరుతుంది.

ఈ తాపత్రయం వలనే బుచ్చమ్మలో ఔన్నత్యాన్ని గుర్తించగలం. కర్ణుడి పాత్ర గురించి ఇర్వాతిక విశ్లేషిస్తూ కర్ణుడు నాయకుడు కాలేక పోవడానికి కారణంగా కర్ణుడు సూతకులం వలన ఇబ్బందిపడి తర్వాత రాజు అయిన తర్వాత సూతకుల ఇబ్బందుల్ని తొలిగించడానికి ఏమాత్రం ప్రయత్నం చేయక పోవడమే అని చెప్తారు. బుచ్చమ్మ మాత్రం తానుపడ్డ కష్టం తన పరిధిలో తన చెల్లికి కలగకుండా ఉండాలని గిరీశంతో పెళ్లికి ఒప్పు కుంటుంది. విధవా వివాహానికి ఆమెని మూడు రకాలుగా భయపెట్టి ఒప్పిస్తాడు గిరీశం. చెల్లి పెళ్లి తప్పించడానికి ఆమె తనతో లేచి రావాలంటాడు. తల్లిదండ్రులు పోయిన పిమ్మటైనా ఖాయిదా పోయి కాలుజారుతా వంటాడు. తనని పెళ్లాడకపోతే తను బతకనని చచ్చిపోతానని మరీ బెదిరిస్తాడు. మొదట భయపడినా చెల్లి పెళ్లికోసం, గిరీశం చచ్చిపోతాననడంతో సున్నితమైన మనసుగల బుచ్చమ్మ అంగీకరిస్తుంది.

**ముగింపు :**

కుటుంబ పరిధిలో సామాజిక భాగస్వామ్యంలేని బుచ్చమ్మ తమ గురించి తాము ఆలోచించుకునే స్థితి, ఆనాటి సమాజానికి లేదు గనుకే ఆనాటి సమాజ స్త్రీల స్థితి మారాలనే గురజాడ బుచ్చమ్మ చదువుకొని ప్రాజ్ఞురాలవ్వాలనే ఒక సార్వజనీయమైన ముగింపు నిచ్చారు. "చచ్చి బ్రతికి ప్రజల కెవ్వరు ప్రీతిగూర్చు వాడె ధన్యుడు' అన్నట్లుగా గురజాడ స్త్రీలకు ప్రీతి గూర్చిన ధన్యుడు.

**ఆధార గ్రంథం :**

1. గోపాలకృష్ణ పెన్నేపల్లి. 2012. గురజాడలు (మహాకవి గురజాడ అప్పారావు సర్వలభ్య రచనల సంకలనం). హైదరాబాదు: ఎమెస్కో బుక్స్.

# స్త్రీ ఔన్నత్యం

- యమ్. అనంతలక్ష్మి, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, సెంట్ జోసెఫ్ డిగ్రీ & పి.జి. కళాశాల, హైదరాబాద్.

'యత్రనార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః' ఎక్కడ ఆడవాళ్లు గౌరవించబడతారో అక్కడ దేవతలు విహరిస్తారని ఈ శ్లోకం అర్థం. కానీ సమాజంలో ఇలాంటి పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. గౌరవం సంగతి అలా ఉంచితే స్త్రీలకు ముందు రక్షణ లేకుండా పోయింది. ముసలి వాళ్ళ దగ్గర నుండి చిన్న పిల్లల వరకు ఆడవాళ్లకు భద్రత కరువైంది. చివరికి పసికందైన నెలల పిల్లలు కూడా మగ మృగాలుకు, కామాంధులకు బలైపోయే సంఘటనలు చూస్తే గుండె తరుక్కు పోతుంది. ఎన్నో చట్టాలు, రక్షకభటులు, ఎంతో విజ్ఞానం, వైజ్ఞానికత ఇలాంటివెన్నో ఉన్నాగాని స్త్రీలపై జరిగే ఉన్మాదుల దాడులు, అత్యాచారాలు, అఘాయిత్యాలను అరికట్టలేకపోతున్నారు, అదుపు చేయలేక పోతున్నారు. ప్రతిరోజు పేపర్లో, మీడియాలో స్త్రీలపై జరిగే అత్యాచారాలను, దాడులను మనం చూస్తూనే ఉంటున్నాం. మనకు తెలిసినవి కొన్నేకానీ తెలియనివి ఎన్నో. ఈ విధంగా స్త్రీలకు ఇలా అన్యాయం జరుగుతుంటే, బాధపడుతుంటే, ఆవేదన చెందుతుంటే, అక్కడ దేవతలు ఎలా కొలువై ఉంటారు? సమాజంలో స్త్రీ ఎక్కడ గౌరవించబడుతుంది?అసలు స్త్రీకి ఏ రంగంలో, ఎక్కడ గౌరవం లభిస్తుంది అని ఆలోచిస్తే అనేక సందేహాలు వస్తాయి. ఎక్కడ స్త్రీలు గౌరవించబడతారో అక్కడ దేవతలు నివాసం ఉంటారని పై శ్లోకం అర్థమైతే మనదేశంలో దేవతలే లేరా ? అనే సందేహం కలుగుతుంది. ప్రస్తుత పరిస్థితులు చూస్తే నేటి కాలంలో స్త్రీలకు ఇలాంటి స్థితి కలగడానికి కారణాలేంటి?నివారణా మార్గాలేంటని ప్రతి ఒక్క రూ అన్వేషించాలి.ఎందుకంటే నేటి సమాజంలో ఆడ పిల్లలు గానీ, వారి తల్లిదండ్రులు గానీ అభద్రతా భావంతో, ఆందోళనతో బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. ఆఖరికి అప్పుడే పుట్టిన పసికందును కూడా కామాంధులకు బలైపోతుంటే ఆడపిల్లల తల్లిదండ్రుల పరిస్థితి, మానసిక స్థితి ఏ విధంగా ఉంటుందో మనం ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. స్త్రీలకు రిజర్వేషన్లు, పథకాలు మొదలైనవన్నీ రాజకీయ నాయకుల స్వార్థానికి ఉపయోగపడతాయి. కానీ స్త్రీలకు ఎంత ప్రయోజనాన్ని కలిగిస్తున్నాయి అనేది సందేహమే! స్త్రీలకు ఏదో మేలు చేస్తాం,ఉద్ధరిస్తాం అని ఉపన్యాసాలిచ్చే చాలామంది నాయకులు, పెద్దలు వాటిని మాటల వరకే పరిమితం చేస్తున్నారు.చేతలలో ఏమి చేసి చూపించరు. చివరికి వారి ఇండ్లలో స్త్రీలకే వారు సరైన గుర్తింపు ,గౌరవం ఇవ్వరు. వీళ్ళు చెప్పేది ఒకటి చేసేది మరొకటి.స్త్రీల ఎదుగుదలకు సహకరించే నాయకులు చాలా అరుదు.

## స్త్రీవాదం - ప్రసిద్ధ కొటేషన్స్ :

'చావడానికి మా దగ్గరకు రాకండి
బ్రతకడానికి నానా చావు చస్తున్నవాళ్ళం'.

- ఓల్గా.

'పాలింకి పోవటానికున్నట్లు
మనసింకి పోవడానికి మాత్రలుంటే ఎంత బాగుండు'.

- పాటిబండ్ల రజని.

'చలన చిత్రాలకు, వ్యాపార ప్రకటనలకు
పెట్టుబడి నా శరీరమే కదా'

- మందరపు హైమావతి.

'ఈ వంటింటి సామ్రాజ్యానికి మా అమ్మే రాణి
అయితే చివరికి వంటింటి గిన్నెలన్నిటిపైనా మా నాన్న పేరే'.

- విమల (వంటిల్లు).

'మేం పాలిచ్చి పెంచిన జనంలో సగమే
మమ్మల్ని విభజించి పాలిస్తోంది'

- సావిత్రి (బందిపోట్లు).

'మొన్నటిదాకా నా జన్మ నిషిద్ధం
నిన్న నా చదువు నిషిద్ధం
నేడు నా బ్రతుకు కూడా నిషిద్ధమే'

- శ్రీమతి.

'నా దేహాన్నే ఒక వ్యధ శిలగా మార్చుకుని
అవ్యక్త వేదనరాగాన్నై
అనంత వాయువుల్లోకి పయనిస్తాను'

- కె.వరలక్ష్మి

'మనమంటే 34,24,35 కొలతల మైన చోట
మొటిమలు మొలవడం జుట్టు రాలడం
నడుము సన్నగా లేకపోవడం
అందం సరుకులైన చోట
అందాల వ్యాపారాన్ని నిషేధిద్దాం'

- విమల

ఈ విధంగా స్త్రీవాద రచయితలు వారి ఆవేదనను, వ్యధను కవితల ద్వారా మనకు తెలియజేశారు. సమాజంలో స్త్రీ, పురుషుల మధ్య సమానత్వం ఉండా లంటే ముందు సమాజంలో కన్నా కుటుంబం నుండి ఆ మార్పు సాధ్యమవుతుంది.కుటుంబంలో పిల్లలకు చిన్నప్పటి నుండేస్త్రీల విలువ తెలియజేస్తూ, వారి పై గౌరవ భావం కలిగేలా పెంపకం ఉండాలి. ఆ సంస్కారం చిన్ననాటి నుండే పిల్లలకు కలిగేలా తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలి. ఒక విధంగా చెప్పాలంటే సమాజంలో స్త్రీకి ఈ విధమైన దుస్థితి కలగడానికి కారణం పురుషాధిక్యత భావమే. దానికి కారణం నాటి మన సంప్రదాయాలు, ఆచారాలు, కట్టుబాట్లు అయి ఉండవచ్చు. చిన్ననాటి నుండి వారిలో ఇలాంటి భావాలు కలిగించడం వల్ల అవే భావాలు తర్వాత వారితో పాటు పెరిగి చివరికి స్త్రీల మీద చులకన భావం కలగడం, స్త్రీని అబలగా చిత్రించడం లాంటివి జరుగుతున్నాయి. పాఠశాల స్థాయి నుండి విద్యార్థులలో స్త్రీ ప్రాధాన్యత తెలుపుతూ పాఠ్యాంశాల బోధనలో మార్పులు చేయడం ద్వారా కొంత మెరుగు పరచవచ్చు అనిపిస్తుంది. అప్పుడు స్త్రీలపై జరిగే యాసిడ్ దాడులు,ఉన్మాదుల దాడులు కొంతవరకు నివారించ బడతాయి. సమాజంలో తప్పకుండా కొంత మార్పు అనేది సాధ్యమవుతుంది. అలాగే ప్రతి రంగంలో పురుషులతో పాటు స్త్రీలకు కూడా సమాన అవకాశాలు ఇవ్వాలి. సామాజికంగా, కుటుంబ సమస్యలతో స్త్రీ అంతర్గతంగా ఎంతో నలిగిపోతుంది. మానసికంగా ఎంతో కుంగి పోతుంది. పైకి చెప్పుకోలేని అనేక సమస్యలతో చాలామంది స్త్రీలు బాధపడుతున్నారు. అలాంటి వారికి సమాన అవకాశాలు ఇవ్వడం, సమాజంలో గౌరవ మర్యాదలు పొందడం ద్వారా తన బాధల నుండి కొంత ఉపశమనం పొందుతారు. తద్వారా వారిలో కొంత ఆత్మ విశ్వాసం నింపవచ్చు.

'ముదితల్ నేర్వగరాని విద్య కలదే ముద్దార నేర్పించి నన్' అని ఒక కవి అన్నారు. కాబట్టి స్త్రీ నేర్వలేని విద్య అంటూ ఏమి లేదని చెప్పవచ్చు.

విద్యావతి అయినా ఆధునిక స్త్రీ గురజాడ అప్పారావు గారి కాలానికి ఆవిర్భవించక పోయినా ఆయన దూరదృష్టితో ' భవిష్యత్తులో స్త్రీలు చరిత్రను పునర్నిర్మించ గలరు' అని అన్నారు.

చలం స్త్రీలకి లైంగిక స్వాతంత్ర్యం, వివాహ స్వేచ్ఛ కావాలని చాటుతూ ఎన్నో రచనలు చేశాడు. ఆయన భావనల కన్నీటికి అంత సూత్రం స్వేచ్ఛ. స్త్రీలు అనుభ విస్తున్న బాధలకు ఏదోవిధంగా శాశ్వత పరిష్కారం చూపాలనే తాపత్రయం ఆయన భావాలలో, ఆలోచన లలో మనకు స్పష్టంగా కనిపిస్తుంది.

పురుషాధిక్యతాభావాలు నరనరాన జీర్ణించుకుపోయిన సమాజంలో మనం బతుకుతున్నాం.దానిని మార్చడానికి సాంస్కృతిక పరమైన మహోద్యమం అవసరం. మానసిక పరివర్తన అనేది చాలా ముఖ్యమైనది.

రంగనాయకమ్మ రచనల్లో "స్త్రీ స్వేచ్ఛ" గురించిన ఆలోచనకి పునాది ఏర్పడింది. తర్వాత అభ్యుదయ, విప్లవ కవిత్వ మార్గంలో స్త్రీలు రచనలు చేశారు. తెన్నేటి

లత, రంగనాయకమ్మ,వాసిరెడ్డి సీతాదేవి, మల్లాది సుబ్బమ్మ మొదలైన వారి రచనల ద్వారా కొత్త ఆలోచనల్ని, కొత్త భావాల్ని రేకెత్తించారు.1975-85 కాలాన్ని ఐక్య రాజ్యసమితి అంతర్జాతీయ మహిళా దశాబ్దంగా ప్రకటిం చింది.

ప్రాచీన కాలం నుండి నేటి వరకు కూడా అనేక సందర్భాలలో స్త్రీని అబలగా చిత్రిస్తున్నారు.కానీ స్త్రీని శక్తి తో పోలుస్తారు. ఒక స్త్రీ తల్లిగా, భార్యగా, సోదరిగా, కూతురుగా, మమతానురాగాలకు ప్రతిరూపంగా కనిపిస్తుంది. ఉపన్యాస వేదికలపై స్త్రీ ఔన్నత్యాన్నిగురించి గొప్పగా గొంతు చించుకొని మాట్లాడినా దుర్గ, లక్ష్మి, పార్వతి, సరస్వతి మొదలైన దేవతా స్త్రీలను ఎంత పూజించినా నిజ జీవితంలో స్త్రీని మానసిక, శారీరక చిత్ర హింసలకు గురి చేస్తూనే ఉన్నారు. స్త్రీని అంగడి బొమ్మగా, ఆట వస్తువుగా, విలాస పరికరంగా చేసి అణగతొక్కుతూనే ఉన్నారు.సహా ఉద్యోగుల అవ హేళనలు, వేధింపులు, అడుగడుగునా అవమానాలు తప్పడం లేదు.

స్త్రీలలో ఉన్న ప్రత్యేక లక్షణం సహనం. అదీ భూదేవికి ఉన్నంత సహనం. ఆ లక్షణం సహజంగా వచ్చిందే కానీ తెచ్చిపెట్టుకున్నది కాదు. ఈ సహనంతో ఆమె సాధించలేనిదంటూ ఏదీ లేదు. సంసారం, రాజకీయం, సంఘ సంస్కరణ, ఆరోగ్యం, చదువు, శాస్త్రం, చట్టం మొదలగు క్షేత్రాలలో స్త్రీ తన సత్తా చాటుకుంది. అంతేకాదు ధైర్యం,తెలివి,అనుభవం వల్ల కూడా అనేక కార్యాలు సాధించకలుగుతుందని పలు సందర్భాల్లో తెలియజేస్తున్నాయి ఇటువంటి సమర్థురాలైన స్త్రీని అబల కాదు సబల అని నిరూపించే అనేక ఉదాహరణలున్నాయి. రజియా సుల్తానా, ఝాన్సీ లక్ష్మీబాయి, ధాయి పన్నా, మదర్ థెరిసా, విజయలక్ష్మి పండిట్, లక్ష్మీ సహగల్, అనిబిసెంట్, ఇందిరాగాంధీ, సోనియాగాంధీ మొదలైన వారు వీరు తమను తాము ఏ విధంగా సబలగా నిరూ పించుకున్నారో మనకు తెలిసిందే. వీటితో పాటు సునీత విలియమ్స్, కిరణ్ బేడీ, జయలలిత, మాయావతి, మమతా బెనర్జీ లను కూడా ఉదాహరణగా చెప్పుకోవచ్చు. విజయం పొందిన ప్రతి పురుషుడు వెనక ఒక స్త్రీ ఉన్నది అంటారు. మరి ఆ స్త్రీ వెనుక ఏముందంటే? ఆమెలో ఓర్పు, నేర్పు, బాధ్యత, త్యాగం అనేవి దాగున్నాయి. అదే ఆ పురుషుడిని సఫలీకృతుడిని చేస్తాయి. నేటి ప్రపంచంలో అనేక బాధ్యతలతో సతమతమవు తోంది. నేటి ఉద్యోగాల వల్ల ఎంతో ఒత్తిడి ఎదుర్కొం టుంది. ఆడవాళ్లు తమ మనసుల్లో అగ్నిపర్వతాలను దాచి తన కర్తవ్య నిర్వహణకు పాటుపడతారు.వారు చూపే దయ, త్యాగం చేయడానికి సిద్ధపడటం అనేవి తపస్సుతో సమానమైనవి. అటువంటి తపస్యా బలం గల స్త్రీని అబల అని ఎలా అనగలుగుతాము.

'పురుషాధిక్య ప్రపంచమే స్త్రీ జాతికి శత్రువు కానీ, పురుషుడు కాదు' అని స్త్రీవాదులు చెబుతారు. పితృ స్వామ్య వ్యవస్థ స్త్రీ శక్తిని గుర్తించక వారి అస్తిత్వాన్ని కోల్పోయేలా చేసింది.

ఇంగ్లీషులో 'ఫెమినిజం' మనం తెలుగులో 'స్త్రీవాదం' అనే పదంతో వాడుతున్నాము. స్త్రీ వాదంగా పరిణమించిన ఈ పదం సంచలనాన్ని సృష్టించింది. ప్రపంచ దేశాలన్నింటిలోనూ వ్యాపించి, ఓటు హక్కుతో ప్రారంభమై ఆడపిల్లలు విద్యా విషయం, స్వేచ్ఛ వంటి సంస్కారాన్ని అలవర్చింది.

మహిళలు ఏ పని చేసినా ఆచి తూచి అడుగు వేస్తారు. తమ కర్తవ్య నిర్వహణలో చాలా అప్రమత్తంగా ఉంటారు. ఎక్కువగా ప్రయోజనం కలిగే వాటిపైనే వారు దృష్టి సారిస్తారు. అందరిని సమాధానపరచడంలో వారికి వారే సాటి.

'ప్రపంచంలో వేగంగా విస్తరిస్తున్న రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థను కలిగివున్న భారత స్త్రీ, పురుషులతో సమానంగా చేసే విషయంలో మాత్రం అట్టడుగున ఉంది' అని ప్రపంచ ఆర్థిక వేదిక (WEF) రూపొందించిన సూచి వెల్లడించింది.

భారత్ లో ఆడశిశువును గర్భంలోనే చంపేస్తారని, 2.5 కోట్ల మంది ఆడపిల్లలు భూమ్మీదకు రాకముందే హత్యకు గురయ్యారని నోబుల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన్ వెలిబుచ్చిన ఆందోళనలను ఇది నిర్ధారించింది. 134 దేశాలపై రూపొందించిన ఈ సూచికలలో భారత్ 114వ స్థానంలో నిలిచింది. నేటి ఆధునిక ప్రపంచంలో ఎన్నో సమస్యలను, ఒడిదుడుకులను, దాడులను, ఆటుపోట్లను ఎదుర్కొంటూ తమని తాము రక్షించుకుంటూ ముందుకు పోతున్న స్త్రీ జాతికి మంచి గుర్తింపు రావాలని మన మందరం ఆశిద్దాం!

# శ్రీమద్భాగవతం – వామనుడు

– **జి. శ్రీమతి,** పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, (ఓరియంటల్ విభాగము), ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

తెలుగు సాహిత్య చరిత్రలో ప్రాచీన కవులంతా ఒకెత్తైతే బమ్మెర పోతన ఒకెత్తు. సహజ పండిత బిరుదాంకితుడైన పోతన మహా భాగవతాన్ని తెనిగించి పునర్జన్మ లేకుండా చేసుకుంటానని చెప్పుకున్నాడు. మానవ జీవన గమ్యాన్ని బోధించే ఈ భక్తి తత్త్వం భాగవతంలో నిక్షిప్తమై ఉంది. భాగవతం వేద సారమనీ, మోక్షశాస్త్రమని ప్రతీతి. భాగవతం అంటే శ్రీకృష్ణ లీలా పేటిక, విష్ణు భక్తుల కథా వాటిక. భాగవతం అంటేనే భగవంతునికి, భక్తునికి వారధి వంటిది. మోక్ష సాధనలో జ్ఞాన, కర్మ,భక్తి మార్గాలున్నా, భక్తి మార్గమే సర్వ సులభమనీ, దీనికి లింగ, వర్ణాది భేదాలు అడ్డురావని భాగవతం చెబుతుంది. పోతన పాత్ర రూపు రేఖల్ని నవరస భరితంగా తీర్చిదిద్ది, సన్నివేశాన్ని సాక్షాత్కరింప జేస్తాడు. ప్రతీ పాత్రలోనూ తాను లీనమై, సాత్విక భావాన్ని ప్రదర్శిస్తాడు. భాగవతంలో వన్నెలేని పాత్ర లేదు. సజీవం కానీ పాత్ర కనిపించదు. ప్రహ్లాదుడు, అక్రూరుడు, కుచేలుడు, అంబరీశుడు, వామనుడు మొ॥న పాత్రలు భక్తి శాఖకు పూచిన పుష్పాలే. ఈ పుష్పాలలోని ఒక పుష్పమే శ్రీమద్భాగవతం - అష్టమ స్కంధంలోని వామనవతార ఘట్టం.

విష్ణువు పూర్ణ పురుషుడు. పూర్ణ కాముడు. నిర్వికారుడు. లక్ష్మి దేవితో కూడిన వాడు. అటువంటి వాడు బలి చక్రవర్తిని ఎందుకోసం మూడడుగులు అడిగినాడు? దరిద్రుని వలె ఇతరుల వద్దకు ఎందుకు పోయినాడు? ఎ తప్పు లేకుండా పుణ్యాత్ముడైన బలిని ఎందుకు బంధించినాడు ? ఈ వ్యాసంలో వామనవతార విశిష్టతను, ఔన్నత్యాన్ని సాక్షాత్కరింపచేయడమే ప్రత్యేకత.

బలి చక్రవర్తి, ఇంద్రుని చేతిలో ఓడిపోయి శుక్రాచార్యుని సేవించడం వల్ల శిష్యుడైన బలి చక్రవర్తి శుక్రుని ఆజ్ఞచే, విశ్వజిద్యాగానిచేసి వరాన్ని పొంది, స్వర్గం పై దండెత్తి, దేవేంద్రున్ని పదవిచ్యుతున్ని చేయగా ప్రాణ భయంతో దేవేంద్రుడు అమరావతిని వదిలి పారిపోయిన ఈ విషయాన్ని తెలుసుకున్న అదితి శుక్రాచార్యునితో, దితి కుమారుల (రాక్షసులు) ఆగడాలకు అడ్డులేకుడా పోయిందని అక్రమంగా స్వర్గాన్ని ఆక్రమించారని మోర పెట్టుకుంటుంది. ఇది గమనించిన కశ్య ప్రజాపతి ఓ కమలాక్షి!

మ. "భగవంతుం బరముం జనార్దను గృపాపారీణు
సర్వాత్మకున్
జగదీశున్ హరిసేవ సేయు................"

అని అన్నింటికి ఆ జగదీశుడే మూలం కావున'పయో భక్షణ వ్రతం'చేయమని ఆజ్ఞాపిస్తాడు. పతి మాట జవదాటక వ్రతమాచరిస్తుంది.

వామన మూర్త్యావిర్భావ ఘట్టం

మ. "రవి మధ్యాహ్నమునం జరింప గ్రహంతారా
చంద్ర భద్ర స్థితిన్
శ్రవణ ద్వాదశినాడు శ్రోణ నభిజిత్సంజ్ఞాత
లగ్నమునన్
భువనాదీషుడు పుట్టె వామనగతిం పుణ్య
శ్రోపేతకున్

దివిజాధీశ్వరు మాతకుం బరమ పాతివ్రత్య విఖ్యాతకున్" అది శ్రావణ మాస ద్వాదశి, శ్రవణ నక్షత్రం, అభిజిత్తు లగ్నం, పట్ట పగలు సూర్యుడు ఆకాశం నట్ట నడుమ ప్రకాశిస్తున్నాడు. గ్రహాలు,నక్షత్రాలు ఉచ్ఛదశలో ఉన్న సమయాన దేవ మాత అదితి గర్భం నుండి వామన రూపంలో జన్మించాడు. వామనుడు పుట్టగానే సకల లోకాలు సంతసించాయని వామనుని పుట్టుకను హృద్యం గమంగా తీర్చి దిద్దాడు.

వామనునికి జన్మతహ వచ్చిన రూపాన్ని వదిలి ఇతరులకు మేలుచేసే ఉదేశంతో బక్క చిక్కిన దేవేంద్రున్ని కాపాడగోరి, కపట బ్రహ్మచారిగా మారు రూపాన్ని పొందిన్నాడు. పొట్టి బాలుడై, వడుగు చేయదగిన వయసు కలవాడై, తానవతరించిన కార్యాన్ని పూరి చేయదలిచిన వాడై ప్రయాణాన్ని సాగించి నర్మదా నది తీరమున, భృగు కచ్ఛప తీర్థమున బలి చక్రవర్తి చేపట్టిన అశ్వమేథ యాగశాలను సందర్శిస్తాడు. ఆ యాగశాలకు వచ్చిన వామనున్ని చూసిన వారు

శా. "శంభుడో హరియో పయోజన భవుగో చండాశు
డో వహ్నియో
దాంభాకారత వచ్చె గాక...."

అని వామనుని యొక్క దివ్య రూపాన్ని చూసి ఈ బ్రహ్మచారి మారు వేశంలో వచ్చిన శివుడో ! విష్ణువో ! బ్రహ్మనో అని అక్కడున్నవారంత గుసగుసలాడుకున్నారని ఈ సందర్భాన పోతన చేపిన తీరులో అద్భుత కల్పన కనిపిస్తుంది.

కం. "వెడ వెడ నడకలు నడుచుచు
నెడ నెడ నడు గిడగ నడరి యిల దిగ బడగా
బుడి బుడి నొడుపులు నొడువుచు
జిడి ముడి తడబడగ వడుగు సేరెను రాజున్"

అని వామనుడు మెల్ల మెల్లగా అడుగులు వేసిన తీరు, అక్కడక్కడ పుడమి కుంగిపోతుంటే, అడుగులు వెయలేని తీరు, నడుమ నడువ కొద్ది కొద్దిగా మాట్లాడుతూ కలవరపడుతూ, బలి చక్రవర్తిని సమీపించిన తీరును, పోతన శబ్దాలంకారాలతో వామనుని పాత్రని సహజంగా తీర్చిదిద్ది ఈ శ్రవణ కావ్యాన్ని దృశ్య కావ్యంగా మలిచాడు పోతన పండితుడు.

యాగ స్థలి నందు నిలబడిన వడుగును చూసి బలి చక్రవర్తి

మ. "వడుగా యెవ్వరి వాడ ? వెవ్వడవు ? సంవాసస్థలం
బెయ్య ? ది"

అని అడిగి నీవిక్కడికి రావడం వల్ల నా వంశం, జన్మ సఫలమైనాయి. ఈ యజ్ఞం పవిత్రమై నా కొరికలన్ని నెరవెరినాయి.

మ. "వర చేలంబుల మాడలో మన్యంబులో గోవులో
హారులో రత్నములో రథంబులో విమృష్టాన్నంబులో
కన్యలో
కరులో కాంచనమో నికేతనములో గ్రామంబులో
భూములో
ధరణీఖండమొ కాక యే మడిగెదో ధాత్రీ
సురేంద్రోత్తమా"

అని బ్రాహ్మణోత్తమా ! నీకేమి కావాలో కొరుకొమన్నాడు.

ఆ. ఒంటి వాడ నాకు నొకటి రెండడుగులు
మేర యిమ్ము సొమ్ము మేర యొల్లు
గోర్కిదీర బ్రహ్మ కూకటి ముట్టేద

దాన కుతుక సాంద్ర!దానవేంద్ర ! నాకు ఎవి అక్కర లేదు నాకు మూడడుగుల నేల చాలు దానితో తృప్తి పడి బ్రహ్మనందం పొందుతాను అని వామనుడనగా బలి ఇంత చిన్న కోరిక అడగుతావా ? అనగా

మ. గొడుగో, జన్నిదమో, కమండలువొ, నాకున్ ముం
జియో, దండమో
వడు గేనెక్కడ ?...

నేను బ్రహ్మచారిని గొడుగో, జందెమో, కమండలమో, మొల త్రాడు, యోగ దండం అవసరం అంతే కానీ భూములు, ఏనుగులు, గుఱ్ఱాలతో, స్త్రీలతో పని లేదని నా కోరికకు తగ్గట్లు మూడడుగుల నేల చాలు, దానితో తృప్తి పొందుతాను అని, ఆశా మిక్కిలి పొడవైనది. దానికి అంతు లేదు అనే మాటలు భాగవతానికే సూక్తి సుధార్ణవాలని చాటి చెప్తాయి.

వచ్చిన వాడు వడుగు కాదని బలి చక్రవర్తిని వధించడానికి వచ్చిన మహా విష్ణువని గమనించిన శుక్రాచార్యుడు దానమివ్వకుండా అడ్డుకునే ప్రయత్న చేస్తాడు. కానీ బలి గురువు మాట వినక శాపానికి గురైతాడు.

శా. "కారే రాజులు?రాజ్యముల్ గలుగవే ? గర్వోన్నతిం
బందరే"అని పలికి

శా. "ఆదిన్ శ్రీసతి కొప్పుపై, తనువుపై, నంసోత్త
రీయంబుపై

బాదాబ్జంబులపై...." లక్ష్మీ పతియైన శ్రీ మహా విష్ణువే నా దగ్గరచేయి చాచిన వేలా ! నాచేయే పైదైంది. నాకింకా ఎమికావాలి ? అని వామనుడు సత్య మార్గం నుండి చలించలేదు. పోతన పై పద్యంలో పాత్రకు తగ్గట్టుగా శృంగార రసాన్ని అద్భుతంగా పోషించాడు.

మాయా బ్రహ్మ చారి, బలితో 'భూ దానం ఇచ్చిన వానికి దానిని ప్రీతితో తీసుకున్న వానికి పాపాలు నశించి పోతాయి. వారు స్వర్గ లోకంలోను నిండు నూరెళ్ళు విహరిస్తారు. అందువల్ల ఏ దానం భూదానానికి సమానం కాదు. భూ దానం ఇచ్చిన నీకు రెండు లోకాల కీర్తి, పుణ్యం కలుగుతుంది. నేనెందుకు దీనిని అడిగానని చింతింపకుండా దానం ఇవ్వు. సత్యం పెంపొందే విధంగా దీన్ని అడిగాను, ఈ మూడడుగులు ఇస్తే మాకు ముల్లోకాలిచ్చినట్లే అని వామనుడు పలికిన మాటలకు బలి సంతోషించి భూదానం చేశాడు.

శా. "ఇంతింతై, వటుడింతై, మఱియు దానింతై, నభోవీధిపై
నంతై, తోయద మండలాగ్రమున కల్లంతై, ప్రభారాశిపై
నంతై, చంద్రుని కంతయై ధ్రువునిపై నంతై, మహర్వాటిపై
నంతై, సత్య వదోన్నతుండగుచు బ్రహాండాంత సంవర్ధియై"

ఇంత వాడు అంత వాడై, అంత వాడు మరింత వాడై, లోకాలన్ని ఆక్రమిస్తూ, బ్రహాండం అంతా నిండి పోయాడని, అంతా ఇంతా అనే శబ్దాలుఉపయోగించి వామన విజృంభన ఇంత సహాజంగా పాత్రను వర్ణిం చడంలో పోతన ప్రతిభ వ్యక్తం అవుతుంది.

మ. "రవి బింబం బుపమింప బాత్రమగు ఛత్రంబై, శిరోరత్నమై
శ్రవణాలంకృతియై గళాభరణమై సావర్ణకేయూరమై
ఛవిమత్కంకణమై కటిస్థలి నుదంచ ద్ఘంటయై నూపుర
ప్రవరంబై పదపీఠమై వటుడుగా బ్రహాండమున్ నిండుచోన్"

వామనుడు బ్రహాండం అంతా నిండిపోతున్న ఆ సమయంలో సూర్యబింభం క్రమక్రమంగా అతనికి గొడుగుగా, శిరోమణిగా, మకర కుండలంగా, కంఠా భరణంగా, బంగారు భుజకీర్తిగా, కాంతులీనే కంకణంగా, మొలలోని గంటగా ఆ పైన మేలైన కాలి అందెగా, చివరకు పాద పీఠంగా ప్రకాశించింది. త్రివిక్రముడు భూమిని, ఆకాశాన్ని,దిక్కులను సమస్తాన్ని ఆక్రమించిన పాత్ర తీరులో అక్షర రమ్యతను కనబర్చాడు.

మ. "ఒక పాదంబున భూమిగప్పి దివి వేఱొంటన్
నిరొధించి యొ..."

విశ్వ రూపాన్ని దరించిన త్రివిక్రముడు ఒక అడుగుతో భూ లోకాన్ని, ఇంకొక అడుగుతో స్వర్గ లోకాన్ని, మరియొక అడుగుతో పై లోకాలను కప్పివేసి అన్నింటిని దాటి పోయాడు. ఉగ్ర రూపంలో ఉన్న శ్రీ మహా విష్ణువు, పిదప వామన రూపం దరిస్తాడు.

సీ. "దానవా ! త్రిపద భూతల మిత్తు వంటివి
ధరణి జంద్రార్కు లెందాక నందు...."

ఓ దనుజేంద్ర ! మూడడుగుల నేల ఇస్తానంటివి. భూలోకంచంద్ర సూర్యుల దాక ఉండే స్థలం నాకు ఒక అడుగైంది. స్వర్గ లోకం ఒక అడుగైంది. నీ సంపదంతా రెండడుగులైంది. ఇక మూడవ అడుగుకు ఎక్కడుంది చోటు? ఇస్తా అన్న అర్థాన్ని ఇవ్వని వాడు నరరకాన్ని పొందడం నిజం. అందు వల్ల కొంత కాలం నరకానికి వెళ్ళు. అట్లా కాకుంటే మూడవ అడుగు ఇవ్వదలుచు కుంటే ఆచోటు నాకు తొందరగా చూపు. బ్రాహ్మణులకు సాధీనం కావల్సిన దానిని బ్రహ్మకు కూడా సాధ్యం కాదు.

కం. "సూన్నతంబ గాని సుడియందు నా జిహ్వ
బంకజాల నాకు బంకు లేదు...."

అని బలి చక్రవర్తి నా నాలుక సత్యాన్నే పలుకుతుంది. నీ మూడవ పాదం శాశ్వతంగా నా తలపై పెట్టు అని ఆత్మ నివేదన భక్తితో ప్రార్థించగా, తాత ప్రహ్లాదుడు, భార్య వింధ్యావళి ఆ దేవ దేవున్ని ప్రార్థించి, బలి చక్రవర్తిని మన్నించి వదిలివేయమని వేడ్కొనగా దుష్ట శిక్షణ శిష్ట రక్షకుడైన ఆ త్రిభువనాదిశుడు కరుణించి

కం. "సావర్ణి మనువు వేళను
దేవేంద్రుడగు...."

అని సావర్ణి మనువు కాలంలో దేవతలకు ప్రభువై దేవేంద్రుడౌతాడు. దైత్య దానవుల కలయిక వల్ల నీకు కలిగిన రాక్షసత్వం నన్ను ధ్యానించడం వల్ల త్వరలో తొలిగిపోతుంది. మా ఆజ్ఞ ప్రకారం సంతోషంగా సుతల లోకంలో దానవుల సేవలందుకొటూ ఉండు అని ఆ మహా విష్ణువుదీవిస్తాడు.

ఈ మవామనవతార పాత్ర వల్ల సత్యం, ధర్మం అనే పాదాల మీదనే ఈ లోకం నడుస్తుంది కానీ అసత్యం, అధర్మం మీద కాదని బోధపడుతుంది. పాపాలు ఎక్కువ అయిన సందర్భాన 'దుష్ట శిక్షణ, శిష్ట రక్షణార్థం' భగవంతుడు అవతరిస్తాడని పాపులను అంతం చేస్తాడని ఈ పాత్ర ద్వారా నిరూపితమౌతుంది.

**ఉపయుక్త గ్రంథం :**

1. శ్రీ మహా భాగవతం జంధ్యాల పాపయ్య శాస్త్రి.

BHAVAVEENA
Vol. 18, Issue. 9, September 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# విమర్శ – విమర్శకుడు – వివేచనా దృక్పథం

- ఎరికంబట్లు రాజేష్

ఒక రచనను చదివి చాలా బాగుంది అని అన్నా, ఆ రచనలోని కొన్నిభాగాలను చదివి చాలా బాగుంది అన్నా - ఆ రచన మనకు 'తెలిసి' నట్లు కాదు. రచన మనకు బాగుంది అని అనిపించినప్పుడు, అందులోని 'బాగు' ఏమిటి? అది అందులో ఎక్కడ ఉంది? దాన్ని విడదీసి చూపడానికి వీలుగా ఉందా? లేదా పాలల్లో వెన్నలాగ అది ఆ రచన మొత్తంగా వ్యాపించి దాని జీవంగా ఉం దా? దాన్ని మన మాటల్లో చెప్పడానికి వీలుందా? ఆ చెప్పడం మామూలుమాటల్లోనా? విశిష్టమైన మాటల్లోనా? విశిష్టమైన మాటల్లో చెప్పడంవల్ల కలిగే అధిక ప్రయోజనం ఏమిటి? మొదలైనవి మనకు తెలియాలి. స్థూలంగా చెప్పాలంటే విమర్శ అంటే ఈ ప్రశ్నలకు సమాధానమే.

సాహిత్యరచనలోని వైశిష్ట్యాన్ని చూపించేదే విమర్శ. మంచివిమర్శ సంప్రదాయ అవిచ్ఛిన్నతను పోషిస్తుంది. దూసుకొని వస్తున్న ప్రతి కొత్తరీతి రచనను వెనకటి దానితో దానికున్న సంబంధం, దాని ముందు అది ఎంత స్వతం త్రించింది? అన్న విషయాలను విమర్శ ప్రతిక్షణం బేరీజు వేస్తూ ఉంటుంది. నూతనంగా ఆవిష్కారమైన విషయం సంప్రదాయంలో ఎలా సహజంగా కలిసిపోయిందో కూడా చూపడం విమర్శలోని అంశమే.

దాంతో పాటుగా విమర్శ పాఠకుని అభిరుచిని తీర్చి దిద్దుతుంది. ఇలా తీర్చిదిద్దలేని విమర్శ ఒకవిద్యగా ఎన్నడూ అంగీకృతం కాదు. వాచ్యమైనరచనకే పరిమిత మైన అభిరుచి కల్గిన పాఠకుణ్ణి విమర్శ వ్యంగ్య, వక్రత, అలంకారప్రధానమైన రచనలను మెచ్చుకునేస్థాయికి ఎదిగేట్లుగా చేస్తుంది. ఇట్లా అభిరుచిని సరిచేయటానికి విమర్శ, రచనలోని సూక్ష్మాంశాలను, రచనలోని సౌందర్యాన్ని, రచన ప్రాణాన్ని విశదీకరిస్తుంది. విమర్శ సాహిత్య సృష్టిమీది వ్యాపారం (పని). సాహిత్యసృష్టి జరిగిన తర్వాతే విమర్శ మొదలౌతుంది. రచనకు ముందే విమర్శ ఉంటుందన్న వాదంతో మనకిక్కడ పనిలేదు. అలాంటి విమర్శ పాఠకుల ముందుకు రానేరాదు. ఒకవేళ అది పాఠకుల ముందుకు వచ్చినా 'రచన' జరిగాకనే వస్తుంది. రచన నేపథ్యంలోనే దాని పరిశీలన జరుగుతుంది. అందువల్ల విమర్శ రచన తర్వాతిదే.

రచన గుణాన్ని నిర్ణయించడానికి భారతదేశంలో అనేక సాహిత్య సిద్ధాంతాలేర్పడ్డాయి. మహామేధావులు, పండితులూ, సహృదయులూ అయిన భరత, భామహ, దండి, వామన, ఆనందవర్ధన, అభినవగుప్త, కుంతక, మహిమభట్ట, జగన్నాధ, అప్పయ్య దీక్షితాది మహా మేధావులు సూక్ష్మవివేచనతో రస, అలంకార, గుణ, రీతి, ధ్వని, వక్రోక్తి, రామణీయక సిద్ధాంతాలను ప్రతిపాదిం చారు. ఇంగ్లీషులో నేటికాలంలో పదేపదే చెప్పే విషయ సమగ్రతకు వీరు ఏమాత్రమూ అవకాశం ఇవ్వలేదు. ఆబ్జెక్టివ్ పరిశీలన తర్వాతనే - అందుకు పనికి వచ్చేట్లుగానే - శాస్త్రనిర్మాణాన్ని పై మేధావులు చేశారు.

ఏ ఒక్క కొలమానాన్నో పట్టుకుని దానికి నిలవని దంతా సాహిత్యం కాదని నిరంకుశంగా వారు అనలేదు. అంతగా అయితే తమ కొలమానం పట్టని కావ్యాలను ద్వితీయ, తృతీయ శ్రేణి కావ్యాలుగా భావించారు. సాధ్యమైనంత వరకు తర్వాత వచ్చిన శాస్త్రకారులు తమ పూర్వ ఆలంకారికుల సిద్ధాంతాలను తమసిద్ధాంతాలలో పాక్షికంగా ఇమడ్చడానికి ప్రయత్నించారు. రసం ధ్వనిలో, అలంకారం వక్రోక్తిలో, గుణం కొంత అలంకారంలో రస, ధ్వని, గుణ, అలంకారాలు ఒక్కొక్క వక్రోక్తిభేదంలో అట్లా ఇమడ్చడం జరిగింది.

కవిత్వంలాంటి ఆంతరంగిక కళకు కూడా సాధ్య మైనంతవరకు శాస్త్రీయతాబద్ధమైన విమర్శ పరికరాలను

ప్రాచీనులు సిద్ధం చేశారు. అంటే ప్రథమశతాబ్దం నుంచి ఇంచుమించు 17వ శతాబ్దం వరకు ఈ మహాకృషి భారత దేశంలో జరుగుతూ ఉన్నది. పాశ్చాత్యదేశాల్లో అరిస్టాటిల్, లాంజినస్‌ల తర్వాత సుమారు 1500 సం॥లో ఈ రకమైన కృషి బొత్తిగా జరగని రోజుల్లోనే భారతదేశంలో ఇంతటి మహత్తరమైనకృషి జరగడం ఒక విచిత్ర సన్నివేశం.

వైయక్తికమైన ప్రశంసదగ్గరనో, లేదా స్వీయవ్యక్తి మీద రచన వేసిన ప్రభావం ఏమిటి - అన్న దాని దగ్గరో పాఠకులు నిలిచిపోతే వాళ్లు విమర్శలోకి సరిగ్గా ప్రవేశించలేదని అర్థం. రచనను చదివే పాఠకుడు సహృదయుడు కావాలన్నది భారతీయ ఆలంకారికుల అభిప్రాయం. అసలు వాళ్లు పాఠకులని కానీ, విమర్శకు లని కానీ అననేలేదు. ఈ రెండింటికీ పర్యాయంగా సహృదయులనే అన్నారు. సహృదయతను పాఠక, విమర్శకులకు కూడా కనీసలక్షణంగా ఉండాలని వాళ్లు ఆశించారు. 'సహృదయత' అన్నది పరిభాషాశబ్దం. ఇది విమర్శకునికి ముందు ఉండాల్సిన మొదటి లక్షణంగా భావించాలి.

విమర్శలోని లోపాలను ముప్పాతికమువ్వీసం ఈ సహృదయత ఉంటే తొలగించుకోవచ్చు. సహృదయత విమర్శకుణ్ణి స్వీయ వ్యక్తిదోషాలనుంచో, పక్షపాతాల నుంచో ఉద్ధరిస్తుంది. సహృదయతే లేకుంటే విమర్శకుని అనుభూతిలోనే సమగ్రత లోపిస్తుంది. దానివల్ల రచనను చదువుతున్నప్పుడు అతనికి 'స్వీయ ఆవేశాలు' మాత్రమే కల్గుతాయి తప్ప రచన అతనిలో కల్గించాల్సిన ఆవేశాలు, భావానుభూతి అతనిలో కల్గవు. అయితే సహృదయత ఉన్నప్పుడు ఈ ప్రమాదం తప్పి, ఈ వైయక్తికదోషం తొలగిపోతుంది.

మరొకటి - విమర్శకునిలో సహృదయత కొరవడితే రచనలో అతడు చూపించేదేదీ రచనది అయివుండదు. అది విమర్శకుని సొంతవిషయమే అవుతుంది. అందుచేత రచయితతో విమర్శకుడు శ్రుతి కలుపుకోవడానికి ఈ సహృదయత అవసరం. అయితే చాలామంది విమర్శకు లకు ఇది దానంతటదే సిద్ధించేది కాదు. ఇది ప్రయత్నం చేత సాధించుకోవలసిన విషయమే. దీనికోసం కృషి చేయాలి. ఈ కృషి చాలావరకు బుద్ధికి సంబంధించిన కృషిగానే ఉంటుంది. ఇలాంటి కృషి లేకపోతే విమర్శ కునికి కవిత్వం దివ్యదర్శనం కానేకాదు. అతనికే దర్శనం కానప్పుడు ఇంక అతడు రచనను ప్రకాశింపజేయడం సాధ్యం ఎట్లా అవుతుంది?

విమర్శకుడు - సహృదయుడు - ఆలంకారికులు - వీళ్ల కృషి రచనను విశదీకరించేది. దానిమీద వెలుగును ప్రసరిస్తూ సాహిత్యసంస్కృతిని పెంచిపోషించేది కావాలే తప్ప నియమనిబంధనలను తయారుచేసేది కాకూడదు. ఒక రచన ఆధారంగా సాహిత్య లక్షణ చర్చ చేయడం వేరు. ఆ రచనకు ఫలానా నియమం పట్టిందా? అని పరిశీలించడం వేరు. 'రచించడానికి కొన్ని లక్షణాలను చూపించడమే తప్ప, నియమాలను తగిలించడం కాదు విమర్శ లక్ష్యం' అన్నాడు కాలరిడ్జ్.

సహృదయతే కనుక విమర్శకునిలో ఉంటే అల్పాం శాలాధారంగా చేసుకుని విమర్శించకుండా రచనలని మహావిషయాలనే పాఠకులకు విశదం చేస్తాడు. ఈ విషయాన్ని సాధించడంకోసం విమర్శకుడు నిర్దుష్ట విమర్శకుడుగా (Perfect Critic) తనని తాను తీర్చి దిద్దుకోవాలి.

విమర్శలో సమతౌల్యం, భావావేశ రాహిత్యం, బౌద్ధికత అన్నవి ఉండాలి. ఇవి లోపిస్తే ఆ విమర్శకుడు అసమగ్ర విమర్శకుడౌతాడు. పాండిత్యం, పరిశీలన, సహృదయత, విశ్లేషణ లాంటి ప్రాథమికవిమర్శ లక్షణా లేవీ లేకుండా కేవలం లేఖనచాతుర్యంతో రాసేవాడు అసత్య విమర్శకుడు.

విమర్శకుడు కేవలం ప్రశంసించినంత మాత్రంలో ఒక రచనమీద వెలుగు ప్రసరించదు. మరి విశ్లేషణ సహృదయత లేకుండా చేస్తే రచనను ఖూనీచేయటానికే అది పనికివస్తుంది. రచన మీది విమర్శ రచనలోని పరమార్థాన్నీ, అది కలిగించే సమగ్రానుభూతినీ, దాని

వైశిష్ట్యాన్నీ తెలిపేదిగా ఉన్నప్పుడే అది విమర్శ అవుతుంది. అలాంటి విమర్శే పాఠకుని 'ఎరుక సమగ్రం' చేస్తూ అతని ఆనందాన్ని ఇనుమడింపజేస్తుంది.

నిరంకుశ సూత్రీకరణలు కానీ, వైయక్తిక స్పందనల గ్రథనం కాని, విమర్శకాదు. అది రచన మీద ఒక సాధారణ నిర్ణయం చేయడానికి చేసే సామాన్యకృషి అనీ విమర్శకులు గమనించాలి. విమర్శకుడు ప్రధానంగా చేసేవి నాలుగు పనులు. అవి 1) విశ్లేషణ 2) తులనాత్మకపరిశీలన 3) వ్యాఖ్యానం 4) నిర్ణయం.

విమర్శ ప్రధానంగా ఈ నాల్గుపనులను చేసినప్పుడు అంటే విమర్శలో ఈ నాలుగంశాలున్నప్పుడే అది విమర్శ అవుతుంది. విమర్శకునికి ఉండాల్సిన లక్షణాలు -

1) విమర్శకునికి ఓం ప్రథమంగా కావాల్సింది తన విషయం మీద అభినివేశం ఉండటం. ఈ అభినివేశాన్ని ఇతరులకు కలిగేట్లుగా వ్యక్తీకరించే శక్తి కూడా అతనికి ఉండాలి.
2) విమర్శకుడు పోల్చి చూడడం, విశ్లేషించడం అనే రెండుపద్ధతుల్ని వాడితీరాలి.
3) కేవలం పైపై మెరుపులతో ఆకర్షించే కావ్యం నుంచి, సుందరమైన కావ్యం దాన్నుంచి సార్వకాలీనంగా నిలిచే గాఢతా, గాంభీర్యమూ ఉన్న కావ్యాలను గ్రహించగలిగిన శక్తీ, దృష్టీ విమర్శకునికి ఉండాలి.
4) ఒక కాలం యొక్క spirit ÔÃHÃ, fashion తోనో (దీన్నే Local flavour అంటాడాయన). విమర్శకుడు స్తబ్ధత, (saturate) పొందకుండా, దాన్నుంచే తనను వేరు చేసుకోగల్గి కూడా ఉండాలి.
5) విమర్శకునికి సృజనశీలమైన అభినివేశముండాలి. ఇది భవిష్యదృష్టినిస్తుంది.
6) ముఖ్యుడైన విమర్శకుడెవ్వరంటే - కళకు సంబంధించిన వర్తమానసమస్యలలో మునిగినవాడు. ఆ సమస్యల పరిష్కారానికి దానికి గతంలో శక్తుల్ని వినియోగించేవాడు.

విమర్శకుని లక్షణాలను గురించి వివేచిస్తూ తమ అనుశీలన (సాహిత్యవిమర్శ) అన్న గ్రంథంలో మందేశ్వర రావు కింది లక్షణాలను తెలిపాడు.

1) కవి ప్రయాణం చేసిన దారిలోనే విమర్శకుడూ ప్రయాణం చేయాలంటే అతనికి భావుకత ఉండాలి. (అలా పయనించగలిగిన సామర్థ్యమే భావుకత)
2) శబ్దం తాలూకు లక్షణం - అంటే వాచ్యార్థమే కాక, అది ఎలా అందంగా ఉంది? అది వస్తువునెలా అందగిస్తున్నది? ఆ శబ్దాన్నే ప్రయోగించడంలోని ఔచిత్యం - అది సహృదయునిలో కల్గించే హృదయస్పందనను వినగల్గడం. వాచ్యార్థాతీతమైన విషయాల స్ఫురణ ఉండాలి.
3) శబ్దాన్నీ, అర్థాలనీ, అర్థాంతరాలనీ ఎంత నిశితంగా పరిశీలిస్తాడో శిల్పాన్నీ అంత చక్కగా పరీక్షించాలి. "స్థూలంగా చెప్పాలంటే కవి పనితనం ఎక్కడ ఉంటుందో అక్కడ శిల్పం ఉంటుంది. అది ప్రధానంగా వస్తువును ఆశ్రయించి ఉంటుందను కోవచ్చు. ఇతివృత్త నిర్వహణలో కవి సాధించిన సౌష్ఠవం, అంగాంగీభావం, ప్రతిధ్వనులు, కథలను పేర్చిన కూర్చిన, పద్ధతులు, ఇవన్నీ శిల్పానికి సంబంధించినవి. అలాగే ఛందస్సును వాడడంలో కవి కనబరచిననేర్పు కూడ శిల్పానికి సంబంధించిందే". (పు.76, 77)
4) ప్రతియుగంలోనూ మారుతున్న సాహిత్యాభిరుచుల్ని విమర్శకుడు గమనించగల్గాలి. "సాహిత్యపు విలువలు ఎలా మారుతున్నాయో గ్రహించాలి." (పు.83)
5) సాహిత్యాన్ని పరీక్ష చేయడానికి విమర్శకునికి ప్రధానంగా అలవడాల్సిన, అలవరచుకోదగ్గ లక్షణం నిర్మమత" (పు. 84)
6) విమర్శకుని మూర్తిమత్వం విమర్శలలో ప్రతిఫలించడం మంచిది కాదు. విమర్శకుని

స్వాతంత్ర్యం, అతని ప్రతిభ, విమర్శలో ప్రతిఫలిస్తే ప్రమాదం లేదు. కానీ అతని ఇష్టానిష్టాలన్నీ విమర్శలో ప్రతిఫలిస్తే అది, విమర్శ కాక రచయిత అభిరుచులను పట్టి ఇచ్చే వ్యాసమైపోతుంది. (పు. 84)

7) "కావ్యాన్ని అనుశీలన చేసేటప్పుడు విమర్శకుడు తన కేర్పడిన దృక్పథానికి బానిస కాకూడదు. అసలు ఏ దృక్పథానికీ లొంగకుండా ఉండడమే అవసరం" (పు. 88).

8) విమర్శకుడు ఒక విధంగా సమకాలీన సహృదయులకు ప్రాతినిధ్యం వహిస్తాడు (పు.89) వెనుకటి విమర్శనల్ని అధ్యయనం చేయడం విమర్శకునికి అవసరమే అయినా వెనుకటి విమర్శకులు అతనికి ప్రామాణికులై పోగూడదు.

9) విమర్శకుని బాధ్యతల్లో ఒకటి నేటికావ్యాలను పరిశీలించడం. (అవసరమైతే) రెండోది సమకాలీన సమాజపుటభిరుచిని దిద్ది తీర్చడం.

10) మానవ సమాజంలో అన్నిరంగాలలోనూ అను క్షణమూ వస్తున్న మార్పులను విమర్శకుడు బాగా ఆకళింపు చేసుకుంటే తప్ప మారుతున్న సమాజం, దాన్ని అనుసరించి మారుతున్న సామాజికపు విలువలు, దాన్ని ప్రతిఫలించే సాహిత్యపువిలువలు. పర్యవసానంగా సాహిత్యం అతనికి అర్థం కావు. (పు. 91)

11) విమర్శకుడు విజ్ఞతవల్ల కవి చూసిన చూపునే అలవరచుకుని, ఆ కవికి ఆ చూపు ఎందుకు ఎలా అలవడిందో చెపుతాడు. (96)

12) నిరంతర కావ్య పఠనం వల్ల పదును తేరిన హృదయంతో సాహిత్య సిద్ధాంతాలను మధించాలి. వాటి విలువలను మదింపు కట్టాలి (పుట 106). ఒక సాహిత్య సిద్ధాంతం ఉండటంచేత కావ్యం గొప్పగా ఉందనవద్దు. కవి ఆ సిద్ధాంతాలను ఎలా చాతుర్యంతో వాడుకొన్నాడన్నది చెప్పగల్గాలి. అలంకారశాస్త్రం భావుకుని ఆలోచనకు అడ్డు రాకూడదు.

"విమర్శకు అలంకారశాస్త్రంలోని పారిభాషికపదాలు తూకపురాళ్లలా ఉండకూడదు" (పుట 207). "అలంకార శాస్త్రపు మూలసూత్రాలను ఆధునికవిజ్ఞానంతో పరీక్ష చేయడం కన్న ఆ శాస్త్రానికి వేరే మహాపకారం లేదు". (పుట 108)

ఇట్లా మందేశ్వరరావు చక్కగా అన్నిరకాలైన విమర్శకలక్షణాలను విశదీకరించాడు. ఇలియట్ నిజమైన విమర్శకానిదేదో ఇలా చెప్పాడు.

1) కవులమీద, కవిత్వంమీద లేదా యుగాల (periods) మీద కేవలం ఉత్సాహం.

2) కవిత్వంలో, అవెంత సుకుమారమైనవైనా తత్కాలీన fashion (Local flavour) మీద ఇష్టాన్ని వ్యక్తీ కరించడం.

3) వైయక్తికమైన ఆవేశాలను, అభిరుచులనూ, (temperaments) స్వభావాలను గ్రధించడం (రికార్డ్ చేయడం).

4) ముందుగానే (priori) కొన్ని సూత్రాలను సిద్ధంచేసి మంచిచెడులను వాటికి అన్వయించి నిర్ణయిం చడం.

5) కవిత్వం తాలూకు కొన్ని సాంకేతికాంశాలను వాని "దాని" నేపథ్యం (సామాజికమే కానీండి, చారిత్రక లేదా జీవితచారిత్రకం కానీండి) కానీ అధ్యయనం చేయడం.

ఈ రెండుపార్శ్వాల చేత విమర్శ - విమర్శకుల లక్షణాలేమిటో తెలుస్తాయి.

విమర్శకుడు వ్యాఖ్యానించాలి. రచనను వివరించాలి. అలా చేయకపోతే విమర్శ తనవైశిష్ట్యాన్ని కోల్పోయి సంక్షిప్తీకరణం (precis) లాంటి ఒక యాంత్రికవ్యాపారం

అవుతుంది. ఇప్పుడు ఆధునికవిమర్శ వైయక్తిక లక్షణం చేత, పొందిక లేకపోవడంచేత, సందర్భశుద్ధి లేకపోవడం చేత, నిర్ణయరాహిత్యంచేత బలహీనమైంది.

పాండిత్యమూ, బుద్ధినైశిత్యమూ, కావ్యమర్మజ్ఞతా, అన్నవి విమర్శకునికి ఉన్నప్పుడే అతని విమర్శ సారవంతమై, విద్యగా రూపొంది పాఠకులకు, రచయితలకు అది ఉపయోగపడుతుంది. విమర్శకుని పనిలో చిచ్ఛక్తి ఉంటుంది. సాహిత్యం పాఠకులకు విలువైన అనుభూతిని ఇచ్చేది కాబట్టి. ఒక కళాకృతిలోని విలువలను గ్రహించడానికి ఉన్ముఖుడూ, సుముఖుడూ కాని వాణ్ణి సుముఖుడయ్యేట్లుగా విమర్శ శక్తిని విమర్శకుడు గుర్తిస్తాడు. ప్రకృతిరీత్యా విమర్శకుడు ఒక వ్యాఖ్యాత సాధారణంగా చాలాసందర్భాలలో కవి తన రచనలను తాను వ్యాఖ్యానించుకోలేడు. కాబట్టి విమర్శకుడు ఈ పాత్రవహించాల్సి వస్తుంది. కాబట్టి విమర్శకుడు 'విద్యా' వంతుడై, సాహిత్యసంస్కృతిని కాపాడే గలిగేటందుకు గాను సద్విమర్శక లక్షణాలనన్నింటినీ కలిగి ఉండాలి. "విమర్శకుడు రచనకు తన స్పందనను వ్యాఖ్యానంగా మలచుకోవడంలో, తన స్పందనకు కారణమైన రచనకు అతీతంగా పోకూడదు. సందర్భశుద్ధి అతనికి ఉండాలి. తన ఎదురుగా ఉన్న గ్రంథంలోంచి అనుచితంగా దాని సారమని అన్యవిషయాన్ని గ్రహించకూడదు. అసందర్భంగానూ, అపరిపక్వమైందిగానూ ఉండేట్లుగా (అందులోని విషయాన్ని) సామాన్యీకరించకూడదు" అన్న T.R. Leaves అభిప్రాయం విమర్శకునికుండాల్సిన లక్షణాన్ని చక్కగా చెప్తుతుంది.

ఈ లక్షణాలు లేని విమర్శకుని విమర్శ సత్యాన్వేషణ చేయలేదు. కావ్యసౌందర్యాన్ని, గుణాన్ని, ఆత్మను పాఠకులకు విశదీకరించలేదు. అందువల్ల విమర్శకుడు ఈ స్థితిని సాధించాల్సి ఉంటుంది.

BHAVAVEENA
Vol. 18, Issue. 9, September 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# తెలంగాణ ఉద్యమ కవిత

- జె. శంకర్, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

"భూమి కోసం

భుక్తి కోసం

పేద ప్రజల విముక్తి కోసం" అని 1940 ల్లో తెలంగాణ ప్రాంతంలో నైజాం వ్యతిరేక పోరాటం, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం, జగిత్యాల జైత్ర యాత్ర (రైతు పోరాటం), 1969 తెలంగాణ ఉద్యమాలతో మొదలై, నేటి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం వరకు తెలంగాణ ప్రాంతంలో అనేక ఉద్యమాలు జరిగాయి. కానీ నీళ్ళు, నిధులు, నియామకాలలో జరిగిన అన్యాయంపై మొదలైన ప్రత్యేక తెలంగాణ ఉద్యమం దశల వారిగా తన ఒరవడిని మార్చుకుంటూ, సబ్బండ వర్ణాలను ఉత్తేజ పరిచి, తెలంగాణ సాధన వైపు పయనించి, జూన్ 2,2014 న ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన జరిగింది.

తెలుగు సాహిత్యంలో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నించడం వరకే సాహిత్యకారులు ఆగి పోలేదు. వివక్షను నిరసించడం వరకు నిలిచిపోలేదు.తమ స్వరాలను వినిపించడానికి తగిన కార్యాచరణతో ముందుకు వచ్చి తమ అస్తిత్వాన్ని,ఉనికిని చాటడానికి సమీకృతమైనారు. ఈ ప్రయత్నంలో భాగంగానే రూపు దిద్దుకున్న బృహత్తర ప్రక్రియ 'కవిత్వం'. తెలంగాణ ఉ ద్యమ సాహిత్యచరిత్రలో ఇది ఒక కీలక ఘట్టం. ఇది తెలంగాణ కవిత్వ సంరంభం. కవిత్వ కదలికి సంకేతం. తెలంగాణ కవుల సమూహగానానికి ప్రతి ఫలనం ఇవాళ్ళ తన అస్తిత్వం కోసం, ఉనికి కోసం ఎలుగెత్తి నినదించిన తెలంగాణ వాసి పోరుకేకలే దీనికితార్కాణం. తనలోపలి దు:ఖాన్ని,కోపాన్ని,ఆక్రోశాన్ని కవిత్వంగా మలచి ప్రతి స్థాయిలో తెలంగాణ కవులు చేసిన ప్రయత్నమే ఈ కవిత్వానికి సాక్షి.

తెలంగాణ సాయుధ పోరాట కాలంలో (1946 - 56) వచ్చిన కవిత్వం నాడు నిజానికి పాటదే ఆధిక్యంకానీ కవిత్వం కూడా వచ్చింది.1956 - 69 మధ్య వచ్చిన సాహిత్య చరిత్రను గమనిస్తే ఈ కాలంలో వచ్చిన కవిత్వం అంతా ఆంధ్ర ప్రాంతం నుంచే వచ్చినట్లు కనిపిస్తుంది. 1969 - 90 వరకు విప్లవ ప్రభంజనం ఊగించి శాసించిన కాలమిది. కవిత్వంలో తనదైన బాణీలో తెలంగాణ జీవితాల్ని ఆవిష్కరించే క్రమానికి ఈ కాలంలోనే పునాది పడింది. ప్రత్యేక తెలంగాణ కోరుతూ మాండలికంలో కవిత్వం రావడం ఆరంభమైంది. తెలంగాణలో ప్రాంతీయ స్పృహ బలపడింది. వస్తురూపాల్లో తెలంగాణ కవిత్వం కొత్త రూపు దాల్చింది.

2001 సంIIలో ఏర్పడ్డ స్వరాష్ట్ర ఆకాంక్షతో ప్రాంతీయ స్పృహ పెరిగి పెద్దదై ఓ వెతుకులాట మొదలై మే,2002 తర్వాత 129 కవులతో కూడిన "పొక్కిలి"తెలంగాణ కవితా సంకలనం రావడం తెలంగాణ మలి దశ ఉద్యమానికి నాంది పలికినట్లయింది. ఇది తెలంగాణ ప్రాంతంలో పోరాటస్ఫూర్తితో తొలిసారి వచ్చిన కవిత్వమిది. తమ బతుకుల్ని చింద్రం చేస్తున్న శక్తులపై తెలంగాణ నిరసన బాణాల్ని ఎక్కుపెట్టి, భౌగోళిక తెలంగాణ ఎలా ఉండేదో, వలస పాలకులు దాన్ని ఎలా విచ్ఛిన్నం చేశారో శక్తి వంతంగా చెప్పారు. ఇప్పుడు తెలంగాణ పల్లె ఎలా ఉందని ప్రశ్నిస్తే అన్నవరం దేవేందర్ తన కవిత ద్వారా ఇలా అంటాడు.

"కను కొనలి నుంచి రాలుతున్న సముద్రం
తెలంగాణ పల్లె"

(సం. జూలూరి గౌరీ శంకర్, పు. పొక్కిలి, పుట. VI)

ఇది తెలంగాణ పల్లె దృశ్యం.భీభత్సం రూపుగట్టిన విషాద భీకర సన్నివేశం. పక్కకెల్లి రెండు నదులు

వెళ్తున్నా మన భూములు బీళ్ళు బారే,గుక్కెడునీళ్ళకోసం తల్లాడే పరిస్థితి ఎందుకు వచ్చింది?కరువులతో తల్లడిల్లే దుస్థితి ఎంటి? తెలంగాణలోనే బావులు, చెరువులు ఎందుకు ఎండి పోతున్నాయి? ఇక్కడి రైతులు, చేనేత కార్మికుల ఆత్మ హత్యలు జరుగుతున్నవి? తమ ఊళ్ళో తాము పరాయివాళ్ళైపోతున్నారెందుకు? అనే ప్రశ్నల్ని సంధిస్తున్నారు. అన్ని రంగాల్లో జరిగిన అన్యాయాన్ని నిలదీస్తూన్నారు.

తెలుగు వారొక్కట్టే అనే సమైక్య వాదుల గురించి 'మేలుక' కవితలో

"మన నెల ఒక్కటే మన జాతి ఒక్కటే అయితే
బతుకులోక్క తీర్గ ఎందుకు లెవ్వరా అయ్యా"

(పైదే, పుట. 228)

అని తాగు నీరు లేదు మంచి నీళ్ళకోసం మైళ్ళకు మైళ్ళు పోవాల్సి రావడం పరమ విషాదం. తమ పక్క నుంచే కృష్ణా, గోదావరి నదులు వెళ్తున్నా తమ పంట పొలాలు ఎడారులుగా మారే దరిద్రపు పరిస్థితి.

కడుపు చేతబట్టుకొని వలస వచ్చిన వాళ్ళు,ఆశ్రయం ఇచ్చిన వాళ్ళ కడుపుగొట్టడం ఎక్కడి నీతి, ఇదేక్కడి దౌర్జన్యం? అని 'తిన్నకాడికి సాల్' కవితలో

"ఇస్సూట రమ్మంటే
ఇల్లంత నాదంటివి"

(పైదే, పుట.123)

అని కోట్ల వేంకటేశ్వ రెడ్డి దేశంగాని దేశం వచ్చిన ఆంధ్రా వలస వాదులకు పిలిచి ఆశ్రయమిస్తే మిత్తి కిందికి పత్తి పెట్టించి మొత్తం భూమిని, ఊరంతా ఆక్రమించి సర్కారు తుమ్మల వలె మొలసి,మా ఊరు దొరనే ఊరి కాపలా దారుని చేశారని తెలంగాణ ప్రజల ఆవేదనను వ్యక్తం చేశాడు. భూమి, భుక్తి పోయి కన్నీళ్లే మాకు మిగిలాయంటాడు. ఆలోడివి కాకపోతివి, పాలోడివి కాక పోతివి, అందిన కాడికి దిగమింగితివి. దోసుకున్నంత వరకు దోచుకుంటివి. నీ వేశం బాగా లేదు. పచ్చగా ఉన్నకాడ పందిరివెచ్చగా ఉన్నకాడ గొంగడి వెయ కంటూ, పని చేసే వానికి పద్ధతి చెబుతే చేతిలో ఉన్న కట్టెకోల ఎదురు తిరుగుతుందని, ఇక సాలు ఇక్కడి నుండి తోక ముడిస్తే నీకు మంచి దని వలస వాదుల నీచత్వాన్ని కవిత్వీకరించాడు.

తెలంగాణ భూమి ప్రాశస్త్యం గురించి తెలుపుతూ.....

"ఈ భూమిలోంచి ఎక్కడ పిడికెడు మట్టి తీసుకున్నా
ఒరిగిన వీరుల కనుగుడ్లే కదలాడుతున్నాయ్ !
నుజ్జు నుజ్జైన జీవుల ఆత్మకతలే వినిపిస్తున్నాయ్"

(పైదే, పుట. VIII)

అనే ఈ పోరాట సంప్రదాయం తెలంగాణలో భాగం. త్యాగాలకు వెరవని ధీరత్వం తెలంగాణ స్వభావంలోనే ఇమిడి ఉందని పగడాల నాగేందర్ ఉద్దేశం.

కలిసి ఉందామంటు ఇప్పటి వరకు చెప్పిన కబుర్లన్ని ఇక కట్టి పెట్ట మంటూ 'తెలంగాణ 2002 పొలి' కవితలో

"నువ్వు ఆడిస్తున్న మాటల్లో
మాటను కాను"

(పైదే, పుట.10)

అని అప్సర్ నువ్వు ఆడించే నాటకంలో బొమ్మను కానూ, నువ్వు పలికిస్తే పలికే మాటను కాదు. నేనాడిస్తానిక నీ అధికారం, నీ ఆర్డర్ల కింద కూర్చుండడానికి నీ బానిసను కాదు. నిన్ను ఊరు దాటించే వరకు నిన్ను వదలను అనే తెలంగాణ ప్రజల ధిక్కార స్వరాన్ని తన కవిత ద్వారా చెబుతున్నారు.

తెలంగాణ పోరాట స్ఫూర్తితోనే వచ్చిన మరో కవితా సంకలనం "మత్తడి" (బహుముఖ తెలంగాణ కయిత)ఈ సంకలనం 258 కవులతో వెలివడింది. తెలంగాణ ప్రాంత మంతా వలస వాద కుట్రలతో, ఖాకీ భూట్ల కవాతు చప్పుల్లతో నిర్బందించిన తెలంగాణ పల్లెను గూర్చి 'ఈ మట్టెన్నడూ నిద్రపోలేదు' కవితలో

"చరిత్రలో ఎన్నడూ ఈ మట్టి నిద్రపోలేదు
ఎన్ని సార్లు చూసినా చుట్టూ సాలెగూడు పోలీసులే!"

(పైదే, పుట.39)

అని ఆశా రాజు తెలంగాణ పల్లెను గురించి ఎన్ని సార్లు గీసినా తుపాకి బమ్మే వసుంతుంది. ఏ గీతను తూడిచి గీసినా తుపాకి ఆకారమే కనిపిస్తుందంటాడు. దూరం పోయినా, దగ్గేరికెళ్ళినా తెలంగాలన అంతా ఇనప టోపి మాదిరినే తెలంగాణ అంతా ఒక పంజరంలో చిక్కు కున్న పక్షుల్లా ఉంది అంటాడు. అలాగే నేలంతా నల్ల బూట్ల చప్పుల్లతో భూకంపం వచ్చి భయం భయంగా వణుకుతున్న తెలంగాణ బిడ్డల గొంతుపై చేస్తున్న పోలీసు కవాతు, కుక్కలు చింపినవిస్తరివలె ఆడవాళ్ళను చెరుస్తున్న తీరును కవి ఎండగడుతున్నాడు.పోలీసు బెటాలియన్ల కోసం ఈ ప్రాంతంఅంతా బహిరంగ మానబంగాలకు వేదికైందనీ, రగులుతున్న అగ్ని పర్వతంలా దహిస్తుంది అంటాడు. తెలంగాణ గడ్డ చరిత్రలో ఎప్పుడు నిద్ర పోలేదని,ఎన్ని సార్లు చూసినా పోలీసు బలగాలే చుట్టు ముట్టి తెలంగాణ దేహం నిండ బుల్లెట్ల గాయాలు చేశాయని తన కవిత ద్వారా తెలంగాణ ప్రజల పాత జ్ఞాపకాలను నెమరు వెస్తున్నాడు. 'కాస్త మాట్లాడుకుందాం!' కవితలో

"నన్ను దగా చేయ లేదా
నా దేహాన్ని చలి మంటలో మాడ్చ లేదా !"

(పైదే, పుట.47)

అని డా॥ ఉదరి నారాయణ అంతా ముఖం మీదే చెప్పుకుందాం ! మనుషులు బ్రతికున్నప్పుడే మాట్లాడు కుందాం! కర్రు మెనకు కపాలం చెఎపుతున్న కవుల గురించి చర్చిదాం ! తర తరాల ఉక్కు పాదాన్ని చివరి శ్వాసలో భరిస్తూ,నా పల్లె తల్లి వల్లకాడుకుసిద్ధమౌతున్న వెల ఇక భయంలేదు. ఇకనైనా నిజం చెప్పు నా కన్న తల్లి రక్తం మరిగిపోతుంటే తోలు చిట్లుతున్నది. లోపలున్న అగ్ని పర్వతాన్ని ఎవరాపగలరు అంటాడు ? బాసలు చేసిన వద్దే మోసపు వల విసిరనవు. నువ్వెంత మురిపించినా నిజం నిప్పైంది. ఇక నన్ను విధూషకున్ని చేయడం అంత సులభం కాదు. ప్రవాహానికి అడ్డుకట్ట వేస్తే,ఆ కట్టను తెంపుకొవడానికి చిన్న ప్రయత్నం చేసినట్లే, ఈ తెలంగాణ బిడ్డలు ఆంధ్ర వలసవాద కుతంత్రాల్ని బద్దలు చేయడం మాకు పెద్ద పనేంకాదని కవి తెలంగాణ గొంతుకై పలికిస్తున్నాడు.

'తెలంగాయాలు' కవితలో తెలంగాణ పల్లె పరిస్థితి ఎలా మారిందో ఎదురు దాడి చేయాలని హెచ్చరిస్తూ...

"రాజకీయ నిరుద్యోగుల
రంగుల ప్రపంచం కాదీ తెలంగాణ !"

(పైదే, పుట.69)

అని యస్.రఘు తెలంగాణకు అయిన గాయాల గురించి ఇలా అంటాడు. తెలంగాణలో తల్లి పాలు కరువై,ఏ పాట చూసినా కరువు పాట పల్లవే. పచ్చి గాయాల గొంతుల్లో తడి ఆరని ఉద్యమ గీతాలే. తెలంగాణ పల్లెలో భీభత్సమైన శ్రమ దోపిడి జరుగుతుందనీ, ఈ శ్రమ దోపిడి శాశ్వత బానిస బ్రతుకులుగా మార్చి, ఈ భారతావనిలో ప్రతీదీఉల్లంగిస్తూనే ఉన్నారు. అందుకే పెద్ద మనుషుల ఒప్పందం సమాధి రాయైంది అంటాడు. అంతే కాకుండ బకాసురులు,బ్రహ్మ రాక్షసులైన తెల్ల దొరలను,నైజాం దొరలను గెలిచినం. కానీ ఈ ఆంధ్ర వలసవాదుల చేతుల్లో ఒడి పోతున్నాం. ఈ ఒటమికి కారణం ఇంటి దొంగే అని చెప్పకనే చెబుతున్నాడు. ఈ వలసవాద రాజకీయాలకు,వారు చేసే వ్యాపార రంగాలకూ, కళ్ళెదుటే కాళ్ళకింది భూమి మాయమైతుంది. నీటి దోపిడితో పంట పోలాలు ఎడారులుగా మారినవి. గిన్నెన్ని నీళ్ళకోసం కన్నీటి జీవ నదిలో కొట్టుక పోయిన పరిస్థితికనిపిస్తుంది అంటాడు. వృత్తి పనులను మాయం చేసి, ఫాక్టరీలను నెలకొల్పి తెలంగాణ అంతా కాలుష్యంతోనిండిన లే అవుట్లను నెలకొల్పి,ఈ నేలను మాకు దక్కకుండా చేశారు. ఇక మా సహనపు నెత్తుటి మరక మమ్మల్ని హెచ్చరిస్తుందం టాడు. ఈ నేల ఆత్మగౌరవం ఎదురు దాడికి నడుం కట్టింది. మునుపు గాలంకు పడేచేపలం కానీ ఇప్పుడు సముద్రంలో తిమింగలాలం ఎవరికి చిక్కం. వలసవాద, సామ్రాజ్యపు వాదుల గుండెల్లో జలాంతర్గాంలం. రాజకీయ నిరుద్యోగుల ప్రపంచం కాదీ తెలంగాణ. నెత్తుటి

జ్వాలల్లో కాలిపోయిన ధీరుల మోగసాల అంటున్నాడు. 'తెలంగాణం' అనే కవితలో

"ఈ పూట గడవడం కోసం గాదు
ఈ బతుకు బలపడడం కోసం"

(పైదే, పుట.77)

అని ఐలేని గిరి తెలంగాణ నినాదం రోజు రోజుకు బలపడుతుందనీ, ప్రశ్నించే గళాలు పెరుగుతున్నా యంటాడు. నీళ్ళున్నా,నిధులున్నా పనికోసం ప్రాకులాడే జనం. భూకంపు అంచుల మీద ఉండి అటు ఆకాశంని, ఇటు భూమిని వదలేక, తాగు నీరు లేక, పండే పంట లేక పరాన్న బుక్కులను ప్రశ్నిస్తున్నాడని అంటాడు కవి. అన్ని పోయి ఇంకా ఎంమిగిలింది. ఎంమిగలలేదని పల్లెను కబలిస్తున్న తీరును ఎండగడుతున్నాడు. వివక్ష తెలంగాణాను చుట్టుముట్టినపుడు ఇక విషాన్ని మింగడం కష్టం. ఈ ప్రాంత హక్కులు, అధికారానికి పోరాడే తత్వం బలపడుతుండడం, బతుకులు బాగుపడటం కోసం బరి గీసి కోట్లాతం. బజార్లో నిలబడతం అంటున్నాడు కవి. దగాపడ్డ తెలంగాణలో దోపిడి కొత్త కొత్త రూపాల్లో కొనసాగుతూనే ఉంది. చారెడు నేల కోసంనిండు ప్రాణాలు బలై పోతునే ఉన్నాయని సుంకర రమేష్ "తెలంగాణ కవిత" అనే సంకలనాన్ని 2008లో తీసుకోచ్చాడు.

తెలంగాణ ప్రత్యేక వృత్తుల జీవితాన్ని కవిత్వీకరిస్తూ వరఖల శివ కుమార్ 'కాలేరన్నలు' కవిత లో చూపిస్తున్నాడు.

"నల్ల బంగారాన్ని తవ్వితీస్తూ
దేహాల్ని అనగదీసుకుంటారు"

(సం. సుంకర రమేష్, పు.తెలంగాణ కవిత 2008, పుట.56)

అని తెలంగాణలోని బొగ్గు గని కార్మికులు మడమ తిప్పని సాహసంతోనల్ల బంగారాన్ని తవ్వి తీయడానికై జన్మనిచ్చిన నేల తల్లి ఒడిలోకి వెళ్ళి, కారు చీకట్లను లెక్కచేయకుండా తమ రక్తాన్ని స్వేదంగా మలిచి తన శరీరాన్ని హూనం చేసుకుటూ నల్ల బంగారాన్ని తవ్వి తీసి దేశానికే వెలుగును ఇస్తూ, దేశ ప్రగతికి బాటలు వేస్తూన్నారు. అడుగడుగునా ప్రమాదాల్ని దాటుకుంటూ లక్ష్యం వైపు దూసుకెల్తారు. కన్న వాళ్ళకు, కట్టుకున్న వాళ్ళకు కంటి మీద కునుకు లేకుడా ఎప్పుడు వస్తాడో అనే ఎదురు చూపులు ఈ ప్రాంత కుటుంబాల్లో కని పిస్తుంది. ఒపెన్ కాస్ట్ గనుల పేరుతో ప్రోక్లెన్ల ఉన్మాదం. దిక్కుతోచని స్థితిలో ఊర్లు. వేల కొలది కార్మికుల్ని నిరాశ్రయిల్ని చేస్తున్న యాంత్రీకరణ ఇక్కడ కనిపిస్తుం దంటాడు కవి. తర తరాలుగా బగ్గు పొరల్లో పానమిడిసిన కుటుంబాలు ఒంటరై దిక్కు తొచని స్థితి అగుపిస్తుంది. పక్కకే నది పారినా గుక్కేడు నీళ్ళ అందుత లేవు. అభివృద్ధి వెలుగు నీడలతో విలసిల్లుతున్న ఒపెన్ కాస్ట్ గనులతో, మిషనరీలతో పనిలేక పనికోసం ఎదురు చూస్తూ వర్తమానాన్ని మింగుతున్న ఆశతో బావి పనులకు బయల్దేరుతున్నారని కవి బగ్గు గని కార్మికుల బతుకు చిత్రాన్ని ఈ కవితలో చూపించారు.

'పడిగె' కవితలో దొడ్డి రామూర్తి దళితుల జీవన స్థితి గతుల గురించి

"పంట తీసినోనికి - బువ్వ నిషేధం
చెట్లు పెంచినోనికి - అడవి నిషేధం"

(పైదే, పుట. 130)

అని బతుకు యుద్ధమైనపుడు యుద్ధం గెలవడానికి ఆయుధం కావాలంటాడు. తెలంగాణలో మూడు కోట్లు ఉన్న బహుజనులను విభజించిపాలిస్తున్నది ఎవరు? నీకు తెల్వనట్టు నటించకు. మీ సుఖానికై నా శరీరాన్ని కరిగించి కంకరైన 'ఎట్టి గాని' కొడుకును మాట్లాడుతున్నా. మీ మాయ వేశాల్ని గమనిస్తున్నా.నన్ను బానిసచేసి ఆడిస్తుంటే చూస్తూ కూర్చుండే గుడ్డివాన్ని కాదు. ఈ దేశంలో బువ్వ కోసం కుట్ర,నీళ్ళ కోసం కుట్ర ఇదేం అంటే తీవ్ర వాదం టారు. పంట పండించినొడికి బువ్వ నిషేధం. చెట్లు పెంచినొడికి అడవి నిషేధం. కుండ చేసినొడికి మట్టి

నిషేధం. ఇదేం న్యాయం అని అడిగితే గొంతు నొక్కెయడమే ప్రజా స్వామ్యం అని తెలంగాణ ప్రాంతలోని దళితుల జీవితంను చిత్రిస్తున్నాడు దొడ్డి రామూర్తి
"ఇవాళ్టి సందర్భం తెలంగాణ

ఇవాళ్టి సన్నివేశం తెలంగాణ" (సం. జూలూరి గౌరీ శంకర్, పు.సెగ (తెలంగాణ కవిత్వం), పుట.VII) ఈ అనివార్య సామాజిక సందర్భం నెలనకొనడానికి తగిన నేపథ్యాన్ని రూపొందించడంలో ఉద్యమాలకు ఎంత పాత్ర ఉందో, కవిత్వానికి అంతే పాత్ర ఉంది. తెలంగాణ ఉద్యమానికి పునాది వేయడంలో, అది దేశం అంతా వ్యాపించడంలో తెలంగాణ కవిత్వం ముందడుగు వేసింది.నాయకత్వాన్ని నిలదీసి, నిర్దేశించింది. దారి తప్పిన నాయకులను హెచ్చరించింది తెలంగాణ ఉద్యమ కవిత్వం. ఆంధ్రా పెత్తందారుల్ని నిలదీసింది. తెలంగాణ రాజకీయాల్ని, తెలంగాణ మీద రాజకీయాలుచేస్తూ ఆటలాడుకునే వారి మోసకారితనాన్ని నిలదీసింది.

చేసిన నిర్వాకానికి క్షమాపణలు చెప్పాలని గంట బజాయించి '610' కవితలో

"నానుంచి గుంజేస్కున్న దానికి జవాబు రావాలి
చరిత్రకు బహిరంగ క్షమాపణ చెప్పి"
(పైదే, పుట. 26)

అంటూ జూలూరి గౌరీ శంకర్ వలన వాదుల చరిత్రను, చరిత్రగా మాపై రుదొద్దంటాడు. మా చరిత్రను ఇప్పుడు మేమే రాసుకుంటాం.మా చరిత్ర త్యాగానికి ప్రాణంపోస్తుంది. మా మీద పైత్యం చేస్తే ఊరుకోము. మాకు దొంగ లెక్కలు రావు. ఎదుటోల్ల బతుకులపై పెత్తనం తెలువదంటాడు. మా పిల్లగాండ్ల పెయిని తాకిచూడు మా చరిత్ర తెలుస్తదంటాడు. మా నుంచి గుంజుకున్నదిమా కిచ్చి బహిరంగ క్షమాపన చెప్పి దురాక్రమణ మానివేయాలి. లేకుటే పోరు తప్పదని హెచ్చరిస్తున్నాడు.

నిర్భందగా ఆంధ్రా పాలకులపై తన కవిత్వపు బాణాలను ఎక్కు పెట్టి తెగదెంపులకు సిద్ధంకండి అని 'తెలంగాణోదయం' కవితలో

"చెప్పక పోవట మేది లేదు
తెగదెంపుల సంగ్రామమని తెగెసి,తెగ్గోసి,చెప్పేశాక"
(పైదే, పుట.47)

అని జూలూరి గౌరీ శంకర్ ఆంధ్రా పాలకుల కుట్రలను గమనిస్తూ,ప్రజల్లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమ భావాలు నింపుకుటూ సూర్యోదయం లాంటి తెలంగాణను సాధించుకుందాం అంటూ అబద్ధపు సమైకాంధ్రా గీతం మాకు వద్దనీ,యేంచేసినా గెలుపు మాదే అని ఉద్ఘాటించాడు. గౌరీ శంకర్ ఉద్యమ స్ఫూర్తి,అతని ముక్కు సూటితనం ఈ కవితలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

ఉద్యమాలు తెలంగాణకు కొత్త కాదు. ఇక్కడి మన్ను మఱ్రవడే సారంలనే తిరుగుబాటు లక్షణం ఉంది. తెలంగాణలోని ఉద్యోగులు, కార్మికులు, రైతులు, కూలీలు, విద్యార్థులు, సబ్బండ వర్ణాలు తాము అన్ని రంగాల్లో ఆంధ్రా దోపిడికి గురౌతున్నామని లెక్కా, పత్రంతో సహా అర్థం చేసుకున్నారు అని 'దీపం వత్తి' కవిత్వంలో అన్నవరం దేవేందర్

"తినే ఇస్తారిల మన్ను వోసింద్రు
కాళ్ళ సందుల కట్టె వెట్టింద్రు"
(సం. అన్నవరం దేవేందర్, పు.వల్లు బండ, పుట.67)

అని యాభై సంవత్సరాలుగా నీళ్ళు, భూములు, ఉద్యోగాలు, బొగ్గు మరియు కరెంటు మొదలైనవి ఇక్కడి నుంచి ఆంధ్రా కమ్మ సంపన్న వర్గాలు కొల్లగొట్టుక పోవడం ముగిసింది. ఆంధ్ర పాలకులచే విముక్తి కలిగిందనే తరుణంలో ఒక్క రోజు కూడా మిగల లేదు. తినే కూట్లే మట్టి పోసింద్రు. కాళ్ళల్లో కట్టె వెట్టింద్రు, మంచి నీళ్ళల్లో విషం కలిపింద్రు. పల్లె పల్లె ఆత్మగౌరవ పతాకలై జనమంతా జై తెలంగాణ!నినాదం అయింద్రు. 1969 నుండి నేటి దాకా ఎన్ని కమ్మలు తింపినా చరిత్ర అదే.

1969లో 369 మంది ఇప్పుడు అంతకన్నా ఎక్కువనే. పచ్చని బ్రతుకుల కోసం ప్రాణంఇస్తుండ్రు. దీపం వత్తిలా మనిషి మండుతుంటె ఇంకా అబద్ధపు ఆత్మవంచనే ఆంధ్ర పాలకులదంటున్నాడు.

'తెలంగాణ విద్యార్థి' కవితలో

"ఆయన విద్యార్థి
తెలంగాణ విద్యార్థి" (పైదే, పుట.105)

అని మంచాల వేంకటేశ్వర్లు తెలంగాణ ఉద్యమ చైతన్యంతో మహా భారతంలోని అభిమన్యుడి వలె గర్భంలో ఉన్నప్పటి నుండే యుద్ధ విద్యలు విన్నటే, ఆంధ్రా దగాకోరు దాష్టికాలను విన్న విద్యార్థి ఉగ్రరూపుడై బుల్లెట్‌లా పేలుతాడని విద్యార్థి ఆక్రోశాన్ని,ఆక్రందాన్ని, చైతన్యాన్ని తన కవిత్వంతో విద్యార్థిలో చైతన్యాన్ని నింపాడు.

'పోరు కేక' కవితలో

"ఉద్యమాలకు ఊపిరినివ్వండి
ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకై"
(పైదే, పుట.190)

అని పెద్దోజు నరేష్ మీ దుర్మార్గం సాగదిక. దురాగతం నడవదిక.ఉరిమింది పోరు కేక రండి రండి కదలి రండి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకై అంతా ఒక్కటై తెలంగాణ ప్రజల సత్తువను వలస వాదికి చూపించి తెలంగాణను ఏలుకుదాం ! అని ఉద్యమకారుల్లో ఊపిరి నింపి తెలంగాణ సాధన యాత్రకు తన కవిత్వం ద్వారా సైరన్ ఊదిండు.

తెలంగాణ ఉద్యమానికి ఊపిరిలూదిన కవిత్వం తొలి దశలో కంటె మలి దశలో ప్రతి కవితెలంగాణ జీవన రీతుల్ని తనదైన పద్ధతుల్లో కవిత్వీకరించాడు. తమబ్రతుకు చింధ్రం చేస్తున్న శక్తులపై నిరసన బాణాల్ని ఎక్కు పెట్టారు. అలాంటి కవిత్వ కోవలోకి చెందినవే పొక్కిలి, మత్తడి, వల్లు బండ, ముండ్ల కర్ర, జాగో..జగావో, దిమ్మిస, సెగ మొదలైన కవితా సంపుటీలు.

తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష జనం గుండెల్లో గూడు కట్టుకొని ఉన్న వర్తమాన సన్నివేశంలో చారిత్రిక దృష్టితో తెలంగాణ గడ్డమీద బహుముఖ పార్శ్వాలతో వెల్లువెత్తిన కవిత్వం ఇది.

**ఆధార గ్రంథాలు :**

1. జూలూరి గౌరీ శంకర్ - పొక్కిలి (తెలంగాణ కవిత్వం), ప్రచురణ స్పృహ సాహితీ సంస్థ, కోదాడ, నల్లగొండ, మే 2002.
2. జూలూరి గౌరీ శంకర్ సెగ (తెలంగాణ కవిత్వం), ప్రచురణ తెలంగాణ రచయితల వేదిక, హైదరాబాద్, 2008.
3. అన్నవరం దేవేందర్ వల్లు బండ (తెలంగాణ ఉద్యమ కవిత్వం), ప్రచురణ సాహితీ సోపతి, కరీంనగర్, తెలంగాణ, జులై 2010.
4. సుంకర రమేష్, తెలంగాణ కవిత 2008, ప్రచురణ మట్టి ముద్రణలు, ఆల గడప, మిర్యాలగూడ, నల్లగొండ, తెలంగాణ, నవంబర్ 2009.

BHAVAVEENA
Vol. 18, Issue. 9, September 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# విశ్వనరుడు గుర్రం జాషువా

- డా॥. పెండ్యాల లావణ్య
తెలుగు అధ్యాపకులు, డా॥. కొత్త రఘురామయ్య మెమోరియల్ డిగ్రీ కళాశాల, దుగ్గిరాల.

- డా॥. బూసి వెంకటస్వామి
శాఖాధిపతి, తెలుగు విభాగము,
పెదనందిపాడు ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, పెదనందిపాడు, గుంటూరు.

"కుల మతాలు గీచుకున్న గీతలజొచ్చి
పంజరాన గట్టుపడను నేను
నిఖిల లోకమెట్లు నిర్ణయించిన నాకు
తిరుగులేదు విశ్వనరుడు నేను"

అని ధైర్యంగా చెప్పుకున్న నవయుగ కవి చక్రవర్తి జాషువా. జాషువా 1895 సెప్టెంబర్ 28వ తేదీన గుర్రం వీరయ్య, లింగమ్మ దంపతులకు గుంటూరు జిల్లా వినుకొండ మండలం చాట్రగడ్డపాడులో జన్మించారు. తల్లిదండ్రులు వర్వేరు కులాలకు చెందినవారు. తండ్రి యాదవ, తల్లి మాదిగ. వీరి వివాహం ఎన్నో కష్టాలకు వోర్చి పెళ్ళి చేసుకున్నారు. ఈ కుల మతాల పోరు పిల్ల వాడైన జాషువాకి అంటకుండా చూడాలని తల్లిదండ్రులు ఎంతో ప్రయత్నం చేశారు. జాషువా చిన్ననాటినుండే ఎన్నో అవమానాలు, ఈసడింపులు ఎదుర్కొన్నాడు. నాటి సమాజంలో వర్ణ వ్యవస్థ దుర్భరంగానే ఉండేది.

జాషువా వినుకొండలో ఫాదరీ బడికి వెళ్ళాడు. ఐదో తరగతి తర్వాత హయ్యర్ గ్రేడ్ ఎలిమెంటరీ స్కూల్‌లో చేరారు. కాని అక్కడి వాతావరణం జాషువా మనసులో గాయాలను రేపింది. పంచమ జాతిపై 'కోపమున్ రోతయున్ గొంతుంబట్టి గలట్టివారు' అక్కడ అగ్రవర్ణ కులస్థుల ధాటికి తట్టుకోలేకపోయాడు. మూఢాచారాలతో నిండిన సమాజంలో అవమానాలు, చీత్కారాలు ఎదుర్కొన్నాడు. అయినా జాషువా ఊరుకునేవాడు కాదు, తిరగబడేవాడు. హిందూ గ్రంథాలు చదవడం, క్రైస్తవ మతాధికారులకు రుచించలేదు. రాత్రిపూట రహస్యంగా పాడుబడ్డ మసీదులో గుడ్డిదీపం వెలుగులో పురాణేతిహాసాలు చదువుకునేవాడు. ఒక విధంగా చెప్పాలంటే జాషువా హిందువులు, క్రైస్తవుల మధ్య నలిగిపోయాడు. అయితే జీవితంలో ఎన్నో పాఠాలు నేర్చుకున్నాడు. అందుకే జాషువా అంటాడు. "నా గురువులు ఇద్దరు, ఒకటి పేదరికం రెండు కులమత భేదం. ఒకటి సహనాన్ని నేర్పితే, రెండవది నాలో ఎదిరించే శక్తిని పెంచిందేగాని బానిసగా మాత్రం మార్చలేదు. దారిద్ర్యాన్ని కులభేదాల్ని కూడా చీల్చి నేను మనిషిగా నిరూపించుకోదలిచాను. వాటిపై కత్తి కట్టాను. అయితే నా కత్తి కవిత. నా కత్తికి సంఘంపై ద్వేషం లేదు. దాని విధానంపై ద్వేషం అంటారు. జాషువా గుండె మంటల నుండి ఏర్పడినవే ఈ మాటలు.

1910-11 సంవత్సరాల్లో వినుకొండ దగ్గరలో చాట్రగడ్డ పాడులో బడిపంతులు ఉద్యోగంలో జాషువా ఉద్యోగ పర్వం ప్రారంభమైంది. అక్కడి మతబోధకుల ఆగ్రహం తప్పలేదు. ఆ తర్వాత టూరింగ్ సినిమాలో కథా వాచకుడిగా పనిచేశారు. బడిపంతులుగా వచ్చే జీతంలో అద్దెకు, ముద్దకు, చాకలిపద్దుకు సరిపోక నానా కష్టాలు అనుభవించారు. పెళ్ళి అయిన తొలినాళ్ళలో అష్టకష్టాలు పడ్డారు. 1910 సంవత్సరంలో మేరీని పెళ్ళి చేసుకున్నారు. 1919 గుంటూరులో యునైటెడ్ లూథరన్ క్రిష్టియన్ మిషన్ బోధనాభ్యసన పాఠశాలలో తెలుగు పండితుడిగా 8 సంవత్సరాలు పనిచేశాడు. ఆ తర్వాత 1928 బాపట్లలో బోర్డ్ స్కూల్ పండితుడిగా చేరాడు. ఇవేకాక అసిస్టెంట్ సాంగ్ పబ్లిసిటీ ఆఫీసర్‌గా, రెండో ప్రపంచయుద్ధ సమయంలో యుద్ధ ప్రచారకుడిగా, మద్రాసు ఆలిండియా రేడియో తెలుగు విభాగంలో స్పొకెన్‌వర్డ్ ప్రొడ్యూసర్‌గా పనిచేశారు. జీవనం కోసం ఎన్నో రకాల

ఉద్యోగాలు చేసిన జాషువాకు 1946 ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో సభ్యత్వం లభించింది. ఏకా ఆంజనేయులు గారి ఆదరాభిమానాలు పొంది, వారిచ్చిన ఇంట్లోనే జీవనం సాగిస్తూ 1971 జులై 24వ తేదీన కీర్తిశేషులయ్యారు.

చిన్నతనం నుండి జాషువాలో సృజనాత్మకశక్తి మెండు. బొమ్మలు గీయడం, పాటలు పాడడం వీరి అభిరుచులకు నిదర్శనం. బాల్య స్నేహితుడైన దీపాల పిచ్చయ్య శాస్త్రి సహచర్యంతో జాషువాకు కవిత్వంపై ఆసక్తి కలిగింది. జూపూడి హనుమచ్ఛాస్త్రి దగ్గర మేఘసందేశం, రఘువంశం, కుమార సంభవం నేర్చుకున్నాడు. జాషువా 36 గ్రంథాలు మరెన్నో కవితా ఖండికలు రచించారు.

జాషువా రచనలలో ఖండకావ్య ప్రక్రియ విశిష్ట స్థానాన్ని పొందింది. నవ్యాంధ్ర కవులు ఖండకావ్య ప్రక్రియను ప్రత్యేకంగా చేపట్టారు. ఆనాటి ఆంగ్ల సాహిత్య ప్రభావం పోషకులైన సంస్థానాధీశులు లేకపోవడం, విభిన్న ధోరణులలో వెలువడే పత్రికలు మొదలైన ఎన్నో ఖండ కావ్య, ప్రక్రియను పరోక్షంగాను, ప్రత్యక్షంగాను ప్రోత్స హించాయని చెప్పవచ్చు. అందుకే "అట్టి సందిగ్ధ కాలమున నుద్గ్రంధ రచన కుత్సహించువాడెవడు, రాసిన జదువ నోపిక పాఠకునకెక్కడిది కావున ప్రజాభిరుచికి నుచితంబు లగు చిన్న చిన్న వ్యాసములుగల భారతి వంటి పత్రికల వతరించినవి. నేడు పరాధీనుడైన తెలుగువాని కిట్టి ఖండకావ్యములు నిముషలము మీద ముగిసి తీరుబడి వేళల నింపుసేయుచుండును' అని జాషువా స్పష్టంగా చెప్పారు. (విజ్ఞప్తి ఖండకావ్యం)

ఒకసారి వినుకొండలో అవధాన సభ నిర్వహించారు. జాషువా ఆ అవధాన సభలో తాను స్వయంగా రచించిన పద్యాలు చదివాడు. తక్కువ కులం వాడిని సభలోకి ఎందుకు రానిచ్చారంటూ కొందరు అగ్రవర్ణ కులస్థులు జాషువాని అవమానించారు. ఆయనకు జరిగిన అవమానాలకు ఇది ఒక మచ్చుతునక మాత్రమే. అంటరానివాడని హిందువులు ఈసడిస్తే, క్రైస్తవుడై ఉండి హిందూమత సంబంధ రచనలు చేస్తున్నాడని క్రైస్తవమాతాధికారులు ఆయన్ని నిరసించారు. జాషువా కుటుంబాన్ని క్రైస్తవ సమాజం నుండి బహిష్కరించారు. ఇటువంటి పరిణామల క్రమంలో జాషువా నాస్తికత్వంవైపు ఆసక్తి కనపరిచారు.

## జాషువా ప్రసిద్ధ రచనలు :

1. 1919 - రుక్మిణీ కళ్యాణం
2. 1922 - చిదానంద ప్రభాతం, కుశలవో పాఖ్యానం
3. 1924 - కోకిల.
4. 1925 - ధృవవిజయం, కృష్ణనాడి, సంసార సాగరం.
5. శివాజీ ప్రబంధం, హీరాబాయి, కృష్ణదేవరాయలు, వేమన యోగీంద్రుడు, భారతమాత.
6. 1927 - భారతవీరుడు, సూర్యోదయం, చంద్రోదయం, గిజిగాడు.
7. 1928 - రణచ్యుతి, అంధ్రుడను, తమ్మెద పెళ్ళికొడుకు.
8. 1929 - సఖి, బుద్ధుడు, తెలుగుతల్లి, శిశువు, బాష్పసందేశం.
9. 1930 - దీర్ఘ నిశ్వాసము, ప్రబోధము, శిల్పి, హెచ్చరిక, సాలీడు, మాతృప్రేమ.
10. 1931 - భీష్ముడు, యుగంధర మంత్రి, సమదృష్టి, నేలబాలుడు, నెమలి నెలత, లోకబాంధవుడు, అనసూయ, శల్య సారథ్యము, సందేహడోల.
11. 1932 - స్వప్నకథ, అనాథ, ఫిరదౌసి, ముంతాజ్ మహల్, సింధూరము, బుద్ధమహిమ, క్రీస్తు, గుంటూరు సీమ, వివేకానంద, చీట్లపేక, జేబున్నీసా, పశ్చాత్తాపం.
12. 1933 - అయోమయం, అఖండ గౌతమి, ఆశ్వాసము, మేషుడు, శ్మశానవాటిక.
13. 1934 - ఆంధ్రభోజుడు.
14. 1941 - గబ్బిలము.
15. 1945 - కాందిశీకుడు.
16. 1946 - తెరచాటు.

17. 1948 - చిన్న నాయకుడు, బాపూజీ, నేతాజీ.
18. 1950 - స్వయంవరం.
19. 1957 - కొత్తలోకం.
20. 1958 - క్రీస్తు చరిత్ర.
21. 1963 - రాష్ట్రపూజ, ముసాఫిరులు.
22. 1966 - నాగార్జున సాగరం, నాకథ.

**అవార్డులు :**

1. 1964 సంవత్సరంలో క్రీస్తు చరిత్రకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు.
2. 1964 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యుడిగా నియమితులయ్యారు.
3. 1970 సంవత్సరంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం కళాప్రపూర్ణ బిరుదుతో సత్కరించింది.
4. 1970 సంవత్సరంలో భారత ప్రభుత్వం పద్మ భూషణ్ పురస్కారం.

అలాగే కవితా విశారద, కవికోకిల, కవి దిగ్గజ - నవయుగ కవి, చక్రవర్తి, మధురశ్రీనాథ, విశ్వకవి సామ్రాట్‌గా ఇలా ఎన్నో బిరుదులు, సత్కారాలు జాషువా అందుకున్నారు.

హైందవకులం కాటేసినా కవితావాణి వలపు పొందిన ధన్యుడు జాషువా. తాను పడిన వేదనని గుండెకు గుచ్చుకునేలా హృద్యంగా వర్ణించిన మహాకవి. సాహిత్యంలో నిమ్నవర్గాలకు ప్రవేశం లేని కాలంలో సగర్వంగా దళిత బావుటాని ఎగురవేసి ఆనాటి మహా పండితుల చేత గండ పెండేరాలు తొడిగించుకున్న వాడు జాషువా. నేటి దళిత శ్రామికవర్గం అదిగో మా కీర్తి శిఖరం, అదిగదిగో మా అక్షర బావుటా అని గర్వించదగిన కవి గుర్రం జాషువా. తన పద్యం నడకలో గుర్రం గిట్టల సవ్వడిని వినిపించిన మధురకవి.

జాషువా రచనల్లో గబ్బిలం (1941) సర్వోత్తమమైనది. కాళిదాసు మేఘసందేశం తరహాలో సాగుతుంది. అయితే ఇందులో సందేహాన్ని పంపేది యక్షుడు కాదు. ఒక అంటరాని కులానికి చెందిన కథా నాయకుడు తన గోడును కాశీ విశ్వనాథునికి చేరవేయమని గబ్బిలంతో సందేశం పంపడమే దీని కథాంశం. ఎందుకంటే గుడిలోకి దళితుడికి ప్రవేశం లేదు. కాని గబ్బిలానికి అడ్డులేదు. కథా నాయకుడి వేదనను వర్ణించిన తీరు హృదయాలను కలచివేస్తుంది.

"ఆ యభాగ్యుని రక్తంబు నాహరించి
యినుప గజ్జెల తల్లి జీవనము సేయు
గసరి బుసకొట్టు నాతని గాలిసోక
నాల్గు పడగల హైందవ నాగరాజు"

అంటూ హిందుమతంలోని చాతుర్వర్ణ వ్యవస్థను ఎంతో భావయుక్తంగా వర్ణించారు.

ఫిరదౌసి (1932) జాషువా విరచిత ఆణిముత్యం. పర్షియన్ చక్రవర్తి గజనీ మహమ్మద్ ఆస్థాన కవి ఫిరదౌసి. ఫిరదౌసి చేత గజనీ మహమ్మద్ తన వంశ చరిత్రను కీర్తిస్తూ మహాకావ్యం రచించమన్నాడు. పద్యానికో బంగారు నాణెం ఇస్తానని మహమ్మద్ మాట ఇచ్చాడు. ఫిరదౌసి మహమ్మద్ మాటకు కట్టుబడి యవ్వనమంతా ధారపోసి మహాకావ్యాన్ని రచించాడు. చివరకు అసూయపరుల మాటలు విని రాజు మాట తప్పాడు. ఆవేదనలో ఫిరదౌసి ఆత్మహత్య చేసుకున్న ఆ కవి హృదయాన్ని జాషువా అద్భుతంగా వర్ణించాడు.

"రాజు మరణించె నొక తార రాలిపోయె
కవియు మరణించె నొకతార గగనమెక్కె
రాజు .జీవించె రాతి విగ్రహములందు
సుకవి జీవించె ప్రజల నాలుకల యందు"

అనే పద్యంలో కవి లోకానికి జాషువా సముచిత స్థానం కల్పించారు. 'వడగాల్పు - నా జీవితమైతే వెన్నెల - నా కవిత్వం' అన్న జాషువా మాటలు అక్షరసత్యాలు.

కవి కావడానికి అనుకూల పరిస్థితులు లేని వ్యవస్థను ధైర్యంగా ఎదుర్కొని నిలబడి జాషువా మహాకవిగా పేరుపొందారు. కులం రీత్యా నాటకం చూడడానికి వీలు లేదు. కులం వల్ల స్కూల్‌లో వేదిక ఎక్కి పద్యాలు చదివే

అవకాశం లేదు. అయినా ఆటుపోటులను సహించి వటవృక్షంలా నిలబడగలిగాడు.

అసమ సమాజం బాకులు గుమ్మినప్పుడు, అంటరాని తనం విషాగ్నులు చిమ్మినప్పుడు, దుర్భర దారిద్ర్యం వెన్నాడినప్పుడు, దురంత వేదన గుండెల్లో తుకతుక ఉడికినప్పుడు జాషువా గుర్తొస్తాడు. అతని ఫిరదౌసి కావ్యం గుర్తుకు వస్తుంది. గబ్బిలం జ్ఞాపకానికి వస్తుంది. 'శ్మశాన వాటి' నిట్టూర్పు పొగలతో కట్టెదుట నిలుస్తుంది. జాషువా సంప్రదాయ బద్ధమైన పద్యాన్ని ఆయుధంగా ఎంచుకొన్నా పద్య రచనలో మార్పులు తెచ్చాడు. వ్యాకరణ నియమాలు సడలించి భాషా స్వేచ్ఛని వ్యక్తీకరించాడు. అరబ్బీ, పారశీ, ఉర్దూ మాటలు యధేచ్ఛగా ప్రయోగించాడు.

జాషువా భావకవిత్వంవైపు కన్నెత్తి చూడలేదు. జాషువా ఊహావిహారి అయిన భావకవిత్వాన్ని కాదని వాస్తవిక ప్రపంచంలోకి వచ్చాడు. భావకవుల్ని, వాళ్ళ ఊహా ప్రేయసి వర్ణనల్ని, పిచ్చ రోదనలను నిరసించాడు. జాషువా కలం మామూలు కలం కాదు.

"నిమ్న జాతుల కన్నీటి నీరదములు
పిడుగులై దేశమును కాల్చి వేయునని"

హెచ్చరించాడు. గర్జించాడు - శపించాడు. అసలు ఈ చాతుర్వర్ణ వ్యవస్థను నిలదీస్తూ జాషువా విప్లవమూర్తిగా సాక్షాత్కరిస్తాడు. పంచమకులం ఎక్కడుందని హుంకరిస్తూ..

"ముసలివాడైన బ్రహ్మకు పుట్టినారు
నలుగురు కుమారులనుట విన్నాముగాని
వసరము కన్న హీనుడ భాగ్యుడైన
యైదవ కులస్థుడెవరమ్మా, సవిత్రి?"

కులం వల్ల కలిగిన అవమానం, దారిద్ర్యం వలన ధైర్యం, రెండు జాషువాని కలచివేశాయి.

జాషువా కరుణరసంలో నుండి వీరరసాన్ని పొంగించిన కవి. అతడు చిందించే కన్నీళ్ళు అగ్ని గోళాలు. అది దేబరించేవి కావు. గూబలను గుద్ది పలకరిచేవి అనడం అక్షర సత్యం. జాషువా ఏ విషయం మీద వర్ణించినా ఆయన దృష్టి అమానుషం మీద, అసమ సమాజం మీదే ఉంటుంది. ఎవరూ చూడని చీకటి కోణాల్ని చూడగల క్రాంతదర్శి జాషువా. ఖండకావ్యాల్లో అభ్యుదయ దృక్పథాన్ని జాషువా ప్రబోధించాడు. అన్నార్తుల ఆక్రందనని ధ్వనింపజేసే ముందు చూపు, లోచూపు ఉన్నకవి జాషువా. శ్మశానవాటికలోని ప్రతిపద్యం ముఖ్యంగా "ఇచ్చోటనే సత్కహింద్రుని కమ్మని కలము నిప్పులలో గణగిపోయే" అనే పద్యం తీవ్రమైన అనుభూతిని కలగజేసి చచ్చిన తర్వాతైనా అందరు ఒక్కటే అనే తత్త్వాన్ని బోధిస్తాడు. తెలివికి కలిమిలేములతో నిమిత్తం లేదని, ప్రతిభకు కులమతాల తక్కెడలో తూచరాదని విశ్వసించి తన జీవితమంతా ఆ విశ్వాసాన్నే కవిత్వంగా విశ్వసించాడు.

జాషువా రచనలన్నింటినీ బంధించిన సూత్రం ఒక్కటే అదే మానత్వం. జాషువా సామాజిక, సాహిత్యపరంగా తన స్థానాన్ని నిలబెట్టుకున్నా నవయుగ కవి చక్రవర్తి. వినుకొండలో పుట్టినా విశ్వాన్ని చుట్టబెట్టిన విశ్వనరుడు. ఖండకావ్య రచనలో అఖండంగా తన కలాన్ని ముందకు నడిపించిన పురోగమనశీలి. కులమత భేదాలు రాహుకేతుఉలా కబళిస్తుంటే వాటి కోరల నుంచి బయటపడి కవితామృతాన్ని సాహిత్య లోకానికందించిన కవి చంద్రుడు జాషువా. కవిగా కలం పట్టి మనిషిగా ఎదిగి విశ్వ మానవతను ఆహ్వానించిన నవయుగ కవి చక్రవర్తి మన గుర్రం జాషువా.

గుణం లేనివాడు
కులం గొడుగు పడతాడు
మానవత్వం లేనివాడు మతం ముసుగువేస్తాడు
పసలేనివాడు ప్రాంతం ఊసెత్తుతాడు
జనులంతా ఒక కుటుంబం
జగమంతా ఒక నిలయం

- గుర్రం జాషువా

# స్థిత ప్రజ్ఞురాలు ద్రౌపది

– యం. అనిత, పరిశోధకురాలు, తెలుగు & తులనాత్మక సాహిత్యశాఖ, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురము.

భారతీయ సంస్కృతిని తెలుసుకోవడానికి మూల భూతమైన విజ్ఞాన సర్వస్వం మహాభారతం. ధర్మతత్వ జ్ఞులు ధర్మశాస్త్రమనీ, ఆధ్యాత్మ విదులు వేదాంతమనీ, కవివృషభులు మహాకావ్యమనీ, రాజనీతిజ్ఞులు రాజనీతి శాస్త్రమనీ కొనియాడబడిన గ్రంథం ఇది. 'యది హాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్ క్వచిత్' అని శ్లాఘించ బడింది. ఇక్కడ ఉన్నదే మరో చోట ఉండగలదు. ఇక్కడ లేనిది మరెక్కడా వుండదు - అని జ్ఞానపూర్వకంగా రాయబడిన గ్రంథం మహాభారతం.

మహాభారతం ఇతిహాస కోవకు చెందింది. ప్రధాన ఇతివృత్తంతోబాటు అనేక ఉపాఖ్యానాలు ఇందులో ఉన్నాయి. శ్రీరాముని చరిత్ర, నలచరిత్ర, హరిశ్చంద్ర చరిత్ర మొదలగు ఉపాఖ్యానాలు స్వతంత్ర గ్రంథాలుగా కూడా రచింపబడ్డాయి. ఒక్కొక్కటి ఒక్కో అంశాన్ని విశదీక రించడానికి ఉద్దేశించినవే. మహాభారతంలో లక్ష శ్లోకాలు న్నాయి. ప్రతి శ్లోకమూ అర్థవంతమైనదే ననవచ్చు. ఈ గ్రంథంలోని కథ కురుపాండవుల వృత్తాంతమే అయినా అందులో ధర్మరాజు, అర్జునుడు, దుర్యోధనుడు, కృష్ణుడు వంటి పురుషపాత్రలూ, కుంతి, గాంధారి, మాద్రి, ద్రౌపది వంటి స్త్రీ పాత్రలూ ఉన్నాయి. ఒక్కొక్కపాత్ర ఒక్కో భూమికను పోషించాయని చెప్పవచ్చు. అందులో ప్రదాన మైన పాత్ర దౌపదిపాత్ర అని చెప్పవచ్చు. ద్రౌపది పాత్ర మహాభారతానికి కేంద్రబిందువు వంటిది. భారత వృత్తాంతమంతా ద్రౌపదిని ఆయువుపట్టుగా చేసుకునే ముందకు నడుస్తున్నది. ఇందులో రెండో అభిప్రాయానికి చోటు లేదనవచ్చు.

ద్రౌపది జననమే ఒక లక్ష్య సాధన కోసమని భారతం విస్పష్టంగా ప్రకటిస్తుంది. ఆ లక్ష్యసాధనలో ఆమె ఎన్నో కష్టాలు, అవమానాలు, బాధలు అనుభవించింది. ఏ పౌరాణిక స్త్రీ - అనుభవించినన్ని ఇడుములను ఆమె అనుభవించింది. ద్రుపదమహారాజు చేసిన యజ్ఞ కుండంలో పుట్టి యాజ్ఞసేనిగా వాసికెక్కింది. స్వయంవరం ద్వారా పాండవులకు భార్య అయింది. దుశ్శాసనుని చేత వలువలు ఊడ్చబడినది. కీచకుని కామదాహం నుంచి బయట పడింది. పన్నెండు సంవత్సరాలు అరణ్యవాసం, ఒక ఏడు అజ్ఞాతవాసం గడిపింది. అరణ్యవాసంలో సైంధవుని చేత అపహరించపబడింది. సకాలంలో అర్జునుడు రావడంతో ఆ దుర్మార్గుని చేతి నుంచి బయట పడింది. కౌరవుల మూలంగా తాను ఎన్ని బాధలు ఎదుర్కొన్నదో రాయబారిగా కౌరవుల వద్దకు వెళుతున్న శ్రీకృష్ణునికి మొరపెట్టుకున్నది. కౌరవుల అంతమే తన జీవితాశయమని తేల్చి చెప్పింది. అశ్వత్థామ చేత ఉప పాండవులు ఊచకోత కోయబడినపుడు దుఃఖసాగరంలో మునిగింది. అంత దుర్మార్గానికి పాల్పడిన అతన్ని పెద్దమనసుతో క్షమించింది. చివరికి మహాప్రస్థానం చేస్తూ ఆసువులు బాసింది.

రామాయణంలో సీత అరణ్యవాసం వెళ్ళింది, రావణుని చేత అపహరింపబడి లంకకు చేరింది. ఆమెపై ఎలాంటి దుర్మార్గానికి ఎవరూ పాల్పడలేదు. అయితే ద్రౌపది మీద ఎన్నో దౌర్జన్యపూరిత ఘటనలు జరిగాయి. వాటన్నిటి నుంచి తను చాకచక్యంగా బయటపడింది. అయినా లోకులు సీతమ్మ కష్టాలు అంటున్నారు గానీ, ద్రౌపది కష్టాలు అనడం లేదు. ఒక స్త్రీపై గతకాలంలో ఎన్నిరకాలుగా లైంగిక వేధింపులు జరిగేవో తెలుసు కొనుటకు ద్రౌపది వృత్తాంతమే ప్రబల నిదర్శనం. అయితే ఈ సాధ్వని పతివ్రతల్లో ఒకరిగా విమర్శకులు పేర్కొనడం ముదావహం. మహాజ్ఞాని యైన ద్రౌపది సత్యభామకు పతివ్రతా ధర్మాలను పూసగుచ్చినట్లు వివరిస్తుంది.

చ॥ పతిగడవంగ దైవతము భామల కెందుకు లేదు ప్రీతుడై
వతి గరుణించెనేని గలభాషిణి భానుర భూషణాంబరా
న్వితధన ధాన్యగౌరవము విశ్రుత సంతతియున్ యశంబు స
దగ్గతియును గల్లు నొందు మెయి గల్గునె యిన్ని తెఱంగులారయన్
(అరణ్యపర్వము - పంచమాశ్వాసము - 314 పద్యం)

ద్రౌపది పతి దైవంతో సమానమని అంటుంది. పతి ప్రీతులైన భార్యను అంతకు మించిన ఐశ్వర్యము లేదంటుంది. పతిని పత్ని చూసుకునే తీరును బట్టి సద్గతి కలుగుతుందని అంటుంది. ద్రౌపది మాటలు నేటికి భారతీయుల్లో ముఖ్యంగా తెలుగువారిలో వినియోగించబడుతూనే ఉన్నాయి. దీనిని ఆధారంగా చేసుకునే పతియే ప్రత్యక్షదైవం అనే సూక్తి పుట్టిందనవచ్చు.

ద్రౌపది ఐదు మంది భర్తలతోనూ సఖ్యంగా జీవితం గడిపింది. అన్నదమ్ములు ఒకరిని మరొకరు విమర్శిస్తే సహించేది కాదు. అరణ్యవాస కష్టాలకు మూల కారణం ధర్మరాజని ఒక సందర్భంలో భీముడు సున్నితంగా నిందిస్తూ అసహనం వ్యక్తం చేస్తాడు. అపుడు ద్రౌపది సూటిగా, ఘాటుగా స్పందిస్తూ భీమునితో ధర్మరాజు ఔన్నత్యాన్ని ఇఆ కినియాడబడుతుది.

సీ॥ ఎవ్వని వాకిట నిభమద పంకంబు
రాజ భూషణ రజో రాజినడుగు
నెవ్వని చారిత్ర మెల్ల లోకములకు
నొజ్జయై వినయంబు నొఱపు గఱపు
నెవ్వని కడకంట నివ్వటిల్లెడు చూడ్కి
మానత సంపద లీనుచుండు
నెవ్వని గుణలత లేదు వారాసుల
కడపటి కొండపై గలయఁబ్రాకు

తే॥ నతడు భూరి ప్రతాపద మహా ప్రదీప
దూరవిఘటత గర్వాంధ కారవైరి
వీర కోటీరమణి ఘృణి వేష్టి తాంఘ్రి
తలుడు కేవల మర్త్యుడే ధర్మసుతుడు
(విరాట పర్వం - ద్వితీయాశ్వాసం - 191 పద్యం)

ధర్మరాజు చరిత్ర అఖిలలోకాలకు గురువుగా వినయాన్ని కలిగిస్తున్నదని, అతని చూపులను గుర్తించే సామంతరాజులు సంపదలు సమర్పిస్తున్నారని, అతని గుణగణాలు ఏడు కొండలపై విరాజిట్లుతున్నాయని పరిపరి విధాలుగా ద్రౌపది శ్లాఘిస్తుంది. దీనితో భీముడు తనకు ధర్మరాజుపట్ల ఉన్న గౌరవాన్ని దురభిప్రాయాన్ని మార్చుకుంటాడు. ఇలా తన వారి గొప్పతనాన్ని సమయం సందర్భానుకూలంగా చెప్పడంలో ద్రౌపది దిట్ట అని చెప్పవచ్చు. అదేక్రమంలో తనను బాధించిన అవమానించిన వారి పట్ల కక్షను కూడా అదేస్థాయిలో తీర్చుకోవాలనుకుంటుంది. రాయబారిగా కౌరవుల వద్దకు వెళుతున్న శ్రీకృష్ణునితో ద్రౌపది ఇలా అంటుంది.

సీ॥ ఈ వెంట్రుకలు పట్టి యీడ్చిన యాచేయి
తొలుతగాఁబోరిలో దుస్స సేను
తనువింతలింతలు తునియలై చెదరి రూ
పఱియున్నఁగని యుడు కాఱుఁగాక
యలు పొలఁబొను పడునట్టి చిచ్చేయిది
పెనుగద పట్టిన భీమ సను
బాహుబలంబును చాటించి గాండీవ
మనునొక విల్లెప్పుడును వహించు

అ॥ కఱ్ఱి విక్రమంబు గాల్పనే యిట్లు బ,
న్నములు పడిన ధర్మనందనుండు
నేను రాజరాజు పేనుగుఁగన్నార,
గాన బయటమైతి మేని గృష్ణ
(ఉద్యోగ పర్వము - తృతీయాశ్వాసము - 177 పద్యం)

జూదంలో ధర్మరాజు ఓడిపోగానే దుర్యోధనుడు దుశ్శాసనుని పంపి ద్రౌపదిని ఈడ్చుకురమ్మని ఆదేశిస్తాడు. అన్న ఆజ్ఞ మేరకు వెళ్ళిన దుశ్శాసనుడు ద్రౌపది వెంట్రుకలు పట్టి ఈడ్చుకొని వచ్చి వలువలు ఊడుస్తాడు. ఇంతకంటే స్త్రీకి జరగాల్సిన అవమానం మరొకటి ఏముంటుంది. ఈ అవమానానికి తగిన విధంగా ప్రతీకారం తీర్చుకోవాలంటుంది ద్రౌపది. దుశ్శాసనుని శరీరం తునియులు కావడాన్ని చూస్తే తప్ప తనకు సంతోషం కలుగదంటుంది. అలా వారిని దారుణంగా క్రూరంగా చంపకపోతే భీమార్జునుల పరాక్రమం ఎందుకని ప్రశ్నిస్తుంది. రాజరాజు అయిన దుర్యోధనుని శవాన్ని తాను కళ్ళారా చూడాలని, అంతవరకు తనకు మనశ్శాంతి కలగదంటుంది. ద్రౌపది అలా ప్రతినబూనడంలో సహేతుకత ఉందనవచ్చు.

పాండవులలో కలసి ద్రౌపది మహాప్రస్థానం చేస్తుంది. ఆ క్రమంలో ముందుగా ద్రౌపది నేలపైబడి అసువులు బాస్తుంది. మేరుపర్వతం సమీపంలోకి రాగానే 'పాంచాల భూ పుత్రిక యోగ మెడలిన మేథిని బడియె' అన్నాడు తిక్కన. ఆ తర్వాత వరుసగా సహదేవుడు, నకులుడు, అర్జునుడు, భీముడు యోగం చెందారు. ధర్మరాజు, ఒక శునకం మాత్రం స్వర్గం చేరారు. అయోనిజగా యజ్ఞంలో పుట్టిన ద్రౌపది శకం అలా ముగిసింది. విభిన్న కోణాల్లో పరిశీలిస్తే ద్రౌపది కేవలం పుట్టినింటిలో మాత్రమే హాయిగా, ఆనందంగా, ఐశ్వర్యవంతంగా, మానసిక ప్రశాంతతో జీవించిందని చెప్పవచ్చు. స్వయంవరం నాటి నుంచి తనువు చాలించేవరకు నిత్యం ఏదోక కష్టం,బాధ, సమస్య, వేధింపులు ఆమెను వెన్నాడుతూనే వచ్చాయని భారతం ద్వారా తెలుస్తున్నది.

ద్రౌపది వృత్తాంతాన్ని మొత్తాన్ని పరిశోధనాత్మకంగా వివేచించి చూస్తే, ఆమె వ్యక్తిత్వ ధీరవనితగా, స్థిత ప్రజ్ఞురాలిగా, సుగుణాల రాశిగా, ఆదర్శపత్నిగా, ప్రతీకార గుణశీలిగా, ఆత్మాభిమానిగా కనిపిస్తుందని చెప్పవచ్చు.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. కవిత్రయం భారతం - నన్నయ, తిక్కన, ఎర్రన
2. మహాభారత సారసంగ్రహము - పుల్లెల శ్రీరామచంద్రుడు
3. వ్యాసభారతము - గీతాప్రెస్, గోరఖ్‌పూర్
4. భారతము - రాజాజీ
5. భారతము - ఉషశ్రీ

BHAVAVEENA
Vol. 18, Issue. 9, September 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# భాగవతంలో ధ్రువుని వైశిష్ట్యం

- కె. నరేష్, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

వేదవ్యాస మహర్షి రచిచంచిన సంస్కృత అష్టాదశ పురాణాలు ఈనాటి వైదిక సంస్కృతి, సంప్రదాయాలకు మూలాధారమయ్యాయి. భాగవతం అష్టాదశ పురాణాలలో ఒకటిగా పేర్కొంటారు. అయితే ఇందులోని కొన్ని సన్నివేశాలు అన్ని పురాణాలను మించిన గొప్ప పురాణంగా భాగవతాన్ని ఉన్నత స్థానంలో నిలిపాయి. సంస్కృత, భాగవతాన్ని మొదటిసారిగా తెలుగులోకి అనువదించిన కవి పండితుడు బమ్మెర పోతన. భాగవతంలోని నాల్గవ స్కందంలో ధ్రువుని జీవిత విశేషాలను, అతని వ్యక్తిత్వం గురించి చెప్పబడింది.

## ధ్రువుని బాల్యం :

బ్రహ్మపుత్రులలో మొదటివాడు స్వాయంభువ మనువు. ఇతడు 'శతరూప'ను వివాహం చేసుకుంటాడు. వీరికి ఇద్దరు కుమారులు జన్మిస్తారు. వారు ప్రియ వ్రతుడు, ఉత్తానపాదుడు. ఈ కుమారులిద్దరూ పెద్దవారై రాజ్యపాలకులవుతారు. వీరిలో ఉత్తానపాదునికి సునీతి, సురుచి అనే వారితో వివాహం జరుగుతుంది. కాని ఉత్తాన పాదునికి పెద్దభార్య సునీతి కంటే చిన్నభార్య సురుచి అంటే ప్రేమాభిమానాలు ఎక్కువ. కొంతకాలానికి సునీతికి ధ్రువుడు, సురుచికి, ఉత్తముడు జన్మిస్తారు. ఒక రోజు ఉత్తానపాదుడు సురుచి కుమారుడైన ఉత్తముడిని తొడపై కూర్చోబెట్టుకొని సంతోషంగా ముద్దులాడుతుంటాడు. అదే సమయంలో ధ్రువుడు తండ్రి దగ్గరకు వచ్చి తాను కూడా తొడపై కూర్చుంటానని చెప్పగా ఉత్తానపాదుడు ధ్రువునితో కనీసం మాట్లడక పోగా కన్నెత్తి కూడా చూడడు. ఉత్తానపాదుని దగ్గరనే ఉన్న సురుచి ధ్రువున్ని చూసి అతనితో "నీకు తండ్రి తొడపై కూర్చునే అర్హత లేదని, నువ్వు నాగర్భమందు జన్మించలేదని, నా గర్భమందు జన్మించిన వారికే తండ్రి తొడ మీద కూర్చుండే అర్హత ఉందని చెప్పి" ధ్రువున్ని అవమానించి, అవహేళన చేస్తుంది. అప్పుడు ధ్రువుడు ఏడుస్తూ సునీతి దగ్గరకు వస్తాడు. ఏడుస్తూ వస్తున్న కుమారున్ని చూసి సునీతి అక్కున చేర్చుకుని తన ఒడిలో కూర్చోబెట్టుకుంటుంది. తన ఏడ్పుకి కారణం బాలున్ని అడుగుతుండగా అక్కడ ఉన్న అంతఃపుర కాంతలు బాలునికి జరిగిన అవమానాన్ని గురించి పూసగుచ్చినట్లు సునీతికి చెప్పారు. అప్పుడు సునీతి కుమారునితో "నాయనా! నీకు జరిగిన అవమానం మన దౌర్భాగ్యం, ఇది నా పూర్వజన్మ పాపఫలం. మీ నాన్న నన్ను రాణిగా గాక, కనీసం దాసిగానైన కూడా చూడడం లేదు అని కుమారునితో చెప్పి తాను బాధపడుతుంది. నీవు మీ తండ్రి మీద కూర్చోవాలంటే శ్రీమహావిష్ణువుని ఏకాగ్రతతో ధ్యానించు. ఆ శ్రీహరి అనుగ్రహంతో నీకు మేలు జరుగు తుందని చెప్పు మీ తాత స్వాయంభువు మనువు. శ్రీ మహావిష్ణువుని సేవించి తరించాడు కాబట్టి నీ పినతల్లి మీద కోపం పోవాలంటే నీకు ఉన్న మార్గం ఒక్కటే శ్రీమహా విష్ణువుని ధ్యానించడమే" అని కుమారునికి హితబోధ చేస్తుంది. తల్లి అనుగ్రహంతో ధ్రువుడు తపస్సు చేయడానికి అడవికి వెళ్ళడానికి సిద్ధమవుతాడు.

## ధ్రవుని తపస్సు :

ధ్రువుడు తన కోపాన్ని తనలోనే అణచుకొని తపస్సు చేయడానికి అడవిలో వెళ్తుండగా నారదుడు ధ్రువునికి సహాయం చేయటానికి అతని ముందు ప్రత్యక్షమై తనకు ఏమి తెలియనట్లుగా ధ్రువునితో 'ఓ బాలకా! నీవు రాజ కుమారునిలా ఉన్నావు ఈ అరణ్య మార్గంలో ఎక్కడికి వెళుతున్నావని' ప్రశ్నించాడు. అప్పుడు ధ్రువుడు మహర్షికి నమస్కరించి తనకు పినతల్లి దగ్గర అవమానం జరిగిందని, తపస్సు చేసి శ్రీమహావిష్ణువు అనుగ్రహం పొందడానికి ఈ అడవికి వచ్చానని' తెలిపాడు. ధ్రువుని మాటలు విన్న నారదుడు "నీవు పసివాడవు, ఆటలాడే వయస్సు

నీది, ఆ శ్రీమన్నారాయణుని అనుగ్రహం పొందడం అంత సులువు కాదని ఋషులు, మహర్షులు లాంటి వారే శ్రీహరి దర్శన భాగ్యాన్ని పొందలేక పోతున్నారు. నీకు అది సాధ్యం కానిపని, నీవు పసివాడవు నా మాటలు విని ఇంటికి వెళ్ళమన్నాడు. అప్పుడు ధ్రువుడు "మహాను భావా మీరు నా మీద దయ ఉంచి నాకేదైనా మంచి ఉపదేశం చేయండి. ఆ మహావిష్ణుని దర్శనం పొందడం నా జీవిత లక్ష్యం. కావున నన్ను అనుగ్రహించమని" కోరాడు. ధ్రువునిలో తపస్సు చేయాలన్న దృఢసంకల్పాన్ని గమనించిన నారదుడు బాలున్ని మెచ్చుకొన్నాడు. 'ధ్రువ కుమారా! పిన్నవయస్కుడవైన నీకు ముక్తిపై కోరిక కలగడం భగవత్సంకల్పం'. నీ పట్టుదల, ఆశయం లోకోత్తరమైనది. కావున యమునా నదీతీరాన మధువనం కలదు ఆ వనం చాలా పవిత్రమైనది అక్కడకు వెళ్ళి నీవు తపస్సు చేయమన్నాడు. జింక చర్మంను ఆసనంగా చేసుకొని, ప్రాణాయామం ఆచరించు, దానిచేత మనశ్చంచలత తొలగిపోతుంది. దివ్య మనోహరుడైన శ్రీమహావిష్ణువు అవ్యయుడు. విష్ణుదేవుని యొక్క పండ్రెండు అక్షరాల వాసుదేవ మంత్రం నీకు ఉపదేశిస్తాను శ్రద్ధగా ఆలకించు. "ఓం నమో భగవతే వాసుదేవాయా' ఈ మంత్రమును ఏడు రోజులు జపించు ఈ మంత్ర మహిమ వల్ల నీకు దేవతలను దర్శించే శక్తి కలుగుతుంది. మట్టితో కాని, రాయితో కాని, కర్రతోకాని చేసిన విగ్రహాన్ని పవిత్రమైన ఆ వనంలో పెట్టుకొని పత్ర, పుష్ప, పండ్లతో, వనమూలికలతో పూజించు. చతుర్విద పురుషార్థాలలో ఏ దానితో కోరినా నారాయణుడు అనుగ్రహిస్తాడు. అపుడు నీకు మోక్షం లభిస్తుందని" నారదుడు, మంత్రో పదేశమును, పూజావిధానాన్ని ధ్రువునికి తెలియజేశాడు. ధ్రువుడు నారదమునీంద్రునికి ప్రదక్షణ పూర్వికంగా నమస్కారం చేసి మధువనానికి బయలుదేరాడు.

నారదుడు ధ్రువుని దగ్గర నుంచి అతని తండ్రియైన ఉత్తానపాదుని వద్దకు వచ్చాడు. ఆ రాజు మహర్షిని భక్తితో ఆర్జించాడు. రాజు ముఖం నిర్వేదంతో ఉంది. అతని ముఖంలో ఆనందం లేదు, కళావిహీనంగా ఉండటాన్ని నారదుడు గమనించి తనకు తెలియనట్లుగా కారణ మేమని అడిగాడు. రాజు తన కుమారుడు అవమానం పొంది ఇల్లు విడిచిపోయిన వృత్తాంతాన్ని మహర్షికి తెలియజేశాడు. అప్పుడు మహర్షి నీ కుమారునికి ఆ శ్రీమన్నారాయణుడే రక్షణగా ఉంటాడు. నీ కుమారుడు ఉన్నత పదవిని పొందగలడు, దిక్పాలకులకు అందని పదవిని పొందుతాడు. అతని వల్ల నీ కీర్తి ప్రతిష్టలు కల్పాంతం చివరివరకు నిలిచి ఉంటాయి. కొన్ని రోజులు తర్వాత నీ కుమారుడు నీ దగ్గరకు వస్తాడని చెప్పి నారదుడు వెళ్ళిపోయాడు. ఉత్తానపాదుడు తన పుత్రుని రాకకై పశ్చాత్తాప హృదయంతో ఎదురుచూస్తూ ఉంటాడు.

మధువనంలోకి ప్రవేశించిన ధ్రువుడు యమునా నదిలో స్నానమాచరించి ఏకాగ్రతచిత్తంతో శ్రీమన్నా రాయణున్ని ధ్యానించటం మొదలు పెట్టాడు. ధ్యానంలో పూర్తిగా నిమగ్నం కావడం కోసం అన్నపానీయాలను సహితం వదులుకోవాలని తలచి మొదటి మాసమున మూడురోజులకు ఒకసారి వెలగ, రేగుపండ్లను ఆహారంగా తీసుకున్నాడు. రెండవ నెలలో ఆరు దినాలకు ఒకసారి ఆకులలుములు తింటూ తపస్సు చేశాడు. మూడవ నెలలో తొమ్మిది రోజులకు జలం మాత్రమే స్వీకరించి శ్రీమన్నారాయణున్ని సేవించసాగాడు. తర్వాత నాల్గవ నెలలో పండ్రెండు రోజులకు ఒకసారి శ్వాసపీల్చుతూ శ్రీహరిని గురించి ధ్యానించాడు. ఐదవ మాసంలో ఒంటి కాలిపై నిలబడి ప్రాణములేని మోడువలె విష్ణువును గూర్చి తపస్సు చేశాడు. ఈ విదంగా అహర్నిశలు శ్రీహరిని గూర్చి కఠోరమైన తపోదీక్షలో మునిగిపోయాడు. ధ్రువుని తపశ్శక్తికి ముల్లోకాలు కంపించాయి. ధ్రువుడు కాలిబొటన వేలు మాత్రమే భూమిపై మోపటంతో భూమి ఒక వైపుకి వాలిపోయింది. ధ్రువుడు ఉచ్ఛ్వాస నిశ్వాసలను కూడా బంధించి తీవ్రమైన తపస్సు చేస్తుండగా చివరకు శ్రీమహా విష్ణువే భయకంపితుడయ్యాడు. ఈయనతో పాటు సప్తలోకాలు గడగడలాడాయి. ఆ మహావిపత్తు నుండి

బయటపడటానికి దేవతలు విష్ణుమూర్తిని శరణు జొచ్చారు. అప్పుడు మహావిష్ణువు దేవతలతో "ఉత్తాన పాదుని కుమారుడైన ధ్రువుడు నన్ను గూర్చి కఠోరమైన తపస్సు చేస్తున్నాడు. అందువల్ల ముల్లోకాలకు ముప్పు వాటిల్లింది. నేను అతనిని తపస్సు విరమింపజేస్తాను. మీరు భయపడాల్సిన పనిలేదు. మీ నివాసాలకు వెళ్ళండి" అని శ్రీమహావిష్ణువు దేవతలతో చెప్పగా అప్పుడు దేవతలు అక్కడ నుండి వెళ్ళిపోయారు. అప్పుడు శ్రీహరి గరుడవాహనమెక్కి ధ్రువుడు తపస్సు చేస్తున్న మధువనా నికి వచ్చిరి. ధ్రువుని ముందు ప్రత్యక్షమయ్యాడు. తన ఎదుట ప్రత్యక్షమైన శ్రీమహావిష్ణువుని చూసిన ధ్రువుడు ఆనందాశ్రువులు నిండిన నయనాలతో తొట్రుపాటుతో కరుణా సాగరుడైన శ్రీహరిని తనివితీర దర్శించాడు.

**శ్రీమహావిష్ణువు బాలునికి 'ధ్రువతారగా' అభయ మిచ్చుట :**

శ్రీహరి దర్శనముచే తన్మయుడైన ధ్రువుడు ఆ దేవదేవునికి సాష్టాంగ నమస్కారం చేశాడు. స్తోత్రపఠనం చేయలేని పిన్నవయస్కుడైన ఆ బాలుని భావాన్ని గుర్తించిన భగవంతుడు తన పాంచజన్యంతో బాలుని కపోలాలను స్పృశించాడు. ఆ సర్వేశ్వరుని దయచే వేదమయములైన స్తోత్ర పాఠాలు బాలుని నోటి నుండి ధారావాహికంగా వెలువడ్డాయి. అప్పుడు శ్రీహరి ధ్రువుని భక్తి శ్రద్ధలకు ముగ్ధుడై ధ్రువునితో "బాలకుమార నీ తపోదీక్ష అచంచలమైనది. నీ అనన్యమైన భక్తితత్పరతను మెచ్చాను. నక్షత్రమండలం కన్నా అత్యున్నతమైన 'ధ్రువ తార' అనే మహోన్నత స్థానాన్ని నీకు ఇస్తున్నాను. ముల్లోకాలు నశించినా కూడా ధ్రువ మండలం నశింపక ప్రకాశిస్తూనే ఉంటుంది. ముందుగా నీవు మీ తండ్రికి వారసునిగా ప్రజానురంజకమైన రాజ్యపాలనలో పాలుపంచుకో, ధర్మం తప్పని రాజుగా కీర్తికెక్కగలవు. మీ తండ్రి అడవులకు పోయి వానప్రస్థాశ్రమం కొన సాగిస్తాడు. మీ తమ్ముడు వేటకెళ్ళి అడవిలో మరణిస్తాడు, మీ పినతల్లి అరణ్యంలో దావాగ్నిలోపడి బూడిదవుతుంది. నీవు అనేక యజ్ఞయాగాలు చేసి ఇహలోక సౌఖ్యాలను అనుభవిస్తావు" అని ధ్రువునితో చెప్పి గరుడవాహనంపై శ్రీమహావిష్ణువు వైకుంఠానికి వెళ్ళిపోయాడు.

ధ్రువుడు శ్రీమన్నారాయణుని యొక్క దర్శన భాగ్యం పొందడం అనేది జన్మరాహిత్యపరమైనది. కాని ధ్రువుడు తనకు ప్రత్యక్షమైన శ్రీమహావిష్ణువుతో ముక్తిని కోరకలేక పోతినని బాధపడ్డాడు. ఇదంతా దైవమాయ, నేను రాజ్య పాలన చెయ్యడం అనేది భగవత్సంకల్పం. దైవ నిర్ణయాన్ని తప్పించడం ఎవరికైనా అసాధ్యం అని తనలో తాను అనుకొంటూ మాధవుని స్మరిస్తూ ఇంటికి బయలుదేరాడు. కొడుకు రాక కోసం ఎదురుచూస్తున్న తండ్రికి కుమారు డొస్తున్న శుభవార్తను ఆ నగరవాసులు రాజుకు తెలియ జేశారు. కుమారున్ని చూడాలనే తపనతో అతని మనసు తహతహలాడింది. కుమారుని రాకను నగరమంతా చాటింపు వేయించాడు. రాణులు బంగారు పల్లకిలోను, రాజు రథారూడుడై, మంత్రి, పురోహితులు సమస్త పరివారముతో కుమారునికి ఎదురు వెళ్ళారు. విష్ణుమూర్తి అనుగ్రహం పొందిన పుణ్యాత్ముడైన కుమారున్ని చూసి తండ్రి తనివితీరా ఆలింగనం చేసుకున్నాడు. తర్వాత ధ్రువుడు తండ్రి పాదాలకు నమస్కరించాడు. తర్వాత తల్లికి, పినతల్లికి వినయంతో నమస్కరించాడు. తమ్ముడైన 'ఉత్తముడు'ని గాఢాలింగనం చేసుకున్నాడు. కుమారున్ని హరికృపకు పాత్రుని గావించిన సునీతి ఉత్తమ ఇల్లాలని, తల్లి కొడుకులను ఇద్దరిని నగర జన మంతా వేనోళ్ళ కీర్తించారు. సునీతిని చూసిన పుర ప్రజలందరు ఎంతో సంతోషించారు. అమ్మా నారాయణుని సేవయే నిన్ను కాపాడింది. భగవంతుని నమ్మిన భక్తులకు ఎప్పుడు మంచే జరుగుతుందని సర్వజనులు సునీతిని ప్రశంసించారు. జనులందరిచే ప్రశంసలు అందుకున్న ధ్రువున్ని ఉత్తానపాదుడు మదకరీంద్రముపై ఊరేగించు కుంటూ సపరివార సమేతుడై మంగళవాయిద్యాలతో నగరంలోకి ఆహ్వానించారు. ముత్తైదువులు ఎత్తైన మేడల మీది నుంచి పూలు చల్లుతుండగా, ప్రతి ఇంటి ముందు

పన్నీటి బిందెలతో సుగంధ పరిమళాలను వెదజల్లుతూ నగర ప్రజలందరూ పెద్ద పండుగలాగ చేసుకుంటున్నారు. దైవశక్తి మూర్తీభవించిన ధ్రువున్ని రాజకుమారునిగా పొందగలిగిన ఆ నగరప్రజల భాగ్యమే భాగ్యం.

**రాజ్యపాలకుడిగా ధ్రువుడు :**

ఉత్తానపాదుడు తన కుమారునికి పట్టాభిషేకం చెయ్యాలని తలచి పురోహితులు, మంత్రులు, సామంతులు, పురప్రజలందరి సమక్షంలో రాజ్యాభిషిక్తునిగా పట్టాభిషేకం చేశాడు. కుమారునికి పట్టం కట్టిన తర్వాత ఉత్తానపాదుడు వాన ప్రస్థాశ్రమం కోసం అడవులకు వెళ్ళిపోయాడు. మరికొంత కాలానికి ధ్రువుడు శింశుమార ప్రజాపతి కూతురైన 'భ్రమిని', వాయుపుత్రికయైన 'ఇల' అనే ఇద్దరినీ పెండ్లాడతాడు. కొంతకాలానికి వీరికి సంతానం కలిగింది. భ్రమినికి వత్సరుడు, కల్పుడు జన్మించారు. ఇలకు ఉత్కలుడు జన్మిస్తాడు. ధ్రువుని తమ్ముడైన ఉత్తముడు ఒకరోజు హిమాలయాలకు సమీపంలో ఉన్న అడవికి వేటకు వెళ్ళి అక్కడ యక్షుని చేతిలో మరణిస్తాడు. పుత్రశోకంతో ఉత్తముడి తల్లి సురుచి ఆ అడవిలోనే దావాగ్నికి ఆహుతై బూడిదవుతుంది. దురహంకారంతో కన్నుమిన్ను కానక ధర్మాన్ని మరిచిపోయి ధ్రువున్ని అవమానపరిచిన సురిచికి ఆదేవుడు చివరిదశలో తగిన శిక్షను విధించాడు. తమ్ముని మరణవార్తను విన్న ధ్రువుడు మిక్కిలి దుఃఖంతో, కోపంతో, తన తమ్ముని మరణానికి కారణమైన యక్షుల రాజధాని అలకాపురిపై దండెత్తాడు. ధ్రువుడు ప్రయోగించిన నారాయణాస్త్రానికి యక్షులందరు నేలకొరిగారు. ధ్రువున్ని శాంతింపచేయడానికి ధ్రువుని తాత స్వాయంభువ మనువు ఋషులతో కలిసి మనుమడి వద్దకు వచ్చి నాయనా నీవు చంపిన వారందరు దోషులుకారు ఒకని కోసం ఇంతమందిని వధించావు ఇది ధర్మం కాదు. విష్ణుభక్తుడవైన నువ్వు ఈ విధంగా చేయడం మంచిది కాదు. శాంతించమని శాంతింపచేశారు. అప్పుడు యక్షులకు రాజైన కుబేరుడు ధ్రువుని వద్దకు వచ్చి నమస్కరించారు. "ధ్రువా! మీ తాత గారివల్ల మాపై విరోధాన్ని వదిలేశావు. అందుకు నాకు సంతోషంగా ఉంది. జీవుల జనన మరణాలకు కాలమే కారణం. నీ తమ్ముని్ని చంపినది యక్షులు కాదు, యక్షులను చంపినది నీవు కాదు. దేహాభిమానం వల్ల నీవు నేనను భేదభావం కలుగుచున్నది. శ్రీహరి త్రిగుణాత్మకమైన మాయకు అతీతుడు. కావున ధ్రువా నీ మనస్సులో గల కోరికను కోరుకో నేను దానిని తీర్చుతానని కుబేరుడు చెప్పినాడు. "శ్రీహరి నామస్మరణం నా మనస్సులో స్థిరంగా ఉండునట్లు వరమిమ్మని" ధ్రువుడు కుబేరున్ని కోరాడు. కుబేరుడు ధ్రువునికి తన కోరిన వరాన్ని ప్రసాదించి వెళ్ళిపోయాడు. ధ్రువుడు సమర్థవంతంగా రాజ్యపాలన చేస్తూ, యజ్ఞ యాగాలను నిర్వహిస్తూ, శ్రీహరిని పూజిస్తూ ఉంటాడు.

**ధ్రువుడు విష్ణుపదం చేరుట :**

రాజ్యభోగాలు, భవబంధాలు అశాశ్వతమని విరక్తి చెందిన ధ్రువుడు తన కుమారుడైన వత్సరునికి పట్టాభిషేకం చేసి రాజ్యాన్ని విడిచి బదరికావనానికి వెళ్ళిపోయాడు. అక్కడ 'విశాల' నదిలో స్నానమాచరించి తపస్సు చేయడం మొదలు పెట్టి తీవ్ర తపోదీక్షలో మునిగిపోయాడు. అప్పుడు విష్ణులోకం నుంచి ధ్రువుని కొరకు విమానం వచ్చింది. ఆ విమానంలో తేజస్సంపన్నులైన నంద, సునంద అనే ఇద్దరు విష్ణు కింకరులున్నారు. ధ్రువుడు వారికి నమస్కరించాడు. విష్ణు కింకరులు ధ్రువునితో "రాజా! నీవు ఐదేండ్ల చిరుప్రాయంలోనే గొప్ప తపస్సు చేసి శ్రీహరిని మెప్పించావు. శ్రీహరి ఆజ్ఞానుసారం మేము నిన్ను విష్ణు పదంకు (విష్ణులోకం) తీసుకొని పోవడానికి వచ్చాం. మీ పూర్తికులకు ఎవ్వరికీ రాని పదవి నీకు వచ్చింది. కావున నీవు మాతో దయచేయండని" ధ్రువునితో చెప్పారు. ధ్రువుడు నదీస్నానం చేసి బదరికాశ్రమంలో మునులకు, నమస్కరించి, ఆ విమానానికి ప్రదక్షిణ చేసి విష్ణుదూతలతో విమానంలో ప్రవేశించి విష్ణువును ధ్యానించాడు. అప్పుడు దేవతలు ఇతనిపై

పూలవాన కురిపించారు. ధ్రువుడు విమానం ఎక్కిన తర్వాత తన తల్లి గురించి చింతించాడు. నా తల్లిని విడిచి నేనెట్లా విష్ణుపదం వెళ్ళిదనని మనసులో తలచుకొన్నాడు. ఇతని భావాన్ని గ్రహించిన విష్ణుదూతలు మీ కంటే ముందున్న విమానంలో మీ తల్లి కూర్చొని వెళుతోందని చూపించారు. ఈ విధంగా తల్లి కుమారుడు విష్ణుపదం చేరుకొన్నారు. కఠోర తపస్సు ద్వారా విష్ణుమూర్తిని దర్శింపజేసుకొన్న సాధారణ మానవుడు ధ్రువుడు. భగద్భక్తికి, పట్టుదలకు వయసుతో నిమిత్తం లేదని ధ్రువ చరిత్ర ద్వారా తెలుస్తున్నది. ధ్రువుడు విష్ణుపదానికి విమానంలో వెళ్ళాడు. తల్లిదండ్రులను ఇంటి నుండి గెంటివేస్తున్న నేటి కొడుకులకు ఒక గుణపాఠం గాను, అదే విధంగా నేటి బాలలందరికీ ఆదర్శంగా ధ్రువుడు నిలిచాడని చెప్పవచ్చు.

**ఆధార గ్రంథాలు :**


1. శ్రీమదాంధ్ర వచన భాగవతం (సంపుటం 1) - శతఘంటం వెంకట రంగ శాస్త్రి
2. భాగవత కథా సమీరము - చిలమకూరు సాలమ్మ
3. శ్రీ మద్భాగవతము - సుందర చైతన్యస్వామి
4. శ్రీ మద్భాగవత ప్రకాశము (చతుర్థ స్కంధం) - ఎక్కిరాల కృష్ణమాచార్య
5. శ్రీ మహాభాగవతము (12 స్కంధములు) - ఆంధ్ర సాహిత్య అకాడమి
6. శ్రీమదాంధ్ర మహాభాగవతము (12 స్కంధాలు) - వెంకట్రామ & కో, బెజవాడ, మద్రాస్
7. శ్రీమదాంధ్ర మహాభాగవతము (12 స్కంధాలు) - 1924 - అమెరికన్ ముద్రాక్షర శాల, చెన్నపట్నం
8. శ్రీ మదాంధ్ర మహాభాగవతము పురాణ రాజము (12 స్కంధాలు) - వ్రాతపతి - వ్రాసినవారి పేరు ప్రకటించలేదు.
9. పూర్వగాథాలహరి - వేమూరి శ్రీనివాసరావు
10. మత్స్యపురాణం - ఆవంత్స సత్యనారాయణ

# తెలంగాణ సజీవ కథలు "లొట్టపీసు పూలు"

– Md. గౌస్ పాషా, నాగర్ కర్నూల్.

"శీలం భద్రయ్య" గారు రచించిన "లొట్టపీసు పూలు "తెలంగాణ కథలు గ్రామీణ నేపథ్యంలో సాగిన కథలు. ఈ కథల్లో మనకు రజాకార్ల ఆగడాలు, దొరతనం, మానవత్వం, తెలంగాణ భాషా పటుత్వం, సామెతలు, పోరాట స్ఫూర్తి ఇవన్నీ ఒకేచోట ఈ పుస్తకంలో కనిపిస్తాయి.

సాహిత్యంలో కథా ప్రక్రియ గాఢమైన సృజనాత్మక ప్రక్రియ. ఇది అద్భుతమైన కళారూపం. కథ అందంగా, సంపూర్ణంగా రావాలంటే చాలా మానసిక కృషి అవసరం. కథా ప్రక్రియలో ఇతివృత్తాన్ని ఎంచుకోవడం చాలా ముఖ్యం. ఎంచుకున్న వస్తువును గుండెలకు హత్తుకునే విధంగా చెప్పడం అందరికి రాకపోవొచ్చు. కానీ రచయిత శీలం భద్రయ్య గారికి కథకు ఉండవలసిన అన్ని మౌలిక లక్షణాలను ఎరుకలో పెట్టుకొని, ఏ ఒక్క లక్షణాన్ని విస్మరించకుండా కథను నడిపిన పద్దతి చాలా ఆశ్చర్యానికి గురి చేసింది.ఆనందం కలిగించింది.

పుస్తకంలోని కథలను మనం పరిశీలించినట్లైతే, 'ఇసపురుగులు' ఈ కథను రచయిత ఏ ఉద్దేశంతో రాసారో కానీ పాఠకులకు మాత్రం ఈ కథ సినిమాటిక్ గా అనిపిస్తుంది. మన తెలంగాణలో గల్ఫ్ కి వెళ్ళే వారి సంఖ్య నిజామాబాద్, కరీంనగర్‌లలో ఎక్కువగా చూస్తుంటాం, కానీ నల్గొండ వాసి అయిన రచయిత, సైదులు రూపంలో గల్ఫ్ కష్టాలను, ఇస్తారి పెద్దయ్య రూపంలో మానవత్వాన్ని, నర్సమ్మ పాత్ర ద్వారా తల్లితనాన్ని,భర్త కోసం తపనపడే స్త్రీ ఆరాటాన్ని, తెగువని, పటేల్ పాత్ర ద్వారా దొరతనాన్ని, అవసరాన్ని అవకాశంగా మలచుకోవాలనే స్వార్థబుద్ధిని అద్భుతంగా చూపటం జరిగింది. ఈ కథ ముగింపు పాఠకుడు ఊహించని రీతిలో ముగుస్తుంది.

దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు వీరులు, ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు నాయకులు ఉద్భవిస్తారనేటందుకు "కేంపు చెర్వు" కథలో చెప్పారు. ఈ కథలో మనవడితో బుచ్చయ్య నెమరేసుకున్న ముచ్చట్లలో శివయ్య పాత్ర తెలియపరుస్తుంది.ఈ కథలో శివయ్య వచ్చి భూపరిహారం గురించి చెప్పే వరకు ప్రజలకు ఆ విషయమే తెలియదంటే విచిత్రమే, అదే ఈ కాలం ప్రజలైతే కోర్టులకు కూడా ఎక్కి వారి హక్కులు పొందుతారు.

'బంచెర్రాయి 'కథ చదువుతున్నప్పుడు కలేకూరి ప్రసాద్ రాసిన 'కర్మభూమిలో పూసిన ఓ పువ్వా' పాట గుర్తొస్తుంది. గారాబంగా పెంచుకున్న బిడ్డను ఒకింటికి మనువిచ్చి పంపిస్తున్నప్పుడు ఏ తండ్రి గుండెయైనా బద్దలవుతుంది. అలాంటిది రజాకార్ల అరాచకాలకు కాళ్ల పారాణి ఆరకముందే అల్లుడిని చంపి బిడ్డ బతుకును అంధకారం చేసిన రజాకార్ల పై ప్రతీకారం తీర్చుకున్న రాజారెడ్డి పాత్ర రచయిత ఉద్యమాల గడ్డ నల్గొండవాసి అవటం, కుటుంబానికి ఉద్యమ నేపథ్యం ఉండటం కూడా కలిసొచ్చింది.

మరోకథ' కర్తవ్యం', సినిమా చూస్తున్న అనుభూతినిస్తుంది. ఈ కథలో శంకరయ్య లాంటి కృతజ్ఞులు, రాముడిలాంటి విద్యార్థులు ఉన్నప్పుడు, రాఘవయ్య సార్ లాంటి గురువుల కృషి తప్పక మార్పుని తెస్తుందనే నమ్మకాన్ని ఇస్తుంది.

దురలవాట్లు తప్పులకు దారితీస్తాయి, నమ్మినవారే పక్కన ఉండి కట్టప్పలవుతారు, పెంట కుప్పల ఇస్తరాకే ఓరోజు ఉపయోగపడుతుందని మనం వినే ఉంటాం, వాటన్నింటికి ఉదాహరణలు మనకు లొట్టపీసుపూలు, పాపయ్య,మల్లయ్య పాత్రలు తెలియజేస్తాయి.

సమాజంలో తండ్రి ఆస్తులను పంచుకుని, ఆశయాలు, గుణాలను వంట పట్టించుకున్న వారసులను చాలా తక్కువ మందిని చూస్తాం.

కానీ "వెలుగుచుక్క" కథలో తండ్రి ఆశయాలు, గుణాలను వారసత్వంగా స్వీకరించిన కిరణ్ పాత్రలో చూస్తాం. మనం చాలా అరుదుగా పత్రికల్లో చదువు తుంటాం భార్య మరణాన్ని తట్టుకోలేక భర్త మృతి, భర్త మరణాన్ని తట్టుకోలేక భార్య మృతి అని ఇలాంటిదే 'తోడు 'కథ.

రామలింగం లాంటి చాలా మంది జీవిత చర మాంకంలో సంతానం స్వార్థానికి ఆస్తులు కరిగించుకుని, ఆసర కావలసిన సమయంలో అనాదరణకు గురయ్యే వారు చాలామంది ఉన్నారు. అందుకే సంతానంపై ఎంత ప్రేమున్నా వృద్ధాప్యంలో మనకు ధైర్యం కోసం కొంత చేతపట్టుకోవటమే మేలు ముఖ్యంగా ప్రైవేటు జీవులు.ఈ కథ వయసు మీద పడేవారికి ఒక హెచ్చరిక లాంటి దనొచ్చు.

శీలం భద్రయ్య గారికి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కుటుంబంలో జన్మించి ఉన్న నేపథ్యంలో ఆయన రాసిన ప్రతీ కథలో మనకు స్పష్టంగా తెలంగాణ సాయుధ పోరాట స్మృతులు కనిపిస్తాయి.

పోరాటాన్ని కథగా మలచటంలో మంచి పట్టు కూడా ఉంది. ఈ పుస్తకం లో తొలి కథ 'ఇసపురుగు' నుండే మనకు ఆ విషయం అవగతమవుతుంది. ప్రస్తుతం 'కోదండం' అనే పదం విద్యార్థులకు తెలియదు కానీ పాత తరానికి ఆ పదం చాలా భయపెట్టేది. రచయిత రజాకార్లతో ప్రత్యక్ష పోరు చేసిన లేదా చూసిన విధంగా "రజాకార్లను చూసి కోత కోయని లేత కంకులు కూడా ముడుచుకున్నయ"ని వర్ణించిన తీరు రచయిత యొక్క భాషా నైపుణ్యం కనిపిస్తుంది.

రజాకార్ల యొక్క కౄరత్వానికి ప్రకృతి కూడా భయపడుతుందని మనకు ఇట్టే తెలుపుతుంది.

ఇక 'కొత్తదొర' కథ గురించి చెప్పాలంటే ఒసేయ్ రాములమ్మ సినిమాలో రామస్వామి పాత్ర అందరికీ గుర్తే ఉంటది.

రాజకీయాలను,రాజకీయ నాయకులను నమ్మితే నట్టేట మునుగుతం. అధికారం చేతికొస్తే మనలాంటి సామాన్యుడు కూడా దొరతనంలోకి పరకాయప్రవేశం చేస్తాడు. ప్రస్తుతం ఉదాహరణకు మన కళ్ళ ముందున్న కొద్ది మందిని మనం చూస్తూనే ఉన్నాం, అలాంటిదే కొత్తదొరలో పెంటయ్య పాత్ర.

మనిషంటేనే స్వార్థ జీవి అంతా సవ్యంగా జరిగితే అదృష్టమనో, స్వయంకృషనో అంటాడు.లేకపోతే దురదృష్టమో, మూఢనమ్మకమో ముందలేసుకుంటడు.

'లత్త' కథలో లింగమ్మ కు ఎగనాకుడుందని మల్లయ్య లగ్గం రద్దు చేసుకుంటే, మూడో మనుం పోతుందని ముక్కిడ్డినోళ్లు తర్వాత లింగమ్మ సహనం, శ్రమ వీరందరి అంచనాలను తలకిందులు చేయటం కొసమెరుపు.

అన్యాయానికి గురైనవాడు ఆగ్రహదోక్తుడైతే అది విప్లవానికి దారితీస్తుంది. 'మాయబారి' కథలో ముత్తయ్య చావుదెబ్బలు తిని,కుటుంబం మొత్తాన్ని పోగొట్టుకున్నాక కాస్త కుదుటపడి రజాకార్లపై సమరం పూరించి తల్లి సాయమ్మకు ఇచ్చిన 'మాయబారి' న్యాయమైనదే.

ఇక గుండెను పిండేసిన కథ "అగ్గువ బతుకులు" ప్రపంచంలో అత్యంత విషాదం నింపిన సంఘటనల్లో నాకు తెలిసి, కరోనా ముందు వరుసలో ఉంటుంది. ఇద్దరు అనాథలు ( రాములు, రాములమ్మ) కలిసి మరో అనాథను నాన్నమ్మ లింగమ్మ భుజస్కంధాలపై వేసి ప్రమాదంలో ప్రాణాలిడవటం ప్రతి ఒక్కరిని కదిలిస్తుంది. రాములుతో పాటూ పాఠకుడు కూడా నాన్నమ్మ కళ్లల్లో ఆనందం చూడాలనుకుంటాడు, కానీ కళ్ల చూపే లేని లింగమ్మ కళ్లల్లో కన్నీరు కూడా లేకుంటది ఏడ్వటానికి.

ఈ కథ కల్పితమైనదైతే రచయిత గుండెను రాయి చేసుకుని రాసాడా అనిపిస్తుంది. ఒకవేళ నిజమైనదైతే ఆ దేవుడికి కనికరం కరువైందనిపిస్తుంది.

నిజమే రెండు కళ్లతో చూసే అలవాటున్న మనిషి, రెండు కోణాల్లో ఆలోచించే శక్తి కూడా కలిగి ఉంటే

విచక్షణను కోల్పోకుండా ఉండొచ్చని 'ఖూనీ' కథ చెబుతుంది.

ఆడదానికి ఆడదే శత్రువన్నారు.ప్రేమించిన కొడుకు మనసెరగకుండా, అంతస్తుకు తగ్గ కోడలిని తెచ్చు కోవాలనుకున్న అనసూయమ్మ, ఉన్న కొడుకును పోగొట్ట కోవటమే కాకుండా జైలుపాలు కావడం కూర్చున్న చెట్టును నరుక్కున్నట్లయ్యింది.

ఈ పుస్తకంలో ప్రతి కథ ముగింపు అద్భుతంగా ముగిసింది.రచయిత శీలం భద్రయ్య గారు పాఠకులకు పావురంతో (ప్రేమతో), ఆజం, అంగుకు, ఈతాపకి (ఈసారికి), కత్ర, లాంటి కొత్త కొత్త పదాలను పరిచయం చేసారు. నిజంగా రచయిత భాషా ప్రయోగానికి నేను ముగ్దుడనయ్యాను.

ఖూనీ కథలో బస్సు నిండా ప్రయాణికులున్నారనే వాక్య ప్రయోగానికి 'బస్సును నిండు గర్భిణితో'' పోల్చటంతో కాసేపు ఆ వాక్యం దగ్గరే ఆగి భద్రయ్య గారిని మెచ్చుకోకుండా ముందుకు వెళ్లలేకపోయాను.

ఇది భద్రయ్య గారి తొలి కథా పుస్తకం. గతం, వర్తమాన రెండు కలగల్సిన వస్తువుతో కథనాన్ని అల్లడం రచయిత పట్టును తెలుపుతుంది ఈ కథల్లో వస్తు వైవిధ్యం ఉంది. మూస పద్దతి లేదు. చదివించే గుణం కథలకు ఉంది. తెలంగాణ మాండలికంలో కథ చెప్పడం వల్ల తెలంగాణ భాష సుసంపన్నమవుతున్నది. తెలంగాణ జీవ భాష సజీవతను నిలుపుకుంటుంది. దీనివల్ల తెలం గాణ కథా సాహిత్యం మరింత సంపద్వంతం అవుతుంది. ఈ పుస్తకం రచయితకు మంచి పేరు తేవాలని, అంతేకాకుండా మంచి చర్చ జరగాలని ఆశిస్తూ, అభినందిస్తూ ఒక చిన్న సూచన కూడా చేయదలుచు కున్నా. గ్రామీణ నేపథ్యంలో రాసినప్పుడు పేర్లు దొరకడం కష్టమైనప్పటికీ ఒక కథలో వచ్చిన పాత్రల పేర్లు మరో కథలో రాకుండా చూసుకుంటే మంచిది. అవే పేర్లు మళ్ళీ మళ్ళీ రావడం వలన పాఠకుడి ఏకాగ్రత దెబ్బతినే అవకాశం ఉంది. ఇదొక్క విషయం తప్పితే ఇక ఏ విషయంలోనూ రచయితను కథల పరంగా వేలెత్తి చూపలేం.

కథను సినిమా కోణంలో ఆలోచించి, సినిమా కోణంలో ముగింపునివ్వగలగే నేర్పు ఉన్నందున భవిష్యత్తులో భద్రయ్య గారిని సినీ రచయితగా కూడా చూసే రోజు రావాలని, ఈ కథలను సినిమాలుగా తీస్తే ఇంకా బాగుంటుందని తెలియజేస్తూ.. రచయిత శీలం భద్రయ్య గారికి శుభాకాంక్షలు. నాకు ఈ పుస్తకాన్ని అందించి నా చేత నాలుగు మాటలు రాయమని ప్రోత్స హించిన గుడిపల్లి నిరంజన్ గారికి ధన్యవాదాలు.

BHAVAVEENA
Vol. 18, Issue. 9, September 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253  UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# ఇందూరు సాహితీవనంలో 'సూరారం' గజల్‌ల జల్లు

- **మున్నం శశి కుమార్,** పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వ విద్యాలయం, హైదరాబాద్.

సాహితీ రచన చెయ్యాలని పూనుకున్న వారికి అనేక ప్రక్రియలు ఆహ్వానం పలుకుతాయి . వీటిలో అత్యంత క్లిష్టమైన ప్రక్రియగా గజల్‌ను చెప్పవచ్చు. ఇట్టి క్లిష్టమైన గజల్ ప్రక్రియ చేపట్టి ఇందూరు సాహితీ వనానికి మరింత వన్నె తెచ్చిన కవిగా సూరారం శంకర్ గారిని పేర్కొనవచ్చు.

సూరారం వారి గజల్లను పరిశీలించే ముందు మనం దరికీ గజల్ లను గురించిన పరిచయం కొంత అవసరం. ఫారసి, ఉర్దూ భాషల నుండి మన తెలుగునాట గజల్ ప్రవేశించిందని చెప్పవచ్చు. దానికి మూలం తుర్కీ భాషలో ఉంది ఉంది. టర్కీ భాషలో 'గజాల' అనే పదానికి అర్థం 'జింక ' లేదా 'జింక కన్నులు గల' అనే అర్థం కలదు.

"స్త్రీల సంభాషణ" అని కూడా చెప్పబడే గజల్ నాటి పర్షియా లేదా ఇరాన్లో 10వ శతాబ్దిలో ఆవిర్భవించి మహమ్మదీయుల తో పాటు భారత్ లోకి ప్రవేశించింది అని చరిత్ర చెబుతోంది. మహమ్మద్ ఇక్బాల్, మిర్జా గాలిబ్ వంటి కవులు ఉర్దూ మరియు పారశీ భాషలలో గజల్ రచన చేపట్టారు తెలుగులో దాశరథి, సి.నా.రె, రెంటాల గజల్ల రచనలలో పేరు పొందిన వారు.

గజల్‌లలో ఉండే చరణాలను 'షేర్' లేదా 'పాదాలు' అని అంటారు. ఒక గజల్ లో షేర్లు 5/ 7/ 11 గా ఉం డవచ్చు. షేర్‌లోని తొలి పంక్తి ని 'మిస్రా 'అని అంటారు. ఈ రెండవ పంక్తి నీ 'మిస్రసానీ'అని అంటారు. ప్రతి షేర్ లోని మొదటి పాదానికి/ చరణానికి 'మత్లా' అని పేరు. చివరి చరణానికి 'మఖ్తా' అని పేరు. ఇక చివరి పాదంలో కనిపించే కవి కలం పేరు 'తఖల్లుస్'.

ఇక ప్రతి 'మిస్రసాని(చరణం లోని రెండవ పంక్తి)'లో కనిపించేలో కనిపించే పాదాంత పదమే 'రదీఫ్ '. రదీఫ్‌కు ముందున్న ఒకటి లేదా రెండు పదాల సమూహమే 'కాఫియా'. గజల్ సౌందర్యాన్ని ఇనుమడింపజేసేది ఈ 'కాఫియాలే'.

భావము, భాషల పట్ల కవికి లోతైన అవగాహన ఉన్నప్పుడే ఒక కవి గజల్ ఆవిష్కర్తగా మారతాడు. చక్కటి అంత్యప్రాస అలంకరణలతో గజల్ కు జీవం పోస్తాడు. గజల్ భావ కవితా ప్రక్రియ కు చెందిన రసరంజక అను భూతులను సహృదయులకు పంచుతుంది. 'అనంతమైన ప్రేమ కథ' అని కూడా చెప్పబడే గజల్ భగవంతుడిపై చెప్పబడితే అదే 'తసవ్వుఫ్'. అంటే 'సూఫీ వేదాంతం' అని అర్థం. ఒకరకంగా ఇదే గజల్ కు మూలం.

వృత్తి పరంగా ఉపాధ్యాయుడు మరియు స్వయంగా చిత్రకారుడు కూడా కూడా అయిన సూరారం శంకర్ గారు చక్కటి భావుకత కలిగిన కవి .అందువల్లే చక్కటి గజల్ లను సృష్టించడం వారికి సాధ్యం అయింది. ఉర్దూ మరియు హిందీ భాషల్లో గజల్ల సృష్టి ఆ భాషకున్న సౌలభ్యం అని చెప్పవచ్చు.కానీ ఉర్దూ, హిందీ బాషల్లో ని గజల్ ల లక్షణాలన్నీ పుణికి పుచ్చుకొని అదే విధంగా గజల్ లను సృష్టించడం లేదా రాయడం తెలుగులో కష్టమైన ప్రక్రియ. ఇది కొంతమందికే చెల్లింది. ఆ కోవకే చెందుతారు మన ఇందూర్ కు చెందిన భావుకుడు సూరారం శంకర్.

విరహం మరియు వియోగాన్ని అధికంగా చూపించే కవితా శిల్పం గజల్. ప్రేమ, ఆవేదన, ఆరాధన స్మృతి అనేవి గజల్ యొక్క ముఖ్య లక్షణాలుగా వుంటాయి. శంకర్ గారు రాసిన "సౌగంధిక " అనే గజల్ సంపుటి నుండి గ్రహించిన కొన్ని గజల్ షేర్లను ఇప్పుడు మనం పరిశీలిద్దాం. ఇందులోని ఒక 'మత్లా (మొదట చరణం)' ను మనం ఇప్పుడు పరిశీలిస్తే..." మనసు దోచిన స్నేహమే నా మనసుకు కోస్తూ ఉన్నది/ కలలు పంచిన హృదయమే

నను కలత పెడుతూ ఉన్నది".. అనే షేర్ లో కవి యొక్క విరహం, వియోగాన్ని మనం గమనించవచ్చు. తన మనస్సు యొక్క గాయాన్ని కవిత్వీకరించారు కవి. ఇందులో చక్కటి భావం, భాష గోచరమవుతాయి.

మనసు మారిన తన ప్రేయసి నుండి ఊరట పొందేందుకై రాసుకున్న మరో గజల్ లోని షేర్ ను పరిశీలిస్తే...."ఒకరి కోసం ఒకరు బ్రతకని శ్వాస ఎందుకు దండగ/ మాట ఏదో మౌనమేదో మనసు మారాక" అని రాసుకుంటాడు బాధతో.! సహజంగానే ప్రేయసి, ప్రియుల శ్వాస ఒకటిగా ఉంటుంది అనేది కవి భావన. అంటే ఇక్కడ ప్రేయసి ప్రియుల వియోగాన్ని పరోక్షంగా ప్రకటిస్తాడు. సహజంగానే లవియోగం లో మౌనం రాజ్యమేలుతుంది. ఇలా మిస్రా లోనూ, మిస్రాసాని లోనూ విడదీయరాని భావ అనుబంధాన్ని కవి ప్రదర్శిం చాడు.

తనలో అలుముకున్న నైరాశ్యాన్ని చక్కగా వ్యక్తపరి చారు కవి మరొక షేర్ లో...ఇలా..."చంద్ర నిప్పుల మాట ఎందుకు చంద్రుడే సెగ కురిసెను/ చెలిమిలో ఏ సొగసు లేదు నాకు నేనే హేతువు". చల్లని చంద్రుడు సెగలు కురియడం అనేది తీవ్రమైన స్పందన. వాస్తవ విరుద్ధం. కానీ ఇక్కడ బాధకు, కష్టానికి చివరకు చల్లని చంద్రుడు కూడా కారణమని ఆరోపించడం వెనక కవి బాధ లోతు లను ఊహించవచ్చు. విసిగి వేసారిన కవి తన దురదృష్టానికి కారణంగా తననే నిందించుకోవడంతో మిస్రాసానిని అద్భుతంగా ముగిస్తాడు కవి.

విరహాన్ని, వియోగాన్ని ప్రకటించే మరో షేర్ ను గమనిస్తే కవి ఎంతటి సున్నిత హృదయుడో మనకు అర్థమవుతుంది. "ఇస్తేనే ఆశించే హక్కు ఎవరికైనా/ హక్కు సమసే ఆవేదన మిగిలే ఉంది." తాను అన్ని అర్పించినప్పటికీ అని తనకు మాత్రం మిగిలింది శూన్యం అని, ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. అంతే కాకుండా సమాజానికి, తొలుత ఇచ్చిన వారికే ఆశించే హక్కు ఉం టుంది అని తన ప్రబోధాత్మక వాక్యం ద్వారా అంతర్లీనంగా చెబుతాడు.. కవి. ఇలా కవి తన బాధాతప్త హృదయంతో నూ తన సామాజిక బాధ్యతను నెరవేర్చినట్లు గా కనబడుతోంది.

ఇక కవి తన కలం పేరు లేదా కవి పేరు కనిపించేలా రాయబడిన పదం "తఖల్లుస్"ను కలిగిన చివరి చరణం అయిన ఒక 'మఖ్తా' ను మనం పరిశీలిస్తే కవి యొక్క అనుభూతులు, అనుభవాల స్మరణా చిత్రీకరణ ద్వారా యొక్క భాష మరియు భావవ్యక్తీకరణ పటిమలు మనకు స్పష్టంగా అవగతమవుతాయి. క్రింది విధంగా రాయబడిన 'మఖ్తా' ను ఒకసారి పరిశీలిస్తే.... "ఏల శంకర్ నీకు వేదన? బ్రతుకు వేడుక చూడవా??? జారవిడిచితే జారిపోయే జ్వలనమా నీ జ్ఞాపకం". కొన్ని రాసుకోవడం వెనుక చెప్ప బడని అంతులేని వేదనా స్మృతి ఉంది. వేదన పడుతున్న జీవితం వేగంగా కరిగిపోతుంది. చూడవలసిన సంతోషా లన్ని కోల్పోతుంది. జ్ఞాపకాలు బలమైనవి అయినప్పుడు మరియు వేదనా భరితం అయినప్పుడు అయినప్పుడు, వేదనా భారం అధికమైతే కవికి మిగిలేది విరహమే!! చక్కటి ప్రాస, అక్షర రమ్యత తో పదబంధాలను పూర్తి చేసి తన విరహ బాధను గజల్ లోని చివరి చరణం అయిన మఖ్తా లో ముగిస్తాడు కవి హృద్యంగా..!

ఇలా విరహం, వియోగం, బాధ, స్మృతి లాంటి అనుభూతులను వ్యక్తపరచడానికి గజల్ ను మించిన ప్రక్రియ లేదని చెప్పవచ్చు. భావ కవితా ధోరణి ని మించిన ధోరణి లేదని చెప్పవచ్చు.

అయితే 'ఇందూరు' (నిజామాబాద్) జిల్లాకు చెందిన సూరారం శంకర్ గారు ఈ క్లిష్టమైన సాహితీ ప్రక్రియ గజల్ ను చేపట్టటమే కాకుండా తనదైన గజల్ రచనలతో ముందు వరుసలో ఉన్నారు అని చెప్పవచ్చు. అతి కొద్దిమంది చేపట్టిన రచనా ప్రక్రియ ద్వారా తన భాషా, భావవ్యక్తీకరణ, చక్కటి కాఫియాలతో అద్భుతమైన గజల్ లను సృష్టించి నిజామాబాద్ జిల్లా గజల్ కవితా ప్రక్రియకు సారథిగా నిలుస్తున్నారని నిస్సందేహంగా చెప్పవచ్చు.

BHAVAVEENA
Vol. 18, Issue. 9, September 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# ఆచార్య కొలకలూరి ఇనాక్ 'పైమెట్టు' నవల – దళిత స్త్రీ అస్తిత్వ పోరాటం

- సురేఖ దుగులూరు
పరిశోధక విద్యార్థిని, తెలుగు అధ్యయన శాఖ,
శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం, తిరుపతి,

- డా।। వై. సుభాషిణి
అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు అధ్యయన శాఖ,
శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం, తిరుపతి,

ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు ఇటీవల రాసిన మూడు నవలల్లో ఒకటి పై మెట్టు కరోనా లాక్‌డౌన్ సమయంలో ప్రాణభీతితో ఉన్న ఊరును, కన్నతల్లిని వెతుక్కుంటూ వివిధ దేశాల నుండి పల్లెతల్లి ఒడికి చేరుకుని అయిన వాళ్ళతో గడుపుతూ పోగొట్టుకున్న మానవ సంబంధాలు తిరిగి మొలకలెత్తుతుండగా, లోకం అంతా కరోనా ఇచ్చిన విరామ సమయాన్ని గడుపుతుంటే శతాధిక గ్రంథకర్త అయిన ఇనాక్ గారు తనకు జన్మనిచ్చి, తన ఉన్నతికి తోడ్పడిన పల్లె జ్ఞాపకాలతో నిత్యం సహజీవనం చేస్తూ, డెబ్భై, ఎనభై ఏళ్ళనాటి వేజండ్ల మాదిగ పల్లెలోని గతస్మృతుల్ని నెమరు వేసుకుంటూ ఉండగా పుట్టింది పైమెట్టు నవల. ఈ నవలలో రచయిత వేజండ్ల పల్లెలో తాను విన్నవి, కన్నవి పాఠకులకు వినిపించే ప్రయత్నం చేసి పైమెట్టు నవలకు శ్రీకారం చుట్టాడు. ఈ నవలలో దళితస్త్రీని పైమెట్టు ఎక్కించాడు. స్త్రీ తలచుకుంటే వేల సంవత్సరాల నాటి కట్టుబాట్లను చేధించి తన అస్తిత్వాన్ని నిలుపుకోగలదని నిరూపించాడు. దీనికి కారణం దళిత స్త్రీ పట్ల తనకున్న విశ్వాసం నమ్మకం.

**ఇతివృత్తం :**

బుజ్జిబాబు, మల్లిల ఏకైక సంతానం దొరబాబు. వేటపాళెంకి చెందిన మేనత్త నల్లమ్మ కూతురైన బుజ్జితో దొరబాబుకు వివాహం నిర్ణయించారు పెద్దలు. నల్లమ్మ బుజ్జిబాబు (బుజ్జులు)కు ఒక్కగానొక్క చెల్లెలు. నల్లమ్మ పెళ్ళి చేసుకొని వేటపాళెం కాపురానికి వెళ్తూ "నాకు కొడుకు పుడితే నీకూతుర్నిచ్చి పెళ్ళి చేయాలి. దాన్ని కూతురులాగే చూసుకొంటాను. పోనీ నాకు కూతురు పుడితే నీ కొడుక్కి చేసుకొని నన్ను ముద్దు చేసినట్లు దాన్నీ మురిపెంగా చూసుకోవాలి"(పుట14,పైమెట్టు) అంది. బుజ్జులుకు చెల్లెలంటే అమితమైన ఇష్టం పైగా అప్పగింతలనాడు చెల్లి కోరిన కోర్కెను కాదనలేక మాట ఇచ్చాడు బుజ్జులు. ఈ మాటకు కట్టుబడి దొరబాబుకు బుజ్జితో పెళ్ళి నిశ్చయించడం జరిగింది.

దొరబాబు తల్లి మల్లికి ఏకైక తమ్ముడు చిట్టోడు. చిన్నతనం నుండి అక్కాతమ్ములు చెట్టపట్టాలేసుకొని తిరుగుతూ ఉండేవాళ్ళు. ఒకర్ని విడిచి ఒకరు ఉండ లేనంత బంధం అక్కాతమ్ముళ్ళది. చిట్టోడు దారి తప్పు తున్నాడని గ్రహించి, తల్లిదండ్రులకు చెప్పి పెళ్ళి జరి పించింది మల్లి. చిట్టోడి దంపతులకు ఒక కొడుకు పుట్టాడు. అయినప్పటికీ చిట్టోడు సిందుబోగం పిల్ల అయిన రవ్వను ఇష్టపడి పెళ్ళి చేసుకుంటానంటే మాదిగ పెద్దలు ఒప్పుకోలేదు. కావాలంటే కన్నెరికం పెట్టు కోమన్నారు. దానికి కారణం ఏళ్ళనాటి కట్టుబాట్లు వలన సిందుబోగం ఆడపిల్లలు పెళ్ళికి అర్హులు కారు. కేవలం కన్నెరికానికే అర్హులు. కన్నెరికం పెడితే మాదిగలే పెట్టాలి. ఇతరులు పెట్టకూడదు. కన్నెరికం కారణంగా కలిగిన సంతానానికి కన్నెరికం పెట్టిన మాదిగ మగమనిషి ఆస్తుల్లో వాటా కానీ, వారసత్వం కానీ, ఇంటిపేరు కానీరాదు. తల్లి ఇంటి పేరే ఉంటుంది కాబట్టి తల్లిలాగే పెళ్ళికి అనర్హులు. కన్నెరికానికి (ఉంచుకోవడానికి) అర్హులు.

పెద్దల మాటకు కట్టుబడి రవ్వకు కన్నెరికం పెట్టాడు చిట్టోడు. రవ్వకు, చిట్టోడితో ఒక కూతురు. ఒక కొడుకు పుట్టారు. కూతురు పేరు మువ్వ. మువ్వ "గలగలా మాట్లాడుతుంది. కిలకిలా నవ్వుతుంది. తల్లిని మించిన అందగత్తె ముద్దుగా బొద్దుగా ఉంది. తెలివి తేట

లున్నాయి. బాగా చదువుకొంటూ ఉంది''.(పుట22 పైమెట్టు) అంటారు రచయిత. రవ్వ మాదిగ పెద్దల్ని, చిట్టోడ్ని ఒప్పిచి, చిట్టోడి ఇంటిపేరు సంపాదించి తన బిడ్డల్ని చిట్టోడి ఇంటిపేరుతోనే బళ్ళో చేర్పించింది. కన్నెరికానికే యోగ్యమైన తన కూతర్ని పెళ్ళికి అర్హురాల్ని చేయాలన్నదే రవ్వ తలంపు.

తన కూతరు మువ్వను మల్లికి కోడల్ని చేయాలని భావించింది. తన కూతుర్ని కోడలిగా చేసుకోమని బుజ్జుల్ని అడిగింది. నల్లమ్మకు ఇచ్చిన మాటను కాదనలేక, కావాలంటే వేరే సంబంధం చూసి పెళ్ళి చేద్దామన్నాడు బుజ్జులు. బుజ్జితోనే దొరబాబు పెళ్ళి జరుగుతుందని తేల్చి చెప్పాడు. వేటపాలెం నుండి పెళ్ళి కూతురై వచ్చిన బుజ్జిని, దొరబాబును పెళ్ళి పీటలు ఎక్కించారు. ఇక పెళ్ళి తంతు జరుగుతుందని అందరూ అనుకుంటుండగా మువ్వ పెళ్ళి చీరతో, వడిబియ్యంతో పెళ్ళి కూతురై వచ్చి దొరబాబుతో తన పెళ్ళి జరిపించమంది. కాదంటే చస్తానంది. వేజండ్ల, వేటపాలెం పెద్దలు అయ్యావారు మల్లగుల్లాలు పడి చివరికి ఒకే లగ్నంలో దొరబాబుతో బుజ్జి, మువ్వల పెళ్ళి అందరి అంగీకారంతో జరిపించారు. వివాహానంతరం వధూవరులు ముగ్గురు అన్యోన్యంగా ఉండడం ఈ నవలలో ఇతివృత్తం.

**దళిత స్త్రీ అస్తిత్వ పోరాటం :**

అస్తిత్వం అంటే మనుగడ. ఒక వ్యక్తి తన మనుగడను నిలుపుకోవడానికి చేసే పోరాటమే అస్తిత్వ పోరాటం. అస్తిత్వవాదం (Existentialism) అనేది మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత మొట్టమొదటి సారిగా జర్మనీలో ప్రారంభమై రెండో ప్రపంచయుద్ధం తర్వాత నాస్తిక వాద ఛాయలతో ఫ్రాన్స్, ఇటలీ దేశాలకు వ్యాపించినట్లు తెలుస్తుంది. అస్తిత్వ వాదానికి మూలపురుషుడు కీర్క్‌గార్డ్ (Kierke gaurd 1813-1855) అనే డేనిష్ తత్త్వవేత. ఇతడు రాసిన "either or" అనే గ్రంథం అస్తిత్వవాదానికి మూలాధారం. వ్యక్తి స్వాతంత్ర్యమే అస్తిత్వవాద ప్రధాన లక్షణం.

వ్యక్తి మనుగడలో మానవాతీత శక్తుల ప్రమేయం లేదనీ, అతడికి స్వీయ నిర్ణయ స్వేచ్ఛ ఉన్నదనీ, ఎవరికి వారు తమ జీవన శైలిని, మూర్తిమత్వాన్ని (Personality) నిర్మించుకొనడమే గాని, అది తలరాతను బట్టి జరిగేది కాదని, ఎవరు చేసే పనులకు వారే బాధ్యులని చెప్పేదే అస్తిత్వవాదం.

"Existentialism is a philosophical approach that rejects the idea that the Universe offers any clves about how humanity should live"- Encyclopedia"

తెలుగు సాహిత్యంలో వ్యాసాల ద్వారా అస్తిత్వాన్ని పరిచయం చేసింది ఆర్.ఎస్.సుదర్శనం గారు. ప్రఖ్యాత నవలా రచయిత వడ్డెర చండీదాస్ అస్తిత్వవాదంపై పరిశోధన చేశాడు. వీరి హిమజ్వాల అస్తిత్వానికి ప్రతీక. బుచ్చిబాబు చివరికి మిగలేది, గోపిచంద్ మెరుపుల మరకలు నవలల్లోనూ అస్తిత్వఛాయలు కన్పిస్తాయి. దిగంబర కవి నిఖిలేశ్వర్ అస్తిత్వాన్ని గూర్చి చెబుతూ "మనిషి చైతన్యాన్ని వ్యక్తిగతమైన అస్తిత్వమే నిర్ణయిస్తుందంటాడు. కాబట్టి సర్వ స్వతంత్రుడైన వ్యక్తి చైతన్యాన్ని నిర్ణయించేది అస్తిత్వమే. సమజం ఎన్ని కట్టుబాట్లతో వ్యక్తిని బంధించినా తన అస్తిత్వాన్ని నిలుపుకోవడానికే మనిషి ప్రయత్నిస్తాడు. ఆచార్య కొలకలూరి ఇనాక్ నవల 'పైమెట్టు'లో కూడా దళిత స్త్రీ అస్తిత్వ పోరాటం స్పష్టమవుతుంది.

ఈ నవలలో తన అస్థిత్వాన్ని నిలుపుకోవడానికి పోరాటం చేసిన దళిత స్త్రీ రవ్వ. చిట్టోడు కన్నెరికం పెట్టినప్పుడు రవ్వ ఒక పట్టానా లొంగలేదు. పైగా "నేను కనే నా పిల్లలకు నా ఇంటిపేరు వదులుకొంటా, నీ ఇంటి పేరు పెట్టుకొంటా'' (పుట 22) అంటుంది. రవ్వ తన సంతానానికి ఆస్తుల్లో వాటా అడగలేదు. ఎంతో దూర దృష్టితో ఇంటి పేరు అడిగింది.

రవ్వ చిట్టోడ్ని, మాదిగ పల్లె పెద్దల్ని ఒప్పించి ఏళ్ళ నాటి ఒప్పందాన్ని కట్టుబాటుని అతిక్రమించి, చిట్టోడి

ఇంటి పేరు సంపాదించి, ఆ ఇంటిపేరుతోనే కొడుకుని, కూతుర్ని బళ్ళో చేర్పించింది. చిట్టోడి ఇంటి పేరు సంపాదించడంతో తన అస్థిత్వ నిరూపణలో మొదటిమెట్టు ఎక్కిందని చెప్పవచ్చు.

ఇప్పుడు రవ్వ కూతురు మువ్వ సిందుబోగం పిల్ల కాదు. చిట్టోడి కూతురు మాదిగ పిల్ల. ఇంక పెళ్ళికి అర్హురాలు తనలాగా కన్నెరికం ఆడదిగా తన బిడ్డ బ్రతకాల్సిన అవసరం లేదు. ఇది రవ్వ ముందుచూపుతో సాధించిన తొలి విజయం. తన విజయానికి తోడ్పాటును అందించారు మాదిగ పెద్దలు.

రవ్వ చిట్టోడి అక్క మల్లి గుండెల్లో స్థానాన్ని సంపాదించుకుంది. తన కూతరు మువ్వను దొరబాడు పెళ్ళాన్ని చేయాలన్నది రవ్వ సంకల్పం. అందుకు మొదటి నుంచి ప్రణాళిక ప్రకారం ప్రయత్నం చేసింది. మువ్వను బడికి పంపింది. అల్లారు ముద్దుగా పల్లెంతా తిరుగుతున్న దొరబాబును బడికి వెళ్ళేలా చేసింది. దొరబాబు, మువ్వల మధ్య సాన్నిహిత్యం పెరిగేందుకు పరోక్షంగా ప్రయత్నం చేసింది. పల్లెంతా దొరబాబు, మువ్వలను మొగుడు పెళ్ళాం అనుకొనేలా, అలాగే పిలిచేలా చేసింది. ఇది రవ్వ ఎక్కిన మరోమెట్టు.

మువ్వని దొరబాబుకు చేసుకోమని బుజ్జుల్ని అడిగింది. చెల్లెకిచ్చిన మాట తప్పనన్నాడు. కావాలంటే అందరం కలిసి వేరేపెళ్ళి చేద్దాం అన్నాడు. దొరబాబు, బుజ్జీల పెళ్ళి పెద్దలు కుదిర్చారు కాబట్టి ఆగే ప్రసక్తే లేదన్నాడు బుజ్జులు. చిట్టోడి దగ్గర పెళ్ళి చీర తెప్పించింది. తాను వడిబియ్యం కట్టింది. మువ్వను పెళ్ళికూతుర్ని చేసి దొరబాబు బుజ్జుల పెళ్ళి పందిట్లోకి పంపింది.

అందరూ ఆశ్చర్యపోయారు. దొరబాబు, బుజ్జీల పెళ్ళి రెండు గ్రామాల పెద్దల నిర్ణయించారన్నారు. మువ్వతో పెళ్ళి కుదరదన్నారు. కావాలంటే బుజ్జితో పెళ్ళి మువ్వతో కన్నెరికం అన్నారు. "రవ్వ నిప్పులు గుండలంలా సెగలు కక్కింది. చిట్టోడు పట్టి ఆపినా ఆగకుండా తిక్కబట్టినట్లు అరుస్తూ ఉంది. కన్నెరికం పెట్టడానికి అది సిందుబోగం పిల్లకాదు. మాదిగపిల్ల రొప్పుతూ ఉంది రవ్వ.

కన్నెరికం మాట ఎత్తితే. ఇక్కడే నాగొంతు కోసుకుంటాను. మువ్వను ఉరివేసి చంపుతాను. చేస్తారా దాని పెళ్ళి చేయండి, చెయ్యలేరా మానండి కన్నెరికం అన్నారా, ఈ పెళ్ళి పందిరి తగలబెడతాను రెచ్చిపోయింది రవ్వ"(పై మెట్టు 70)

పల్లెపెద్దలు తర్జనభర్జన పడి దొరబాబు పెళ్ళి ముందుగా బుజ్జితో జరిపి, ఇంకో లగ్నానికి మువ్వతో జరుపుదాం అంటారు. చిట్టోడికి సైగచేసి, చేస్తే ఈ రోజే చెయ్యాలని పట్టుబట్టింది రవ్వ. మల్లిని, బుజ్జుల్ని, నల్లమ్మను, ఆమె పెనిమిటిని, రవ్వను, చిట్టోడ్ని ఒప్పించి, దొరబాబు, బుజ్జి, మువ్వల అంగీకారంతో ఒకే లగ్నంలో ఒకే పెళ్ళి కొడుకుతో ఇద్దరు పెళ్ళి కూతుర్లని ఇచ్చి వివాహం జరిపించడానికి అంగీకరించారు పల్లెపెద్దలు. పెళ్ళి పందిట్లో మువ్వను బుజ్జికి ఎడంపక్క కూర్చొబెడుతుండగా కూడా మువ్వ దొరబాబుకు ఎడమ పక్కే కూర్చోవాలని, బుజ్జికి ఎడం పక్క కూర్చోవడానికి వీలు లేదంది రవ్వ. చివరకు పెద్దలు దొరబాబుకి ఎదురుగా ఇద్దరు వధువులనూ కూర్చొబెట్టి పెళ్ళి జరిపించారు. ఇది రవ్వ విజయం.

**మువ్వ :**

తల్లికి తగ్గ కూతరు పెళ్ళి బట్టల్తో, వడిబియ్యంతో పెళ్ళి పందిట్లోకి ఎందుకొచ్చావు ? ఎవరు పంపారని అయ్య వారు అడిగితే "నాన్నే పెళ్ళి చీర తెచ్చాడు. అమ్మ వడిబియ్యం కట్టింది'' (పుట 60) అని ధైర్యంగా చెపుతుంది. తాను పెళ్ళికూతురుగా రావడం అత్త అయిన మల్లికి తెలుసంటుంది. దొరబాబు నిన్ను పెళ్ళి చేసుకుంటానన్నాడా? అని అయ్యవారు అడిగితే "పెళ్ళి చేసుకుందామని మేమిద్దరం మాటల్లో అనుకోలేదు. కానీ చూపుల్లో చేతల్లో అనుకున్నాం. మల్లి అత్త, బుజ్జులు మామ 'నా కోడలు, నా కోడలు' అనే వాళ్ళు. నేను

అత్తమామలకు కోడల్ని, చిన్నప్పటి నుండి కోడల్ని. కాబట్టి ఈ ఇంట కోడల్ని. దొరబాబు ఒక్కడే కొడుకు. ఇతడికి ఆలిని అయితేనే ఈ ఇంట ఇల్లాలిని. అత్తమామల కోడల్ని దొరబాబు పెళ్ళాన్ని'' (పుట 61) అని తెగేసి చెబుతుంది. ఈ తెగువ మువ్వకు తల్లినుండి వచ్చి ఉండవచ్చు. అందుకే పుల్లయ్య తాత ''రవ్వా ! నువ్వు ఆడబిడ్డను కనలేదే చక్కనిదానా ! పులిబిడ్డను కన్నావు''(పుట 65) అంటాడు.

ఒక దశలో తల్లీదండ్రీ ఈ పెళ్ళివద్దు జీవితాంతం సవతి పోరు ఉంటుంది. వెళ్ళిపోదాం అంటే రానని చెపుతుంది. 'నీకు లేదా సవతి పోరు' అని తల్లిని ప్రశ్నిస్తుంది. దొరబాబు పెళ్ళాంగా తన అస్తిత్వాన్ని నిలుపుకోవడానికి పోరాటం చేసి గెలుస్తుంది మువ్వ. దొరబాబు పెళ్ళాంగా, మాదిగ పిల్లగా తన అస్తిత్వాన్ని నిలుపుకుంది మువ్వ.

**బుజ్జి :**

నల్లమ్మ బుజ్జిని చిన్నప్పటి నుండి దొరబాబు పెళ్ళాంగా, బుజ్జులకు కోడలుగా పెంచింది. పెళ్ళికి మువ్వ అడ్డుపడ్డప్పుడు తల్లితండ్రి ''ఈ పెళ్ళి వద్దు వెళ్ళి పోదాం మా అప్పకొడుకు నీ కోసం వేయి కళ్ళతో ఎదురు చూస్తున్నాడు'' అంటే ఎవరేమనుకున్నా ఫరవాలేదు. 'దొరబాబు లేందే నేను బ్రతకలేను' అని చెప్తుంది. తన స్థానాన్ని మరో స్త్రీ పంచుకోవాలనుకున్నా, ఏ మాత్రం జంకు లేకుండా, ధైర్యంగా దొరబాబు పెళ్ళాంగా తన అస్థిత్వాన్ని నిలుపుకుంటుంది.

**ముగింపు :**

తన కూతురు మువ్వను మాదిగల కోడల్ని చేసి, ఆమెకు తల్లిగా మాదిగ అయ్యింది రవ్వ. మువ్వ పుట్టినప్పటి నుండి మువ్వకు పెళ్ళై అక్కడ కార్యం జరిగే వరకూ తనకూతరు అస్థిత్వాన్ని తద్వారా తన అస్థిత్వాన్ని నిలుపుకోవడానికి పోరాటం చేసింది.

చిట్లోడి ఇంటిపేరు సంపాదించి, తన పిల్లల్ని చిట్లోడి పిల్లలుగా, మాదిగ పిల్లలుగా చదివించి పల్లెలో వాళ్ళకు గుర్తింపు వచ్చేలా చేసి, దొరబాబుకు పెళ్ళాన్ని చేయాలని తలచి, పల్లెంతా మువ్వని దొరబాబుని మెగుడూ పెళ్ళాం అనుకునేలా పన్నాగం పన్ని, భర్తని మల్లిని తన మాట వినేలా చేసింది. మువ్వకు పోరాటాన్ని నేర్పింది. పెళ్ళి పందిట్లో అందరికీ కన్పించేలా మువ్వ పోరాడితే ఆ పోరాట బీజాల్ని నాటింది రవ్వ. తన కూతరు తన బతుకు బరువు మోయనక్కర లేకుండా చేసి పెళ్ళి చేసుకున్న ఆలిని చేసింది. సం॥ల తరబడి కొనసాగుతున్న సంకెళ్ళ లాంటి కట్టుబాట్లును ఛేధించింది. తన ఆరాటం, పోరాటం అంతా తన కూతరు తనలా కన్నెరికం ఆడది కాకూడదనే ఈ పోరాటంలో గెలిచింది. తానున్న మెట్టు నుంచి ఒక్కొమెట్టు పైకెళ్ళి చివరికి పై మెట్టు చేరింది. ఇది దళిత స్త్రీ తెచ్చిన సామాజిక మార్పు.

**ఆధార గ్రంథాలు :**

1. పై మెట్టు - ఆచార్య కొలకలూరి ఇనాక్
2. తెలుగు సాహిత్య చరిత్ర - డా॥ద్వా.నా.శాస్త్రి
3. Encyclopedia Britanica
4. Wikipedia

BHAVAVEENA
Vol. 18, Issue. 9, September 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# తెలంగాణ సాంస్కృతిక చైతన్యంలో బతుకమ్మ గేయాలు – వైశిష్ట్యం

– వి. వినయ్ కుమార్, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ (ఓరియంటల్ విభాగం) ఉస్మానియా విశ్వవిద్యలయం, హైదరాబాద్.

"మనవుడు ఉన్నత జీవితం గడపడానికి భౌతికంగా, మానసికంగా చేసే నిరంతర ప్రయత్నమే సంస్కృతి. వ్యవస్థ, రాజ్యం, మతం, కళలు, వస్తుజాలం, వెషభాషలు. ఆచార వ్యవహారాలు, అనుబంధాలు, ఆహార విహారాలు, పండుగలు, జాతరలు, కట్టుబాట్లు, కష్టసుఖాలు, పెనుగులాటలు, పోరాటాలు అన్నీ సంస్కృతి వ్యక్తీకరణల సంస్కృతి స్వరూప స్వభావాలు, వికాసాలు ఆర్థిక, రాజకీయ, సామాజిక పరిస్థితులపై, పరిణామాలపై ఆధారపడి ఉంటాయి. తెలంగాణ సంస్కృతి విశిష్టమైంది. ప్రత్యేక అస్తిత్వం కలిగియున్నది. కాలగమునంలో ఆంధ్ర సంస్కృతిలో భాగంగా పేర్కొని నష్టపర్చినప్పటికీ ఇవాళ్లటి సందర్భంలో తెలంగాణ సంస్కృతి పునరుజ్జీవనం పొందుతున్నది. కొత్త చూపుతో, అన్వేషణతో, తన అస్తిత్వాన్ని తిరిగి నిర్మించుకుంటున్నది. విస్మరణకు, వక్రీకరణకు, అణచివేతకు గురైన స్థానిక సంస్కృతి రూపాల్ని సమీకరించుకుంటూ కొత్తగా వ్యక్తీకరించుకుంటున్నది". ఏ ఉద్యమమైనా దానికి సాంస్కృతిక భూమిక లేనిదే, మద్దతు లేనిదే సఫలం కాదు. మలిదశ తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో సంస్కృతి, భాష చాలా కీలకంగా పని చేశాయి. ఉద్యమం పోటు మీదికి రావడానికి ఒక రకంగా సాంస్కృతిక అస్తిత్వమే కారణమని చెప్పొచ్చు. ప్రజలందరిలో ప్రత్యేక తెలంగాణ భావోద్వేగాన్ని రగిలించడంలో సాంన్కృతిక చైతన్యం పోషించిన పాత్ర అమోఘమైనది. బతుకమ్మ, బోనాలు, పీరీలు, అలావా దుంకదం, ఆహారపు అలవాట్ను, కోలాటం, పేరిణీ నృత్యం. చిత్రకళ, శిల్పకళ. శివసత్తులు, పోతురాజు. ఒగ్గుకథ, తెలంగాణ తేజోమూర్తులు, చారిత్ర స్థలాలు... స్థానిక సాంస్కృతిక అస్తిత్వ కేతనాలుగానే కాక ఉద్యమ రూపాలుగా కూడా రూపాంతరం చెంది తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవనానికి తోడ్పడ్డాయి. రసమయి బాలకిషన్, అంతడుపుల నాగరాజు, కె. చంద్రశేఖరరావుల ఆలోచనల నుండి పురుడుపోసుకున్న ధూం ధాం సమైక్య పాలనలో మనక బారిన తెలంగాణ కళారూపాలను మళ్లీ తెర మీదికి తెచ్చి తెలంగాణ ప్రజలను ఉద్యమం వైపు అడుగులు వేయించడంలో విజయం సాధించింది. తెలుగు నేల మీదున్న నాలుగు ప్రాంతాల్లోనూ తెలంగాణది విభిన్న సంస్కృతి. ఇక్కడి నేల స్వభావం, వనరులు, వేష భాషలు, పండుగలు, పంటలు, మనుషుల వ్యక్తిత్వం అన్నీ ఇతర (ప్రాంతాల కంటే భిన్నమైనవే. తెలంగాణ సంస్కృతి గురించి మాట్లాడేటవుడు మందుగా గుర్తుకు వచ్చేది ఇక్కడి ఆడవడుచుల పూల పండుగ బతుకమ్మ పండుగ. అందుకే ఇక్కడ కలం పట్టిన ప్రతీ కవీ బతుకమ్మ గురించి ఒక్క వాక్యమైనా రాసి ఉంటాడు. 1920లోనే సిద్ధిపేట జిల్లా కోహెద మందలం గుండారెడ్డిపల్లెకు చెందిన సిద్దప్ప వరకవి బతుకమ్మ పండుగలోని తాత్విక కోణాన్ని ఆవిష్కరిస్తూ అందమైన సీస పద్యమొకటీ రాశారు.

బ్రతుకుంఅమ్మ-బ్రతుకమ్మ, బ్రతికించే అమ్మ కాబట్టి బ్రతుకమ్మ అయ్యిందని లేదా బ్రతికిన అమ్మ, బ్రతుకమ్మ అయ్యిందని భావింపవచ్చు. 'బ్రతుకమ్మ' వ్యవహారంలో బతుకమ్మగా మారింది, బతుకమ్మ పుట్టుపూర్వోత్తరాలను తెలిపే అంశాలు బతుకమ్మను లక్ష్మీదేవి, పార్వతీదేవి అంశంగానూ, పేరంటాలుగానూ, సాహసవనితగాను, ప్రకృతికి ప్రతిరూపంగాను, శ్రీచక్ర శోభితంగానూ తెలియజేస్తాయి. బతుకమ్మ పండుగ పుట్టుపూర్వోత్తరాలను తెలియజేసే ఒక కథ పురాణాలకు సంబంధించింది. గౌరి దేవి మహిషాసురుణ్ణి వధించి, అలసి ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నాడు స్పృహ కోల్పోతుంది. అమె స్పృహనుండి తేరుకోవడానికి స్త్రీలందరూ దేవిని బతుకమ్మ అని ప్రార్థిస్తూ పాటల రూపంలో వేడుకుంటారు. దశమిరోజున దేవి స్పృహ నుండి తేరుకుంటుంది. దేవి పునర్జీవిం

చిందని, నాటి నుండి ఆమెను బతికిన అమ్మ బతుకమ్మగా కొలుస్తున్నారు. ఆమె స్పృహ కోల్పోయిన తొమ్మిది రోజులు ఆమెను స్మరిస్తూ పండుగ చేసుకోవడం ఆచారంగా మారింది.

తెలంగాణలోని ప్రతి జిల్లాలోను ప్రచారంలో ఉన్న 'ధర్మాంగదుని పాట' బతుకమ్మ పుట్టు పూర్వోత్తరాలను తెలియజేస్తుంది.

| | | | |
|---|---|---|---|
| శ్రీ లక్ష్మిదేవియం | ఉయ్యాలో | సృష్టి బతుకమ్మాయె | ఉయ్యాలో |
| పుట్టినారీతిజెప్పె | ఉయ్యాలో | భట్టు నరసింహకవి | ఉయ్యాలో |
| ధరచోళదేశమున | ఉయ్యాలో | ధర్మాంగుడనురాజు | ఉయ్యాలో |
| ఆ రాజు భార్యయు | ఉయ్యాలో | అతిసత్యపతియంద్రు | ఉయ్యాలో |
| నూరునోములు నోమి | ఉయ్యాలో | నూరు మందినిగాంచె | ఉయ్యాలో |

ఈ చోళదేశాన్ని పాలించిన రాజు ధర్మాంగుడు. అతని భార్య సత్యవతి. వారికి వందమంది కుమారులు జన్మించినా పుత్రశోకం తప్పలేదు. అందుకే వారు తపస్సు చేసి శ్రీలక్ష్మినే తమ కూతురుగా జన్మించాలని కోరారు. వారి కోరికను మన్నించి లక్ష్మీదేవియే కుమార్తెగా ఆ ఇంట జన్మించింది. ఆ శిశువును చూచి దేవతలు, ముని పుంగవులు చల్లంగ బతుకమని బ్రతుకమ్మగా దీవించినారు. అందుకే ఆమె బతుకమ్మ అయ్యింది. శ్రీ మహావిష్ణువు చక్రాంకుడనే పేరుతో రాజువేషంలో వచ్చి బ్రతుకమ్మను పెండ్లి చేసుకున్నాడు. వారిద్దరు సిరి సంపదలతో, సంతనంతో వెలుగొందారు.

శ్రీ లక్ష్మిదేవియే బతుకమ్మగా జన్మించి, శాశ్వతమైన కీర్తిని పొందినందున ఆమెను దేవతాకన్యలు, ప్రజలు పూజించారు. కట్లపూవులతో గద్దెవేసి గోరింట, దానిమ్మ, కానుగ, తుమ్మి, వావిలి, యింద, పయిడి, పొన్న, బీర పూవులతో చుట్టుగోడలు, అరుగులు, దరువాజలు, తోరణాలు కట్టి పద్మాసనం వేసి పసుపు ముద్దలను నిలిపి పూజించారు. ఆనాటి నుండి నేటి వరకు ఆశ్వీజ శుద్ధపాడ్యమి మొదలు తొమ్మిది దినాలు పూలగోపురంగా బతుకమ్మను పేర్చి పండుగ జరుపుకోవడం ఆచారంగా ఉంది. నేటికీ లేకలేక పుట్టిన సంతానానికిగానీ, ఎక్కువ మంది పుట్టి చనిపోయిన తరువాత పూట్టే బిడ్డకుగానీ చల్లంగా బతుకాలని 'బతుకమ్మ అనే పేరు పెట్టుకుంటారు సిరిసంపదల నిచ్చే లక్ష్మీ దేవితో పాటు పడతులకు ప్రత్యేక పండుగ పూలపండుగ,

"ఆశ్వీయుజ శుద్ధమనగా స్రీలంత
తిరిగి పువ్వులు తెచ్చి తేగమలర
ఐబతకమ్మయని పేర్చి భ్రమనొందగా
నాడి నదిలో వేతురు శుద్ధనవమి వరకు
నా సందు నీ సందు నానాడె పాసెనని
కుంటి రంగని పుండు గూసేననుచు
వైనమను సిబ్బులన్ నదులు ఐదులందుకొని
యెవ్వరెవ్వరి చద్దివారు గుడిచి
యేగుదురు నపుడు యిండ్లకున్ ఎలిమితోడ
ప్రేమదీరెను బతుకమ్మ పేరు మాసె
వినుడి మాయప్ప శిద్దప్ప విహితుడప్ప
కనుడి కరమొప్ప కవికుప్ప కనకమప్ప"

ఆశ్వీయుజ మాసంలో దొరికే ఒక్కొక్క పూవునూ కోసుకొచ్చి తాంబాలంలో గౌరి ముత్తయిదువలంతా తుకమ్మల చుట్టూ తిరుగుతూ తొమ్మిది రోజులు ఆడిపాడి గౌరీ మాతకు ఆరగింపు చేసిన చద్దిని (ప్రసాదం) నీ మధ్య నా మధ్య నెలకొన్న విరోధాలు పోవాలని వాయనాలుగా ఇచ్చి పుచ్చుకొని చివరికి బతుకమ్మను గంగలో వేసి ఉత్తచేతులో ఇంటికి పోతారు. జీవితం కూడా ఇంతేనని కవి బతుకమ్మ చుట్టూగల జీవిత తాత్త్వికతను ఎంతో సొంపుగా చెప్పి తత్త్వం బోధపరుస్తారు. తెలంగాణ

సంస్కృతీ చిహ్నమైన బతుకమ్మ పండుగను మనిషి జీవితానికి ముడి పెట్టి చెప్పడం కవి పరిణతికి, తెలంగాణ పండుగల వెనకగల ఉన్నతికి నిదర్శనం.

"ఏంత వన్నెల విరులు చేరిచి / పేరిచిన బతుకమ్మ లంగొని
చంచలాంగులు నడువ తీగలు / సాగి నడిచినయట్లు కన్నడె" '

- డా. సి. నారాయణ

బతుకమ్మ పండుగ అంటేనే పూల పండుగ. పూబంతుల పండుగ. ఎన్నో వన్నెల పూవులను ఏరుకొచ్చి వాటిని కోణాకారంలో పేర్చి, శుభాలు కలగాలని గౌరీ మాతను పూజించి తోటి ఇంతులతో కలిసి ఆడుటకు దేవాలయం ముందరికో, చెరువు కట్ట మీదికో చేరు కుంటారు. బతుకమ్మను పట్టుకొని అట్లా నడిచిపోతున్న తీగవంటి కోమలులను చూస్తుంటే తీగలే సాగి నడిచి పోతున్నట్టుగా తోచింది కవికి. పండుగకు బతుకమ్మను, ఇంటీని, ఒంటీని శముస్తాబు చేసుకోవడం కూడా సంస్కృతిలో భాగమే కదా!

'ఏ రోజూ వంచని తలైనా
ఆ రోజు పెద్దల ముందు వంచక తప్పదు
జమ్మి బంగారంతో మురిసిపోకా తప్పదు
జమ్మి ఆకులతో ఆ సాయంత్రం వంగిపోతుంది
జమ్మి ఒక చేయి నుంచి / మరో చేయికి మారిందంటే
హృదయాలు హత్తుకుపోయ్యి చేతులు వీపుల్ని నిమురుతాయి
పాత శత్రుత్వాల్ని తెగ నరికే ఆయుధం జమ్మి"

-జింబో

బతుకమ్మ పూల పరిమళం ఇగిరిపోక ముందే దసరా పండుగ వచ్చేస్తుంది. దసరా అంటే సరదా ఒక వైపేతే మరో వైపు ఆయుధ పూజ, మేక పిల్లను "గావు" పట్టడం, జమ్మి చెట్టు పూజ, పాలపిట్ట దర్శనం, జమ్మి ఆకునే 'బంగారం'గా చేతిలో పెట్టి పెద్దల దీవెనలు తీసుకోవడం, దోస్తులతో అలాయి బలాయి తీసుకోవడం.. ఇవన్నీ తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే అంశాలు. బతుకమ్మ, దసరా పండుగలకు ప్రతీ ఇల్లు సంతోషపు కెరటాలతో అనంద సాగరమవుతుంది. 'వాత శత్రుత్వాల్ని తెగ నరికే ఆయుధం జమ్మి' అని అనడంలోనే తెలంగాణ జీవితం, అనుబంధాలు దాగి ఉన్నాయి.

"పండుగ రోజులల్ల / లైట్లు లేకపోయినా
పల్లె పల్లంతా గొప్ప వెలుగే
గాలినిండా / గునుగులూ, తంగేళ్ల గుసగుసలే
జీవితం వన్నె దిద్దుకొని / ఉయ్యాల పాటల అలల మీద తేలే
సద్దుల బతుకమ్మైపోతది / సుద్దుల్నీ సద్దుల్నీ
వాయినాలుగా ఇచ్చిపుచ్చుక్కు తృప్తి
చెవికమ్మల మెరుపుల / తళుక్కుమంటది" !

- దేశపతి శ్రీనివాస్

తెలంగాణ పల్లె తనను తానే దేవులాడుకుంటున్న దృశ్యాన్నంతా చిత్రిక పట్టి చూపిన కవిత ఇది. ముఖ్యంగా పండుగ రోజుల్లో పల్లెలు ఎంత శోభాయమానంగా వెలిగిపోతాయో కవి చాలా సమర్థవంతంగా వివరిస్తాడు. ఏ ఇంటికి పోయినా తంగెడు పువ్వులు, గునుగుపూల గుసగుసలే వినిపిస్తాయంటాడు. జీవితం బతుకమ్మలా మురిసిపోతది. కాని పండుగ అయిపోయిన తర్వాత ఆడపడుచులు మళ్లీ తను పెరిగిన ఊరును, తల్లి గారింటిని, దోస్తులను వదిలి పోవాలంటే మనసంతా కలత పడ్డ ఆవులాగా అయిపోతుందంటాడు. 'గౌరమ్మను సాగనంపినట్లు గావురంగ సాదిన బిడ్డను పంపలేక చిట్టి చేతుల టాటాలకు జవాబీవ్వలేక' కన్న తల్లిదండ్రుల ఆవేదనకు మన కళ్లూ చెమర్చుతాయి. పండుగ, ఆడబిడ్డా వెళ్లి పోయిన తదుపరి ఇల్లు బతుకమ్మను చెరువులో వేసిన అనంతరం ఖాళీగా మిగిలిపోయిన తాంబాలమవు తుందనడంతో మనస్సు చివుక్కు మంటుంది. 'మల్లొచ్చే ఏటిదాకా ఒంటరి పాటొకటి పల్లెగుండెలో ఊపిరి ఉయ్యాల ఊపుతది' అనడంలో తెలంగాణ సంస్కృతి లోని ఎదురుచూపంతా కనబడుతుంది. ఇంతే ఆర్ద్రతను,

అందాన్ని, ఆనందాన్ని పంచే మరో మంచి కవిత ఏనుగునరసింహారెడ్డి రాసిన 'బతుకమ్మకల'

"ఎంగిలి పువ్వుకూ చద్దుల బతుకమ్మకూ
పూల గుత్తుల వంతెన కట్టీ
పాటల రహదార్లను పరిచాకనే
కొత్త పెండ్లి పిల్లలు
పిందారబోసిన వెన్నెల్లో అటల ఆరిందలయ్యింది
-----------------
పోయే పోయే గౌరమ్మా/పొన్నగంటి గౌరమ్మా
తాడులోతు నీళ్లల్లో/తరలిపోయే గౌరమ్మా
మల్గొచ్చే పండుగాకు/మళ్ళీ మళ్ళీ రావమ్మా!"

బంగారు కాంతులీనే తంగెడు పువ్వు చుట్టూ గునుగు పూలు అమరినట్టు, చెరువు కట్టమీద నడుమ బతుకమ్మను పెట్టి చుట్టూ చప్పట్ల తాళాలు కొడుతూ సీతమ్మ శోకాన్ని రాగయుక్తంగామగువల పండుగే అయినా బతుకమ్మకు కావాల్సిన పూలను సేకరించడంలో పిల్లలు, పురుషులే ముందుంటారు. అక్కలకు బదులు తమ్ముళ్లకే రెండు వారాల ముందు బతుకమ్మ పండుగ మొదలయ్యేది. వేకువ జామునే మంచు బిందువుల కిరీటాలను ధరించిన తంగెడు పూలను తల నిమిరి జాగ్రత్తగా గంపల్లోనో, చేసంచుల్లోనో వేసుకునేది. అట్లా ప్రకృతిలో దొరికే తీరొక్క పూవును ఇంటికి తీసుకొచ్చి బతుకమ్మలో కొలువుదీరేలా చేసేది. సాయంత్రం చీకటి ముసురుకునే దాకా ఆడి మెల్లగా చెరువు అలల మీద వదిలి వీడ్కోలు పలుకుతారు. అది తల అటూ ఇటూ ఊపుతూ అందంగా ముందుకు కదిలిపోతుంది. వాయనాలు ఇచ్చి పుచ్చుకొని ఇంటిదారి పట్టినా బాట వెంట 'ఆట చిలుకలారా.. పాట చిలుకలారా..' అంటూ మళ్లీ పాటలే మారుమోగుతాయి. తెలంగాణలో ఈ పండుగ ఒక్కటే అతివలు ఇంటి బయట సామూహికంగా జరుపుకునేది.

పూల పండుగ / బతుకమ్మ / జీవితమే ఒక
రంగుల పండుగ / తెలంగాణకు / ప్రతీక
బతుకమ్మ పండుగ / ప్రతి పల్లె సంబురం / తంగేడు పువ్వు ల
తళతళలు వీధివీధిన పూలవనాలు / బతుకమ్మ
ఆటపాటలతో/ పల్లెలన్నీ / పూల సంబరాలతో
రోజంతా/ పూల సంబరాలే / బతుకమ్మ /ఒక జీవనగీతం
ప్రకృతి పండుగ / బతుకమ్మ /పుడమికి శోభనిచ్చే / పూలకొమ్మ
తెలంగాణ / సాంస్కృతిక ప్రతీక / బతుకమ్మ/ రోజు పర్వదినం
ఆడబిడ్డల / సంబురం / ప్రకృతిని కొలిచే / ఒక సంప్రదాయం
తెలంగాణ మట్టిబిడ్డ / బతుకమ్మ / ప్రతి పల్లె / ఒక పూలవనం
సంస్కృతి జీవనాడి / బతుకమ్మ /భావితరాలకు / సాంస్కృతిక వైభవం
ఇంతింటి దేవత / బతుకమ్మ / ఆడబిడ్డలకు / బతుకునిచ్చే అమ్మ
బతుకమ్మ పాట / బతుకునిచ్చేది / ప్రతి నోట / జీవనపరిమళం
పూల తోట / మురిసింది / బతుకమ్మ / సిగలో ఆడింది
తొమ్మిదిరోజుల / వైభవం/ బతుకమ్మకు /రోజు పండగ
బతుకమ్మ / ప్రకృతికి మారుపేరు / ప్రతి పువ్వు / ఒక ఆదిశక్తి
బాధలు / తీర్చే /బతుకమ్మ / ఆడబిడ్డల చిరునవ్వులో
సిరులు / పంచేటి / బతుకమ్మ / మా తల్లి గౌరమ్మ
బతుకమ్మ / తెలంగాణ పూలకోమ్మ / చరిత్రలో సిగలో /మెరిసిన గౌరమ్మ
తెలంగాణ మట్టి గంధం / బతుకమ్మ / పల్లెపల్లెనా / పూల జోరు

బతకడం కూడా / ఒక సంబరమే / బతుకమ్మ / నేర్పిన పాఠం

బతుకమ్మ / రంగుల హరివిల్లు / నేలతల్లి కట్టుకున్న / పచ్చని చీర

బతుకమ్మ / రాష్ట్ర పండుగ / ఉద్యమకాలంలో / శిఖరాయమానం

పూలనే పూజించే / పూల పండుగ / అదే తెలంగాణ ప్రత్యేకత

ప్రకృతికి ప్రతీక / బతుకమ్మ /బతుకు చిత్రానికి / ముఖచిత్రం

ఆటల జోరు / పాటలు హెూరు / బతుకమ్మ / పూలు పులకరింత

తెలంగాణకే / ప్రత్యేకం / బతుకమ్మ / ఆడపడుచుల పండగ

ఉయ్యాల పాటలు / చందమామ ఆటలు / బతుకమ్మ పై / పూల జల్లులు

ఒక్కేసి పువ్వేసి / చందమామ / మురిసిపోయిన / బతుకమ్మ

వీనుల విందులు / మహిళల పాటలు / వీధివీధిన / బతుకమ్మలు

కన్నులపండుగగా / వేడుకలు / సంబరాలు / బతుకమ్మలు

ఉత్సాహం నింపే / బతుకమ్మ / పరిమళాన్ని వెదజల్లే / పూల పండుగ

విశిష్టత పండగ / బతుకమ్మ / వినోదం పంచే / పూల పరిమళం

పూలను పూజించటం / తెలంగాణ సంస్కృతి / బతుకమ్మ / పూబంతుల గుమ్మ

దుర్గమ్మ కు ప్రతిరూపం / బతుకమ్మ / ప్రకృతియే / ప్రత్యక్ష దైవం

బతుకమ్మ / కులమతాలకు అతీతం / సామాజిక కు / దర్పణం

బతుకమ్మ పండుగ తెలంగాణ కు ప్రత్యేకం. ఆశ్వీయుజ మాస శుద్ధ పాడ్యమి నుండి తొమ్మిది రోజుల పాటు ఈ పండుగను జరుపు కుంటాం. మహాలయ అమావాస్య రోజు మొదలై దుర్గాష్టమి రోజు ముగుస్తుంది. ఈ పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రత్యేక చిహ్నం. తెలంగాణ మలిదశ ఉద్యమంతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలని తొమ్మిది రోజులూ ఆరాధిస్తూ బొడ్డెమ్మలు వేస్తారు. కోలాటం వేస్తారు. ఆడబిడ్డలు కష్టసుఖాలు, ప్రేమలు, భక్తి, అనురాగాలు అన్ని పాటల ద్వారా గౌరమ్మను ఆరాధించి తొమ్మిది రోజుల తర్వాత గంగమ్మ ఒడిలో ఉంచి సాగనంపుతారు. కన్నుల పండుగగా సాగే ఈ పండుగ ప్రస్తుతం తెలంగాణలో ఒక ఉద్యమ స్ఫూర్తి గా నిలిచింది. మలిదశ ఉద్యమంలో ఈ పండుగ సబ్బండ వర్గాలను ఏకం చేసి రాష్ట్ర సాధనలో ప్రముఖ స్థానాన్ని ఆక్రమించింది. జాగృతి లాంటి సంస్థలు ఈ పూల పండుగకి బ్రహ్మరథం పట్టి జనాకర్షణగా మలిచారు. ఈ పండుగ పేర బోలెడంత సాహిత్యం వస్తున్నది. భీంపల్లి బతుకమ్మను వస్తువుగా తీసుకొని అది తెలంగాణ పల్లె జీవితానికి ఎన్ని రంగులద్దుతున్నదో మనకు ఈ నానీల్లో ఆవిష్కరిస్తున్నడు.

BHAVAVEENA
Vol. 18, Issue. 9, September 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# తెలుగు సాహిత్యంలో కొత్తవేకువ – జగ్‌నే కీ రాత్

– షేక్ హుస్సేన్, పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

వెయ్యికి పైబడిన సంవత్సరాలుగా వివిధ ప్రక్రియలలో విస్తరించిన తెలుగు సాహిత్యంలో విస్మృత వర్గాలు చాలానే ఉన్నాయి. వాటిని మైనారిటీ వర్గమైన ముస్లిం వర్గం ఒకటి. ఆధునిక కాలంలో దళిత సాహిత్యవాదం వచ్చిన తరువాతైన వారికి సాహిత్యంలో స్థానం దక్కిందేమో గానీ, ఈ మైనారిటీ వర్గానికి మాత్రం తగిన స్థానం దక్కలేదన్నది కఠోర వాస్తవం. కథలలో, నవలల్లో అక్కడక్కడ ముస్లిం పాత్రలు వచ్చినా, అవి సార్వజనీనమైన లక్షణాలను కలిగి ఉన్నాయే తప్ప, మైనారిటీ వర్గపు వెతలని ప్రతిబింబించినవి కావు. అలాంటి పరిస్థితుల్లో కొత్త వేకువలా వచ్చింది జగ్‌నే కీ రాత్ కవితాసంకలనం. ఈ కొత్త వేకువ అనేక సంచలనాలకు కారణం కూడా అయ్యింది.

స్కైబాబాగా ప్రసిద్ధుడైన షేక్ యూసఫ్ బాబా రచించిన ఈ సంకలనంలోని రేహాల్, హిజాబ్, సాంచా, మొహబ్బత్ 1417 హిజ్రీ, చిఠ్ఠి, కాలీ చుమ్టీ, పహ్లా గులాబ్ హీ పహ్లా కాంటా, ఈద్ కా చాంద్, బెచారా, గుజ్రా కవితలు ముస్లిం వర్గంలోని స్త్రీలు పడుతున్న పాట్లు, తండ్రులు బాధ్యతల మధ్య నలుగుతున్న తీరు, అక్కాచెల్లెళ్ళు పరాయి దేశంలో పడుతున్న పాట్లు వర్ణించాయి. అవి హృదయస్పర్శులు అనడంలో సందేహమే లేదు. ముఖ్యంగా చిఠ్ఠిలోని బడీదీదీ ఫాతిమా చివరలో చెప్పిన ఆప్ కే సాతో దామాద్ సలామత్ వంటి వాక్యాలు వారి హృదయాందోళనలను మన ముందుంచుతాయి.

ఇంత వరకు ముస్లిం కుయుంబాల వెతలు, వారి సమస్యలను చెప్పిన కవితల పథం, కవి దృక్పథం, గొంతు కాఫిర్ నుంచి సర్పకఫ్ వరకు ఉన్న కవితలలో మారిపోయి కనిపిస్తాయి. ఈ సంకలనం వెనుక 'కవిత్వం ఏ సూత్రాలకూ అందదు' అన్న సుంకిరెడ్డి నారాయణరెడ్డి గారి ఆప్తవ్యాసంలో చెప్పబడిన ముస్లిం వెనకబాటు కారణాలు, విజ్ఞుల అభిప్రాయాలకు భిన్నంగా తమ సమస్యలకు బాబ్రీ మసీదు విధ్వంసం (పదం సరైనదే), గుజరాతు మారణహోమం (ఈ పదమూ సరైనదే) కారణాలని కవి భావించినట్లు మనకు కనిపిస్తుంది.

కాఫిర్ కవిత తమ వర్గంలోని కొందరే తమ కష్టాలకు కారణమని కవి భావిస్తున్నట్లు స్పష్టంగా చెబుతుంది.

నా ఆలోచనకు టోపీదారాల్తో ఉచ్చు బిగించి
నా పసి కలల్ని 'నాడా'తో బంధించి
నా పాలమనసుపై నీ 'తక్ఫీర్' పలుకుల విషపు
చుక్కల్ని చిలకరించి
- మత్తెకిస్తున్నది చాలు (కాఫిర్, పు.28)

అన్న కవితాభాగం వాస్తవాల్ని బయటపెడుతున్నది. నువ్వు చెప్పేదంతా వట్టి బూటకమంటున్నందుకు నేను కాఫిర్‌నే (పుట. 29) అని కవి నిర్ద్వంద్వంగా విషపు చుక్కల్ని మనస్సులో చిలకరిస్తున్న వారిని ధిక్కరించారు. ఇక్కడ నేను కాఫిర్‌నే అని కవి అనడంతో ఆ విషపు చుక్కల్ని చిలకరించే వారెవరో స్పష్టంగా తెలిసిపోతున్నది. అది ముస్లిం ఛాందసవాదులేనని వివరించి చెప్పాల్సిన పని లేదు. ఎందుకంటే మిగతా మతాల వారెవరూ ఒక ముస్లింను కాఫిర్ అని ముద్ర వెయ్యరు. ఆ పని చేయగలిగిన వారు ముస్లిం ఛాందసవాదులే. ఇది స్పష్టం.

శతాబ్దాలుగా కలిసి ఉన్నా, రాజకీయకారణాల వల్ల తమని ద్వేషిస్తున్నవారిని కవి నిలదీశారు.

ఘటనను కాదురా
దానికో క్షణం ముందరి కాలాన్ని నిలదియ్
(భూక్ కో ఫాసీ దో పు.32)

అంటున్న కవి 'రండ నా కొడకా' అని పిలిచి మరీ చెప్పి నిలదీశారు.

గరీబోల్ల కోసం బందూఖ్ పట్టినోన్ని సంపుతుంటివి
నీ లెక్కనె మనుషులందర్కి హక్కులుంటయంటె
నరుకుతుంటివి
తుర్కోల్ల వష్షి పోరగాల్లని పరాయి ఏజంట్లని
పట్కపోతుంటివి
ఏ దేశంర నీది
మా కాడ పెద్దర్కం జేస్కుంట
మమ్మల్నే ఆగమాగం జైస్తున్నవ్ గదర
(బద్వా పు. 33)

అంటూ వర్గరక్షణకు తోడు నిలిచిన వారిపై జరుగుతున్న అమానుషాన్ని వ్యక్తం చేశారు.

తురకరాజులు గూడ ఈడ రాజ్యం జేసినరు గని
మారాజులు
మా నోటికాడిది గుంజి ఇంకోనికైతె పెట్టలె
(బద్వా పు. 34)

అంటూ ఎంతో ఈ దేశపాలనలో తమవంతు బాధ్యత నెరవేర్చిన సుల్తానులను, నవాబులను, జమీందారుల సహనశీలతను తెలియజేశారు. నోటికాడిది గుంజుకొని ఇంకోని పెట్టడం అన్న అభివ్యక్తి తమకు దక్కవలసివి దక్కలేదనే విషయాన్నే కాదు, ఆ దక్కవలసినవి వేరేవారికి మళ్లింపబడ్డాయని కూడా తెలిజేస్తున్నది.

హిందువులు బాణాలతో, చక్రాలతో, త్రిశూలాలతో వస్తే తమ చేతులు ఉట్టి దువా కోసం కాదని స్పష్టం చేశారు గుజరాతు అనే కవితలో. గుజరాతులో జరిగింది మారణహోమమే. కాదన్నవాడు మనిషి కానేరడు. అంచేత ఆయుధం చేతబట్టగలమనే కవిగారి సూచన వర్గ వైషమ్యాలకు, ఎంతోమంది నలిగి చచ్చిపోవడానికి కారణం కాగలదే అయినా, అది ఆత్మరక్షణకే అన్నది స్పష్టం.

వీళ్ల ఇంట్లకు త్రిశూలాలు దొడ్డిదారిన వచ్చి చేరుతున్న పట్టనట్లుంటరు (నయా లాషే చాహియే పు.50) అన్న పంక్తులు మెజారిటీ వర్గం రాజకీయంగా దక్కిన ఆలంబనతో ఎంతగా మతద్వేషాన్ని పెంచుకున్నదో తెలియజేస్తున్నాయి.

తీయరా లెక్కలు
మేము ఎఫ్.సి. ఎట్లవుతామో చెప్పడానికి
(మర్ఫా పుట. 53)

అన్న పంక్తులు అంతర్లీనంగా తాము ఇప్పటికీ శోషితులమే అని చెబుతున్నది. గతంలో కొన్ని ముస్లిం రాజవంశాలు ఈ దేశాన్ని పాలించినా, నేడు ఆ వర్గపు పరిస్థితి దయనీయంగా ఉన్నదనే విషయాన్నీ తెలియజేస్తున్నది.

అంటరాని జాతంతా లేస్తోంది నల్ల సముద్రమై
వెంట సూదర్ల ఊరేగింపు
రంజాన్ చంద్రుళ్ల కవాతు
(మర్ఫా, పుట. 56)

అని చాటిన కవిగారు తమ వెంట దళితులు నిలిచి ఉన్నారని చాటుతున్నారు. శోషణకు గురైన వర్గాలన్నీ ఏకతాసూత్రాన్ని పాటించాలనే ఆశయాన్ని ఈ పంక్తుల్లో గమనించవచ్చు.

పోలీసధికార్లు, పత్రికాధిపతులూ
అందరి ఒంట్లోనూ హిందుత్వపు జీన్స్
ప్రగతివాదుల రక్తంలోనూ వదలిపోని హిందూ జాఢ్యం
(సర్బకఫ్, పుట. 67)

అంటూ సమాజంలో ప్రబలమైన వర్గాలన్నీ హిందువుల వైపే నిలుస్తున్నాయని, మైనారిటీలకు ఈ సమాజంలో బాసటగా నిలిచేవారు లేరని సూచిస్తున్నారు.

ఇస్ దేశ్ మే
జిత్‌నా ఖూన్ ముసల్మాన్ కా బహాయా గయా
ఉస్ కా అంజామ్
బహుత్ మహెంగా పడేగా
(సర్బకఫ్, పుట. 73)

అంటూ ధర్మాగ్రహాన్ని వ్యక్తం చేశారు.

ఈ కవితా సంకలనానికి ఆప్తవాక్యం వ్రాసిన శ్రీ నారాయణ రెడ్డిగారు కవిత్వం ఏ సూత్రాలకు అందదు అనే శీర్షికతో ఉన్న వారి ఆప్తవాక్యంలో -

వేయేండ్ల క్రితం ఈ దేశం మీద దాడి చేసిన
దేవాలయాల్ని ధ్వంసం చేసిన అప్పటి ముస్లిములేనా
ఇప్పటి ఈ ముస్లింలు
లక్షలాదిమంది భారతీయులను ముస్లింలుగా
మార్చిన అప్పటి నవాబుల వారసులేనా
ఇప్పటి ఈ ముస్లిం ప్రజలు
కాదు, ఎంత మాత్రమూ కాదు
(కవిత్వం ఏ సూత్రాలకు అందదు, పుట 98)

అన్న నారాయణ రెడ్డిగారి వాక్యం ఇప్పటి ముస్లిములు గతకాలపు నవాబుల, రాజవంశాల దాష్టీకాలకు వారసులు కాదని ప్రకటించారు. అంతేకాదు -

శిల్పం అవసరం. శిల్పం ట్రాష్ కూడా. శిల్పం అంటే ఏమిటి? గుండె దడకూ నోటి మాటకూ అనుసంధానమే శిల్పం. ప్రతిదీ అవసరమైన పాళ్లలో కుదరడమే శిల్పం. శిల్పం అవసరమే (పుట 100)

అంటూ వ్యక్తీకరణ ప్రధానం కాదు, వ్యక్తమయ్యే భావం ప్రధానం అని ఈ కవితల్ని విశ్లేషించారు.

మరొక ఆప్తవ్యాస కర్త అయిన అంబటి సురేంద్ర రాజు గారు వారి 'తీన్‌మార్ దరువు-నిశిరాతిరి పాట' అనే ఆప్తవ్యాసంలో - సున్నీ-షియా, అష్రాఫ్ -అజ్లాఫ్, దూదేకుల - దుదేకులేతర, ధనిక-పేద, విదేశీ - దేశీ, మైనారిటీ-మెజారిటీ, విద్యాధిక-నిరక్షరాస్య, అభివృద్ధి చెందిన-వెనుకబడిన వంటి పలు పరస్పర విరుద్ధ అంశాల ప్రాతిపదికపైన ముస్లిం జనాభా విభజన జరిగేలా చూడాలి. (పుట. 92) అంటూ ముస్లిములను ఆయా వర్గాలపరంగా విభజించి, ఆయా వర్గాలకు అవసరమైన సహాయసహకారాలను అందించాలని కోరారు. ఇలా చేస్తే ఏ వర్గానికి ఏది అవసరమో, అది అందుతుంది. ఫలితంగా అభివృద్ధి సాధ్యమౌతుంది.

BHAVAVEENA
Vol. 18, Issue. 9, September 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# తెలుగు సినీగేయాల్లో వ్యక్తిత్వ వికాసం

- **డా॥. చింతల రాకేశ్ భవాన్,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హయత్ నగర్.

సనాతన భారతీయ సాహిత్యమంతా వ్యక్తిత్వ వికాస బద్ధమైనదే. మనిషి నడవడికకు ఆధారభూతమైన ఎన్నో గాథలు ఈ నేలలో ఏనాడో పురుడుపోసుకున్నాయి. వేదాలు మొదలుకొని ఆదికావ్యమైన రామాయణం, పంచమ వేదమైన భారతం, అనేకానేక శతకాలు, కథలు, గాథలు ఇలాంటివెన్నో అనాదిగా భారతీయులకు ధర్మం, సత్యం, మనిషి చేయాల్సినవి, చేయకూడనవని ఇలా అనేక విషయాలను బోధిస్తూ మానవ వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తూ ఒక సభ్యసమాజాన్ని నిర్మించడానికి తోడ్పడుతున్నాయి. పైవన్నీ కూడా మనిషి ఎలాంటి సందర్భాలలో ఎలా ప్రవర్తించాలో, ప్రవర్తించకూడదో చాటి చెప్పుతూ తరతరాలుగా ఉన్నతోన్నతమైన జీవనసరళిని మనకు అలవాటు చేసాయి. అధునాతన విద్యా వ్యవస్థకు మనం అలవాటు పడిన తర్వాత మన విద్యను కోల్పోయి పరదేశీ విద్యావిధానాన్ని పాటిస్తూ ఒక అగమ్య గోచరమయమైన స్థితిలో ఉండిపోయి పాశ్చాత్యులు చెప్పిన వ్యక్తిత్వ వికాస పద్ధతులపై ఆధారపడి బ్రతుకాల్సి వస్తోంది నేడు. ఒకప్పుడు బడులు మొదలుకొని కళాశాల చదువులవరకూ మాతృభాషా రూపంలో ఎంతోకొంత వ్యక్తిత్వ వికాస సాహిత్యాన్ని మనకు పరిచయం చేసేవారు నేటి పిల్లలకు అదీ కూడా కరువైంది. మన ప్రాచీన సాహిత్యాన్ని పరిచయం కానీ అధ్యయనం కానీ చేసే అదృష్టం ఈ తరాలకు కలగడం లేదు. అయితే ఒకప్పటి ప్రజలకు కావ్యాలు, శతకాలు, ప్రబంధాలు, లేదా ఇతరేత్రా సాహిత్యం వలన ఒనగూరిన లాభం, ఇప్పుడు ఒకింత చలన చిత్రాల ద్వారా కలుగుతోంది.

అంతర్జాతీయ కేంబ్రిడ్జ్ ఇంగ్లీషు నిఘంటువు ప్రకారం వ్యక్తిత్వం అంటే “the type of person you are, shown by the way you behave, feel, and think” నీ నడవడిక, ఆలోచనాసరళి, భావనాభివ్యక్తి ద్వారా నిన్ను నిన్నుగా చూపించగలిగేదే నీ వ్యక్తిత్వం. మనిషి దేశకాల పరిస్థితులను అనుసరించి ఏయే సందర్భాలలో ఎలా ఆలోచించి ప్రవర్తిస్తాడో అనేది అతని మానసిక స్థితిగతుల పైనే ఆధారబడి ఉంటుంది. మనిషి బాహ్యరూప అలంకరణ, మాటతీరు, చేష్టలు వీటి ద్వారా అతని వ్యక్తిత్వాన్ని పూర్తిగా లెక్కించలేం. వ్యక్తిత్వ వికాసమనేది వాస్తవంగా మానవుడి అంతరంగిక స్థాయికి చెందింది. మనసు, దాని స్వాభావం, అది చేసే కార్యాకలాపాలను అధ్యయనం చేయడం ద్వారా ఒక వ్యక్తి యొక్క వ్యక్తిత్వాన్ని తెలుసుకోవచ్చు. మానసిక పరివర్తననే వ్యక్తిత్వ వికాసమని చెప్పొచ్చు.

శారీరక పెరుగుదల బాహ్యపరమైన వికాసమైతే, వయసుతో నిమిత్తం లేకుండా ఎదిగేదే మానైక వికాసం. దీన్నే మనం మనోవికాసమని, అంతర్గత వికాసమని పిలుస్తాం. సమాజంలో మనోవ్యాపారాభివృద్ధిని ప్రోత్సహించే ఆరోగ్యకరమైన పరిస్థితులు నెలకొన్నప్పుడు బాల్యదశ నుండే మనిషి యొక్క మనీష వికసనం జరుతుంది. వ్యక్తిత్వ వికాసంలో ఒక వ్యక్తి నివసించే దేశకాలపరిస్థితులను బట్టి సంస్కృతి, విలువలు, విశ్వాసాలు ప్రముఖ పాత్రను పోషిస్తాయి.

## సంస్కృతి :

సమాజంలోని వ్యక్తుల ప్రవర్తనా ఫలితంగా ఏర్పడిందే సంస్కృతి. అంటే సంస్కృతి సమాజ ఫలితంగా ఏర్పడుతుంది. సంస్కృతి మానవ నిర్మితమైనదే అందుకే మనిషి చేసే పనులనే సంస్కృతీ అన్నారు. కొత్త తరం వారికి అవసరమైనవన్నీ అందించేది సంస్కృతి. పరిణామ శీలం కలిగినది సంస్కృతి. సమాజ అవసరాలను బట్టి సంస్కృతిలో మార్పులు చేర్పులు వస్తాయి. మానవలు అంతకు ముందుతరాలవారిని నుంచి నేర్చు కోవటం వల్ల

ఇది ఏర్పడుతుంది. భాషా, కళలు మొదలైనవి నేర్చుకొంటెనే వస్తాయి. మనిషికి తనకు అవసరమైన హెూదా, గౌరవం, తిండి, బట్టలు పొందడం సంతృప్తినిస్తుంది. సంస్కృతుల మధ్య ఆదాన ప్రదానాలుంటాయి. అనుకరణ అనేది ఆదరణలకు నిలయమై పంచుకోబడేదిగా ఉంటుంది. నిరంతరం మారుతూ ఉండటం దాని లక్షణం. ఆలోచన, భావం అనేవి దాని లక్షణాలే కనుక సంస్కృతి మారుతూ గతిశీలంగా ఉంటుంది. సంస్కతి విస్తృతంగా వికాసం పొందితే అది మెల్లిమెల్లిగా కొద్ది తేడాలతో మరొక సంస్కృతిగా పరిణామాన్ని పొదుతుంది. ఒకే రకమైన సంస్కృతి ఉన్న వేర్వేరు వ్యక్తుల మధ్య పరస్పర సంబంధాన్ని సంస్కృతి నెలకొల్పుతుంది. అందుకె అది భిన్నత్వంలో ఏకత్వమై సమగ్రతగా ఉంటుంది. సంస్కృతి సమాజంలోని వ్యక్తుల పరివర్తనను, సామాజిక ప్రమాణాలను నియంత్రిస్తుంది. ఒక జాతి తన సంస్కృతిని మరచిపోతున్నప్పుడు దాన్ని కోల్పోయే పరిస్థితి ఎదురైనప్పుడు ఆయా విలువలను తిరిగి పాదుకొల్పడానికి ప్రబోధం అవసరమవుతుంది.

19వ శతాబ్దంలో భావనామాత్రంగా పురుడుపోసున్న ఈ సంస్కృతి అనే అలోచన రెండవ ప్రపంచ యుద్ధం నాటికి విస్తృత స్థాయికి చేరుకొని స్థిరపడిపోయింది. ప్రతీ భాషీయులకు తమదైన సంస్కృతితో పాటు కొద్ది తేడాలతో జాతీయ సంస్కృతి కూడా ఉంది. జాతీయోద్యమ కాలం నాటికి ఆంగ్లేయుల వలసపాలన, దౌష్టికాల వల్ల భారతీయ సంస్కృతికి ముప్పువాటిల్లుతున్న తరుణాన ప్రజలందరినీ ఏకతాటిపై నిలపడానికి ఇక్కడి ప్రాచీన సంస్కృతిలో భాగమైన మాతృ ఆరాధనను మౌళిక సూత్రంగా తీసుకొని ఆనాటి నాయకులు ప్రజలను మాతృదేశారాధన వైపు మళ్ళించిన ఫలితమే భారతమాత సాక్షాత్కారం.

"జయ జననీ పరమ పావనీ జయ జయ భారత జననీ
శీతశైల మణి శృంగ కిరీటా, సింహళ జాంబూ నగ పీఠా
వింధ్య మహీధర మహా మేఖలా, విమల కాశ్మీర కస్తూరి రేఖా
జయ జననీ పరమ పావనీ జయ జయ భారత జననీ
గంగా సింధూ మహానదీ, గౌతమీ కృష్ణా కావేరీ
క్షీరసార పరిపోషిత కోమల సస్య విశాలా శ్యామలా
జయ జననీ పరమ పావనీ జయ జయ భారత జననీ"

(సముద్రాల రాఘవాచార్య, మనదేశం, 1949)

మహాకవి రవీంద్రుని జనగణమన స్ఫూర్తితో సాగిన ఈ రచన దేశౌన్నత్యాన్ని చాటుతూనే జనసమీకరణకు పిలుపునిస్తుంది. సాంస్కృతికాంశమైన మాతృదేవతారధనతో ప్రజలలో ఏదో తెలియని భక్తిభావన కలిగి మాతృదేశ విముక్తి ప్రతి పౌరుడి బాధ్యతనే తలపును వికసింపజేసిన గేయమిది.

భారతీయులు ఆదినించి వీరశురులే, సహనమే ఆభరణంగా వెలుగొందినా అవసరమైనప్పుడు శౌర్య ప్రతాపాలను ప్రదర్శించినవారే. పరాయి పాలనలు, స్వార్థ పూరిత సజాతీయులు, కాలం కలసిరాక బానిస సంకెళ్ళను పెనవేసుకున్నా, మన వీరచరితులను ఆవాహన చేసినప్పుడు ఒక్కొక్కడు అరివీరభయంకరులై సమరరంగాన దుమికిన సన్నివేశాలు కోకొల్లలు.

"రామ రామ శ్రీరామారామా రామరఘురామ తందానతాన
పురగిరి రాజులు పూత చరిత్రులు పురుష సింహములూ
పరాయి రాజులు పారదోలినది వారల పౌరుషమూ
పరరాజ్యములను పాలించినది వారల పౌరుషమూ
.............................................
విని మీ శక్తిని రాజభక్తిని వెల్లడి చేయండి."

(రచయిత ఎవరో తెలియదు, చండిక, 1940)

ఈ పాట 'చండిక' చిత్రంలోని ఓ బుర్రకథ. ఇది ఒకరకంగా వీరగాథ కోవకు చెందిందే. వీరగాథలు మన సంస్కృతిలో ఒక భాగమే కదా. పల్లెపదాలు, వంత

హాస్యాలు, బిగువైన కథనాలు, పద్యాలు, పాటలు అన్నిటినీ కలుపుకొంటూ సరదా సరదాగా సాగిపోయే ఒక జానపద కళారూపం. పరిమితమైన ఆహార్యంతో, ఆడుతూ పాడుతూ హాస్యోక్తులు పలుకుతూ జన సామాన్యానికి చేరువగా వెళ్లే కళారూపాలలో హరికథ మొదటిది అయితే బుర్రకథ రెండవది. హరికథలో కొంత సంప్రదాయముద్ర ఉండి బుర్రకథ పూర్తిగా జానపద కళారూపం. ఈ బుర్రకథ విన్నప్పుడు గతించిన మన వైభవాలు, చల్లారిపోయిన శౌర్యప్రతాపాలు సంస్కృతిగా మారి పునర్వైభవాన్ని సంతరించుకునే విధంగా ప్రేరణ కలిగిస్తాయి.

భారతీయ సంస్కృతిని మరొక్కసారి ప్రపంచానికి చాటిచెప్పిన సుగుణవంతమైన పాట. ఏ దేశమేగినా ఎందుకాలిడినా రాయప్రోలు సుబ్బారావు రాసిన జన్మ భూమి గేయంలోని పంక్తిని తీసుకొని సినారె అల్లిన అత్యద్భుతమైన గేయమాలిక అమెరికా అబ్బాయి చిత్రం లోనిది.

"ఏ దేశమేగినా ఎందుకాలిడినా, ఏ పీఠమెక్కినా ఎవ్వరెదురైనా
పొగడరా నీ తల్లి భూమి భారతిని, నిలుపరా నీ జాతి నిండు గౌరవమూ...
రాయప్రోలన్నాడు ఆనాడూ..అది మరిచిపోవద్దు ఏనాడూ..
పుట్టింది నీ మట్టిలో సీత, రూపు కట్టింది దివ్య భగవద్గీత
వేదాలు వెలసినా ధరణిరా, ఓంకార నాదాలు పలికినా అవనిరా
ఎన్నెన్నొ దేశాలు కన్ను తెరవని నాడు, వికసించె మననేల విజ్ఞాన కిరణాలు"

(సి.నారాయణరెడ్డి, అమెరికా అబ్బాయి,1986)

ఈ పాట మొదటి చరణమంతా మన ఘనమైన సంస్కృతి వారసత్వ వాహినై తరతరాలుగా మన నరనరాన ఎలా ప్రవహించిందో, మన మూలాలు ఎంత మహత్తర మైనవో తెలియజేస్తుంది. ఇది విన్నప్పుడల్లా మనిషిలో సాంస్కృతికపరమైన ఆలోచనలు, దేశాభిమానం జాగృత మౌతుంది.

## విలువలు :

ఆధునిక సిద్ధాంతాలపరంగా అభివృద్ధి చెందుతున్న సమాజంలో అనేక రకాలైన విలువలు నిర్వచించబడ్డాయి. వాటిల్లో నైతిక, మానవీయ, ఆరోగ్య, ఆర్థిక, విద్య, కుటుంబ, శాస్త్రీయ, భౌతిక (క్రీడలు, కళలు), సాహిత్య విలువలు ఉన్నాయి. వీటన్నింటిలో మనిషిని ఎల్లవేళలా ప్రభావితం చేసేవి నైతిక, మానవీయ విలువలు. ఈ విలువలు వ్యక్తిత్వ వికాసంలో ప్రసరించాయో కొన్ని సినీగేయాలను చూద్దాం.

### నైతిక విలువలు :

నైతిక విలువలంటే ఒక వ్యక్తి యొక్క వ్యక్తిత్వాన్ని ప్రదర్శించే సానుకూల, ప్రతికూల చిత్రాలు. అతని ప్రవర్తన పర్యవసానంగా ప్రదర్శితమైయ్యే సన్నివేశాలు. మొత్తం సమాజం ఆచరించే అలవాటు లేదా ఆచారం వలె నైతిక విలువలు ఒక సమాజం మొత్తం కట్టుబడి ఆచరించే నియమాలు. కాలాన్ని బట్టి, సమాజాన్ని బట్టి వీటిల్లో కొద్ది తేడాలుండే అవకాశం ఉంది.

"నీతికి నిలబడి నిజాయితీగా పదరా ముందుకు పదరా పదరా ముందుకు పదరా
నీతికి నిలబడి నిజాయితీగా పదరా ముందుకు పదరా చల్ రే బేటా చల్ రే
తాతల తండ్రుల అర్జన తింటూ జల్సాగా నువ్వు తిరగకురా
కండలు కరగగ కష్టం చేసి తలవంచక జీవించుమురా"

(కొసరాజు, పూల రంగడు 1967)

నీతికి నిలిచినవాడు ఏటికే కాదు, సముద్రానికైనా ఎదురీదుతాడు. నీతి తప్పిన వాడు తన నీడను చూసి కూడా భయపడుతుంటాడు. నీతికి నిలబడడం ఒక హుందాతనాన్ని తెచ్చిపెడితే నీతి తప్పడం మనిషిని అన్ని కోణాలలో పతనం చేస్తుంది.

ఇక మనిషి పుట్టుక పుట్టిన తర్వాత ఏదో ఒక పని చేస్తునే ఉండాలి తప్ప తాతతండ్రులు సంపాదించిన ఆస్తిపాస్తులపై ఆధారపడి సోమరిగా జీవించేబదులు కష్టపడి చెమటోడిస్తే తనతొ పాటు సమాజాభివృద్ధి కూడా సాధ్యపడుతుంది అని ప్రబోధించే గేయమిది. పని, వృత్తి పట్ల విరక్తి కలిగి పనిపాటా లేకుండా బ్రతుకీడ్చే పరాన్నజీవులకిది మేల్కొలుపు. ఇక్కడ కష్టించడం ప్రతీ ఒక్కరి నైతిక బాధ్యత.

"జయమ్ము నిశ్చయమ్మురా భయమ్ము లేదురా
జంకుగొంకు లేక ముందు సాగిపొమ్మురా సాగి పొమ్మురా
ఏనాటికైన స్వార్ధము నశించి తీరును
ఏరోజుకైన సత్యమే జయించి తీరును... జయించి తీరును
కష్టాలకోర్చుకున్ననే సుఖాలు దక్కును... సుఖాలు దక్కును"

(కొసరాజు, శభాష్ రాముడు 1959)

ఈ పాట వింటే మనకు ఆంధ్రమహాభారతంలో తిక్కన రాసిన గుర్తురాక మానదు.

సారపు ధర్మమున్ విమలసత్యముఉ బాపముచేత బొంకుచేఉ
బారముఉ బొందలేక చెడఉబాఱినదైన యవస్థ దక్షులె
వ్వార లుపేక్షచేసిరది వారలచేటగుఉ గాని ధర్మ ని
స్తారకమయ్యు సత్య శుభదాయక మయ్యును దైవ ముండెడున్.

ఉత్తమమైన ధర్మం - పాపము చేత. ఏ మలినమూ లేని సత్యము - అసత్యము చేత, గట్టెక్కలేక, దరి చేరలేక చెడబారిపోవడానికి సిద్ధం అయిన నేపథ్యంలో సామర్థ్యం-దక్షత కలిగిన వారు, పరిస్థితిని చూస్తూ కూడా ఉపేక్ష వహిస్తే అది వారికే చేటు కలిగిస్తుంది కానీ ఇవన్నీ చూసి ధర్మాన్ని గట్టెంకించే, సత్య-శుభ స్థితులని యోగ్యులకు కట్టబెట్టే దైవం మాత్రం ఎల్ల వేళలా ఉంటుంది. అంటాడు రాయబారం సభలో కృష్ణుడు. ఈ విషయంతో పాటు కష్టేఫలీ అన్న సత్యం కూడా గోచరమౌతుంది.

## మానవీయ విలువలు :

సమాజంలో సామరస్యాన్ని మరియు సహజీవనాన్ని సులభతరం చేసే నియమాల కూటమే ఈ మానవీయత. ఇవి మానవాభివృద్ధిలో ముఖ్యమైనవి. తమను తాము జయించటానికి మరియు ఇతరులపై ప్రేమతో ప్రజలు చేసిన ప్రయత్నాల ఫలితంగా ఉద్భవించిన విలువలు ఇవి. సహనం, ప్రేమ, శాంతి, దయ, పరస్పర నమ్మకం, పరస్పర గౌరవం, సమన్యాయం, స్వేచ్ఛ, శాంతి, బాధ్యత మానవీయ విలువలలో ముఖ్యమైనవి.

# తండా కన్నీరు కారుస్తుంది!

- డా॥. మహ్మద్ హుసేన, తెలుగు అధ్యాపకులు, ఖూవీ ప్రభుత్వ బాలుర, జూనియర్ కళాశాల, నల్లగొండ.

గురువులు
జీవన తత్త్వాన్ని ...
జీవిత తత్త్వాన్నిఎరుకపరుస్తారు ...
ఉన్న స్థానం నుండి, ఉన్నత స్థానానికి చేరుస్తారు ...
మనిషిని మనీషిగా మారుస్తారు ...
అభ్యసనా వైకల్యాలు, ప్రవర్తనా లోపాలు సరి దిద్దుతారు ....
గురువులతో చెలిమ, జన్మ జన్మల కలిమి ...

'గురువు' వ్రాసిన గ్రంథానికి సమీక్ష చేయడమంటే కత్తిమీద సాములాంటిదే. అయినా సాహసం చేస్తున్నాను. ఆచార్య సూర్యా ధనంజయ్ అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగు శాఖాధిపతి. మన నల్లగొండ బిడ్డ. నాకు పరిశోధనా పర్యవేక్షకులు. వారి మార్గదర్శనంలో పిచ్.డి. పూర్తిచేసి డాక్టరేట్ పట్టా పొందాను. అందుకే వారు రచించిన బంజారా నానీలను సమీక్షించ దలిచాను. ఇది నా గురు దక్షిణగా భావిస్తు న్నాను.

'బంజారా నానీలు' కరదీపిక లాంటి పుస్తకం. అందులో బంజారాల అస్తిత్వానికి, జీవన స్థితి గతులకు సంబం ధించిన అనేక వాస్తవాలపైన పదునైన పద ప్రయోగంతో కూడిన కరవాలం లాంటి నానీలు మనకు దర్శనమిస్తాయి. బంజారాలు భారతదేశంలో ఈశాన్య రాష్ట్రాలు మినహా అన్ని రాష్ట్రాల్లో నివసిస్తున్నారు. వారిని ఒక్కో రాష్ట్రంలో ఒక్కో పేరుతో పిలుస్తారు. వారిని తెలంగాణలో లంబాడీలని, ఆంధ్ర ప్రదేశ్ లో సుగాలీలని, దేశమంతటా లమాని, లంబాని, లభాన్ లని పిలుస్తారు. వీరి వేష భాషలు, సంస్కృతీ సంప్రదాయాలు, జీవన విధానం ఒక విశిష్టతను కలిగి భిన్నరీతిలో ఉంటాయి. అయినా వారు భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతూ వివిధ ప్రాంతాల సంస్కృతులలో మమేకమై జీవితున్నారు. ఒకప్పుడు సంచార జాతిగా ఉన్న బంజారా జాతి ఆధునిక యుగంలో 'తండా' (స్థిరనివాసాలు) ఏర్పరచుకొని జీవిస్తున్నారు. భారత దేశ చరిత్రలో వారికి ఒక ప్రత్యేకమైన స్థాన మున్నది.

విలక్షణమైన జీవన విధానం బంజారాల సొంతం. అయినా అందరు పేదల్లాగే వారికీ కష్టాలు, కడగండ్లు న్నాయి. ఐతే వారి విలక్షణతను, జీవన విధానాన్ని, కష్ట నష్టాలను లోకానికి చాటి చెప్పే సాహసం ఇంతవరకు ఎవరు చేయలేదు. ఆచార్య సూర్యా ధనంజయ్ 'బంజారా నానీల'ను రచించి సాహితీలోకానికి బంజారాల అస్తిత్వాన్ని, కష్టాలను, కడగండ్లను తెలియజేశారు. ఇక బంజారాల అస్తిత్వానికి ప్రతీకలుగా నిలిచినా కొన్ని నానీలను పరిశీ లిద్దాం.

"బంజారాలంటే
వనచరులే!
అందుకేవారి మాటల్లో
అడవిపరిమళం!

పై నానీని పరిశీలిస్తే బంజారాలు వనాల్లో సంచరించే గిరిజన జాతి అని, స్వచ్ఛమైన మనసులు కలవారని, ఆధునికతకు లోబడి వారి మనసులు ఇంకా కలుషితం కాలేదని మనకు తెలుస్తుంది.

తండా కూడా
నాగరికం నేర్చుకుందే!
కాళీ, ఫెట్యాలను
చీర ఎత్తుకెళ్లింది.

బంజారాలు నివసించే తండాలు సాధారణంగా మారు మూల ప్రాంతాల్లో ఉంటాయి. నగరీకరణ ప్రభావం పూర్తిగా వాటి దరిచేరకున్నా ఆధునిక సమాజపు ప్రభావం

వారి దుస్తుల పైన ఉంది. వారి మహిళల సంప్రదాయ దుస్తులైన కాళీ (రైక), ఫెట్యా (లంగా) ల స్థానంలో చీర లొచ్చేశాయని ఈ నానీ తెలియజేస్తుంది. బంజారా సంస్కృతి పైన ఆధునికత ప్రభావం ఎంతగా ఉందొ రచయిత్రి ఈ నానీ ద్వారా మనకు తెలియజేస్తున్నారు.

మా అమ్మానాన్నలు
మట్టి మనుషులు
అందుకే మా ప్రేమల్లో
ఇంత గట్టిధనం.

బంజారాలు మట్టితో సహవాసం చేసే కష్ట జీవులు. అందుకే రచయిత్రి బంజారా అమ్మానాన్నలను మట్టి మనుషులు అని సంబోధించారు. మట్టి లాగా బంజారాల బంధాలు కూడా బలంగా పెనవేసుకుంటాయని నర్మ గర్భంగా ఈ నానీలో తెలియజేశారు.

భాషలెన్నో నేర్చాను
కాని యాడి నేర్పిన
లంబాడీ భాషే
నాకు శ్వాస.

భాష గురించి విలక్షణంగా చెప్పిన నానీ ఇది. బంజారా తండాల్లో కొన్నేళ్ళక్రితం చదువుకున్న వారు చాలా తక్కువ. నేడు వారు కూడా చదవుకుంటున్నారు. వారి లిపి లేని 'గోర్బోలి' (లంబాడి) భాషతో పాటు ఇతర భాషలైన తెలుగు, హిందీ, ఇంగ్లీషు భాషలు కూడా నేడు నేర్చుకుంటున్నారు. కాని ఎన్ని భాషలు నేర్చినా అమ్మ నేర్పిన 'లంబాడి' భాషే నాకు ప్రాణవాయువులా అని పిస్తుందని చెప్పడం వల్ల రచయిత్రికి తన మాతృభాషపైన ఉన్న మక్కువ మనకు తెలుస్తున్నది. నిజంగా ఎవరికైనా కన్నతల్లి, తల్లిభాష అంటే ప్రాణమే!

ఆ తండాలో
కొండ గాలి లేదు
బంజారాహిల్స్ లో
బంజారాలూ లేనట్టు.

ఈ నానీ నేటి లంబాడీ తండాల దీనమైన స్థితిని తెలియజేస్తుంది. కొండల్లో కోనల్లో ఉన్న తండాల్లో కొండా గాలి కరువయ్యిందని తెలియజేయడంలో తండాలు సంతోషంగా లేవని మనకు తెలుస్తున్నది. అలాగే బంజారా హిల్స్ లో కూడా బంజారాలు లేరు. ఒకప్పుడు బంజారా హిల్స్ బంజారాల చారిత్రిక నివాస స్థానం, అందుకే ఆ ప్రాంతానికి 'బంజారా హిల్స్' అని పేరొచ్చింది. కానీ నేడు అక్కడ వారి భూములు అన్యాక్రాంతమై పోయి, వారికి నిలువ నీడ లేకుండా పోయింది. ఆ వేళా ఎకరాల భూములన్నీ సంపన్నుల విలాస ప్రాంతంగాలుగా మారి పోయాయి. బంజారా తండాల్లో కొండా గాలికి, బంజారా హిల్స్ లో బంజారాలు లేని విషయంతో పోల్చడంవల్ల బంజారాల అస్తిత్వం పైన సామాజిక అణచివేత పైన రచయిత్రి నిరసనను తెలియజేస్తున్నది. బంజారాల సామాజిక వెనుకబాటు పట్ల రచయిత్రి తన ఆవేదనను తెలియజేస్తుంది.

ఆ సువాసన
ఎక్కడి నుంచో తెలుసా ?
మా యాడి తొక్కు నూరే
రోటిలోంచి.

అమ్మచేతి వంట ఎంత కమ్మగా ఉంటుందో కదా! రచయిత్రి కూడా ఆమె అమ్మ చేతి తొక్కు సువాసన మరిచిపోలేదు సుమా! అమ్మ రోటిలో తొక్కు నూరుతుంటే ఆ సువాసన అల్లంత దూరాన గుప్పుమంటుందట మరి. అమ్మ మీద ప్రేమకు తార్కాణంగా నిలిచే ఈ నానీలో బంజారాల జీవన విధానం మనకు తెలుస్తుంది.

కట్టెల మోపులకే
పైసలిచ్చారు
మరి అంత దూరం
మోసుకొచ్చి నందుకు?

బంజారాలు ఎక్కువ శాతం పేదలే. వారు అమాయ కత్వం, స్వచ్ఛతను ఆభరణాలుగా కలిగి ఉంటారు. అడవిలో కట్టెలు సేకరించి దగ్గర్లోని ఊళ్లకు, అంగళ్లకు

వెళ్లి అమ్ముకోగా వచ్చిన డబ్బుతో జీవనం గడుపుతారు. కానీ వారికి వచ్చే ఆదాయం వారి కష్టానికి తగ్గట్టుగా రాదని తెలియజేసే ఈ నానీలో శ్రమ దోపిడికి ఆనవాలుగా నిలిచే వారి బ్రతుకు చిత్రం మనకు చూపిస్తుంది.

గుండెనిండా
తండా జ్ఞాపకాలు
ఎన్నిటికి వాడని
మమతల పూలు.

ఎన్ని చదువులు చదివినా, ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండే గుణం చాలా గొప్పది. పుట్టిన తండా జ్ఞాపకాలను గుండెలో పదిలంగా దాచుకొని ఆ మమతల పూల సువాసనలు గుర్తుకొస్తున్నాయని రచయిత్రి తన తండా జ్ఞాపకాలను నెమరువేసుకుంటున్న తీరు ఈ నానీలో మనం చూడవచ్చు.

పెప్సీలెందుకు
పనికొస్తాయి
యాడి వండి పెట్టిన
లాప్సి ముందు?

యాడీ (అమ్మ) చేతి వంట ముందు ఏదైనా దిగదుడుపే! బంజారాల ప్రత్యేక తీపి వంటకం లాప్సి. అమ్మ వండిన 'లాప్సి' ముందు పెప్సీ కోలాలు దేనికీ పనికి రావని తెలియచేసే నానీలో అమ్మపై ప్రేమను తెలియజేస్తుంది.

ఏ భీయా
నీ సంస్కృతి ఏదయా?
వ్యాపారీకరణ
నీకు సోకిందా ...?

మారుమూల ప్రాంతాల్లో ఉండే బంజారా తండాలు వారి సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకాలుగా నిలుస్తాయి. తండా అంతా ఒకే కుటుంబంగా నివసించేవారు. అక్కడ ఒకప్పుడు సమ సమాజం తొణికిసలాడేది. కానీ నేడు అక్కడ కూడా వ్యాపార ధోరణి మొగ్గదొడిగింది. ఒకప్పటి తండా సంస్కృతిని జ్ఞాపకం చేస్తున్న నానీ ఇది.

తండా కూడా
కన్నీరు కారుస్తుంది
గోరేటి వెంకన్!
జర ఇటు చూడన్నా!!

ప్రపంచీకరణ ప్రభావం నేడు పల్లెలపై పడి అనేక చేతి వృత్తులు కనుమరుగవుతున్నాయి. ఈ హృదయ విదారక దృశ్యాన్ని ఆశు కవి గోరటి వెంకన్న కళ్ళకు కట్టినట్లు తన కవిత్వంలో చూపించిన నేపథ్యంలో, తండాలు కూడా కన్నీరు పెడుతున్నాయని, వాటి వైపు నీ దృష్టి పడలేదా అన్నా అని ప్రశ్నిస్తున్నది ఈ నానీ. ప్రపంచీకరణ ప్రభావం తండాలకు కూడా సోకిందని తెలిపే నానీ ఇది.

లంబాడీలకు
వేదాలు తెల్వదంటారేం!
అరణ్యాల్లో పలికేవి
ఆ ధ్వనులేగా!

తండాల్లోని లంబాడీలు పామరులు, వారు వేదాలు చదువుకోకపోయినా వేదాల సారాన్ని అడవుల్లో, బ్రతుకు బడిలో నేర్చుకుంటారు. బంజారాలు అరణ్యాల నుండే వచ్చిన సంస్కృతిలోనుండి వారికి వేదాల సారం తెలుస్తుం దని బంజారా సంస్కృతి ఔన్నత్యాన్నితెలియజేశారు.

"చంప్లి"ని
చంపకండిరా
అది
రేపటి ఛాంపియన్!

ఆడపిల్లలను కడుపులో ఉన్నప్పుడే చంపే వాళ్ళున్న లోకం ఇది. మరి పుట్టిన పసికందులను పోషించే స్థోమత లేక అమ్ముకునే వాళ్ళు కూడా ఉన్న లోకం ఇది. అంతకంటే నికృష్టంగా ఆడబిడ్డ పుట్టగానే వడ్ల గింజలు నోట్లో వేసి చంపే వాళ్లు కూడా ఉంటారు. తండాల్లో ఇలాంటి ఆగడాలు ఇంకా జరుగుతూనే ఉన్నాయి.

పేదరికం, నిరక్షరాస్యత, మూఢనమ్మకాల ప్రభావం వల్ల ఆడ పిల్లల్ని పురిట్లోనే అమ్ముకునే దుస్థితి నేటికీ బంజారా తండాల్లో జరుగుతున్న తీరు చుస్తే బాధ కలుగకమానదు. దేవరకొండ, అచ్చంపేట, అదిలాబాద్, అమ్రాబాద్ చుట్టుప్రక్కల గల గిరిజన తండాల్లో ఇప్పటికీ ఇలాంటి సంఘటనలకు సంబంధించిన వార్తలు వినవస్తుంటాయి. గర్భంలో ఉన్నప్పుడు కాకుండా, పుట్టిన తరువాత ఆడపిల్లల్ని చంపడం, అమ్మడం గిరిజనుల అమాయకత్వానికి నిదర్శనం. ఆడపిల్లల్ని చంపకండి అదే ఆడపిల్ల రేపటి" పి.వి.సింధు, మీరాబాయిచాను "లాగ ఓలింపిక్ ఛాంపియన్ కావచ్చు అంటూ హెచ్చరిస్తారు రచయిత్రి.

'బంజారా నానీలు' బంజారాల బతుకు చిత్రాన్ని మన కళ్ళకు కట్టినట్లుగా చూపిస్తాయి. ఆచార్య సూర్య ధనంజయ్ ఎంత ఎదిగినా ఒదిగే గుణమున్న రచయిత్రి. తన మూలాలను మరచిపోకుండా, జన్మించిన తండా అస్తిత్వాన్ని తన జ్ఞాపకాల్లో పదిలంగా దాచుకొని, మూటగట్టి 'బంజారా నానీల' భరిణను సమాజానికి అందించారు. ఆ భరిణలో బంజారాల జీవన స్థితిగతులు, కష్టాలు, కడగండ్లు, తాండాలపై ప్రపంచీకరణ ప్రభావం మొదలైనని కళ్ళకు కట్టినట్లుగా కనిపిస్తాయి. బంజారాల స్థితిగతులపై ఆలోచనలు రేకెత్తించే నానీలు, వారి అస్తిత్వాన్ని బయటి ప్రపంచానికి తెలియజేసే నానీలు ఇంకెన్నో ఇందులో ఉన్నాయి. బంజారాలకు సంబంధించిన సమగ్రమైన సమాచారాన్ని సూక్ష్మంలో మోక్షం లాగా సంక్షిప్తంగా నానీల రూపంలో సమాజానికి రచయిత్రి అందజేశారు. ఈ గ్రంథం సాహితీలోకంలో ఒక విలక్షణమైన కలికితురాయి. సాహిత్య పరిశోధక విద్యార్థులకు కూడా చక్కని దిక్సూచి.

BHAVAVEENA
Vol. 18, Issue. 9, September 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# సాహితీ స్రష్టల సాహితీ రూపాన్ని ఆవిష్కరించిన నియోగి

- నాగెల్లి ప్రభాకర్

సాహిత్యం సమాజానికి అద్దం పడుతుంది. ఏ కాలంలో ఉదయించిన సాహిత్యానికైనా ఆనాటి జన జీవన చిత్రణ చేయకమానదు. లోకవృత పరిశీలనను రచనల్లో ప్రతిఫలింపచేయాలన్న రచనా నియమం ఉం డనే ఉంది. సమకాలీనతను ప్రతి ఫలించకుండా ఏ రచనను కవి రాయడు. ఒకవేళ రాసినా అది లోకంలో కలకాలం నిలవదు. సమకాలీన సామాజిస్థితులను సాహిత్యంలో యధాతథంగా ప్రతి ఫలింప చేయ్యాలనీ నియోగి ఆధునిక సాహిత్యంలో అనేక ప్రక్రియల్లో రచనలు వెలువరించారు. కవిత్వం, కథలు, సాహిత్య చరిత్ర, సాహిత్య విమర్శ వ్యాసాలు, సమీక్షలు, పీఠికలు ఇంటర్వ్యూలు- ప్రశ్న జవాబులు మొదలైన ప్రక్రియల్లో అనేక రచనలు వెలయించారు. నియోగి రచన నిండా సమాజం కనిపిస్తుంది. ఆ రచనల్లో సమాజ సమస్యలు వాటి పరిష్కారాలు ఉంటాయి. ఆ పరిష్కారాలు కూడా మానవత్వం భూమికగా సాగుతాయి. నియోగి రచనల్లో అక్షర నక్షత్రాలు, అక్షర ముద్రలు ఆయన ప్రతిభకు నిదర్శనం.

శ్రీశ్రీ ప్రభావం పడని ఆధునిక కవి, అభ్యుదయకవి లేదు. ఆయన మహాప్రస్థానం ప్రభావం నియోగి పైన కూడ ఉంది. సమాజంలో అన్యాయానికి గురవుతున్న ధీన, హీన జనావళి ఘోషలను వస్తువులుగా తీసుకొని నేను ఎన్నో గీతాలు రాశారు. శ్రీశ్రీ కుక్కపిల్ల, అగ్గిపుల్ల, సబ్బు బిళ్ల హీనంగా చూడకు దీనిని కవితా మయ మేనోయి అన్ని అన్న మాటలు ఆయన ప్రేరణగా నిలిచాయి. ప్రాచీన కవులలో కవిత్రయం, పోతనను, ప్రబంధ కవులలో పెద్దనను, రాయలను, ధూర్జటిని, తెనాలి రామకృష్ణుని, వేమన ఇత్యాది కవులను ఇష్టపడ్డారు. ఆధునిక కవులలో రాయప్రోలు, గురజాడ, జాషువ, దువ్వూరి రామిరెడ్డి, దాశరథి, తిలక్, వేదుల, విశ్వనాథ, అనిశెట్టి, శేషేంద్ర, సోమసుందర్, సినారె మొ॥కవులను ఇష్టపడారు.

శ్రీశ్రీ మహాప్రస్థానం ఆయను ఇష్టమైన కవితాసంపుటి. శ్రీశ్రీ కవిత్వం నియోగిని అమితంగా ఆకర్షించింది. తొలి దశలో ఆయన అనుభూతి ప్రభావం ఉన్నా తరువాత ఆయన సొంత గొంతుతో తరువాత అనేక రచనలు చేశాను. సమాజం శ్రేయస్సు కోరుకునే విధంగా వస్తున్న రచనలు చాలా తక్కువ వ్యాపార సంస్కృతిని పెంచి పోషిస్తున్న రచనల ద్వారా సమాజానికి అపకారము జరుగుతున్నది. ఏమైన "విశ్వ శ్రేయః కావ్యం" అన్న లక్ష్యంతోనే కవి రచనలు చేస్తున్నారు. సరళమైన భాష సమాజానికి సార్వకాలిక సందేశము. శ్రీశ్రీ అన్నట్టుగా కదిలేదీ, కదిలించేదిగా ఉండాలి. పరిపూర్ణ బ్రతుకిచ్చేది యును ముందుకు నడిపించేది గాను ఉండాలి. ఓ అందమైన మానవతా ప్రపంచాన్ని నిర్మించేదిశగా యువకవుల కలాలు ముందుకు సాగాలి. నియోగికి సాహిత్య సృజనలో మునిగి తేలడం తప్ప మరో వ్యాపకం లేదు. నియోగి నాలుగు దశాబ్దాల క్రితమే కవిత్వాన్ని ప్రవృత్తిగా చేపట్టి వివిధ పత్రికల్లో వచన కవితలు రాసి ప్రచురించడం జరిగింది. సమాజ కోణంలో నిశిత పరిశీ లనా శక్తి ఒకటి ఆయునకబ్బింది. ఆయా సందర్భాలను, సంఘటనలను కవితా వస్తువులుగా తీసుకొని, అంతరంగంలో నిలుపుకుని కవిత్వంగా ఆవిష్కంచడంలో ఒక ప్రతిభను కనబరుస్తారు. మానవతావాదానికి పెద్దపీట వేశారు. ఇటువంటి ఘెర సంఘటనలను విన్నప్పుడు, చూసినప్పుడు చలించిపోతాడు. తాను సృజిస్తూ ఇలా ఈ కవితను భావతీరాలకు వడివడిగా నడిపించుకు పోతారు నియోగి.

సాహిత్యం సమాజాన్ని మారుస్తుందనే చెప్పాలి. ఆనాటి గురజాడ సాహిత్యం సమాజంలో ఎంత మార్పు

తీసుకువచ్చిందో అనుభవైక వైద్యమే ! ఆరోజుల్లో సమాజోద్ధరణ బాధ్యత. తమ భుజస్కంధాల మీద వేసుకున్నవారు గురజాడ, కందుకూరి వీరేశలింగం పంతులు తమ సాహిత్యంలో బీజం వేశారు. "దేశమును ప్రేమించుమన్నా, మంచి అన్నది పెంచుమన్న" అన్న గురజాడ దేశభక్తి కవిత్వం జనాన్ని మంత్రముగ్ధులని చేసింది. సాహిత్యం రాత్రికి రాత్రే సమాజాన్ని మార్చి వేస్తుందని చెప్పలేం. పరిణామ క్రమంలో మార్పు సంభవం.

తెలంగాణ తెలుగు సాహిత్యంలో ద్విపద సాహిత్యానికి ఆద్యుడైన పాల్కురికి సోమనాధుడు, తెలుగు ప్రజలకు మొదటిగా భాగవతాన్ని అందించిన పోతన వంటి మహాకవులను ప్రత్యేకంగా పేర్కొన్ని వారి పద్య సాహిత్యాన్ని విశ్లేషిస్తూ అభిమానాన్ని చాటుకున్నాడు. ఈ విధంగా నియోగి ప్రాచీన కవిత్వంలో పద్యానికి పెద్దపీట వేసి పద్య సాహిత్య వైవిధ్యానికి బాటలు వేశారు. పద్యం ఆదినుండి తెలంగాణలో పరిపుష్టి చెందిందని, పద్య కవిత్వానికి మూలాలు ఇక్కడి కవిత్వంలో కనిపిస్తున్నాయని తన సాహిత్య చరిత్రలో పేర్కొన్నారు. దాశరథి కృష్ణమాచార్యతో పద్యం ఒక కొత్త రూపు సంతరించుకుందని, నిజాం నిరంకుశతత్వంపై అంకుశమై పద్యం పదునెక్కిందని, దాశరథి తెలంగాణ అస్తిత్వానికి ప్రాణం పోయడానికి పద్యాయుధాన్ని ఆశ్రయించారని పద్యాన్ని రాయడంలో ఆయన అందెవేసిన వారని ఇలా ఎందరెందరో పద్యకవులు తమ పద్య కవిత్వం ద్వారా పద్యకవితా లోకంలో వెలుగొందారని నియోగి వివరించారు.

నియోగి వ్యాసప్రక్రియ ద్వారా సాహితీ అభిమానులకు దగ్గరైయ్యారని చెప్పాలి. ఈ ప్రక్రియ ద్వారా ఎంతోమంది కవుల గురించి వారి సాహిత్య గొప్పతనాన్ని గురించి అనేక పత్రికల్లో వెలుగులోనికి తీసుకొచ్చారు. ఉదాహరణకు అంపశయ్య నవీన్ గురించి రాసిన వ్యాసాలు, దాశరథ రంగాచార్య గురించి రాసిన సాహితీ వ్యాసాలు ఇక ప్రాచీన సాహిత్యంలో అనేకమంది కవులను గురించి రాసిన వ్యాసాలు నియోగికి మంచి పేరును తీసుకువచ్చాయి. వీటిలో శ్రీనాథుడు, పాల్కురికి సోమనాథుడు, పోతన, కొరవిగోపరాజు, మొదలైన ప్రాచీన కవులు గురించి ప్రాచీన వ్యాసములు సాహితీ ప్రియులకు కనువిందు చేశాయి.

నియోగి రాసిన సమీక్షలు కూడా తెలుగు సాహిత్యంలో మంచి గుర్తింపును తెచ్చాయి. కవుల మీద, కావ్యాలమీద నియోగి చేసిన సమీక్షలు చాలా విలువైనవి. ఈ సమీక్షల్లో రచయిత యొక్క మంచి చెడ్డలను ఎత్తిచూపడంలో తన ప్రతిభను చూపించారు. ఒక్కొక్కసారి రచనలో దోషాలను ఎత్తిచూపి భవిష్యత్తులో జాగ్రత్తపడమని చూచించారు. నియోగి సమీక్ష చదివితే పాఠకుడు ఆనందంతోపాటు ఒక మూలగ్రంథాన్ని చదివిన అనుభూతిని పొందుతాడు. జూకంటి కవిత్వము- మూడు సంపుటాలు, రెక్కల్లో మెరిసిన తెలంగాణ కేసరి(దినపత్రిక) గురించి వచ్చిన సమీక్షలు తరువాత ఏబికే ప్రసాద్ పత్రిక రంగం గురించి చేసిన సమీక్షలు నియోగికి మంచి పేరును తీసుకొచ్చాయి. అదే విధంగా పీఠికలు కూడా నియోగిని తెలుగు సాహిత్యపీఠంపై కూర్చోబెట్టాయి. తన నాలుగు దశాబ్దాల సాహితీ జీవితంలో అనేక పీఠికలను రాశారు. ఈ అధ్యాయం చివరలో అక్షరముద్రలు(ఇంటర్వ్యూలు) నియోగి ఈ ప్రక్రియలో ప్రసిద్ధ కవుల రచయితల, రచయిత్రుల అభిప్రాయాలను కలకాలం పాఠకులు గుర్తుంచుకునేలా ఈ పుస్తకాన్ని ముద్రించారు. రచయిత అభిప్రాయాలను సందార్భోచితంగా రాయడంలో నియోగి సఫీకృతుడైయ్యాడని చెప్పవచ్చు. ఇందులో ఆవంత్స సోమసుంధర్ నుండి సూర్య ధనుంజయ వరకు ప్రసిద్ధ వ్యక్తుల సాహితీ జీవితాన్ని సమగ్రంగా ఇందులో చర్చించారు.

నియోగి అక్షర నక్షత్రాలు కవిస్తుతిలో సంఘ సంస్కరణకు పాటు పడ్డవారు కొందరు పీడిత ప్రజల అభివృద్ధికి కొందరు, రాష్ట్ర సాధనకు మరికొందరు, తెలుగుభాషా

వృద్ధికి తోడ్పడినవారు ఇంకొందరు ఇలా ఎందరో మహానుభవావులున్నారు. అటువంటి మహనీయులు తెలుగు సాహిత్యానికి గర్వకారణమైనవారు ఉన్నారు. ఇటువంటి వారి గురించి వారి గుణగణాలను, వారి రచనలను తెలుసుకోవడం మన కనీస కర్తవ్యం వారు చూపించిన మార్గంలో ఒక్క అడుగువేసినా మనజీవితం సార్థకం చేసుకొన్నట్లుగా భావించవచ్చు. నియోగి వెలువ రించిన ఈ "అక్షరనక్షత్రాలు" ఒక అద్భుత గ్రంథమని ఘంటాపథంగా చెప్పవచ్చు. ఇది ఆయన పరిశోధనా ప్రతిభకు పట్టం కట్టే గ్రంథమనీ తెలుపవచ్చు. ఇందులో మహాకవులు, గొప్ప రచయితలు, పరిశోధకులు, విమర్శ కులు, కథకులు, నవలాకారులు జీవితమంతా సాహిత్యా నికే అంకితం చేసిన మహానుభావులు, అక్షరాలను ఆయుధాలుగా మలుచుకొని పోరాటం చేసినవారు, జైలు శిక్షలకు వెరవక ముందుకు సాగిన ఉద్యమకవులు ఇలా అనేకమంది కనిపిస్తారు. ఒక ప్రాంతమనిగాక తెలుగు రాష్ట్రాలలోని అన్ని ప్రాంతాల వారు ఈ అక్షర నక్షత్రాలలో చోటు చేసుకున్నారు. ఇందులో కొందరి గురించి మనం మొదటిసారి వినటం కూడా కనిపిస్తుంది. మరొక విషయమేమంటే ఇందులోని ఏ ఒక్కరు నేడు భౌతికంగా లేరు. 1853 నుండి 1964 వరకు జన్మించిన వారిందులో చోటు చేసుకున్నారు. ఈ నూటపది సంవత్సరాల మధ్య సాహిత్యంలో తమదైన ఒక బలమైన ముద్రను సాహిత్యలోకంలో ప్రతిష్టించి తమ ప్రజ్ఞను చాటినవారే వీరంతా. అటువంటి వారి గురించి శ్రమించి సేకరించి అందించారాయన. వీరందరి ఫొటోలు కూడా ఈ గ్రంథంలో ఇచ్చారు నియోగి. ఇంతమంచి గ్రంథం ఈ మధ్యకాలంలో రాలేదనే చెప్పాలి. శ్రమకోర్చి ఈ గ్రంథాన్ని కూర్చి అందించినందుకు తెలుగు సాహిత్యలోకం నియోగికి రుణపడి ఉంటుందని చెప్పవచ్చు.

ఈ గ్రంథంలో మనం నిత్యం తలుచుకునే విశ్వనాథ, శ్రీశ్రీ, దేవులపల్లి, కాళోజీ, దాశరథి, సినారె, జాషువా, ఆరుద్ర, శేషేంద్ర, కరుణశ్రీ, సోమసుందర్, తిలక్, సురవరం వంటి వారితో పాటు తెలుగు సాహిత్యాన్ని సుసంపన్న చేసిన శ్రీపాదకృష్ణమూర్తి శాస్త్రి, కొమర్రాజు లక్ష్మణరావు, పుట్టపర్తి నారాయణాచార్యులు, రాయప్రోలు, మునిమాణిక్యం, మొక్కపాటి వంటి వారెందరో కని పిస్తారు. ఒక ప్రణాళిక బద్దంగా వెలువడిన ఈ గ్రంథంలో ఒక్కో కవికి మూడు పేజీలపై చిలుకు కేటాయించి నప్పటికీ నియోగి ఏ ఒక్క వాక్యమూ వ్యర్థం కాకుండా ఆయా కవుల యొక్క సాహిత్యం, జీవితం అర్థం చేసుకొనేలా చేసిన ప్రయత్నంలో సఫలమైనాడు.

నియోగి అక్షర నక్షత్రాలు కవిస్తుతిలో ఆధునిక కవులను, వర్తమాన కవులను వారి కవిత్వాన్ని, కవితల విశిష్టగుణాన్ని ఇందులో స్ఫురింప జేశారు. ఆదిమ కాలం నుండి ఆధునిక కాలం దాకా తెలుగు నేత తన కంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంతరించుకొన్నది. ఈ నేల తనదైన ప్రత్యేకతను, ఔన్నత్యాన్ని కలిగి ఉంటూనే సాహిత్యపర మైన గుర్తింపు పొందింది. ఈ కవుల ఘనతను తరచి చూద్దాం.

ఈ పుస్తకంలో శతాబ్ద పైబడి కాలంలోని ప్రముఖు లున్నారు. ఎవరిని ఈ రచయిత ఏరీతిన కొలమానించారో పుస్తకం చదివితేనే తెలుస్తుంది. "నియోగిగారు తన అనుభవాన్ని, లౌక్యాన్ని రంగరించి మనముందుంచారు. కవితాసాగరంలో ఏ ఒక్క ముత్యాన్ని ఆయన వదిలి పెట్టలేదు. ఆయన భాష్యంలోనే చెప్పాలంటే తెలుగునాట ఉన్న సకల అక్షరనక్షత్రాలను సాహితీ వినీలాకాశంలో కుమ్మరించారు. అవి నిజనక్షత్రాల కన్నా దేదీప్యమానమైన కాంతులతో ఈ పుస్తకంలో మిలమిల మెరుస్తున్నాయి. తెలుగువారిలో అందరికీ వీరిలో ఏ కొందరో తెలిసి ఉం డొచ్చు. లేదా అందరి గురించి అంతో ఇంతో తెలిసి ఉం డొచ్చు. ఈ పుస్తకం చదివితే మాత్రం తెలుగు అక్షర నక్షత్రాల గురించి అందరికీ ఆసాంతం తెలియడం తథ్యమని నా ప్రగాఢ విశ్వాసం.అన్నారు. 'అక్షరనక్షత్రాలు' ఈ పుస్తకం 111 మంది ఆధునిక తెలుగు రచయితల జీవిత, పాండిత్య జీవితాల పరిచయ సమాహారం.

ఒక్కొక్కరినీ ముచ్చటగా మూడు పుటలలో క్లుప్తంగా ఆవిష్కరించారు నియోగి. రచయిత స్థలకాల పరిచయం, జీవిత వివరాలు చెప్పడం, రచనలను పేర్కొనడం, రచయితలు సాధించిన విజయాలు చెప్పడం, ఆయా రచయితల సాహిత్య విశిష్టతను కొన్ని వాక్యాలలో చెప్పడం ఈ పుస్తకంలోని ప్రణాళిక. ఈ ప్రణాళికను నియోగిగారు స్పృహలో ఉండి చక్కగా అమలు చేశారు. ఈ పుస్తకాన్ని జాగ్రత్తగా అధ్యయనం చేస్తే మనకు చాలా విశేషాలు తెలుస్తాయి.

సాహిత్యానికి సమాజానికి మధ్య ఎప్పుడు అవినాభావ సంబంధం ఉంటుంది. పరస్పర ప్రభావం అనివార్య మయి విలువలను పెంచుతుంది. ఇది సమాజం ఏర్పడిన నాటి నుంచి సాహ్యిత్యం సృజింపబడినప్పటి నుంచి నిరంతరాయంగా జరుగుతున్నవే. వాటిలోని అంశాలన్నీ ప్రయోజనాన్ని సాధించలేకపోయినా చాలా వరకు సమాజ శ్రేయాన్ని ఆకాంక్షించేవే. సమాజం పరిణామ శీలాన్ని సంతరించుకున్నట్టేది. వివిధ ఉద్యమాల ద్వారా రకరకాల ప్రభావాల ద్వారా మార్పు చెందుతూ ఉంటుంది. పూర్వకాలంలో ఉద్యమాలు అనేవి ప్రత్యేకంగా లేకపోయినా కొన్ని సంఘటనల సంఘర్షణల ద్వారా మార్పు వచ్చినట్టు కనిపిస్తుంది. ఇవి సమాజాన్ని ఆలోచింపజేశాయి. ఆధునిక కాలంలో ప్రత్యేకించి కొన్ని ఉద్యమాలు సమాజం వెంటే ఉండి పనిచేశాయి. కొన్ని సందర్భాలలో సమాజానికి ముందు నడిచాయి. వర్తమానంలో కూడా ప్రభావితం చేస్తూనే ఉన్నాయి. సాహిత్యం ఒక ప్రేరక ప్రక్రియ. అది ఎప్పటికప్పుడు సామాజిక స్వరూపాన్ని ప్రతిబింబిస్తూనే ఉంటుంది. అందుచేత తెలుగు సాహిత్యంలో సామాజిక చైతన్యం ఎల్లవేళలా ప్రతి ఫలిస్తూనే ఉంది. రచనలలో సామాజిక స్పృహలోపిస్తే అది సహజత్వాన్ని కోల్పోతుంది. పదికాలాల పాటు మనుగడ సాగించలేదు. అందుకే బీరువాలలో మాత్రమే పదిలంగా ఉండిపోతుంది. సామాజిక స్పృహ అన్నప్పుడు సమాజంలోని అన్ని పార్శ్వాలు కూడా ఈ స్పృహలోనే అంతర్భవించి ఉంటాయి. కవయఃక్రాంత దర్శినః అన్నారు లాక్షణికులు. నియోగి కూడా క్రాంత దర్శి అయిన కవి. ఆయన సమాజాన్ని భావి భారత జాతి భాగ్యోదయంగా ఆశిస్తున్నారు. తన చేతిలోని కలం ఎత్తి సమాజాన్ని హృద్యంగా గానం చేస్తూ. కవి తనను తాను సామాజికుడుగా భావిస్తున్నారు. అలాంటప్పుడు బాధ్యత తెలుస్తుంది. ఆశయం దారి చూపిస్తుంది. అయితే అది వర్తమానం, ఆగామిలోకం అభ్యుదయాన్ని సాధిస్తుంది అందుకే వాస్తవాన్ని ఒక ప్రజ్వలనతో వ్యక్తీకరించారు.

అన్ని సాహిత్య ప్రక్రియల్లో నిష్ణాతులు వీరు. అనేక సాహిత్య ప్రక్రియల్ని చేపట్టి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన మహానుభావులు వీరు. ఎన్నో అవార్డులు పురస్కారాలు సన్మానాలు పొంది ప్రముఖ సాహితీవేత్తగా ఎనలేని కీర్తి ప్రతిష్టలు గడించారు. వ్యాస విమర్శక పరిశోధకుడిగా పేరు పొందారు.

BHAVAVEENA
Vol. 18, Issue. 9, September 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# తెలుగు వాఙ్మయం – కథాకావ్యాల వైశిష్ట్యం

– డా॥. ఎం.మునిరత్నం, తెలుగు శాఖాధ్యక్షులు, సర్ త్యాగరాయ కళాశాల, చెన్నై, తమిళనాడు.

సామాన్య ప్రజలలో ప్రచారంలో ఉన్న కథలకు కావ్యరూపాన్నిచ్చి, కొందరు కవులు తమ కల్పనాశక్తితో ఆ కథలను చిరస్థాయిగా నిలచేలాగా చేశారు. కవిత్రయం వారి వ్యాసభారతాన్ని ఆంధ్రీకరించే కాలంలోనే భాస్కర, రంగనాథ రామాయణ కవులు వాల్మీకి రామాయణాన్ని తెలుగు చేసిన కాలంలోనే, పోతన వ్యాసభాగవతాన్ని గురించి కావ్యాలుగా రచించే సంప్రదాయం మొదలైంది.

క్రీశ. 13శతాబ్ది ప్రారంభంలో మంచెన 'కేయూర బాహు చరిత్ర'ను కేతన దశకుమార చరిత్రను రచించి కథా కావ్యాలకు మార్గదర్శకులయ్యారు. మంచెన నుండి గ్రహించిన దానిలో ఉన్న ఇతర కథలు మంచెన కాలంలో ప్రజలలో ఉన్నవే.

లోకరీతిని, నీతిని తెల్పటంలో కథా కావ్యాలు చాలా గొప్పవి. సమాజ పరిస్థితులను అద్దంలో చూపినట్లు చూపటమే గాకుండా ప్రజలు వాటిని సరిదిద్దుకోవలసిన అవసరాన్ని తెలియజెప్పాయి. సమకాలిక సాంఘిక చరిత్రను తెలుసుకోవటానికి కథాకావ్యాలు ఉప యోగించినట్లుగా మహాకావ్యాలు ఉపయోగపడవు. శ్రీ సురవరం ప్రతాపరెడ్డి ఆంధ్రుల సాంఘిక చరిత్రలో కథా కావ్యాల ప్రాముఖ్యాన్ని నొక్కిచెప్పారు. ధీరులు, వీరులు, పుణ్యాత్ములు, భక్తులే గాకుండా సంఘంలోని పతితులు, దొంగలు, శ్రామికులు, బలవంతులు, బలహీనులు, యుక్తిపరులు, తెలివితక్కువారు. తాడిచెట్టెక్కే వారుంటే, వారిని తలదన్నేవారు ఎందరో సంఘజీవులు కథాకావ్యంలో సజీవంగా సాక్షాత్కరిస్తారు.

కేయూరా బాహు చరిత్ర (క్రీ.శ.1300)లోని వైశ్య బాలిక కథ, బ్రాహ్మణుని కథ, వేశ్యకథ, వింత పతివ్రత కథ చదివితే 14వ శతాబ్ది నాటి ఆంధ్ర ప్రజా జీవనం ఎలాం టిదో మెండుగా కనపడుతుంది. లోకంలో పోతన చెప్పిన చాటువుగా ప్రసిద్ధమైన

బాల రసాల పుష్ప నవ పల్లవ కోమల కావ్యకన్యకన్
గూళలకిచ్చి యప్పడుపుగూడు భుజించుటకంటె సత్కవుల్
హాలికులైన నేమి మఱియంతకు నాయతి లేని నాడు గౌ
ద్దాలికులైన నేమి నిజ దార నుతోదర పోషణార్థమై

అనే పద్యం కేయూర బాహు చరిత్రలోనిదే. తిక్కన శిష్యుడైన కేతన దశకుమార చరిత్ర రచించి ఉభయ కవి మిత్రుడని మెప్పు పొందాడు. దశకుమార చరిత్ర దండి సంస్కృతంలో రచించిన దశకుమార చరిత్రకు పద్య గద్య రూపమైన అనువాదం శ్రీ పింగళి లక్ష్మీ ల్మ కాంతము గారు తెలిపినట్లు మనభాషలో గల కథా వాఙ్మయ శాఖలో కేతన దశకుమార చరిత్ర ప్రథమ గ్రంథం ఆంధ్ర సాహిత్య చరిత్ర. ఇది పూర్తిగా సంస్కృత గ్రంథానికి అనువాదం కావటం చేత ఇందులో తెలుగు జాతి జీవన విశేషాలు అంతగా తెలియవు.

క్రీ.శ. 15వ శతాబ్దంలో కథా కావ్యాలు కోకొల్లలుగా వచ్చాయి. వాటిలో జక్కన 'విక్రమార్క చరిత్రము అనంతమాత్యున భోజరాజీయం, కొరవి గోపరాజు సింహాసన ద్వాత్రింశిక, పుత్తేజి రామచంద్రకవి, సకల కథాసార సంగ్రహము, వెన్నెలకంటి అన్నయ్య షోడశ కుమార చరిత్ర, కూచిరాజు ఎఱ్ఱన బేతాల పంచవింశతి, పాలనేకరికదిరీపతి శుకసప్తతి, అయ్యలరాజు నారాయణ మాత్యుని హంసవింశతి, ఎర్రన సకల కథావిధానం, బైచరాజు వేంకటనాథుని పంచతంత్రం, దూమగుంట నారాయణ కవి పంచతంత్రం మొదలైనవి ముఖ్యంగా చెప్పదగినవి.

జక్కన విక్రమార్క చరిత్రలో కథానాయకుడు చారిత్రక వ్యక్తికాడు. అట్లగని పురాణాలలోని వాడు కాదు. సాహస వంతుడైన ఒక మహావీరుని విక్రమార్కుడిగా తెలుగు

ప్రజలు ఆరాధిస్తారు. సంస్కృతంలో ఒక విక్రమార్క చరిత్ర ఉన్నది. కాని దానికది పూర్తిగా అనువాదం కాదు. నేను చూసినంతవరకు సంస్కృత విక్రమార్క చరిత్రములోని కథలు స్వల్పంగా జక్కన విక్రమార్క చరిత్రములో కనబడినను ఇందులో ఎక్కువ కథలు లేవు. అనేక కథలు ఇందులో కనపడవు. తెలుగు విక్రమార్క చరిత్రలో ఉన్న కొన్ని కథలకు మూలం అనదగిన కొన్ని కథలు బృహత్కథయందు, దాని సంస్కృతానువాదములకు కథాసరిసత్పగల సంపుటములందు కనబడును. ఆంధ్రదేశం నందుండిన కాలాన్ని ప్రజలలో ప్రచారంలో ఉన్న విక్రమార్కుని కథలను కూడా జక్కన తన కావ్యలలో చేర్చి ఉంటాడని ఊహింపబడుతుందని శ్రీ వల్లా దుర్గయ్య తెలిపారు. (విక్రమార్క చరిత్ర పీఠిక) కథాకథన చాతుర్యంలో కవితా చాతుర్యంతో జక్కన.

చక్కన నీ వైదుష్యము
చక్కన నీ కావ్యరచన చాతుర్యంబుల్
చక్కన నీ వాగ్వైఖరి
చక్కన నీ వంశమహిమ జక్కన సుకవీ

క్రీ.శ. 1450 ప్రాంతాలలో అనంతామాత్యుడు భోజ రాజీయము అనే కథాకావ్యాన్ని రచించాడు. ఇందులోని ఆవు పులి కథ తెలుగునాడులో విస్తృత ప్రచారం పొందింది. ఈ కావ్యంలో భోజుని కథ నామమాత్రమే. ఈ కథలలో భోజుడు నాయకుడు కానేకాడు. ఇవన్నీ అన్నదాన సుకృతాలను గురించి చెప్పినవి. అనంతుడు తన గ్రంథాన్ని వివిధ 'కథానూత్న రత్న భూషణాభిరామ, మనియు నూతనంబయ్యు పురాతన కృతులపట్ల సంతత శ్రావ్యమై బరగుననియు' చెప్పుకొన్నాడు. కాబట్టి భోజ రాజీయమే ఆంధ్రదేశంలో ప్రథమ స్వతంత్ర కావ్యమని చెప్పవచ్చునని శ్రీ కాటూరి వేంకటేశ్వరరావు భావించారు. ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము, ఈ కావ్యంలోని గోవ్యాఘ్ర సంవాదములో ఆవు దూడతో చెప్పిన సూక్తులు తెలుగు సాహిత్యంలో మణిపూసలుగ నిలిచిపోయాయి.

సంస్కృత భాషలోని విక్రమార్క చిరత్రలో కథలు ఆధారంగా కొరవి గోపరాజు సింహాసన ద్వాత్రింశిక రచించాడు. కేవలం సంస్కృత కథలే కాకుండా గోపరాజు ఇందులో సమకాలిక జనజీవన విశేషాలను కూడా చేర్చి ఈ కావ్యాన్ని రసవంతం చేశారు. ఆ కాలపు స్త్రీల స్వరూల స్వభావాలను, శకునముల వంటి నమ్మకాలు, వస్త్రధారణా విశేషాలు, ఆటలు, జూదం, దొంగతనం మొదలైన విశేషణ పద్ధతులను గోపరాజు పరిపూర్ణంగా తెలిపారు. సాంస్కృతికమైన శైలిని, తేటతెలుగుని కలగలుపుగా ప్రయోగించి గోపరాజు హృద్యమైన కవిత చెప్పారు.

కవితాకళకు ఏ మాత్రం లోపం రానీకుండా సాంఘిక చరిత్రకు అద్ధంపట్టిన కవి పాలనేకరికదిరీపతి. ఈయన రచించిన శుక సప్తతిలో కులాలు, వృత్తులు, ఆచార వ్యవహారాలు, వేషభాషలు, విన్యాసాలు, వినోదాలు, పత్రాలు, తిరునాళ్ళు, దాతలు, ధర్మాలు అన్నిటినీ మించి మనుష్యుల చిత్తవృత్తులను ఎంతో రమనీయంగా వర్ణించారు. సురవరం ప్రతాపరెడ్డిగారు ఆంధ్రుల సాంఘిక చరిత్రలో ఎక్కువ విషయాలను ఉపయోగించున్నారు.

కథాకావ్యాలు చదవనిదే ప్రాచీన కాలంనాటి ప్రజల జీవనం తెలియదు. మహాకావ్యాలలో సామాన్యుల జీవిత చిత్రణ అరుదుగా కన్పిస్తుంది. కథాకావ్యాలలో జాతి జీవనాడిని గమనించవచ్చు. ప్రజల సుఖదు:ఖాలు, గొప్పలు, లోపాలు అన్నీ ఈ కావ్యాలలో ప్రతిఫలించాయి. ఈ కథాకావ్యాలను మన సాహిత్యంలో విలువైన సంపదగా భావించవచ్చు.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు కథా సాహిత్యం - ఆధునిక దృక్పథాలు - ఎన్.యస్. శరత్ జోత్స్నారాణి
2. తెలుగు కథాకోశం - కాళీపట్నం రామారావు
3. తెలుగు సాహిత్య సమీక్ష - జి. నాగయ్య
4. సమగ్రాంధ్ర సాహిత్యం- ఆరుద్ర

# తెలుగు గజల్ స్వరూప స్వభావాలు

- డా॥. నందిరెడ్డి పురుషోత్తమరెడ్డి, తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కంభం, ప్రకాశం జిల్లా.

పర్షియా భాషలోని ఖసీదా అనే రూపం నుండి గజల్ వచ్చింది. పర్షియా భాషలోకి ఇది అరబ్బీ భాష నుండి వచ్చింది. ఇరాన్ లో క్రీ.శ. 10వ శతాబ్దంలో గజల్ ప్రారంభ మయింది. మహ్మదీయులతో పాటే 12వ శతాబ్దంలో గజల్ భారతదేశానికి వచ్చింది.

ఉర్దూ అవతరణతో పర్షియన్ ప్రక్రియ ఉర్దూ ప్రక్రియగా రూపుదిద్దుకుంది.

## గజల్ వివరణ :

గజల్ అంటే ప్రియురాలితో జరిపే రహస్య సంభాషణ అని అర్థం. అడవిలో లేడికి అకస్మాత్తుగా వేటగాడు ఎదురైనప్పుడు లేడి నోట్లో నుంచి తటాలున బయటికి వచ్చే పదానికి పేరే గజల్ అని గజల్ తత్వ శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు. ఒక అరబ్బు దేశంలో గజ్జాల్ అనే కవి జీవితాంతం ప్రణయ కవిత్వంలోనే నడిచిందని, అంచేత అతని క కవితా రీతి గజల్ అయిందని మరి కొందరు అంటారు.

గజల్ ముక్తాల్లో రెండు పదాల చివర ప్రయుక్తమై ఉంటుంది. రదీఫ్ షేర్ ల్లో రెండో పాదం చివర పునరావృతం అవుతుంది. రదీఫ్ కి ముంది ఉండే పదంలో అంత్య ప్రాస నియమాన్ని పాటించాలి. దాన్ని ఖాఫియా అంటారు. ఖాఫియా లోని అంతిమ వర్ణాన్ని రవీ అంటారు. ఒక్కోమారు ఈ రవీ పూర్తి అక్షరంగా కాక అచ్చుగా కాని, కేవలం హల్లుగా కానీ ఉంటుంది. ఖాఫియాతో షేర్ ఫిరిగి పోవాలి. ఖాఫియా రదీఫ్ లోకి వెళ్లకూడదు.

## గజల్ స్వరూపం :

గజల్ స్వరూప స్వభావాన్ని గూర్చి డాక్టర్ రెంటాల శ్రీ వెంకటేశ్వర్లు గారు చాలా చక్కగా వివరించారు.

గజల్ ఐదు మొదలుకొని పదకొండు, పదమూడు షేర్ ల వరకూ ఉంటాయి. ఇరవై ఐదు షేర్ ల వరకూ ఉన్న గజల్స్ కూడా ఉన్నా వాటి షేర్ ల సంఖ్య బేసిగానే ఉంచడం ప్రాచీన కాలంలో పద్ధతిగా పాటించారు. కవులు ప్రేయసి అసమానురాలు అని సూచించడం కోసం ఈ సంప్రదాయం ఏర్పడిందని ఒక కథనం. ఆధునికులు బేసి సంఖ్యను పనిగట్టుకొని పాటిస్తున్నట్లు కనబడదు.

గజల్ చివర చరణాన్ని ముక్తా అంటారు. ముక్తా అంటే జాగీరు అని అర్థం. గజల్‌లో తఖల్లున్ అని మరో నియమం ఉంది. కవిత తన నామాన్ని గాని కాలం పేరుని గాని ఒక షేర్ లో నిక్షిప్తం చేస్తాడు. ఈ కవి ముద్ర సాదారణంగా ముక్తాలోనే ఉంటుంది. అక్కడే ఉండాలన్న నియమం ఏమి లేదు. ముక్తాలో తఖల్లున్ ఉన్న గజల్ కూడా చూస్తాం అది ఇతర షేర్ లలో కూడా ఉండవచ్చు.

ప్రతి షేర్ భావరీత్యా స్వయం సమగ్రంగా ఉండాలి. భావ పరిపూర్తి కోసం ఏ షేరూ మరో షేరు మీద కాని పల్లవి మీద కాని పల్లవి మీద కాని ఆధారపడి ఉండ కూడదు. అయితే ఒక షేర్ భావం మరో షేర్ లోకి కొనసాగడం అసలు లేకపోలేదు. రెండు మూడు షేర్ లు కలిసి భావం పూర్తి కావడం ఉంటుంది. దాన్ని ఖితాబంద్ అని అంటారు. అయితే ఈ రకమైన కూర్పు చాలా అరుదు.

## గజల్ లక్షణాలు :

గజల్ ద్విపదంలో ఉంటుంది. లయాత్మకత అనేది గజల్ సామాన్య లక్షణం. రదీఫ్ గజల్‌లోని భావాల్ని కలిపి ఏకతనిస్తుంది. రదీఫ్ లేని గజల్‌ని శ్రోతలకు ఎక్కించడం కష్టం. గజల్ నిర్మాణంలో అతి కీలకమైన భాగం ఖాసియా. ఖసియా ఒక ముడిని విప్పుతుంది లేదా ఒక మెరుపుని

మెరుపిస్తుంది. అంచేతనే రెండో పాదంలో చివరగా వచ్చే ఖాఫియా మొత్తం షేర్ కి గరిమనాభి అవుతుంది.

రదీఫ్ లేని గజల్ ఉంటుంది ఖాఫియా లేని గజల్ ఉండదు. అంతే ఖాఫియా ప్రత్యేకత ఏమిటో మనకు తెలుస్తుంది.

చదువుకోవడానికి కాక ప్రధానంగా వినడానికి సంబందించిన రచన గజల్. గజల్ లోని గేయ, లయలు ఆ విషయాన్ని సుస్పష్టం చేస్తుంది.

**తెలుగులో గజల్ :**

ఉర్దూ గజల్ సంస్కారాన్ని సంప్రదాయాన్ని పాటిస్తూ తెలుగు కవులు మంచి గజల్స్ రాశారు. తెలుగు గజల్ రాసిన వారిలో ప్రముఖంగా చెప్పుకోదగ్గ వారు దాశరథి కృష్ణమాచార్యులు, ఆచార్య పి.నారాయణరెడ్డి, డాక్టర్ పెన్నా శివ రామకృష్ణ, డాక్టర్ తటపర్తి రాజగోపాలం, డాక్టర్ రెంటాల శ్రీ వెంకటేశ్వరరావు, చింతాడ రామారావు, వెంపరాల ప్రభాకర సుబ్రహ్మణ్యం, ఎస్.ఆర్. భల్లం, ఎస్.ఆర్.పృథ్వీ, చల్లా రాంబాబు, రుద్రపతి మొదలైన వారు. గజల్స్ పాడి ప్రపంచవ్యాప్తి ప్రసిద్ధి పొందిన గాయకులున్నారు. గులాం అలీ, మెహదీ హసన్, జగజిత్ సింగ్ లాంటి ఎందరో ప్రముఖులు ఉన్నారు. డి.మురళీకృష్ణ, మల్లాది సూరిబాబు, గజల్ శ్రీనివాస్ అతని సోదరుడు కె.సి.రాజు కృష్ణ గజల్ గాయకులుగా మంచి పేరు ప్రఖ్యాతులు గడించారు. ఆచార్య సి.నా.రె. గారిని ఇక్కడ ప్రస్తావించక తప్పదు. ఎందుకంటే గజల్స్ రాయడమే కాక, పాడటమే కాక, రెండు క్యాసెట్లు స్వీయ గానంతో తయారు చేశారు. ఈ క్యాసెట్లు ప్రజల హృదయాలను దోచుకున్నాయి. సామాన్య తెలుగు పాఠకులకు గజల్ ప్రక్రియ గూర్చి తెలిసిందంటే దానికి ప్రధాన కారకులు ఇద్దరు. ఒకరు సి.నా.రె. రెండో వారు గజల్ శ్రీనివాస్. నాగార్జున విశ్వవిద్యాలయం వారు గజల్ శ్రీనివాస్ గారికి - కళా ప్రపూర్ణ బిరుదునిచ్చి ఘనంగా సన్మానించారు కూడా. గాంధీతత్వాన్ని ప్రపంచానికి చాటి చెప్పేందుకు వంద భాషల్లో వీరు పాడి గిన్నీస్ బుక్‌లోకి ఎక్కారు.

# సుందర వెలుతురు యాత్ర

- డా॥. పి.ఎ. సత్యనారాయణ, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ కళాశాల (అ), రాజమహేంద్రవరం.

జీవితానికి ఆనందం పరమావధి, పరమార్థమేకాదు ప్రతినిమిషం అది చెక్కు చెదరకుండా ఉండాలి. అందమే ఆనందం, ఆనందమే అందం కూడా! అందంగా ఉం డటం అంటేనే ఆనందం, దానిలోకలగలసి ఉండటం. అక్కడ ఒక సామరస్య వాతావరణం ఉండటం దాని సమభారత్వమే అక్కడ అందాన్ని ఆనందాన్ని తీసు కొస్తుంది. అది దృశ్య జగత్తుకు, శ్రవ్య జగత్తుకేకాదు కళాజగత్తుకూ వర్తిస్తుంది.

దృశ్య జగత్తు, కళాజగత్తులో స్రష్ట అభీష్టం మేరకు ప్రతిఫలిస్తుంది. శ్రవ్య జగత్తులోను అంతే! ఈ దృశ్య జగత్తు కళగా ఆవిష్కృతంకావడం, అది పాఠకుల చేత ప్రేక్షకులచేత, శ్రోతలచేత ఆస్వాదించబడటంలో వస్తుగత, వ్యక్తిగత వైవిధ్యాలు చోటుచేసుకుంటాయి కూడా!

ఈ వస్తుగతం, వ్యక్తిగతం అనేవి రచనను ఆస్వా దించడానికి సహకరించడానికి బదులు చాలా సార్లు అడ్డుతగులుతాయి. అందుకే ఇన్ని వైవిధ్యాలు. ఈ వైవిధ్యాలు కళాజగత్తులో విభిన్న శైలీ విన్యాసాలుగా కనిపిస్తాయి.

రచన కళాజగత్తుకు సంబంధించిందికాబట్టి, రచనలో రకరకాల ప్రక్రియలు ఉంటాయి. ప్రక్రియలలో వాటిదైన వస్తువు, అభివ్యక్తి ఉన్నట్టుగానే, ఆవస్తువుల్లో, అభివ్యక్తుల్లో రకరకాల భావజాలాలు, రకరకాల రూపవిన్యాసాలు ఉంటాయి. ఇవి రచనలో ఆవిష్కృతం అయ్యేటప్పుడు, ఆరచన ఆస్వాదించబడేటప్పుడు వస్తు గతం (Objectivity) వ్యక్తిగతం (Subjectivity) ప్రభావితం చేస్తాయి.

ఈ కవిత్వానుభవంలో ఉటంకింపులు, వల్లివేతలు, లక్ష్యలక్షణ సమన్వయాలు, కొత్త లక్ష్యాల్లోంచి కొత్త లక్షణాలను వెలికితీయడం లాంటి జ్ఞాన భారం ఏమీ లేకుండా కేవలం కవిత్వానుభవంలో మనల్నిమనం ఒకరసాయనకి చర్యకు గురిచేసుకుందాం. అప్పుడు ఈ ప్రపంచాన్ని మరింత జాగరూకతగా, మరింత మార్దవంగా, దర్శించగలుగుతాం.

ఈ కవిత్వానుభవంల్లోంచి కవి ఆశలు, ఆశయాలు వాసనారూపంగా, మనకూ వంటబడతాయి.

పువ్వుకు రంగు, రుచి, వాసన ఉన్నట్టే పద్యానికి ఉంటాయి. లోకంల్లోంచి కవి ఏరుకున్న సామగ్రి కవితలో వస్తు అభివ్యక్తులుగా కలగలసి తయారవుతుంది. అది ఈ ప్రపంచాన్ని మరింత సున్నితంగా చూడటానికి మన హృదయాలను మరింత ద్రవీభవించేలా చేస్తుంది. అంటే మనం ఇక్కడ వస్తు అభివ్యక్తుల మధ్య విభజన రేఖలు ఏమీ గీయకుండా ఉమ్మడిగా అవి మన మీద వేసే ప్రభావాన్ని అనుభవంలోకి తెచ్చుకుంటాం అంటేకవి పలానావిధంగా రాయాలి, పలానాది రాయలేదు లాంటి ఆరోపణలు ఏవీ ఉండకుండా, ఎలాంటి కొట్టివేతలు, దిద్దుబాట్లుకు అవకాశం లేకుండా కేవలం రసాస్వాదన, రసాయనిక చర్య, ద్రవీభవించడం వెరసి ఈ ప్రపంచాన్ని మరింత జాగృతంగా, సున్నితంగా శ్రద్ధగా చూడటం మాత్రమే జరుగుతుంది అన్నమాట.

సాహిత్య ప్రయోజనం అనే చర్చలో హితమా? ఆనం దమా? ఈ రెంటిలో ఏదిముఖ్యం అంటూ ఉంటాంకాని; లోతుగా చూస్తే ఈ రెండూ రెండు కాదు; రెండూ ఒకటే అని అర్థం అవుతుంది.

ఆనందింపచేసేది హితకారిణి కాదని చెప్పలేం. అలానే హితం చేకూర్చేది అంతిమంగా ఆనందాన్ని ఇవ్వలేదని కూడా చెప్పలేం. వెరసి హితంలోనే ఆనందం, ఆనంద లోనే హితం ఉన్నాయన్నమాట. వేరు వేరుగా కనిపించే

సత్యం, శివం సుందరంలు. వేరు వేరు కావు అవన్నీ ఒకటే అన్నది ఉద్దేశం.

ఈ నేపథ్యంలో వస్తురూపాలను విడివిడిగా చూడ కుండా కలిపి సుందరం గారి ఈ సుందర వెలుతురు యాత్రను ఆస్వాదిద్దాం.

శ్రీశ్రీ ప్రభవ కావ్య ఆవిష్కరణ ప్రభవనామ సం॥ (1927)లో జరిగిందనీ, శేషేంద్రకూడా అదే సంవత్సరంలో ప్రభవించాడనీ, శేషేంద్ర షష్టి పూర్తికి మళ్ళీ సుందరం గారి సుందర ప్రభవ అవతరించిందనీ పతాభిఅంటాడు.

తెలుగు సంవత్సరాలు 60 ఏళ్ళ కోసారి పునరావృత్తం అయినట్టుగా తెలుగు గడ్డమీద భావ విప్లవం తేవటానికి అత్యంత ప్రభావశీలురు పుట్టారు, అనటానికి కవి కావ్యం, ఈ రెండూ ఒక దాని తరువాత మరొకటి పునరావృత్తం అయ్యాయి అని పతాభి అంటాడు. శ్రీశ్రీ, శేషేంద్రలాగ సుందరం గారు కూడా విద్వత్కవే!

ప్రభావశీలులైన ముందుతరాల వాళ్ళ రచనలతోను, వాళ్ళతోను యాదృచ్ఛికమైన కాల సంబంధాన్ని గుర్తు చేస్తాడు పతాభి.

సుందరం పరిపక్వమైన కాకలు దీరిన ప్రతిభను సూచించడానికి సాహిత్యంలో ఆయన స్పృశించని పార్శ్వం లేకపోవటమే నిలువెత్తు సాక్ష్యం. అంతకంటే గొప్పగా ఆయన నిండైన మానవీయతను ఆయన కలం నుంచి జాలువారిన ప్రతి అక్షరమూ ప్రకటిస్తుంది. సాహిత్యంలో పరిపక్వమైన ప్రతిభ నిండైన మానవీ యతతో జతకడితే, సాహిత్యంలో దాని ప్రభావశీలత పెనుతుఫానులా తాకుతుంది.

జీవితాన్ని నిత్య నూతనం చేసుకున్న వాడే "అన్నిటి లోను అందం" చూడగలుగుతాడు 'అన్నిటికి విలువ' ఇవ్వగలుగుతాడు. అతడే కాలంలా సమదర్శికాగలుగు తాడు. కాలంలా చిరంజీవి అవుతాడు.

60 సెకన్లు, 60 నిముషాలు, 6 రుతువులు, అరవై సంవత్సరాల కాలచక్రాన్ని గమ్మత్తుగా దర్శిస్తాడు. అంతేకాదు కాల చక్రంలో మొదటి ఆకు ప్రభవ అంటే ఉదయకాల అందం తోను, ఆరు రుతువుల్లో మొదటిది వసంత రుతువు సంవత్సరంలో మొదటిది చైత్రమాసం, శిశువులాగ కాలం ప్రారంభంకూడా చాలా అందమైనది.

కాల ప్రారంభంలోను, మనిషి ప్రారంభంలోను ఆమాటకొస్తే చెట్టూ, పిట్ట, పువ్వు, పురుగు ప్రతీదాని తొట్ట తొలిదశ అయిన శైశవం చాలా సుందరతమంగా ఉం టుంది. కాలప్రారంభం, జీవి ప్రారంభాల్లో కనిపించే సుందర సారూప్యాన్ని దార్శనికుడు మాత్రమే పట్టు కోగలడు.

> మరింకెప్పుడు నీకు కనిపించని / బెదిరించి పారి
> పోతున్న / బంగారు లేడి / ప్రభవ

కాలచక్రంలోని మొదటిది ప్రభవనామ సంవత్సరం అది మనిషి చరమాంకంలో అప్పటిదాకా ఊరించి తీరా వచ్చాక మళ్ళీ కనపడను అని బెదిరించిందంట. అంటే అది మళ్ళీ వచ్చేదాకా మనిషి ఆగడు అని చెప్పకుండా చెబుతాడు.

మనిషికి ప్రభవ మళ్ళీ కనిపించడం అంటే అతడు చరమాంకానికి వచ్చాడని అర్థం. చరమాంకంలో ఉన్న మనిషిని అది మళ్ళీ కనిపించను అని బెదిరించింది అంటే మనిషికి 120 ఏళ్ళు వస్తాయన్నమాట. మరి అప్పటి దాకా మామూలు మనిషి జీవించజాలడుకదా! అందుకే దాన్ని బంగారు లేడి అంటాడు.

నిజమేకదా కాలం బంగారు లేడి మాయలేడి అది ఊరిస్తుంది, ఆకర్షిస్తుంది దానికోసం ఆరాటపడేలా చేస్తుంది. చివరికి దొరక్కుండా మాయమైపోతుంది. కాని నిజానికి మనిషే మాయమైపోయేది.

> బంగారు లేడి / ప్రభవ అన్న భావ చిత్రం ఎంత
> తాత్త్వికతను నిబిడీ కరించుకుందోకదా!

ఇదంతా కాలనాణేనికి ఒక పక్క కనిపించే వెలుగు దర్శనం. మరోపక్క కష్టాల కరాళ నృత్యం కూడా చూపి స్తాడు. అందుకే ఇలా అంటాడు ప్రభవ సుందరస్మృతుల్ని

చూపించే కిటికీ మాత్రమే కాదు / శతకోటి నక్షత్ర బాధల్ని ప్రతిఫలించే సముద్రం కూడా!

కనిపించని అమూర్తకాలాన్ని చక్రం అనటమే కాదు బంగారు లేడి, కిటికీ, సముద్రం అంటాడు.

మామూలు కిటికీ సుందర దృశ్య దర్శనానుభూతి కలిగిస్తుంది. మరి కాలంకిటికీ సుందర మధుర స్మృతుల్ని చూపిస్తుంది. చరమాంకపు ప్రభవ మరలిరాని గతాల్లోకి జారిపోయిన ఆకుపచ్చ జ్ఞాపకాలను వల్లివేస్తుంది. అంతేకాదు. అనంతకోటి ఉపాయాలుంటాయని ఆశతో శతకోటి బాధల్ని మోసే మనిషిని స్ఫురింపజేస్తూ బాధల్ని నక్షత్రాలతోను, కాలాన్ని సముద్రంలోను పర్సనిఫికేట్ చేస్తాడు.

**సుహానిసి కవితలో**

నీ చురునవ్వు... కన్నీటినిమోసే కళ్ళకొసమెరుపు...
కడలి వేదనల అలల్లోంచి / తొంగి చూసే నురుగు
సుఖదుఃఖాల మధ్య నిల్పిన సిల్కు తెర...
బాదలోనూ నవ్వగలవు / బాధను మరిపించేలా నవ్వగలవు
అందుకే నీ నవ్వంటే నాకిష్టం

కళ్ళకొసమెరుపు కన్నీటిని మోస్తున్నదంట. ఎంత వినూత్నమైన అభివ్యక్తి! చిరునవ్వు కడలి అలలనురుగు తోను, కడగంటి చూపు మెరుపుతోను పోల్చబడింది. పెదాల లాగే కళ్ళూ నవ్వుతాయని మనకు తెలుసు. నవ్వినా, ఏడ్చినా కన్నీళ్ళే వస్తాయనీ తెలుసు. ఇక్కడ మనం చేయాల్సింది అలంకారికుల్లాగో, వైయాకరుణుల్లాగో; ఇదిగో ఇక్కడ మెటఫర్ ఉన్నది, ఇక్కడ మెటానమీ ఉన్నది, ఇక్కడ పర్సనిఫికేషన్ ఉన్నది అని లక్ష్యాల్లోంచి లక్షణాలు తవ్వితీయటంకాదు. మరేంచేయాలి అంటే కవి పదాలతో పాదివి పట్టిన గాఢమైన అనుభూతిలోకి మునిగి పోవాలి అంతే!

ఇంతకూమనం ఇక్కడ అద్భుతమైన కళాత్మక పని తనాన్ని ఆస్వాదించడమే కాదు మన దుఃఖాన్ని దిగ మింగడం ఆనందాన్నిపంచి పెట్టటం, అనే మానవీయత లను అలవరచుకుంటాం.

## మనసులో ఛాయా చిత్రాలు :

... పొలాన్ని నిద్రలేపి / చెమటలో స్నానం చేసి / గుమ్మం చేరిన రాత్రికి విందుచేసే ముందు / చంద్రికలో ప్రియుని ముఖం చదువుతూ / పల్లె పడుచు చూపిన చూపు ... కొడుకు ప్రాణానికి బదులు వ్యవస్థకరుణించిన నష్టపరిహారాన్ని / గత్యంతరం లేక అందుకున్న / ముసలితల్లి నీటి తెరలోంచి చూసిన చూపు... మొట్ట మొదటసారి మెరుపు తీగను చూసి / ఉరుములు మృదంగ ధ్వని విని / మబ్బుల వేళ్ళ కొసల చిలకరింపు లకు పులకరించి / నెల రోజుల కుక్క పిల్ల / విప్పారిన కళ్ళతో చూసిన చూపు.

వెన్నెల్లో ప్రియుడికేసి చూచేచూపు, కొడుకు ప్రాణానికి వెలకట్టిన వ్యవస్థకేసి చూచిన చూపు, మెరుపుతీగల్ని తొలిసారిచూసిన కుక్క పిల్లచూపును ఒకకోట చేర్చి శృంగార, కరుణ, అద్భుత రసాల మేళవింపుతో శ్రీశ్రీ రసన సిద్ధాంతాన్ని గుర్తుచేస్తాడు కవి.

**స్పృహ అనే కవితలో...**

"... ఇంటి కప్పే అంతరిక్షమనుకునే వాడికి / విద్యుద్దీపాలే నక్షత్రాలు / అద్దంలోనే సూర్యో దయమూ చంద్రోదయమూ"

ఇది నూతిలోని కప్ప నుయ్యే ప్రపంచం అన్న సామెతను తలపిస్తుంది. అంటే అజ్ఞానాన్ని సూచించటమే కాదు. చుట్టూ ఉన్న సమాజంలో ఏం జరిగినా తమకు సంబంధం లేకుండా బతికేసే స్వార్ధ జనం గురించి ఇక్కడ కవి మాట్లాడుతున్నాడు. పరిసరాలు బాగుంటేనే మనమూ బాగుంటాం అని సామాజిక బాధ్యతను బోధిస్తున్నాడు.

**మా అన్న సుబ్బన్న**

"మా అన్న / నిలువెల్లా కవిత్వం... మా అన్నకున్నంత వైవిద్యం / కవిత్వానికేలేదు". కవిత్వానికి ఎంత వస్తు వైవిద్యం ఉన్నదో, ఎంత శిల్ప వైవిద్యం ఉన్నదో, ఎంత

అలంకార వైవిద్యం ఉన్నదో ఎంత అభివ్యక్తి వైవిద్యం ఉన్నదో, ఎంత ప్రక్రియావైవిద్యం ఉన్నదో అంత నవనవోన్మేష ప్రతిభాశాలి అయిన సహ అధ్యాపకుణ్ణి, సహోదరుడిగా ఆత్మీకరించుకోవటం మామూలు విషయం కాదు. దానికి ఎంతో విశాల హృదయంకావాలి. సాధారణంగా విద్వాంసులకు మాత్సర్యం ఎక్కువ అంటారు. అవతలి వాళ్ళు ఎదుగుదలను ఓర్వలేరు. అడ్డు పుల్లలు వేసేరకం అంటారు. కాని కవి ఇక్కడ తోటి ఆచార్యుణ్ణి ఎంత ధారాళంగా వర్ణిస్తాడో! ఇది మనమందరం అనుసరించగదిగన స్వర్ణాభరణం లాంటి సుగుణం.

కుష్ఠు రోగిని తాకు
లాబా ఆమ్టే ఎవరో నాకు తెలీదు / మదర్ థెరిసా ఏం బోధిస్తుందో /
నాకు తెలీదు ... / కుష్ఠురోగిని కూడా ప్రేమతో తాకే / థెరిసా వేళ్ళను చూస్తే /
నాకళ్ళు ఎందుకు వర్షిస్తాయో / తెలీదు .... ఎండు కొమ్మల్లాంటి చేతుల్ని / నీ ముందు ఊపుతున్న / కుష్ఠురోగిని తాకు / నిన్ను నమ్ముతా కాల్మొక్కుతా...
పీఠాధిపతులు పల్లకీల్లో ఊరేగితేనాకెందుకు

బాబా అమ్టే గా మురళీధర్ దేవదాస్ ఆమ్టే ప్రసిద్ధులు, కుష్ఠురోగుల పాలిట దేవుడు విదేశంలో పుట్టినా మదర్ థెరిసా భారతదేశానికి తన జీవితాన్నంతా ధారబోసింది. కాని ఆశ్రమాల్లో సన్యాసులు చెప్పేదొకటి చేసేదొకటి అని ఎద్దేవా చేస్తాడు.

ప్రేమకు విదేశీ, స్వదేశీ పొలిమేరలు ఉండవు అని విశ్వమానవ సౌభాతృత్వాన్ని ప్రబోధిస్తాడు.

ఇలా సుందర ప్రభవ కవిత్వాస్వాదన ఒక సుందర వెలుతురుయాత్రగా సత్యం, శివం, సుందర దర్శనానుభూతిని కలిగిస్తుంది.

**ఆధార గ్రంథాలు :**

1) సుందర ప్రభవ - ఆర్వీఎస్ సుందరం
2) కవిత్వంలో నిశ్శబ్దం - ఇస్మాయిల్
3) సంజీవ్‌దేవ్ వ్యాసాలు - సంజీవ్‌దేవ్

# స్నేహితుల్ని హత్తుకున్న స్మృతి కవిత్వం

- సుంకర గోపాలయ్య, తెలుగు శాఖాధ్యక్షులు, పిఠాపురాదిస ప్రభుత్వ కళాశాల, కాకినాడ.

తెలుగు కవిత్వంలో అనేక ఉద్యమాలు ఉన్నాయి. అందులో భావకవిత్వం ఒకటి. భావకవిత్వంలో 6 శాఖల్ని డా. సి. నారాయణరెడ్డి గారు గుర్తించారు. అందులో 'స్మృతి కవిత్వం ఒకటి' మిత్రుల్ని కోల్పోయిన కవులు స్మృతి కవితల ద్వారా వారిని తల్చుకున్నారు. ఇందులో సమాజ తీరును, ధోరణిని తెలిపే అంశాలు కూడా ఉన్నాయి.

మనకు రక్తం పంచిన వాళ్ళు రక్త సంబంధికులు కుటుంబం నుండి బయట అడుగు పెట్టాక మనతో నడిచేవాళ్ళు ఉంటారు. మనల్ని నడిపే వాళ్ళు అంటారు. మన వెంట ఉంటారు. స్ఫూర్తి ప్రదాతలు ఉంటారు. వాళ్ళు మిత్రులుగా ఉండవచ్చు. గురువులు అయి ఉండవచ్చు. మన మనస్సుకు దగ్గరగా ఉంటారు. వారిమే మనం ప్రేమగా ఆత్మీయులుగా భావిస్తాం. కుటుంబ సభ్యుల నుండి ఆదరణ లేకపోయినా 'ఆత్మీయులు' మనల్ని ఆదరిస్తారు. ప్రేమతో సాయపడతారు. మన ఎదుగుదలలో భాగం అవుతారు. అలాంటి ఆత్మీయుల్ని కల్పోయిన కవులు వారిని కవిత్వంలో జ్ఞాపకాలుగా తల్చుకున్నారు. ఆత్మీయుల స్మృతి గురించి చర్చించు కుందాం.

### మిత్రులు :

మిత్రుడు, స్నేహితుడు, చెలికాడు, ఏ పదమైన ఈ మాట ఒక భరోసా. మంచి ఓదార్పు. స్నేహమేరా జీవితం, స్నేహమేరా శాశ్వతం అన్నాడు ఓ సినీకవి. బాల్యం నుండి మన వెంట ఉండి నడిచే వ్యక్తి కావొచ్చు, పాఠశాలలో మనతో చేరవచ్చు, కళాశాల చదువులో చేయి కలపవచ్చు. ఇలా రెండు మనస్సులు, భావాలు కలసిన వారు స్నేహితులు. ఒకొరికొకరు సహకరించుకుంటూ జీవితాల్లో వంతెనలు అయిన మిత్రులు ఎందరో ఉన్నారు. స్వార్థం లేని చెట్టు లాంటి మిత్రుడు దొరకడం గొప్ప అదృష్టం. నిజమైన మిత్రుడికి మించిన ఆస్థిలేదు.

స్నేహానికి రక్త సంబంధాలు ఉండవు. స్నేహం ఒక అనుభూతి. తల్లిదండ్రులకు పంచుకోలేని విషయాలను మిత్రులతో పంచుకుంటారు. గుండె బరువు దించు కుంటారు. స్నేహం ఒక ఆత్మబంధం. "ఓ ఉత్తమ స్నేహి తుడు, వంద ఉత్తమ గ్రంథాలతో సమానం" అంటారు కలాంగారు. ఎడారిలో ఒయాసిస్సు లాంటిది స్నేహం.

అలాంటి మిత్రులను కోల్పోయిన కవులు, వారిని తల్చుకుంటూ, కవితలు రాశారు. స్నేహాన్ని సాహిత్యంలో నిలుపుకున్నారు మిత్రుల్ని కోల్పోయి, కవిత్వంలో ఓదార్చుకున్న కవుల కవితల్ని పరిశీలిద్దాం.

శ్రీశ్రీ తన మిత్రుడు కొంపెల్ల జనార్ధనరావు మరణించి నపుడు ఓ కవిత రాశారు. మహాప్రస్థానాన్ని మిత్రునికి అంకితం ఇచ్చారు. జనార్ధనరావు శ్రీశ్రీకి ఆప్తమిత్రుడు, కవి, విమర్శకుడు కూడా అయిన జనార్ధనరావు ఉ దయిని పత్రికను నడిపారు క్షమ వ్యాధివల్ల ఆకస్మికంగా మరణించారు. ఆ బాధ నుండి తేరుకోవడానికి శ్రీశ్రీ ఈ ఎలిజి రాశారు. ఈ కవిత 103 పాదాలు ఉంటుంది. కొంపెల్ల, శ్రీశ్రీని కాబోయే మహాకవిగా గుర్తించిన వ్యక్తి.

తల వంచుకు వెళ్ళిపోయావా, నేస్తం
సెలవంటూ తీ లోకాన్ని వదిలి...
తలపోసిన వేవీ కొనసాగక పోగా
పరివేదన బరువు బరువు కాగా
అటుచూస్తే, ఇటు చూస్తే ఎవరూ
చిరునవ్వు, చేయూతా ఇవ్వక
మురికితనం, కరుకుతనం నీ
సుకుమారపు హృదయానికి గాయం చేస్తే
... ... ... ... ... ...
వెక్కి వెక్కి ఏడుస్తూ వెళ్ళిపోయావా నేస్తం
తలవంచుకు వెళ్ళిపోయావా నేస్తం

(మహా ప్రస్థానం, పుట.76)

జనార్థనరావు బాగా చదువుకున్న వాడు. ఏవేవో సాధించాలనే తపన కలవాడు. అభ్యుదయ భావాలు మెండుగా ఉన్నాయి. ఉదయిని పత్రికకు మంచి పేరు వచ్చింది. అయినా కవులు రచనలు పంపేవారు కారు. చందాలు బొత్తిగా లేవు. అందుకే శ్రీశ్రీ మురికతనం, కరుకుతనం లాంటి మాటలు వాడారు. తన మిత్రునికి అడుగడుగున శత్రువులు, వంచనలు కనుకనే కవి ఈ ధూర్తలోకంలో, మిత్రుడు నిలబడలేక పోయాడని అంటున్నాడు. ఇద్దరూ కలసి ఎన్నో చేద్దామనుకున్నారు. కానీ నేస్తం వెళ్లిపోయాడు.

దేన్ని వెతుక్కుంటూ వెళ్ళావోయ్ నేస్తం
ఎంత అన్యాయం చేశావోయ్ నేస్తం
ఎన్ని ఆశలు నీ మీద పెట్టుకొని
ఎన్ని కలలు నీ చుట్టు పోగు చేసుకొని
అన్నీ తన్నే వేశావా నేస్తం !
ఎంత దారుణం చేశావమ్మా నేస్తం
(మహాప్రస్థానం, పుట.18)

ఈ కవితలో అడుగడుగున మిత్రుని మీద ఉన్న అపారమైన ప్రేమ వెల్లడవుతుంది. ఇద్దరూ సాహిత్యం సమస్తం అనుకున్నారు. ఊళ్ళుతిరిగారు. ఉదయిని సంచికలు పట్టుకు తిరిగారు. మిత్రుడు గుర్తుకు వచ్చినప్పుడల్లా కవి కదిలిపోతున్నాడు. మృత్యువు చేసిన మోసాన్ని నమ్మలేకున్నాడు. తన మిత్రుడు మరణించినా లోకం మామూలుగానే ఉంది. ఎవరి పనుల్లో వాళ్ళు ఉన్నారు. తను, మరో ఆరుగురు మిత్రులు తప్ప ఎవరు దుఃఖించలేదని, మిత్రుని పట్ల సానుభూతి లేని లోకాన్ని గురించి కవి నిర్మొహమాటంగా చెప్పాడు. తన నేస్తాన్ని కనబడని ఊహ కబళించిందని తీవ్రవేదనకు గురైయ్యాడు. కానీ కవి తేరుకున్నాడు. మిత్రుని స్ఫూర్తిని కొనసాగిస్తానని గట్టిగా అనుకున్నాడు.

లేదు, నేస్తం! లేదు
నీ ప్రాభవం మమ్మల్ని వదల లేదు
నిరుత్సాహాన్ని జయించడం
నీ వల్లనే నేర్చుకుంటున్నాము
ప్రతికూల శక్తుల బలం మాకు తెలుసు
భయం లేదులే అయినప్పటికీ
నీ సాహసం ఒక ఉదాహరణ
నీ జీవితమే ఒరవడి
నిన్న వదిలిన పోరాటం
నేడు అందుకొనక తప్పదు
(మహాప్రస్థానం, పుట.20)

మిత్రుడు ఆశయాలను ముందుకు తీసుకెళ్లగలమని కవి ఉత్సాహంగా చెప్పుకున్నాడు. మిత్రుని సాహసాన్ని ఆదర్శంగా తీసుకుని ఆయన వదిలిన పోరాటాన్ని అందుకుంటానని కవి ప్రకటించాడు.

కావున ఈ నిరాశామయలోకంలో
కదన శంఖం పూరిస్తున్నాను !
ఇక్కడ నిలబడి నిన్ను
ఇవాళ ఆవాహనం చేస్తున్నాను
... ... ... ... ...
ఇలా చూడు నీ కోసం
ఇదే నా మహాప్రస్థానం
(మహాప్రస్థానం, పుట.76)

ఇలా మిత్రునికి, శ్రీశ్రీ ఘనమైన నివాళి అర్పించాడు. తన చిన్ననాటి మిత్రురాలు 'దొండపాటి మీరాబాయి" చనిపోయినపుడు శిఖామణి "ఎందుకొస్తావే జ్ఞాపకానికి మీరా" అంటూ స్మృతికవిత రాశారు. ఇది గొప్ప ఎలిజి. మీరాబాయి జ్ఞాపకాలు కవిని చుట్టుముట్టాయి. ఏమీ పాలుపోవడంలేదు. స్మృతులు వెల్లువలా వస్తున్నాయి. ఆ దగ్గరితనం గుర్తొచ్చింది. దూరమైన తనం మెలిపెడుతోంది. ఈ కవితలో శిఖామణి అక్కడక్కడ జీవితం ఆడే ఆట గురించి వ్యాఖ్యానాలు చేశారు.

ఒక్కోసారి ఏమీ చాతకాదు
వుత్త జ్ఞాపకానికి తెచ్చుకోవడం తప్ప
చానాళ్లయింది కదా చనిపోయి
ఎందుకొస్తావే జ్ఞాపకానికి మీరా
ఈశాన్య పవనమై

కాళహస్తి కొమ్మబొమ్మవై
అమ్మలేనినా చీకటి బాల్యాన్ని వెలిగించావు
(నల్లగేటూ నందివర్ధనంచెట్టు, పుట.127)

కవి తన స్నేహితురాల్ని, అమ్మగా భావించాడు. అమ్మ లాంటి తోడుగా భావించాడు. తల్లిలేని పిల్లాడైన శిఖా మణి, ఆమె కుంకుడు పులుసుతో తలంటి స్నానం చేయించేది. తలదువ్వేది. ఇద్దరూ పేట సందుల్లో హాయిగా ఆడుకునే వాళ్ళు. ఒకొకికొకరు ఉడికించుకునేవారు.

వీరీ వీరీ గుమ్మడి పండు ఆటలో
పంచాతి పిడకల గూడులో దాక్కున్నప్పుడు
తేలు కుట్టి నేనేడుస్తుంటే
నన్ను చూసి నాకంటే నువ్వే ఎక్కువ ఏడ్చావు గుర్తుందా
ఇప్పుడు ఎవరి ఏడ్పులు వారివే తప్ప
ఇతరుల కోసం ఏడ్చే మనుషులేరి మీరా!
(నల్లగేటూ నందివర్ధనంచెట్టు, పుట.76)

ఇలా ఇద్దరూ కలసి దొంగా పోలీసు, పచ్చాకుబైరాకు, దూదూపుల్లా దుక్కుడుపుల్ల ఆటలు ఆడుకున్నారు. అన్నీ ఆటల్లోను ఆమె గెలిచేది. కానీ "జీవితం పెద్దపులికి" తన మిత్రురాలు దొరికి పోయిందని కవి కన్నీళ్ళు పెట్టుకున్నాడు. అయినా కవి మీరా జ్ఞాపకాలను, ఇప్పటికీ తల్చుకుంటూనే ఉన్నాడు.

చిన్నప్పుడు
భుజాలమీద చేతులేసుకుని
పంటచేలో పరిగెలేరుకున్నట్టు
ఎండాకాలంలో ఏటివార
ఉప్పు డొంకల్లో
ఎండు పుల్ల లేరుకున్నట్టు
పొద్దు తిరుగుతున్న వయస్సులో
మీరా ఇప్పుడు నీ జ్ఞాపకాలేరుకుంటున్నాను
(నల్లగేటూ నందివర్ధనంచెట్టు, పుట.76)

బాల్యంలో తనకో ఆసరాగా ఉన్న మీరా, ఇలా వెళ్ళి పోవడం కవిని తీవ్రంగా కలచివేసింది. పొద్దుతిరుగుతున్న వయస్సులోకవి పసిమనసుల జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నాడు. డా ఎన్.గోపి తన మిత్రుడు "వైసిపీ రెడ్డిగారు" మరణించిన సందర్భంలో "వైసీపీరెడ్డిగారూ" అంటూ ఓ స్మృతి కవిత వెలువరించారు. వైసిపీరెడ్డి సొంత ఊరు కడప. కవికి కుటుంబ మరియు సాహితీ మిత్రుడు. కవితో ఆయనకు మంచి అనుబంధం ఉంది. మిత్ర బంధం ఉంది.

# భాష – ఆధునీకరణ – సమస్యలు

– డా॥. డి. ఉదయ కుమారి, ఉప సంచాలకులు & అసోసియేట్ ప్రొఫెసర్, ప్రచురణల కేంద్రం,
ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

భాషను ఆధునీకరించడమే నవీకరణగా మనం చెప్పుకోవచ్చు. భాషను ఆధునీకరించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. భాష ఆధునీకరణకు మొదటి కారణంగా మనం కందుకూరి, కొమఱ్ఱాజు మొదలైన వారిని చెప్పుకోవచ్చు. సాంకేతిక పదజాలం, తర్క, జ్యోతిషశాస్త్రాలు, అశ్వశాస్త్రం, తత్త్వశాస్త్రం మొదలైన వాటిని కూడా ఆధునీకరించుకోవలసిన అవసరం ఉంది. ఇందుకు ప్రయత్నాలు కూడా బాగానే జరిగాయి. ముఖ్యంగా నూతన పదబంధాలను ఏర్పరచుకొనే దిశగా ప్రముఖ పత్రికలు ముందంజ వేస్తున్నాయి. వేరే భాషల్లోని పదాలకు సైతం సమానార్థకంగా ఉండే పదాలను తీసుకురావడంలోనూ పత్రికలు తనదైన పాత్రను ప్రత్యేకంగా పోషిస్తూ నవీకరణలో లేదా ఆధునీకరణలో ఎదురయ్యే అనేక సమస్యలను మనం ఈనాడు చర్చించవచ్చు.

1. లిపి
2. సాంకేతిక సమస్యలు
3. వాక్య రీతులు
4. పరిభాష

భారతీయ భాషల్లోని పదాలు తెలుగులో కలిసిపోయాయి. తెలుగులిపిలో రాయడం వలన, తెలుగు లిపి ప్రమాణీకరణలోనూ ఎన్నో సమస్యలను మనం చూస్తున్నాం. వాటిని ఎదుర్కొనవలసిన అవసరం ఎంతగానో ఉంది.

Tank - ట్యాంకు / టాంకు

Bank - బ్యాంకు / బాంకు / బేంకు

అలాగే

ఐంది / అయింది

తెలుగు పదాలను రాయడంలోనూ మనకిలాంటి సమస్యలు ఎదురవుతుంటాయి. వచ్చారు/వచ్చేరు వంటి పదాలను రాయడంలో కొంత సందేహం వస్తుంది. ఏ పదం సరైనది. దీన్ని ఏ పదం రాయాలి అనేది సమస్యగా కనిపిస్తుంది. ఇప్పుడు "తాటాకు" పదం 'ఆ' అనేది లేఖనంలో కనిపిస్తుంది. భాషాశాస్త్రంలో 'తాటాకు' ఉచ్చారణ వేరుగా ఉంది 'ఆ' నే వేరేగా గా ఉచ్చరిస్తాం. అలాగే ప్రాత, క్రొత్త, క్రావడి వంటి పదాల్లో రేఫ పూర్వం ఉండేది. అది ఇప్పుడు రేఫ లేకుండా పాత, కొత్త, కావడి లాగా కనిపిస్తుంది. అలాగే ముకారాంత పదాలను అనుస్వారంతో ముగించడం చాలాచోట్ల చూస్తున్నాం. పదాలకు అల్పప్రాణ, మహాప్రాణ భేదాన్ని కూడా కొన్నిచోట్ల పాటించడం, కొన్ని చోట్ల పాటించకపోవడం భాషలో కన్పిస్తుంది.

ఉదా॥ భేదం / బేదం
బాధ / బాద ఇలాంటి పదాలు.

ఇక జంట పదాలు. వీటిలో మొదటి పదానికి అర్థం ఉంటుంది. రెండో పదానికి అర్థం ఉండదు.

ఉదా॥ పిల్లాజెల్లా, గొడ్డు గోదా లాంటి పదాలు

అలాగే పొల్లక్షరాలను ఉకారాంత పదాలుగా రాసే పద్ధతిని గమనించవచ్చు.

ఉదా॥ మనస్ / మనసు
హల్ / హల్లు

ఇంగ్లీషు లిపి తెలుగులో తెలుగు లిపి ఇంగ్లీషులో రాసేటప్పుడు కొన్ని సమస్యలు వస్తాయి. సంధి, సమాసాల నిర్మాణంలో అనేక సమస్యలు కన్పిస్తాయి. ఆంగ్లం తెలుగు కలిసిన పదాలు కన్పిస్తాయి. "ఆఫీసుగది" ఇలాంటి వాటిని వైరి సమాసాలుగా చెప్పుకుంటాం. వీటిని కూడా తప్పు పదాలని చెప్పలేం.

ఉదా॥ మోడి / మోది
కశ్మీర్ / కాశ్మీర్

మొట్టమొదటి పదం కరెక్ట్ రెండవ పదం మూల వ్యవహారం తెలియక వ్యవహారంలోకి వచ్చిన పదం. ఏ భాషనుండి ఏ భాషకు అనువదించవలసిన వచ్చినా మూల భాషలో నైపుణ్యం ఉండి తీరాలి. అలాంటప్పుడే చక్కటి అనువాదం సాధ్యపడుతుంది.

మాండలికాలు అనువదించేటప్పుడు అనేక సమస్యలు ఎదుర్కొనవలసి వస్తుంది. ఒక ప్రాంతంలో వ్యవహారంలో ఉండే భాష మరొక ప్రాంతంలో వేరొక అర్థంలో వాడుకలో ఉండవచ్చు. సరికొత్త అర్థం తీసుకురావడంలో అనేక సమస్యలు కనిపించవచ్చు. అలాగే పూర్వం ఒక అర్థంలో ప్రయోగించబడే పదం ఇప్పుడు వేరొక అర్థంలో ప్రయోగించబడవచ్చు.

ఉదా॥ సువాసన అనే పదం.

అర్థ సంకోచ, అర్థ వ్యాకోచాలు ఈ అర్థ వివరణకు సంబంధంచినవి. మౌస్ అనే పదం మొదట ఎలుకని తర్వాత కంప్యూటర్ పరికరమని వాడబడింది. జాతీయాలు, లోకోక్తులు అనువదించే విషయంలో చాలా సమస్యలు ఎదురవుతాయి. ఒక భాషలోకి అను వాదం చేసేటపుడు చేసే భాషలో కూడా అదే జాతీయం ఉండాలి. సమానార్థకాలైన జాతీయం అవసరమౌతాయి. ఒక భాషలోని జాతీయాన్ని మరొక భాషలోనికి అనువదిం చాల్సి వచ్చినపడు దానికి సమానార్థకంగా ఉన్న దాని ప్రకారం అనువదించాలి. యథాతథానువాదం చెయ్య కూడదు. అప్పుడు అర్థం చెడిపోగలదు. శాస్త్రాన్ని బట్టి మారే పదానికి వేరు వేరు అర్థాలు వచ్చే అవకాశం ఉంది.

ఇప్పుడు "ధ్వని" అనే పదానికి అర్థం భాషాశాస్త్రంలో ఒకర్థం, భౌతికశాస్త్రంలో ఇంకొక అర్థం, అలంకార శాస్త్రంలో మరొక అర్థం కనిపిస్తుంది. శాస్త్రాల్లో ఒక అర్థం ఉండచ్చు. వ్యవహారంలో ఇంకొక అర్థం ఉండచ్చు.

ప్రాచీన కాలంలో "కంపు" అన్న పదానికి సువాసన అని అర్థం. ఇప్పుడు "కంపు" అంటే చెడ్డవాసన అని అర్థం.

## ఆధార గ్రంథం :

1. అనువాద విధానాలు (సం.) పరిమి రామ నరసింహం - పమ్మి పవన్ కుమార్.

BHAVAVEENA
Vol. 18, Issue. 9, September 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# వీరవల్లడు – మానవతామూర్తి

– డా॥. పి. విశ్వప్రసాదు, అసిస్టెంట్ ప్రొఫెసర్, శ్రీరాజరాజేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కరీంనగర్.

కృతజ్ఞత గొప్ప మానవీయ విలువ. వ్యక్తి, సమాజాలు తరువాతి తరం వారికి అందించే ఉదాత్తమైన కానుక. మనిషి తన జీవితకాలంలో పరిపూర్ణ జీవితాన్ని అనుభవించేందుకు కారణమౌతున్న అనేక దైవీ గుణాలలో కృతజ్ఞతది మొదటి వరుస. కృతజ్ఞత చూపడం, కృతజ్ఞుడుగా ఉండడం. ఈ రెంటికీ కొద్ది వ్యత్యాసం కనపడుతుంది. మొదటిది ఒక సందర్భంలో తాను పొందిన 'మేలు'ను మరవకుండా, ఆ మేలు చేసిన వారిపట్ల తన 'గౌరవాన్ని' ప్రకటించడం, రెండోది ఆ మేలును జీవితాంతం గుర్తుంచుకుంటూ తనకు మేలు చేసిన వారికి జీవితాన్ని అర్పించేందుకైనా సిద్ధపడడం 'కృతజ్ఞుడుగా ఉండడం' దీన్ని సాధించడం ఉదాత్త మానవీయ విలువగా చెప్పవచ్చు.

విశ్వనాథ వారి 'వీరవల్లడు' ఈ ఉదాత్త మానవీయ విలువను నిరూపించే నవల. వ్యక్తులు ఒకరిపట్ల ఒకరు పూర్తిగా యాంత్రికంగా తయారయ్యే సందర్భంలో, తమ జీవితాలను సుఖమయం చేసుకునేందుకు, ఏమాత్రం అవసరం లేకున్నా ఎదుటివారి జీవితాలను తలకిందులు చేయాలనుకునే సమాజంలో ఒకడు తనకు అన్నం పెట్టి నీడనిచ్చిన వ్యక్తి పట్ల, అతని తరువాతి తరాల పట్ల ఏ విధంగా 'ఋణం' తీర్చుకొని - కృతజ్ఞతను ప్రకటించాడనేది ఈ నవల నిరూపించింది.

దొర-వల్లడి తర్వాత నాలుగోతరంలో కథ మొదలవుతుంది. ఇంగ్లీషు చదువు నేర్పించేందుకు దొర మనుమడు తన కొడుకుని బస్తీకి పంపుతాడు. సెలవులకి ఇంటికి వచ్చిన అబ్బాయి తన "వల్లప్ప అనే పేరు తీసేసి, వేరే పేరు పెట్టుమనడంలో 'వల్లడి' పేరులోని 'ఔచిత్యం' తెలుపుతారు పెద్దలు అయినా అబ్బాయి నాకాపేరు వద్దంటాడు. అప్పుడు బామ్మ "నీవా పేరు మార్చుకుంటే, నీ తండ్రి ఆస్తి నీవు తింటానికి తగవు" అని గట్టిగా చెప్తుంది. ఈ మాటతోనే 'వల్లడి' పట్ల ఇంటివాళ్ళకు ఉండే గౌరవం తెలుస్తుంది. బాబు నాన్న "ఆ పేరు నాకే పెడితే బాగుండేది" అంటాడు. "వల్లడు మాలవాడైతే నాకసలే ఆ లేని, జీవితపు విలువలను సక్రమంగా బోధించని చదువుల ఫలితమిదని తెలుస్తుంది. అప్పుడు నానమ్మ .ఒరేయ్! వీడిని చదువు మానిపించెయ్యి" అంటుంది. ఒక దేశానికి, ప్రాంతానికి ఒక సంస్కృతి పేరు అక్కరలేద"ని మొండిపట్టు పడతాడు బాబు. చరిత్ర పట్ల సరైన అవగాహన నాగరికత, వారసత్వం ఉంటాయి. వాటితో సమాజ విలువలు బలంగా తయారౌతుంటాయి. వీటి ఉనికీ, సామర్థ్యం పై ఎప్పుడైనా దాడి జరిగితే, అలాంటి సందర్భాల్లో ఈ ఉదాత్త మానవీయ విలువలను నిలబెట్టేందుకు "వల్లడు"లు పుడుతుంటారు

వల్లడి గురించి కొడుకు తండ్రి చెప్పుతూ తన చిన్నతనంలో జరిగిన సంగతులు వివరిస్తుంటాడు. తండ్రి కూడ బాబులాగానే వల్లడిని అవమానించి, "వల్లడిని పాలేరుతనంలోంచి తీసేస్తే గాని తినను" అంటాడు. అప్పుడు మామ్మ "ఫో వెధవా! నీవు తినకపోతే మానే" అంటుంది. తండ్రి ఒక మాటతో వల్లడి యొక్క గొప్పతనాన్ని వివరిస్తాడు.. "వల్లడు నన్ను నిలబెట్టిన వాడు, మన కుల దేవత, వల్లడంటే నాకు గౌరవం" అనీ, వల్లడిని వద్దంటే, తనూ వల్లడితోనే వెళ్తానంటాడు. అని వల్లడి యొక్క పూర్తి కథను కొడుక్కి చెప్తాడు. ఒకవైపు వర్ణవ్యవస్థ బలంగా పాతుకుపోయిన సమాజంలో అగ్రవర్ణాల వారు, కింద కులస్థులని ఎన్ని విధాలుగా దోచుకుంటున్నారో చరిత్ర నిండా కనిపిస్తుంది. మరోవైపు గ్రామంలో, చిరకాలంగా కలిసి ఉంటున్న బ్రాహ్మణ, హరిజన కుటుంబాల మధ్య పెన వేసుకుపోయిన గొప్ప మైత్రీ సంబంధం ఉంటేనే గానీ, ఒక బ్రాహ్మణ కులస్థుడు, హరిజనుణ్ని

"మన కుల దేవత"గా సంబోధించడం జరగని పని. భారతీయ గ్రామీణ జీవన సౌందర్యం ఇదే. అనేక కులాలుగా, అంతరాలుగ విడిపోయిన భారతీయ సమాజంలో గ్రామాల్లోని అనుబంధాలు, ఆప్యాయతలు దేశం యొక్క గొప్ప వారసత్వాన్ని నిరూపిస్తుంటాయి.

కృతజత అనే గుణం వల్లడి కులంలో పుట్టింది. ఆనాటి మొదలు ఈనాటి వరకు వల్లడి వంశపు నెత్తురులో ఈ దేవతా గుణం లేశమైనా చెదరలేదు" (పు: 8) అని రచయిత చెప్తాడు. ఆ కులం యొక్క గొప్పదనాన్ని ఆ కుటుంబీకులు చూపించిన కృతజ్ఞతనీ, వారి గొప్ప మానవీయ, స్వచ్ఛమైన విలువలకు, ఆలోచనలకు ఇది దర్పణం పడ్తుంది. బ్రాహ్మణ, హరిజన రెండు కుటుంబాల్లోని పూర్వీకులు దొర-వల్లడి పూర్వీకులు మొదలు అడవిగా ఉన్న ఆ ప్రాంతాన్ని చదును చేసి గ్రామంగా మారుస్తారు తర్వాత అనేక కులస్థులను పిలిపించి నివాసం ఏర్పాటు చేయిస్తారు. ఆ పరంపరలో దొర కుటుంబానికి వల్లడు చూపిన నిరుపమానమైన కృతజ్ఞతకు గౌరవంగానే తర్వాతి దొర కుటుంబం వారు వల్లడిని కులదేవత' చేస్తారు

అర్ధాంతరంగా దొర చనిపోతే, దొర ఆస్తిని మొత్తంగా దక్కించుకునే ప్రయత్నంలో దొర భార్యని చిన్న పిల్లలను అనేక రకాలుగా ఇబ్బంది పెడతాడు. దొర దాయాది రాయుడు. అతని ఎదుర్కొనే శక్తిలేక దొరభార్య సర్వమంగళమ్మ పిల్లల్ని తీసుకొని పుట్టింటికి వెళ్తుంది.

దీన్ని ఏమాత్రం జీర్ణించుకోని వల్లడు రాయుడు మీద మండిపడుతూ "మళ్ళీ నా దొర ఆస్తి నా దొరకప్ప జెప్పుతాను. అప్పజెప్పకపోతే నా పేరు వల్లడు కాదు. నేను మాలవాడి కడుపున పుట్టలేదు (పు10) అంటాడు.

'కృతజ్ఞతను చూపించుకోవడానికి కేవలం ఆవేశంతో అన్నమాటలు కాదివి. దొర సహచర్యంలో దొరలోని మంచిని ఎలా వంటబడించుకున్నాడో లౌక్యాన్ని అంటే వంటబటించుకుంటాడు. వలడు దొరలోని మంచిని ఎలా వంటబట్టించుకున్నాడో లౌక్యాన్ని అంటే వంటబట్టించుకుంటాడు. వల్లడు చదువులేని అనాగరిక, హరిజన కులస్థుడు. రాయుడుని అతని అదుపులో ఉన్న గ్రామాన్ని ఎదిరించడం మామూలు విషయం కాదు. అత్యంత నేర్పుగా తనను రాయుడు ఎన్ని విధాలుగా రెచ్చగొట్టే ప్రయత్నం చేసినా, అసలుకే మోసం వస్తుందని చాలా సందర్భాల్లో సంయమనం పాటిస్తాడు. తన భార్యతో వలపోత పోసుకుంటూ "రాయుడు గారిని సాధిస్తాను. మళ్ళీ నా దొర ఇంట్లో దీపం పెడతాను" (పు 12)అని ప్రతిజ్ఞ చేస్తాడు.

ఆ క్రమంలో భాగంగా ఆ వూరి మునసబును, కరణంనీ మెల్లగా తనవైపు తిప్పుకుంటాడు. ……. మునసబుని బట్టి కరణం కూడా తిరిగిపోతాడని నమ్మకం లేదు. ఆయనకు వేరే పాచిక వెయ్యాలి. అది నెమ్మదిమీద గాది కుదరదు. ఈ లోపుగా నాయకుణ్ణి తిరగతీయాలి. నాయకుడు సాయబ్బు ఇలా సాగుతుంది వల్లడి ఆలోచన. ఎవరెవరిని ఎలా తనవైపుకి తిప్పుకునేందుకు, దానికి అతను ఏయే శక్తులు సమీకరించుకున్నాడో, బాగా 'లౌక్యం' తెలిసి, గ్రామ రాజకీయాలు పూర్తిగా కొట్టిన పిండై ఉన్నవారికే అవగాహనకు అందని ఎత్తులో ఉంటాయి. ఇన్ని యుక్తులు, లోతైన ఆలోచన ఉన్నప్పటికీ - దొర ఆస్తిని తాను ఎన్నడు పొందాలనీ, ఒంటరి దొరసానిని పిల్లలను వంచించాలనీ కలలో కూడ అనుకోని వ్యక్తిత్వం వల్లడిది. ఎందుకంటే 'వాడి వంశంలోనే దేవతాగుణం'ఉంది కాబట్టి. రాయుడితో పంతానికి పోతున్న సందర్భంలో "ఓయీ బ్రాహ్మడా! ఇది నీతో కాదు. నీతో వ్యవహారం చేస్తాను. మాలవాడు గదా వ్యవహారం చేయలేడనుకుంటున్నావు. చేసి చూపిస్తాను. మాలవాడి వ్యవహారానికీ, బాపనాడి వ్యవహారానికి భేదం చూపిస్తాను" (పు : 22) అంటూ తనకింత వ్యవహార జ్ఞానం ఎలా వచ్చిందో రాయుడికి చెప్పుతూ - "బుద్ధికీ, అక్షరానికీ ఏమీ సంబంధం లేదు సంబంధం లేదని మా దొర వెయ్యిసార్లు చెప్పాడు" (పు : 23) అంటూ అవసరమున్నా, లేకున్నా దొర'నే ముందరపెట్టి వ్యవహారం చేస్తాడు వల్లడు

దొర కుటుంబం పట్ల తనకున్న విధేయతను నిరూపించుకునే సందర్భంలో తననుతాను పూర్తిగా తగ్గించుకునే ప్రయత్నం చేస్తాడు వల్లడు. ఇది వల్లడి వ్యక్తిత్వంలోని గొప్పదనం. పోలీస్ స్టేషన్‌లో గానీ, జమీందారుని ఒప్పించి తమ గ్రామానికి రప్పించి, దొర కుటుంబానికి న్యాయం చేసే సందర్భంలో ఎక్కడా తను కనిపించే ప్రయత్నం చేయడు. కథలో మొత్తంగా తనే చక్రం తిప్పినా, దాని ఫలితాన్ని చూసి సంతోషిస్తాడే కానీ, ఆ 'గెలుపు'కు కారణంగా తనేనని గొప్ప చెప్పుకోడు. తాను దొర కుటుంబానికి ఎంతో చేసినా అది తన 'జీవిత ధర్మం' అనుకుంటాడే తప్ప విర్రవీగడు. 'కృతజ్ఞతగా ఉండడం' అంటే అదీ.

దొరసాని పుట్టింటికి వెళ్ళి ఆమెను బతిమాలి, అన్నం తిననని బెదిరించి పిల్లలతో సహా ఇంటికి తీసుకువస్తాడు. ఆమె ఇంటికి రాగానే దొరనే తిరిగి వచ్చిందన్న అతిశయంతో దొరసానితో నీ యింట్ల నీవుండు, ఇంక నేను రాయప్పనాడిస్తాను చూడు. మన ఎడ్లనీ, మన పశువుల్ని తీసుకొచ్చి మన వాకిట్లో కట్టివేస్తాను. కాదనటానికి రాయప్పకు తరంగాదు కదా!" (పు : 30) అని ధైర్యం చెప్తుతాడు.

చివరికి దొర పొలాన్ని దొరసానికి స్వాధీన పరుస్తాడు. ఈ కథంతా చిన్నదొర తన కొడుక్కు చెప్తుంటే "ఏమయ్యా! కుటజ్ఞాయనకు చెప్పావా ఏమి నా కథంతా! భలే తెలివి కలవాడవు! కుజ్ఞాయనకు ఏమి తెలుసు?.... అవన్నీ వట్టిమాటలు బాబూ. మీ నాయన అంతేలే అన్నీ కల్పించి చెప్తాడు" (పు:40) అని కృతజ్ఞతను విరాడ్రూపంలో ప్రదర్శించి, వ్యక్తిగా తాను అణుమాత్రంగా మిగిలిపోతాడు. అందుకే దొర వంశం అంతా వల్లడిని 'కుల దేవత'గా భావించి తరతరాలకు వల్లడి కథను పారాయణం చేస్తుంది. ఎవరి కథనైతే తమ నిత్య జీవితంలో ప్రతీపుటలో చెరగని ముద్రగా మిగిలిపోతుందో, ఆ వ్యక్తి పొందిన సాయం ఎంతనో గానీ, జీవితాంతం తను పొందిన ఆ ఋణాన్ని ప్రత్యంశలో తీర్చుకునేందుకు, తన సర్వశక్తులు కూడదీసుకొని సిద్ధపడతాడో ఆ వ్యక్తి 'కృతజ్ఞుడు', అతని జీవితం నేర్పే ఉదాత్త మానవీయ విలువే "కృతజ్ఞతగా ఉండడం".

**ఉపయోగపడిన పుస్తకం :**

వీరవల్లడు - విశ్వనాథ సత్యనారాయణ.

BHAVAVEENA
Vol. 18, Issue. 9, September 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# పాలమూరు జిల్లాలో స్నేహలతా కవితా సంఘం సాధించిన సాహిత్య చైతన్యం

- డా॥. సి. నర్సింహులు, సహాయ ఆచార్యులు, యం.వి.యస్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వ), మహబూబునగరు.

## స్నేహలతా కవితాసంఘ ప్రస్తావన :

ఆంధ్రసారస్వత పరిషత్తు 5వ వార్షకమహాసభలు తూప్రాన్‌లో జరిగాయి. దానికి బిరుదు వేంకటశేషయ్య సభాధ్యక్షులు. వారు తెలంగాణ కవుల కవితా పాండిత్యాలను చిన్నజేసి మాట్లాడుతూ, తెలంగాణవారు సరియైన తెలుగు కావ్యరచనా పాటవాన్ని సంపాదించా లంటే పెద్దబాలశిక్ష, సుమతీశతకం చదవడం అవసరమని యన్నాడట. అదివిని ఆసభలోవున్న కేశవపంతుల నరసింహశాస్త్రి నొచ్చుకొని తెలంగాణ కవుల పటిమను, పాండిత్యవిశేషాలను జటప్రోలు సంస్థాన స్నేహలతా కవితా సంఘాన్ని,సంఘ చైతన్యాన్ని ఆశువుగా ఒక పద్యములో ప్రస్తావించారు. అది,

సీ. తడియారలేదు మాధవరాయ చంద్రికా
పరిణ యక్షర మషీపంకమందు
చినుగు దింకను సదాశివశాస్త్రి నరసభూ
పాలీయ టీకార్థ పత్ర వితతి
మార్మోతలిడుచుండె మల్లాది వారికి
చెవిలోన వెల్లాల సింహగర్జ
ముడివిప్పలేదింక మొన్న శ్రీపాదవా
రందిన వేయిరూప్యముల మూట

గీ. నేటికిని స్నేహలతపూయు నిరుపమాన
సుమములాంధ్రికి తలలోన సొమ్ములగుచు
ప్రాజ్ఞగుణమైన జటప్రోలు రాజ్యమహిమ
వినకమా రాష్ట్రమును కొల్తవేయదగునె.

అని తెలంగాణ కవుల గొప్పదనాన్ని, జటప్రోలు సంస్థాన స్నేహలతాకవితాసంఘ ప్రాభవాన్ని ప్రస్తావించారు.

## స్నేహలతా కవితా సంఘం-సాహిత్య చైతన్యం:

నైజాం రాజ్యంలో రాజభాషగా ఉర్దూ రాజ్యమేలుతున్న కాలమది. తెలుగుప్రాంతంలో తెలుగుభాష కొడిగట్టిన దీపంలా మిణుకుమిణుకుమంటుంది. తెలుగుసంస్కృతి, సాంప్రదాయాలు కనుమరుగు కాకుండవుండడానికి నిజాంకు సామంతులుగావున్న సంస్థానాలు, కవులు, కళాకారులు చాలా ప్రయత్నం చేశారు. ఇక సంస్థానాలు నవయువకవులను రచనలో ప్రోత్సహిస్తు అనేక రచనలు చేయించారు. తద్వార ప్రజాచైతన్యం, భాషాచైతన్యం, సాంస్కృతిక చైతన్యం కలిగించారు. ఇట్లు చేసిన పాలమూరు జిల్లాలోని సంస్థానాలన్నింటిలో జటప్రోలు సంస్థానానిది ఒక ప్రత్యేకత.

జటప్రోలు సంస్థాన రాజధానియైన కొల్లాపురంలో సంస్థానాధిపతి రాజ శ్రీ సురభి వేంకట లక్ష్మారావు గారు తన కూతురు వేంకట రాజరాజేశ్వరిదేవి గారి కుమారుడైన రాజ విజయఅప్పారావుకు చదువు చెప్పించడానికి 1927వ సంవత్సరములో శ్రీ వాజపేయాజుల రామసుబ్బారాయ కవిని కోవూరు నుండి రప్పించారు. రాజాగారితో కవి పరిచయం అభిమానంగా, స్నేహంగా మారి 1928వ సంవత్సరములో లక్ష్మారావు సుబ్బారాయ కవిని ఆస్థాన కవిగా నియమించారు.

## స్నేహలతా కవితా సంఘస్థాపన :

ఈ విధంగా జటప్రోలు సంస్థాన ప్రవేశం చేసిన రామ సుబ్బారాయ కవి శతాధిక గ్రంథాలు రచించి సాహిత్య చైతన్యం కలిగించారు. కావ్యాలు, ప్రబంధాలు, లఘు రచనలు, శతకాలు, పద్యోత్తరాలు, తారావళులు, తత్వములు, యోగములు మొదలైన సాహిత్య

ప్రక్రియలను చేపట్టాడు. తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేయడానికి రాజావారి అనుమతితో 1929వ సంవత్సరములో స్నేహలత కవితా సంఘం అనునొక సాహిత్యసంస్థను ఏర్పాటు చేశాడు. పాలమూరు జిల్లాలోనే మొట్టమొదటిసారిగా ఏర్పాటు చేయబడిన సాహిత్యసంస్థ. రామసుబ్బారాయ కవి శతాధిక గ్రంథాలు రచించినప్పటికి వీరికి చిరకాల కీర్తినార్జించి పెట్టిన సాహిత్యసంస్థ స్నేహలత కవితా సంఘం. ఆంధ్రదేశంలో వెలసిన తొలి తెలుగు సాహిత్యసంస్థగా పేరు సంపాదించుకొన్నది. ఈ సంఘం దినదినాభివృద్ధిచెందుతూ, కొవ్వూరు, బిలాస్‌పూర్‌లకు శాఖోపశాఖలుగ విస్తరించింది. ఈ సంఘం ద్వారా దాదాపు రెండువందల (200) గ్రంథాలు ప్రచురింపబడి నాయంటే సంఘం యొక్క ప్రత్యేకతను తెలుసుకోవచ్చు. తనకు తెలుగు భాషపై గల అభిమానం, అభిరుచులే స్నేహలతా కవితా సంఘ స్థాపనకు తోడ్పడ్డాయని రామసుబ్బారాయ కవి తెలిపారు.

కాని రామసుబ్బారాయడు కలకత్తాలో చదువు చున్నపుడే 1916 లో ఈ స్నేహలతా కవితా సంఘం ఏర్పాటుకు అంకురార్పణ జరిగింది. తెలుగేతర ప్రాంతములో నివశించు తెలుగుకవులు తెలుగు భాషాభిమానులకు తెలుగుభాషలోని మాధుర్యాన్ని మరచిపోకుండావుండడానికి ఏర్పాటుచేశాడు.

ఈ కవితా సంఘంసంఘం పద్దెనిమిది (18) మంది సభ్యులతో ప్రారంభమై అనేక మంది సాహిత్యాభి లాషులకు చైతన్యం కలిగించింది. ఈ సంఘానికి మహారాజ పోషకురాలు సంస్థాన మహారాణి సురభి వేంకట రత్నమాంబ. ఈమె సంఘాభివృద్ధికి ఎంతో తోడ్పాటు నందించింది.

## సంఘకార్యకలాపాలు :

స్నేహలతా కవితాసంఘానికి అధ్యక్షులుగా శ్రీ వాజపేయాజుల రామసుబ్బారాయడు. కార్యదర్శిగా ఆయన శిష్యురాలు చేబ్రోలు సరస్వతిదేవి గారు నియ మింపబడినారు. వీరి అధ్వర్యంలో కవితాసక్తి గలిగిన కవులను ప్రోత్సహించి వారిద్వారా సాహిత్య సుమాలను వెలువరించడానికి నిరంతర కృషి జరిగినది. ఏ ముగ్గురు సంఘసభ్యులు కలిసినప్పుడు భాషాచర్చ చేయవలెనన్నది సంఘ నిబంధన. ఈ సంఘములో అలోచనశాఖ, అధికార శాఖ యను రెండు శాఖలు ఏర్పాటు చేయబడినవి. సంఘం నుండి ప్రతినెల రెడ్ లెటర్స్ పేరుతో లిఖితపత్రిక వెలువడేది. ఈ పత్రికకు కృష్ణకుమార మిత్రులు సంపాదకులుగా వ్యవహరించే వారు. ఇవి ప్రేమరస పూరితమైన పద్యలేఖలు. దూరప్రాంతాలలో ఉన్న సంఘ సభ్యులు అనురాగముతో ఒకే ప్రాంతములో కలిసి మెలిసి ఉన్నట్లు రాసుకున్న లేఖలు. ఇందులో కవుల ఆహ్లాదకర మైన భావాలు పొందుపరచబడినవి. ఎరుపురంగు శుభకారణమగుట చేత ఈ లేఖలకు రెడ్ లెటర్స్ అను పేరు స్థిరపరచబడింది. ఈ పత్రికకు ముఖచిత్రాన్ని చిత్రకళావిశారద అను పేరు పొందిన మియాపురం రామ కృష్ణరావుగారు చిత్రించుచుండిరి. ఈ సంఘం ద్వారా వార్షిక పత్రికగా వైజయంతి అను పత్రికకూడా వెలువరింపబడేది. ఈ పత్రికకు సంఘకార్యదర్శిగా వున్న చేబ్రోలు సరస్వతిదేవి గారు సంపాదకత్వం వహించుచుండిరి. భాషాసేవ చేయడం సంఘం ముఖ్యోద్ధేశం. వైజయంతి పత్రికను పాళీ, సంస్కృతం, ఆంగ్ల భాషలలో వెలువ రించాలని సంఘం నిర్ణయించింది. ఈ సంఘం చేపట్టిన కార్యక్రమాలకు ఇష్టపడి చాలామంది కవులు సంఘ సభ్యత్వాన్ని స్వీకరించారు. వారిలో ప్రఖ్యాత వ్యావహారిక భాష ఉధ్యమకారుడైన గిడుగురామమూర్తి పంతులు, వారి సతీమణి గిడుగులక్ష్మీకాంతమ్మ, వారి సోదరి జొన్నలగడ్డ శరదాంబ మొదలగువారు. సంఘ కార్య క్రమాలన్నింటిని పరిశీలించడానికి చేబ్రోలు రాజ గోపాలరావుగారు నియమింపబడినారు. సంఘసభ్యులు వెలువరించిన సాహితీసుమాలను పరిశీలించి తమ సంఘం ద్వారా ప్రచురింపజేసారు. సంఘస్థాపకుల యనుమతితో సమస్త కార్యకలాపాలు జరుపబడేవి. ఈ సంఘం నిర్వహించుచున్న కార్యక్రమాలకు ముగ్దుడై రాజ

ఇనుగంటి వేంకటకృష్ణారావు బహద్దర్ తేది. 01 సెప్టెంబర్ 1932న యోగ్యతాపత్రం అందజేశారు.

ఈ సంఘంనుండి ప్రచురించబడిన పుస్తకాలను పుష్పములనేవారు.ఈ స్నేహలతాకవితా సంఘం ద్వారా కొన్ని వందలకొలది పుస్తకాలను ప్రచురించారు. ప్రస్తుతము స్నేహలతకు పుష్పించిన కొన్ని పుష్పములను వాటి వికాసచైతన్యములను పరిశీలింతము.

## స్నేహలతా కవితాపుష్పాలు :

### కాశీయాత్ర :

రామసుబ్బారాయ కవి, వేంకటనారాయణ కవి ఇద్దరు కలిసి రచించిన ఏకాశ్వాస కావ్యము. ఇది 1934 సం.లో స్నేహలతా కవితా సంఘంద్వారా ముద్రించారు. ఇది భక్తిరస ప్రధానమైన కావ్యం. కాశి ప్రకృతి సౌందర్యానికి నెలవు. మోక్ష ప్రదమైన కాశీక్షేత్రాన్ని యాత్రానెపంతో పొగడి ఈ కవులు ధన్యులైనారు.

ఈ కావ్యంలో కవులు తాము నిరంతరము కవిత్వ రచన చేస్తున్నట్లు తెలిపారు. మిత్రులకు అసంఖ్యాకముగా లేఖలు రాస్తున్నట్లు, తమకు నిద్ర, విశ్రాంతి లేదని ఇక స్వర్గంలోనే విశ్రాంతియని రాసుకొన్నాడు. స్వర్గంలో కూడా లేఖలు రాసిపెట్టమని పరమేశ్వరుడు కోరితే అట్టి భాగ్యానికి తరింతుమన్నారు.

ఈ లోకంలో స్థిరమైనది, శాశ్వతమైనది ఏదిలేదు. అన్ని నీటిబుడగల వంటివే. ధనాన్ని సంపాదించడం మోక్షసాధనము కాదు. కాబట్టి మానవులకు ధనకాంక్ష తగదు అంటారు. సోదరకవులు సమస్థ క్షే త్రాలను, సకలదేవతలను దర్శించినట్లు చెప్పుకొన్నారు. ఈ కావ్యాన్ని రాట్కవి తల్లిదండ్రులైన రామనాథ సుబ్బమాంబలకు అంకితమిచ్చారు.

### సీతాకళ్యాణం :

రామసుబ్బారాయ కవి, వేంకటనారాయణ కవి ఇద్దరు కలిసి రచించిన మరొక కావ్యం సీతాకళ్యాణం. ఇది మూడు ఆశ్వాసాల కావ్యం ఇందలి కథా వస్తువు వాల్మీకి రామాయణంలోని బాలకాండ. సీతాకళ్యాణఘట్టాన్ని మార్చకుండా, మూలకథకు భంగం రాకుండా మధ్య మధ్యన స్వతంత్ర వర్ణనలు చేసినారు. ఇందులో అయోధ్యనగరంలోని నాలుగు వర్ణముల ప్రజలను గూర్చి వర్ణించాడు. అట్లే రాజకుమారుల సుకుమారత్వాన్ని వర్ణించాడు.

విశ్వామిత్రుని వెంబడి పుత్రులను పంపలేక పుత్ర వాత్సల్యంతో దశరథుని బాధను వర్ణించిన పద్యం.

ఉ. రాముడు చిన్నవాడు రణరంగ మెఋుంగడు శస్త్రవిద్యలం
దేమియుఁ నేర్వబోడు గ్రహింవగలేడు బలాబలమ్ములన్
రాముని బాయుఁనాడు నికరాజ్యమదేటికి సౌఖ్యమేటికే
నేవెంయి జూచినన్విడువ నిచ్చజనింపదు రామభద్రునిన్.

ఈ కావ్యాన్ని 1936 సం.లో సంఘం ద్వారా ముద్రించారు. దీనిని శ్రీరాజా సురభి వేంకట జగన్నాథరావు గారికి అంకితం చేశారు.

### కవితా కాంతావిహారము :

ఈ కావ్యాన్ని రామసుబ్బారాయ కవి 1934 సం.లో రచించి స్నేహలతాకవితా సంఘం ద్వారా 27వ పుష్పంగా ప్రచురించారు. ఇది ఏకాశ్వాస కృతి. ఇందులో కవి కవిత్వ రచనకిచ్చు ప్రాధాన్యత వివరింపబడింది. స్వప్నంతో కలిగిన విషయాన్ని భార్యకు చెప్పినట్లు రచించారు. ఇందలి వస్తువు కల్పితం. విషయం కవిత్వరచనా విధానం.

### సురభిలక్ష్మి :

జటప్రోలు సంస్థానపాలకుడైన రాజా సురభి వేంకట జగన్నాథరావుగారి ధర్మపత్ని ఇందిరాదేవి. కవి ఈమె జీవిత చరిత్రను సురభిలక్ష్మి పేరుతో చిన్న కావ్యముగా రచించాడు. ఇతడు జటప్రోలు రాజదంపతులకు బాల్య గురువు. కాబట్టి ఈయన రాసిన సురభిలక్ష్మి కావ్యములోని విషయాలన్ని వాస్తవాలే. ఇందులో కల్పితం ఏమాత్రము

లేదు. ఇందిరాదేవి వివాహం జగన్నాథరావు గారితో వైభవంగా జరిగిన విషయాన్ని వర్ణించాడు. అట్లే ఈమె మరణాన్ని గురించి రాజుగారి బాధను కరుణరస పూరితంగా రచించారు.

**శ్రీకృష్ణ భారత ప్రాశస్త్యం :**

ఈ కావ్యాన్ని శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి గారు రచించి 1933లో సంఘం ద్వారా ప్రచురించిరి. శాస్త్రిగారు శతాధిక గ్రంథాలు వ్రాసి తృప్తి చెందక మహాభారతం రాయడానికి పూనుకొన్నట్లు శ్రీపాదవారే తెలిపారు.

**చిరకారి :**

రామసుబ్బారాయుడు రచించి 1957లో సంఘం 173వ పుష్పంగా ప్రచురించారు.

ఇందలి కథ సంక్షిప్తంగా ఇలాఉంది.

అహల్యపై కోపించిన గౌతమ మహర్షి ఆమెను చంపవలసిందిగా తన కుమారుడైన చిరకారిని ఆజ్ఞాపించాడు. తల్లిని చంపడం ఇష్టంలేని చిరకారి స్త్రీహత్య అందులో మాతృహత్య మహాపాపమని తండ్రితో వాదిస్తూ కాలాయాపన చేసి ఆమెను రక్షించడం ఇందలి కథాంశం. దీనివల్ల నిదానమే ప్రధానం అన్న సూక్తి దీని వల్ల తెలుస్తుంది. తొందరపాటు మనిషికి పనికిరాదు. ఏ విషయమైన బాగా ఆలోచించి చేయవలయునని ఈ కృతి ద్వారా రామసుబ్బారాయుడు సందేశం ఇచ్చాడు.

**దేవిప్రసన్నం :**

ఈ కావ్యం 1944 సం.లో స్నేహలతా కవితాసంఘం 87వ పుష్పంగా రెండుభాగాలుగా ప్రచురించబడింది. ఇది జటప్రోలు రాణి సురభి రత్నమాంబ మనుమరాలైన సామ్రాజ్యలక్ష్మి వివాహసందర్భంగా తారహారము.

ఇందులో గృహిణి ఆచరించవలసిన ధర్మాలను అత్యంతరమణీయంగా వర్ణించాడు.

**కోయిల్ కందాడై సంపత్కుమారాచార్యులు మరియు మియ్యాపురం రామకృష్ణా రావు :**

వీరిద్దరు సంఘములో జంటకవులు. వీరిద్దరు కలిసి రచించిన కావ్యాలు. 1.రాఘవశతకం 2.పద్మాలయశతకం 3.సత్యనారాయణ స్తవరాజము 4.ఆంధ్రరామాయణ త్రయదర్శిని 5.శ్రీ త్రిపురేశ్వరస్తవము 6.గీతామృతము మొదలగునవి.

ఇంక సంఘం వెలువరించిన కావ్యాలు చాలా వున్నాయి. అందులో కొన్ని కావ్యాలు అవి..

1. రామకోటి తారావళి. 1937లో సంఘం ముద్రించింది. రచయిత రామసుబ్బారాయుడు.
2. రామాయణ సంగ్రహము. రచయిత పత్రి విశ్వేశ్వర శాస్త్రి.
3. శ్రీ కృష్ణదేవరాయ ప్రశంస. రచయిత పత్రి విశ్వేశ్వర శాస్త్రి.
4. మేఘసందేశం. రచయిత పత్రి విశ్వేశ్వర శాస్త్రి.
5. భావకవి. రచయిత పత్రి విశ్వేశ్వర శాస్త్రి.
6. రత్నలక్ష్మీ స్తవము. రచయిత శ్రీధర పరశురామ శాస్త్రి.
7. మాధవశతకము. రచయిత గంధం వేంకట నరసింహాచార్యులు.
8. భక్తామృతము. రచయిత గంధం వేంకట నరసింహాచార్యులు.
9. మణిహారము. రచయిత గంధం వేంకట నరసింహాచార్యులు.
10. ధృవచరిత్రం. రచయిత గంధం వేంకట నరసింహాచార్యులు.
11. లలితాశతకము. శ్రీ సరిపల్లె విశ్వనాథ శాస్త్రి.
12. కామవిలాసము. శ్రీ సరిపల్లె విశ్వనాథ శాస్త్రి.
13. గోమాత. శ్రీ సరిపల్లె విశ్వనాథ శాస్త్రి.
14. బ్రహ్మపత్రోపాఖ్యానము. రచయిత రామసుబ్బారాయుడు.
15. తస్కరణశతకము. రచయిత రామసుబ్బారాయుడు.

ఈ స్నేహలతా కవితా సంఘంలో రచయిత్రులు కూడా విరివిగా రచనలు చేసి సంఘం ద్వారా ముద్రించి సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు.

**చేబ్రోలు సరస్వతీదేవి :**

ఈమె స్నేహలతా కవితా సంఘం కార్యదర్శిగా ఉండి చాలా కావ్యాలు రచించారు. అవి 1.సరస్వతీ రామాయణం 2.ఉత్తర రామాయణం 3. శ్రీ సత్య నారాయణవ్రతకల్పం 4.సరస్వతీ శతకం 5.పతివ్రతా శతకం 6. ఆత్మోపదేశం 7. గురుగీత మొదలగునవి.

**గిడుగు లక్ష్మీకాంతమ్మ మరియు జొన్నలగడ్డ శారదాంబ:**

వీరు జంట కవయిత్రులు. స్నేహలతా కవితా సంఘం సభ్యులు. వీరి రచనలు 1. లక్ష్మీ శారద గీతాలు 2.లక్ష్మీశారద శతకాలు 3. లక్ష్మీ శారద సుభాషితాలు మొదలగు నవి. వీరి పద్యోత్తరాల కావ్యం. లక్ష్మీసరస్వతీ సంవాదం. పద్యాలతో ఉత్తరాలు రాయడం ఈ సంఘం చేపట్టిన నూతన ప్రక్రియ.

స్నేహలతా కవితా సంఘం స్థాపించిన తర్వాత దాదాపు 30 సంవత్సరాలు సాహిత్య పుష్పాలను వికసింప జేసింది. ఇందులోని ప్రతి పుష్పం పరిశీల నాంశమే. ఇంకా ఈ సంఘం ప్రతిపాదించిన పద్యోత్తరాలు పరిశోధ కాంశాలు. ఈ సంఘంలోని ఒక్కొక్క కవి రచన లపై ఒక్కొక్క సిద్ధాంతవ్యాసము రావలసిన అవసర మెంతైనా ఉంది.

**ఆధార గ్రంథాలు :**

1. స్నేహలతా కవితా సంఘం. రాసురాట్కవి.
2. రాసురాట్కవి జీవిత చరిత్ర. పేరేశ్వర నారసింహకవులు.
3. కాశీయాత్ర. రామసుబ్బారాయ వేంకట నారాయణకవులు.
4. సురభిలక్ష్మి. రాసురాట్కవి.
5. చంద్రికాపరిణయ పీఠిక. కేశవపంతుల నరసింహాశాస్త్రి
6. చరిత్రకెక్కని చెరితార్థులు. బిరుదరాజు రామరాజు.
7. సురభివేంకట లక్ష్మారాయబహద్దర్ వారి జీవితం. రాసురాట్కవి.
8. విజ్ఞానసర్వస్వము. పుటలు. 802,803. కపిలవాయి లింగమూర్తి.

# కాకిపడిగెల కథన నైపుణ్యం

- డా॥. పుట్ట యాదేశ్

ముత్తరాశి కులానికి ఆశ్రితకులం 'కాకిపడిగెల వాళ్ళు'. వీళ్ళు కేవలం ముత్తరాశులకు మాత్రమే 'పటం కథలు' చెప్తూ వాళ్ళు ఇచ్చే త్యాగం(దానం)పై ఆధారపడి బతుకుతారు. వీళ్ళు చెప్పే కథలను సాధారణంగా 'పాండవుల కథలు' అంటారు. అయితే ఇందులో 'ముదిరాజ పురాణం'తోపాటు ఇతర హాస్య కథలు కూడా ఉంటాయి.

కాకిపడిగెలవాళ్ళు చెప్పే కథల్లోని వివిధ ఘట్టాలు బొమ్మల రూపంలో చిత్రించబడిన ఒకటి నుండి రెండు గజాల వెడల్పు, ఇరవై నుండి ముప్పై గజాల పొడువైన వస్త్రపు చిత్రపటాన్ని ప్రదర్శిస్తారు. కథ చెప్తున్నప్పుడు మధ్య మధ్యలో ఆ సన్నివేశాలుగల బొమ్మలనుఆ పటంపై చూపిస్తుంటారు. అందుకే ఈ కథలకు 'పటం కథలు' అనే పేరు వచ్చింది. ఇది ప్రేక్షకులను కథలో మరింతగా లీనం చేయడానికి ఉపయోగపడుతుంది.

కాకిపడిగెలవాళ్ళు చెప్పే పాండవుల కథలకు మూలం లిఖిత మహాభారతంలో కనబడుతున్నాయి. కాని వాటిలో ఎన్నో అంశాలు, కల్పనలు చేర్చబడ్డాయి. ఈ మార్పులూ, చేర్పులకు ఎటువంటి లిఖిత ఆధారాలు లేవు. మహ భారతాన్ని తెలుగీకరించడంలో నన్నయ్య చేసిన పనే ఈ కాకిపడిగెలవాళ్ళూ చేశారు. నన్నయ్య తన ఏలిక అయిన రాజరాజును సంతృప్తి పరచడానికి అతని వంశకర్తలైన పాండవుల చరిత్ర అయిన మహాభారతాన్ని తెలుగులోకి అనుసృజన చేశాడు. కాకిడిగెలవాళ్ళు కూడా తమ పోషకులైన తెలుగొళ్ళ/ముదిరాజులను సంతృప్తి పరచడానికి వారి మూలపురుషులైన పాండవుల కథలు చెప్తున్నారు. తమ ఏలికలను సంతృప్తి పరచడానికి తర్కబద్ధమైన, అంగీర యోగ్యమైన, రసవంతమైన కల్పనలు ఎన్నింటినో జోడించారు. ఏ కాలంలోనైనా ఏలికలను సంతప్తి పరచడం ఆశ్రితుల ధర్మం కదా!

కాకిపడిగెలవాళ్ళ కథనంలో మరో ముఖ్యమైన విషయం, తమ చుట్టూ నిత్యజీవితంలో జరిగే సంఘటనలను, సంభాషణలను పాండవుల కథల్లో సందర్భానుసారంగా ఇరికించడం. ఇవి కథకు బలం చేకూరుస్తూ కథనం మరింత రక్తికట్టిడానికి ఉపయోగపడ్తాయి. ఈ కాకిపడిగెల కథనకౌశలాన్ని దర్శించడానికి వాళ్ళు చెప్పే పాండవుల కథల్లో 'విరాట పర్వం పటం కథ'ను పరిశీలిద్దాం.

కాకిపడిగెల కళాకారులు మూలకథను ఆవేశంగా, హాస్యవంతంగా, ఆసక్తికరంగా చెప్పడానికి తమవైన కొన్ని అంశాలను కథనంలో చొప్పిస్తారు. ఉదాహరణకు కొన్ని-

**కల్పితాంశాలు :**

'విరాటపర్వం పటంకథ' పాండవుల అరణ్యవాసం ముగిసి, అజ్ఞాతవాసం ఆరంభం కావడంతో ప్రారంభమవుతుంది. పాండవులు మారువేషాలు వేసుకొని, విరాట్ రాజు కొలువులో ఉద్యోగులుగా చేరుదామని నిర్ణయించుకున్న తర్వాత తమ ఆయుధాలను, ఆభరణాలను ఎక్కడ దాచిపెట్టలనే ప్రశ్న ఎదురవుతుంది. ఒక పెట్టెలో పెట్టి, ఓ చెట్టుమీద దాచిపెడితే బాగుంటుందనుకుంటారు. ఇక్కడివరకు లిఖిత భారతంలో ఉన్న కథే. కాని,ఆ పెట్టెను ఎవరు తయారు చేస్తారు? అందుకోసం సహదేవున్ని మాయలూ మంత్రాలు తెలిసిన పాత్రగా కల్పన చేశారు కాకిపడిగెల కళాకారులు. సహదేవుడు ఒక మట్టిబొమ్మను చేసి, మంత్రించిన నీళ్ళు దానిమీద చల్లితే అది ఒక మేదరివాడుగా మారుతుంది. ఆ మేదరివాడు ఒక లంకపొదను సృష్టించి,దాని నుండి మేదరి పెట్టెను తయారు చేస్తాడు. ఇది కాకిపడిగెల కల్పితాంశం. ఇటువంటి కల్పతంశాలు వీళ్ళు చెప్పే కథల్లో ఎన్నో!

**హాస్య ప్రధానం :**

ధర్మరాజు ముందుగా తన ఆయుధాలను ఆ పెట్టెలో

పెట్టి, తర్వాత తన తమ్ముళ్ళను కూడా వాళ్ళ ఆయుధాలను అందులో పెట్టమని ఆదేశిస్తాడు. అయితే, ఈ ఆదేశించడంలో 'పెద్ద నుండి చిన్న' అనే వరుస కాకుండా అర్జున, నకుల, సహదేవుని తర్వాత భీమున్ని ఆదేశిస్తాడు. కాకిపడిగెలవాళ్ళు భీమున్ని చివరగా వెళ్ళేటట్లు చేసి ప్రత్యేకతను చూపించారు. ఇందుకు కారణం, వాళ్ళు చెప్పే పాండవుల కథల్లో భీముడే నాయకుడు. ఒక పాత్ర గురించి ప్రత్యేకంగా చెప్పినప్పుడే దానికి ప్రాధాన్యత రావడం కథన సాంప్రదాయం. ధర్మరాజు ఆదేశంతో భీముడు తన ఆయుధాలన్నీ ఆ పెట్టెలో పెడ్తాడు. కాని, ఒక్క గదను మాత్రం తన వద్దనే ఉంచుకుంటాడు. ధర్మరాజు ఎంత బతిమాలినా వినడు. పెట్టనంటే పెట్టనని పట్టుపడ్తాడు. ధర్మరాజు మాట భీముడు వినకపోయేసరికి ప్రేక్షకుల్లో ఉత్కంఠ కలుగుతుంది. చివరికి కారణం అడుగుతాడు ధర్మరాజు. అప్పుడు భీముడు,"నా మీదకు ఎవరైన శత్రువులు వస్తే? ఒక్క గుద్దుతో వంద మందిని చంపుతా! ఒక్క తన్నుతో వెయ్యిమందిని చంపుతా! అదే లక్షమంది వస్తే? అప్పుడుగద కావాలి"అంటాడు. ఈ సంవాదంలో చిరికి భీముడు రాజీపడి, "నువు పెద్దోడివి, నువ్వడిగినపుడు ఇయ్యకపోతే బాగుండదు" అని ఇచ్చేస్తాడు. ఇక్కడ భీముని ప్రవర్తన హాస్యవంతంగా ఉంటూనే అతన్ని నాయకునిగా స్థాపిస్తుంది. ఇది సన్నివేశాన్ని హాస్యవంతంగా నడపడంలో కాకిపడిగెల కళాకారులు చూపిన కథన కౌశలానికి నిదర్శనం.

**సన్నివేశ కల్పన :**

కాకిపడగెల కళాకారులు చేసే సన్నివేశ కల్పన అత్యంత సహజసిద్ధంగాఉండి వాస్తవికంగా ప్రస్తుతం జరుగుతున్నట్లే ఉంటుంది.

1. అర్జునుడు జమ్మిచెట్టును వెతకడానికి అడవికి వెళ్తాడు. అడివి అంతా వెతుకుతూ జమ్మిచెట్టు చుట్టూ తిరుగుతాడు. కాని ఆ చెట్టును మాత్రం చూడడు. అప్పుడు ఆ జమ్మిచెట్టే అర్జునుడు తనను చూడడం లేదని బాధపడ్తుంది. ఆ చెట్టుకు అర్జుడంటే చాలా ఇష్టం. "ఓ ప్రియమైన అర్జునుడా!" అని పిలుస్తుంది. అయినా అర్జునుడికి ఆ చెట్టు మాటలు వినబడవు. అతనిదృష్టి ఎట్లయినా సరే తన దిక్కు తిప్పుకోవాలని తనకొమ్మలను గళగళమని ఊపుతుంది. అప్పుడు చూస్తాడు అర్జునుడు. జమ్మిచెట్టు అర్జునునిపై ప్రేమ చూపించిందనడం అపూర్వమైన కల్పన. కాకిపడిగెల కళాకారులు జమ్మిచెట్టును మానవీకరించి ఈ సన్నివేశాన్ని ఉత్కంఠభరితంగా తీర్చిదిద్దారు.
2. ఆయుధాల పెట్టెను, జమ్మిచెట్టు మీదనే ఎందుకు పెట్టాలి? అనే ప్రశ్నకు కాకిపడిగెలవాళ్ళు కల్పించిన కారణాలు సన్నివేశాన్ని అత్యంత ఆసక్తిదాయకంగా మార్చాయి. ఇది ఎండాకాలం. చెట్లన్నీ ఎండిపోయినయి. జమ్మిచెట్టు మాత్రమే గుబురుగా ఉంది. దానికి ముండ్లున్నాయి. కాబట్టి దానిమీద పెడదామంటారు. ఇది సాధారణ విషయమే అయినా ఒక నమ్మదగిన కారణంగా చూపించారు. ధర్మరాజు ఆ ఆయుధాల పెట్టెను ఆ చెట్టుమీద పెట్టమని భీమున్ని ఆదేశిస్తాడు. అప్పుడు భీముడు హనుమంతునిలాగా చెట్టంత ఎత్తుకు పెరిగి పెట్టెను ఆ చెట్టుపైన పెడ్తాడు. దీనిని రామాయణంలోని హనుమంతుని పాత్రను దృష్టిలో పెట్టుకొని కల్పన చేశారు కాకిపడిగెల కళాకారులు.
3. ఆ ఆయుధాల పెట్టెను ఎవరైనా చూసినా దాని దగ్గరికి వెళ్ళకుండా ఉండడానికి సహదేవుడు దాన్ని దుర్గంధంతో కంపుకొట్టే మాయాశవంగా మారుస్తాడు. ఆ మాయాశవాన్ని చూడగానే పాండవులకు ఏడుపొచ్చింది. పన్నెండేండ్లు అరణ్యవాసంలో పడ్డ కష్టాలు, ఇంకో ఏడాదిపాటు అజ్ఞాతవాసం చేయవలసిన దుస్థితిని తలుచుకొని, ఆ మాయాశవాన్ని పట్టుకొని బోరున ఏడ్చారు. ఈ కల్పన పాండవుల కష్టాలను ప్రేక్షకులకు అనుభూతం చేయడానికి, ఎమోష్నల్ గా చూపించడానికి చేసిందే కాని కథకు

సంబంధించింది కాదు. ప్రేక్షకుల్లో ఎమోషన్ పెంచడానికి ఈ కథకులుచేసే కల్పనల్లో ఇదీ ఒకటి.

4. ఈ కథలో నాయిక అయిన ద్రౌపదిని, కీచకుడు చూసే సన్నివేశ కల్పన అద్భుతం-

సుదేష్ణాదేవి ఇంటి ముందు వాకిట్లో, చుట్టూ పరదాలు కట్టుకొని, దాసివాళ్ళకు ముగ్గులు వేయడం నేర్పుతుంటుంది ద్రౌపది. అక్క ఇంటికి వచ్చిన కీచకునికి ఆ పరదాల కింది నుండి ద్రౌపది పాదాలు కనబడుతాయి. ఆమె అందమైన కాళ్ళ మెరుపులకు కీచకుని కళ్లు జిగేలుమని కిందపడిపోతాడు. అందుకు కారణం, ఆకాశం నుండి చుక్క తెగిపడిందో, సూర్యకాంతి కింద పడ్డదో, చంద్రకాంతి పడ్డదో అనుకుంటాడు. ఆ కాళ్ళు,నారదుడు చెప్పిన అమ్మాయివే కావచ్చని అనుకుంటాడు. దగ్గరికి వెళ్ళి పరదాలు తొలగించి చూస్తాడు. ద్రౌపది దగదగ మెరిసిపోతుంటుంది. ఆమె నడుము సింహం నడుములాగా పిడికిట్లో పట్టేటంతే ఉందంట! కీచకుడు అక్కడే నిలబడి, నారదుడు చెప్పినట్లు ఆ అమ్మాయే తనను పెండ్లి చేసుకుంటుందని కలలు కంటూ ఉంటాడు. అతన్ని గమనించిన ద్రౌపది అక్కడి నుండి వెళ్ళిపోతుంటే కీచకుడి కళ్లల్లో అమృతం పోసినట్లు అనిపించిందంట!

వాకిలి చుట్టూ పరదాలు కట్టుకొని ద్రౌపది ముగ్గులు వేయడం, ఆ పరదాల కింది సందులోనుండి ఆమె పాదాలు కనబడడం, ఆ తెరలను తొలగించి చూస్తే దగదగ మెరిసిపోతున్న ఆమెఆకారం కనబడడం మొదలైన వర్ణనలుకీచకుడికి ఓ అద్భుతాన్ని చూపించడానికి చేసినవి. ఈ వర్ణన నేటి సినిమాలోని దృశ్య చిత్రీకరణలాగా ప్రేక్షకులకు దర్శనమిస్తుంది.

**పిట్టకథలు :**

కాకిపడిగెల కళాకారులు పాండవుల కథలు చెప్తూ, కథాకథనంలో ఒక రసం ముగిసిన అనంతరం ప్రేక్షకులను మరోరసాస్వాధనకు సిద్ధం చేయడానికి ప్రయత్నిస్తారు. అందుకు ప్రధాన కథకు అధనంగా కొన్ని పిట్టకథలు జోడిస్తారు.

పాండవులు మాయాశవాన్ని పట్టుకొని ఏడుస్తుంటే, ఆ బాటగుండా వెళ్తున్న గొల్లొళ్ళు చూస్తారు. ఏమైందోనని దగ్గరికి వచ్చి పాండవులను చూసి ఆశ్చర్యపోతారు. "వీళ్ళు ఎక్కడి నుండి వచ్చార్రా? హోలి ఆడినట్లు రంగులు వేసుకున్నారు!" అని అనుకుంటారు. ఇక్కడ రంగులు వేసుకున్నది పాండవులు కాదు. కథకులూ, వంతపాడేవాళ్ళు. వాళ్ళే పాండవులుగా నటిస్తున్నారు. కథలో లీనమైన ప్రేక్షకులను బయటికి తేవడానికి పాత్రలను వదిలి వాస్తవ లోకంలో ఉన్న కళాకారుల మీదికి వారి దృష్టిని మళ్ళించడానికి గొల్లొళ్ళ ఈ మాటలు ఉపయోగపడ్తాయి. పాండవులు, తమ కష్టాలను మాయాశవంలో చూసుకొని ఏడ్చినపుడు, ప్రేక్షకుల్లో కరుణరసం ఉద్భవించింది. ప్రేక్షకులు ఆ కరుణరసం నుండి తేరుకొని సాధారణ స్థాయికి వస్తేగాని ప్రధానకథ ముందుకు సాగదు. అందుకే, ప్రేక్షకులను కొద్దిసేపు నవ్వించడానికి, గొల్లలు సృష్టించబడ్డారు. ఆ గొల్లల పాత్రధారులుగా కథకుడు, వంతకులు చేసే హాస్యవంతమైన సంవాదం కన్నీళ్ల పర్యంతమైన ప్రేక్షకుల ముఖాలపై హాస్యపు జల్లులు కురిపిస్తుంది. బరువెక్కిన ప్రేక్షకుల హృదయాలు తేలికపడ్డ తర్వాత ప్రధాన కథను మళ్ళీ కొనసాగిస్తారు.

**పాత్ర సృష్టి :**

కాకిపడిగెల కళాకారులు భారతకథలను రసవంతంగా చెప్పడానికి ఎన్నోరకాలుగా మార్పు చేర్పులు చేస్తారు. అవసరమైతే కొత్త పాత్రలను సృష్టిస్తారు. కాని,ఎన్ని రకాలుగా మార్చి చెప్పినా అసలు కథామూలాన్ని మాత్రం మార్చరు. ఇందుకు ఉదాహరణగా కీచకవధ ఘట్టంలో నారద పాత్ర సృష్టిని చెప్పవచ్చు. కీచకుడు, భీముని చేతిలో చావాలి అనేది మూలాంశం. ఈ ఘట్టంలో నారద పాత్రను ప్రవేశపెట్టడం వల్ల గంభీరమైన సన్నివేశాలను కూడా హాస్యవంతంగా, ఆసక్తికరంగా చెప్పే అవకాశాలను సృష్టించారు కాకిపడిగెల కళాకారులు.

పురాణాలలో కలహాలు సృష్టించే పాత్రగా అందరికి సుపరిచితమైనది నారదునిపాత్ర. కాబట్టి నారదున్ని కీచకవధ ఘట్టంలో వాడుకున్నారు కాకిపడిగెల కళా కారులు. నారదుడు కీచకునిపై కక్ష పంచుకోవడానికి హేతుపూర్వకమైన ఒక సన్నివేశాన్ని కల్పించారు. ఎలాగైనా కీచకున్ని చంపాలనే కసిని పెంచుకున్నాడు నారదుడు. కాని అతన్ని చంపడం తనవల్ల కాదు. కీచకున్ని చంపగల మొనగాడు భీముడొక్కడే. భీముడు కీచకున్ని చంపాలంటే వాళ్ళిద్దరికీ మధ్య వైరం రావాలి. ఆ ఇద్దరి మధ్య వైరం రావాలంటే కీచకుడు ద్రౌపదిని మోహించాలి. అది జరగా లంటే ముందు కీచకుడు ద్రౌపదిని చూడాలి. ద్రౌపది ఉన్నది అతని అక్క సుదేష్ణ ఉన్న నగరం నక్షత్రపురిలో. కాని, కీచకుడు అక్కపై కోపంతో నక్షత్రపురికి వెళ్ళక పన్నెండేండ్లయ్యింది. కీచకున్ని నక్షత్రపురికి పంపించడానికి నారదున్ని ప్రవేశపెట్టారు కాకిపడిగెల కళాకారులు. కీచకుడు ఆ ఊరికి వెళ్ళడానికి నారదుడు రకరకాలుగా ప్రేరేపించి చూస్తాడు. మీ అక్క, బావ, అల్లుడు, కోడలు అందరూ చచ్చిపోయారని కూడా చెప్పి చూస్తాడు. ఈ మాటలను కీచకుడు నమ్మినట్లే నమ్మి 'అక్కడికెళ్తే, పాండవ భీముడుంటాడేమో, నన్ను చంపుతాడేమో' అని భయపడ్తాడు. ఇట్లా నారదునికీ కీచకునికి మధ్య జరిగన సంవాదం హాస్యరస ప్రధానంగాసాగి ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తుంది. లిఖిత భారతంలో కీచకుడు భీరుడు కాడు. కాని, కాకిపడిగెల పాండవుల కథలో అతడు భీరుడు. అందులోనూ భీముడంటే విపరీతమైన భయం. కీచకున్ని ఇంత భీరునిగా చిత్రించడంలో కాకిపడిగెల ప్రధానోద్దేశ్యం ప్రేక్షకులను నవ్వించడమే.

కీచకుడు, భీముని గురించి భయపడుతుంటే నారదుడు పాండవులు చచ్చిపోయారని చెప్తాడు. అప్పుడు కీచకుడు, పాండవులు మంచివాళ్ళేనని, "ఎంతమంచి గుండ్రి! ఎంతతెలివిగల్లొల్లు! అందులో ధర్మరాజు బతుకనుండె! వాడు మంచోడే. అర్జునుడు బతుకనుండె, వాడు మంచోడే. నకుల సహదేవులు బతుకనుండ్రి, వాళ్ళు మంచొళ్ళే'' అంటూ పాండవులను గొప్పగా ప్రస్తుతిస్తాడు. కాని, "చాల పొద్దుగాల కర్రోడు భీముడు చావాల్సి ఉండే!'' అంటాడు. ఈ మాటలనుబట్టి, కీచకునికి పాండవుల్లో ఒక్క భీమునిపైనే కోపముందని తెలుస్తుంది. కాకిపడిగెల వర్ణనలో కీచకుని పాత్ర కర్ణుని పాత్రలాగా ఉదాత్తంగా చిత్రీకరించబడింది.

నక్షత్రపురికి వచ్చిన కీచకుడు అక్క సుదేష్ణ ముందు కూర్చుంటాడు. కాని, అక్కను చూడకుండా ఆమె వెనుక ఉన్న ద్రౌపదినే చూస్తుంటాడు. ఆ సమయంలో, ద్రౌపది 'సూర్యుడా! నువు పొడవకు నేనే పొడుస్తా! చంద్రుడా ! నువు పొడవకు నేనే పొడుస్తా!' అంటున్నట్లుందంట! కాకిపడిగెల కథన నైపుణ్యానికి ఈ వర్ణన మచ్చుతునక. అక్క ఎంత పిలిచినా కీచకుడు పలుకడు. ద్రౌపది ధ్యానంలోనే ఉంటాడు. "నీ రాజ్యం బాగుందా? నీ ఊరు బాగుందా? నీ గుర్రాలు బాగున్నాయా? నీ ఏనుగులు బాగున్నాయా?" అని ఎన్ని విధాలుగా అడిగినా కీచకుడికి వినబడదు. కాని, కీచకుడే "అక్కా! నీ వెనుకున్నదెవరు?" అని అడుగుతాడు. సుదేష్ణ, ఆమె దాసిది అనిఅంటే, "దాన్ని ఎంతకు కొన్నావో చెప్పు, నేను కొంట. ఆమె నిలువెత్తు ధనం పోస్తా''అంటూ ఆశపడ్తాడు.

ఇట్లా, అక్కా తమ్ముళ్ళ మధ్య జరిగే ఈసంవాదం ఆసక్తికరంగా సాగుతుంది. సుధేష్ణ స్త్రీవాద దృక్పథంతో మాట్లాడగా కీచకుడు ఉత్తముడైన ప్రేమికుడిగా వాదిస్తాడు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమెను పెండ్లి చేసుకొని తీసుకెళ్తానని పట్టుపడ్తాడు. ఈ మాటల్లో కీచకుని స్వచ్ఛమైన కాంక్ష ప్రస్ఫుటమవుతుంది.

ద్రౌపది పారిపోతుంటే కీచకుడు అడ్డుపడి తనను పెండ్లి చేసుకొమ్మని పట్టుపడ్తాడు. ద్రౌపది 'తండ్రీ! తండ్రీ!' అని ఎంత ప్రాధేయపడినా వినపించుకోడు. చివరికి విసుగెత్తిన ద్రౌపది "ఓరి దుర్మార్గుడా'' అని తిడ్తే "ఆహా! నా చెవుల్లో అమృతం పోసినట్లుంది" అని సంబరపడ్తాడు. అతని ప్రవర్తనకు మండిపడిన ద్రౌపది "మూత్రం పోసినట్లు లేదా?!'' అంటుంది. ఎంతో గంభీరంగా

సాగుతున్న ఈ సంవాదంలో ద్రౌపది అన్న మాటలు ప్రక్షకులను నవ్వుల్లో ముంచెత్తుతాయి. గంభీరమైన సందర్భాలను కూడా కాకిపడిగెల కళాకారులు ఎంతో హాస్యవంతంగా చెప్తారనడానికి ఇది ఒక ఉదాహరణ.

ద్రౌపది తప్పించుకొని పారిపోయిన తర్వాత, ఇంటికి వచ్చిన కీచకున్ని అక్క సుధేష్ణ విపరీతంగా మందలించింది. "నీ పదిగేను మంది భార్యల దగ్గర లేనిది దీని దగ్గరేముందిరా?" అని నిలదీస్తుంది. ఈ మాటలు కాకిపడిగెల స్త్రీవాద దృక్పథానికి అద్దం పడుతున్నాయి. ఈ మాటల్లో సుధేష్ణదేవి వ్యక్తిత్వ ప్రదర్శన కనిపిస్తుంది. ఆమె ఎన్ని మాటలు చెప్పినా వినకపోయేసరికి కీచకున్ని "నువ్వు నా తమ్ముడివిగాదు, వెళ్ళిపో మూరు?డా!" అని తిట్టి పంపిస్తుంది. ఈ మాటలు స్త్రీ గౌరవానికి, స్త్రీ వ్యక్తిత్వానికి అద్దం పడుతున్నాయి. సుధేష్ణ పాత్ర చిత్రణ లిఖిత సాహిత్యంలో కంటే కాకిపడిగెల కథన శిల్పంలోనే మరింత మనోహరంగా, మహోన్నతంగా తీర్చిదిద్దబడింది.

**హేతువుల కల్పన :**

కీచకున్ని చంపించాలని నారదుడు కక్షకట్టాడని ఒక హేతుపూర్వకమైన సన్నివేశాన్ని సృష్టించారు కాకిపడిగెల వాళ్ళు.

1. నారదుడు ఒకసారి కీచకుని దర్శనానికి వెళ్ళినప్పుడు ఏ హడావిడిలేకుండా సాధారణంగా ఆహ్వానిస్తాడు. ఆ రాత్రి నారదుడుకి, అతడు శాఖాహారి కావడంతో పచ్చిపులుసుతో భోజనం పెడ్తాడు. నారదుడు కూడా తృప్తి పడ్తాడు. కాని, కీచకుడికే తృప్తి ఉండదు. రాత్రి పడుకున్న తర్వత నిద్రలోనుండి లేచి "అరె! తాతకు పచ్చిపులుసుతో భోజనం పెట్టిన. మరి పొద్దున కూడా పచ్చిపులుసుతోనే పెడ్తే నాదేం పేరు?" అని ఆలోచించుకొని మాంసంకూరతో భోజనం పెట్టాలని నిర్ణయించుకుంటాడు. అనుకున్నదే తడవుగా ఆ అర్ధరాత్రే అందరినీ నిద్రలేపి వేటకు తీసుకెళ్తాడు. ఆ వేటకు నారదున్ని కూడా తీసుకెళ్తాడు. ఆ రాత్రంతా ఎంత వెదికినా ఒక్క యాట కూడా దొరకదు. ఆ అడవిలోనే వాళ్ళకు పొద్దెక్కుతుంది. నారదుడు ఓ బావి దగ్గరికి వెళ్ళి స్నానం చేసి, సూర్యనమస్కారం చేసుకుంటుంటాడు. నారదుడు కనిపించకపోయేసరికి దారితప్పి పోయాడని భావించి అతన్ని వెతుకుతూ కీచకుడు ఆ అడివంతా తిరిగుతాడు. ఎక్కడా నారదుడు కనిపించడు. ఎంత పిలిచినా నారదుని నుండి సమాధానం రాదు. ఇంతలో కీచకుని ఏనుగుకు దాహమైతే అక్కడున్న బావి దగ్గరికి తీసుకెళ్తాడు. ఆ బావి దగ్గరే సూర్యనమస్కారం చేసుకుంటున్న నారదుడు కనిపించేసరికి కీచకుడికి విపరీతమైన కోపం వస్తుంది. నేను ఎంత పిలిచినా పలుకవా? అని నారదుని జుట్టుపట్టుకొని గుంజుకొచ్చి కొరడాలతో కొట్టిచ్చిస్తాడు. నారదుడు కోపించి "పాయక పన్నెండేండ్లకు పాండవ భీమునిచే చత్తువురా!" అని శపిస్తాడు.

ఇక్కడ కీచకుడు, భీముని చేతిలో చావడానికి కారణం నారదుని శాపమేనని ఒక హేతుబద్ధమైన కథను కల్పించారు కాకిపడిగెలవాళ్ళు. వీళ్ళు చెప్పే ప్రతీకథ ఇట్లా హేతుబద్ధంగా ఉండి, ఉత్కంఠతతో, హాస్యవంతంగా ఉండి ప్రేక్షకులను అలరిస్తుంది.

2. భీముడి పేరెత్తుతేనే కీచకుడు భయపడిపోతుంటాడు. అందుకు కారణంగా భీముడు, కీచకునికి భయం పుట్టించిన ఓ సన్నివేశాన్ని కల్పించారు.

ఒకసారి, హోళీపండుగకు పాండవులు వెళ్ళిన ఊరికే కీచకుడు కూడా వెళ్తాడు. అక్కడ భీముడు, కీచకున్ని చూసి 'నీకు నాకు వైరం' అని పందెం వేసుకొని కీచకుని చేతిలో ఐదాకులు, ఐదు పోకలు, ఖర్జూరం, బొట్టు, పసుపు, కుంకుమ ఉన్న పల్లెం అందిస్తాడు. అది విడియం అనుకొని కీచకుడు తీసుకోబోతే భీముడు చావు దెబ్బలు కొడ్తాడు. ఆ పోరాటంలో భీముని చేతికి రక్తం కారుతున్నా కిలకిల నవ్వుతూ అట్లే నిలబడడం చూసి

కీచకుని గుండెలు పగిలిపోయి భీరుడైపోతాడు. కోటగుమ్మాన్ని గట్టిగా పట్టుకున్న కీచకున్ని, అతనికి రక్షణగా నిలబడ్డ వందమందిని భీముడు అవలీలగా చిత్తుచిత్తు చేసి, అతన్ని నాగలోకంలో పడేటట్లు విసిరికొట్టాడ్తాడు."ఓయ్ సింహబలా! నా జోలికొస్తే సంపుతా!'' అంటూ మీసం దువ్వుకుంటూ వెళ్ళి పోయాతాడు. అప్పటినుండి భీముడంటేనే కీచకునికి విపరీతమైన భయం పట్టుకుంటుంది.

3. ద్రౌపది తప్పించుకొని పారిపోతుంటే కీచకుడు అడ్డుపడినపుడు,"తండ్రీ! తండ్రికి బిడ్డతో ఏమైనా పని ఉంటుందా?'' అని అతని మనసు మార్చాలని చూస్తుంది. కాని కీచకుడు, ద్రౌపది మాటలకు విపరీత అర్థాలు తీస్తూ హేతువులు చూపిస్తాడు. 'బ్రహ్మ కూతురు వరస కూడా లేదా' అంటాడు. "త్రి మూర్తులు సరస్వతీ, లక్ష్మి, పార్వతులను సృష్టించారు. అంటే త్రిమూర్తులకు వాళ్ళేమవుతారు? తండ్రులవుతారు! మరి వాళ్ళను పెండ్లి చేసు కోలేదా?!'' అని తండ్రి కూతురును పెళ్ళిచేసుకుంటే తప్పులేదని వాదిస్తాడు. కీచకుడి వితండవాదానికి కూడా హేతువులను చూపించడం కాకిపడిగెల కళాకారుల కౌశలానికి నిదర్శనం.

**భవిషత్ సంఘటనల సూచన :**

భీముడు వంటలవాడుగా విరాటరాజు కొలువుకు వచ్చినపుడు అక్కడ సింహబలుడు కూడా ఉంటాడు. భీముడు లక్ష పుట్ల భోజనం చేస్తానంటే విరాటరాజు ఆశ్చర్యపోయి అంత తిండి తిని ఏంచేస్తావని అడుగు తాడు. అప్పుడు భీముడు, "అడవి సింహాలను పట్టి బయటకు పడేస్తా, ఏనుగు తొండం పట్టి బయటకు పడేస్తా, అధిక సింహబలున్నైనా పట్టి గుద్ది చంపుతా'' అంటాడు. భవిష్యత్తులో భీముడు, సింహబలున్ని గుద్ది చంపుతాడన్న విషయం ప్రస్తావించడం వల్ల భావి కథా సూచన చేసినట్లయ్యింది.

అట్లే సహదేవుడు, విరాటరాజు కొలువులోకి వచ్చి, అతనికి పంచాంగం చూస్తూ, ఓ ఇంటి అమ్మాయి మీ ఇంటికి వస్తుంది, ఆ అమ్మాయి మీద మీ దగ్గరివాడు నేత్రం పెడ్తాడు, ఒక రోజున, ఆ ఒక్కడు చావక వంద మందిని చంపుతాడని చెప్తాడు. ఈ మాటలు, భీముని చేతిలో, కీచకునితోపాటు అతని వందమంది తమ్ములు కూడా చస్తారనే విషయం సూచించబడింది.

**హీరోయిజం :**

కీచకుడు పాండవుల గురించి మాట్లాడుతూ, 'వాళ్ళం దరూ మంచివాళ్ళేగాని భీముడొక్కడు చచ్చిపోతె బాగుండు' అంటాడు. అక్కడే మారువేశంలో వున్న భీముడు ఆ మాటలు విని కోపం పట్టలేక హుమ్మని మూలిగితే ఆ శబ్దానికి ఏనుగులు గొలుసులు తెంచుకుని పారిపోయాయంట! ఈ వర్ణన అతిశయోక్తిగా ఉన్నా భీముని హీరోయిజాన్ని ప్రదర్శిస్తుంది.

పాండవులకు మారువేషాలు వేసి విరాటరాజు కొలువు లోకి పంపడానికి వచ్చిన యమధర్మరాజు "అంతా కుశల మేనా!'' అని అడుగుతాడు. అందరూ కుశలమేనంటారు. కాని, ఒక్క భీముడు మాత్రం అసహనం ప్రకటిస్తాడు. "ఎక్కడి సంతోషం నాయిన. కడుపునిండ బువ్వ తినక పన్నెండేండ్లయ్యింది. యుద్ధం లేక పన్నెండేండ్లయ్యింది. నా వొళ్ళంతా నసిమిరి పెడ్తుంది. నీ దున్నపోతును నా మీదికి పంపియ్యి. ఒక పట్టుపట్టి దాన్ని అణిచేస్తా'' అంటాడు. ఇట్లా భీముని చేత ప్రత్యేకంగా మాట్లాడిం చడం, బల ప్రదర్శన చూపించడం హీరోయిజం ప్రదర్శించడానికే.

అట్లే భీముడు, విరాటరాజు కొలువులోకి వస్తుంటే, కొండలు కదులుతున్నాయని, గుట్టలు కదులుతున్నా యని, చెట్లు కదులుతున్నాయని వర్ణిస్తారు. ఇట్లా, ఒక పాత్ర బలాన్ని అతిశయోక్తిగా వర్ణించడం హీరోయిజం అనిపించుకుంటుంది.

భీముడు ఊర్లోకి వచ్చేసరికి జనమంతా వెళ్ళి కుంకుభట్టు వేశంలో ఉన్న ధర్మరాజు చెప్తున్న మాటలు

వింటుంటారు. భీమున్ని ఎవరూ పట్టించుకోరు. దాంతో అతనికి రోషం వస్తుంది. జనాన్ని తన దిక్కు తిప్పుకోవాలని తన పాదాన్ని భూమి మీద బలంగా వేస్తే అది పిడుగు పడ్డట్లు పడ్తుంది. ఆ చప్పుడుకు భవనాలు కూలి పోతున్నాయంట! అవతలి మిద్దెలు ఇవతల, ఇవతలి మిద్దెలు అవతల పడ్తున్నాయంట! అయినా జనం మాత్రం ధర్మరాజునే చూస్తున్నారంట! ఇక లాభం లేదని, విరాట్ రాజు ముందలికి వెళ్ళి మళ్ళీ తన కాలును భూమి మీద దబ్బున వేస్తే ఆ రాజు సింహాసనంపైనుండి కింద పడి ఏదో భూకంపమొచ్చిందని భయపడిపోయాడంట! ఎదురుగా కొండలాగా ఉన్న భీమున్ని చూసి, 'వీన్ని ఏ తల్లి కన్నదో' అని ఆశ్చర్యపోయాడంట!

ఇట్లా భీముని పరాక్రమాన్ని అతియోక్తిగా వర్ణించి ప్రేక్షకులకు ఆహ్లాదం కల్గిస్తారు.

**ధాతృకుల వృత్తిని స్పృశించడం :**

పాండవులు తమ ఆయుధాలను మాయాశవంలో దాచి, జమ్మిచెట్టు మీద దాచిన తర్వాత ఒక సందేహం కలుగుతుంది. ఇది ఎండాకాలం. ఎవరైనా గొల్లలు నీడకోసం ఈ చెట్టుకిందికి వస్తే? ఈ పెట్టెను చూస్తే? సొమ్ముల్ని తీసుకొని, ఆయుధాలు పడేసిపోతారు. అవి ఎండకు ఎండి, వానకు నాని పాడైపోతాయిగదా!అని పాండవులు ఆలోచనలో పడ్తారు. ఇక్కడ పాండవులు బాధపడేది సొమ్ములు పోతాయని కాదు, తమ ఆయుధాలు పాడైపోతాయని. ఈ ఆయుధాలు కాకిపడిగెలవాళ్ళ ఆశ్రితకులమైన ముత్తరాసుల కులవృత్తికి చెందినవి. అందువల్ల ధాతృకులస్థులను కథలో లీనం చేయడానికి అక్కడక్కడ ఇటువంటి సందర్భాలను సృష్టిస్తారు.

**వర్ణనలు కల్పించడం :**

కాకిపడిగెల కళాకారులు సందర్భోచితంగా చేసిన వర్ణనలు అద్భుతరసవంతంగా ఉన్నాయి.

కుంకుభట్టుగా మారువేశం వేసుకున్న ధర్మరాజు విరాట్ రాజు కొలువులోకి వెళ్ళడానికి సిద్ధమౌతాడు. ఒక్క అడుగు ముందుకు వేయగానే విరాటరాజ్యంలోని వాతా వరణమంతా ఒక్కసారిగా మారిపోయిందంట!

ధర్మారాజు ఎండలో వెళ్తున్నాడని మేఘాలు ఎండను కమ్మేశాయి. వడగాలి చల్లని పిల్లగాలిగా మారింది. ముత్యాలవాన పడింది. ఎండిన చేలు ప్రాణం పోసు కున్నాయి. ఎండిన చెరువుల్లో నీళ్ళు నిండాయి. ఇట్లా, 'చల్లని ధర్మరాజు చల్లని కాలాన్ని పట్టుకొని నక్షత్ర పట్టణం (విరాటనగరం) వస్తున్నాడు' అంటూ వర్ణిస్తారు. ఇట్లా ఆ నగరంలో అన్ని శుభసూచకాలే కనిపించేసరకి అక్కడి జనం, ఏ దేవుడు మా ఊరికొస్తున్నడో! లేకా ధర్మరాజే మా ఊరికి వస్తున్నాడో! అనుకొని ఆ మహాపురుషుడిని ఆహ్వానించడం కోసం ఊరినంతా అలంకరిస్తారంట. ఇంతపెద్ద కల్పన ప్రాచీన సాహిత్యంలో కూడా కని పిస్తుందో లేదో! సందర్భోచితంగా చేసిన ఈ వర్ణన ధర్మరాజు గొప్పదనాన్ని తెలుపడానికి ఎంతగానో ఉప యోగపడ్తుంది.

అట్లే ద్రౌపది సైరంధ్రి వేశంలో వెళ్తుంటే చేసిన వర్ణన ఆమె కష్టాలను స్పురణకు తెస్తుంది. ఆమె ఆ రాజభవనం లోకి, అరణ్యాలు దాటుకుంటూ, ప్రవాహాలు దాటు కుంటూ వెళ్ళిందంట! ఈ వర్ణన పాత్ర మానసిక ప్రవృత్తిని అనుభూతం చేస్తుంది. ఈ పర్వంలో ప్రధానమైనది కీచకవధనే. దానికి కారణం ద్రౌపదే. అందువల్ల ద్రౌపది ప్రవేశాన్ని కష్టాల వాతావరణంగా చిత్రించారు.

**హాస్య ప్రాధాన్యత :**

నారదుడు కష్టపడి కీచకున్ని అక్క దగ్గరికి వెళ్ళేటట్లు చేస్తే, తీరా అతడు బయలుదేరే ముందు అన్నీ దుశ్శ కునాలే ఎదురౌతాయి. స్నానం చేసిన తర్వాత పొడి వస్త్రం కట్టుకోబోతే అది జారి కిందపడింది. బొట్టు పెట్టుకుందా మని సీస తీస్తే జారి కిందపడింది. బువ్వ తిందామని చూస్తే చేతిలోని ముద్ద కిందపడింది. కిరీటంపెట్టుకొని బయటికి వస్తుంటే దర్వాజ తగిలి కింద పడింది. తీరా బయటికి వచ్చాక నల్లపిల్లి ఎదురైంది. ఇన్ని దుశ్శకునాలు

BHAVAVEENA
Vol. 18, Issue. 9, September 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ఎదురైనందున 'నేను పోనంటే పోను' అని భీష్మించుకొని కూర్చుంటాడు కీచకుడు. అప్పుడు నారదుడు ఆ శకునాలన్నీ మంచివేనని రకరకాల హేతువులు చెప్పి ఒప్పిస్తాడు. ఈ సంవాదం హాస్యపూర్వకంగా ఉండి ప్రేక్షకులను నవ్విస్తుంది.

**కథలో మార్పు :**

లిఖిత భారతంలో, కీచకుని మొండితనానికి తట్టుకోలేక సుధేష్ణనే ద్రౌపదిని అతని ఇంటికి పంపుతుంది. కాకిపడిగెల కళాకారుల కథలో కీచకుని ఇంటికి సైరంధ్రి వెళ్ళదు. కీచకుడే సైరంధ్రి దగ్గరికి వెళ్తాడు. కథలో ఈ మార్పు చేయడం కోసం ముందే ఒక సూచన చేస్తారు కాకిపడిగెల కళాకారులు. ద్రౌపది, సైరంధ్రి వేషంలో సుధేష్ణ ఇంట్లో దాసిగా కొలువు కుదిరేటప్పుడు "నేను ఏ పని పడితే ఆపని చేయను. ఎవరైనా శుభలేఖ రాసి, గిది తీస్కపోయి గా ఊరికాడ ఇచ్చిరమ్మంటే వెళ్ళేదాన్నికాదు. నేను పరమ బుద్ధిమంతురాలిని. నీ వద్ద నేనున్నని వేరే ఇంటికి పొమ్మంటే పోను" అని ఖచ్చితమైన నిబంధన పెడ్తుంది. ఈ విషయం ఇక్కడ చెప్పడం వల్ల తర్వాతి కథను మార్చి కీచకుడే ద్రౌపది దగ్గరికి వచ్చేటట్లు చేయడానికి తగిన కారణం కల్పించబడింది.

ఇట్ల కాకిపడగెల కళాకారులు చెప్పే ఏ కథను పరిశీలించినా తమవైన కొన్ని ప్రత్యేకతలతో ప్రేక్షకులను అలరిస్తూ రసవంతంగా కథనాన్ని నడిపిస్తారని రుజువు చేయవచ్చు.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగులో కుల పురాణాలు ఆశ్రిత వ్యవస్థ -ప్రొ.పులికొండ సుబ్బాచారి
2. కాకిపడిగెల పాండవుల కథలు - ప్రొ.ననుమాస స్వామి
3. తెలుగువారి జానపద కళారూపాలు - డా.మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి
4. తెలుగు జానపద సాహిత్యం - పురాగాథలు - డా.రావి ప్రేమలత
5. పటం కథలు - కథకులు - డా. గడ్డం వెంకన్న

# తెలంగాణ జీవన చిత్రం – కాళోజి కవిత్వం

- పులిగిల్ల ఉపేందర్, ఉస్మానియా యూనివర్సిటీ

"అక్షర రూపం దాల్చిన ఒక్క సిరాచుక్క లక్ష మెదళ్లకు కదలిక'' అను సార్వజనీన సత్యాలను, సామాజిక వాస్తవాలను అక్షరీకరించి ప్రజా చైతన్యాన్ని కలిగించిన కవి కాళోజీ కవిత్వం సమాజానికి ఒక హెచ్చరిక వంటిది. ఇలాంటి కవిత్వం ప్రజల నాలుకలపైనో, ముద్రాకృతి రూపంలోనో కాలంతోపాటు నడుస్తూ, సమాజంలో సజీవ మౌతూ సమకాలీన సామాజిక పరిస్థితులకు సాక్షీభూత మౌతుంది.

నిజాం పాలన కాలంలో వారి అన్యాయాలకు, అరాచకాలకు వ్యతిరేకంగా తన కలమనే కరవాలంతో తెలంగాణ ప్రజలల్లో చైతన్యాన్ని నింపిన మహనీయుడు కాళోజీ. తన జీవితం మొత్తాన్ని నిజాం నిరంకుశ దాస్య శృంఖలాల నుండి తెలంగాణ ప్రజల్ని విముక్తి చేయడానికై తన కవిత్వంతో కదం తొక్కిన వైతాళికుడు. తెలంగాణ ప్రజల్లో రాజకీయ, ఆర్థిక, సామాజిక చైతన్యం కోసం, వారి హక్కుల కోసం ఉద్యమించిన ప్రజాకవి. తెలంగాణ ప్రజల ప్రతిధ్వనిగా పిలువబడి, ఉద్యమమే ఊపిరిగా జీవించిన నిఖిలాంధ్రకవి. జాతి, మత విచక్షణ పాటించక సమస్త ప్రపంచాన్ని తన కుటుంబంగాభావించి, వజ్ర శంఖం వంటి తన కంఠాన్నిమోగించి, ప్రజాహృదయాలను కదిలించిన తీరు ఈ వ్యాసంలో ప్రతిబింబిస్తుంది.

కాళోజీ నారాయణ రావు1914 సెప్టెంబర్ 9వ తేదీన కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ జిల్లాలోని రటిహాల్లి గ్రామంలో జన్మించారు. బీజాపూర్ నుండి వరంగల్ జిల్లాకు తరలి వచ్చిన కాళోజీ కుటుంబం మడికొండలో స్థిరపడింది. అక్కడ ప్రాథమిక విద్యానంతరం హైదరాబాద్ పాతబస్తీ లోని చౌమహల్లా పాఠశాలలో కొంతకాలం చదివి అక్కడి నుండి సిటీ కాలేజీలోనూ, తర్వాత హనుమకొండలోని కాలేజియేట్ హైస్కూల్ నుండి మెట్రిక్యులేషన్ పూర్తి చేశాడు. 1939లో హైదరాబాద్‌లో హైకోర్టుకు అనుబంధంగా ఉన్న లా కళాశాల నుండి న్యాయ శాస్త్రంలో పట్టా పొందారు. తెలుగు, హిందీ, ఉర్దూ, మరాఠి, కన్నడ, ఇంగ్లీష్ వంటి భాషల్లో ప్రావీణ్యం పొందినకాళోజీ 1930 నుండి గ్రంథాలయోద్యమంలో ఎంతో చురుకుగా పాల్గొని తన భాషాభిమానాన్ని సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొని 25 సం॥ల వయస్సులోనే జైలుశిక్ష అనుభవించి తన దేశాభిమానాన్ని చాటుకున్నాడు. రజాకార్ల దౌర్జన్యాన్ని ప్రతిఘటిస్తూ వరంగల్ కోటలో జాతయ పతాకాన్ని ఆవిష్కరించడానికి ప్రయత్నించి నగర బహిష్కరణకు గురయ్యాడు. స్వరాజ్య సమరంలో పాల్గొన్న ఉస్మానియా విశ్వ విద్యాలయం విద్యార్థులను బహిష్కరించినపుడు వారిని నాగపూర్ విశ్వవిద్యాలయంలో చేర్పించి, వారిని ఆదుకోవడంలో కీలకమయ్యాడు. మాడపాటి హనుమంత రావు, సురవరం ప్రతాపరెడ్డి, జమలాపురం కేశవరావు, బూర్గుల రామకృష్ణారావు, పి.వి. నరసింహారావు వంటి వారితో కలిసి ఉద్యమాల్లో పాల్గొన్నాడు. విద్యార్థి దశలోనే నిజాం ప్రభుత్వ నిషేధాజ్ఞలను ఉల్లఘించి, వరంగల్ గణపతి ఉత్సవాలను నిర్వహించాడు. తెలంగాణలో అక్షర జ్యోతిని వ్యాపింపజేయాలన్న తపనతో ఆంధ్ర సారస్వత పరిషత్ స్థాపనలో భాగమయ్యాడు. నిజామంధ్ర మహాసభ, హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్‌తో కాళోజీ అనుబంధం విడదీయరానిది. హింస తప్పు, రాజ్యహింస మరీ తప్పు అని, సామాన్యుడు దేవుడని ప్రకటించిన కాళోజీ 2002 నవంబర్ 13న తుది శ్వాస విడిచారు.

కాళోజీ బతుకు ప్రయాణం నిండా అడుగడుగున ఒక ప్రయోగమే. తాను చేస్తున్నది, తనకు తోస్తున్నది రాస్తాడు. నిజం ఆలోచిస్తే కాళోజీ ఒక శాస్త్రజ్ఞుడు గర్భితమైవున్న కవి. తెలుగు భాష గౌరవార్తం, మాతృభాష కోసం ఆయన ఒకసారి

అన్యభాషలు నేర్చి ఆంధ్రంబు రాదంచు
సంకలించు ఆంధ్రుడా ! చావవెందుకురా ?
ఏ భాష రా నీది యేమి వేషమురా ?
ఈ భాష ఈ వేష మెవరి కోసమురా ?

అంటూ మాతృభాషను ప్రాచుర్యంలోకి తువడానికి ఇతోధికంగా కృషి చేశారు. మనోవిశ్లేషణ వాదం భూత, వర్తమాన, భవిష్యత్ కాలాల పరిధిని ఒప్పుకోదు. మనస్సు నిస్సీమం గనుక కాలము నిరవధికమే. కాళోజీ నిరాశ - దురాశలను నిశిత దృష్టితో పునరావృత్తి కవితలో -

ఉదయం కానే కాదనుకోవడం నిరాశ
ఉదయించి అట్లానే ఉండాలనుకోవడం దురాశ అని అంటాడు.

దగాకోరు దండగీడు దర్జాగా బ్రతుకుచుండ
సక్రమ మార్గాన సహించేడి వాడెవ్వడు ?
అవనిపై జరిగేటి అవక తవకలు చూసి
ఎందుకో నా హృది ఇన్ని ఆవేదనలు
పరుల కష్టములు జూచి కరిగిపోవును గుండె

అనే కాళోజీ ప్రాపంచిక దృక్పథానికి ఎవరు సాటి. కాళోజ గారిలో కక్ష గట్టే శక్తి లేదు. ప్రతీకారేచ్ఛ లేదని కింది కవిత ద్వారా చెబుతున్నాడు.

తప్పు దిద్దగ లేను
దారి చూపగ లేను

ఇట్లా ఉంది నా మతి - గతి అంటాడు.

అన్నపు రాసులు ఒక చోట
ఆకలి మంటలు ఒకచో
హంస తూలిక లోక చోట
అలసిన దేహాలొక చోట

అని లోకాన్ని రెండు భాగాలుగా నిర్దాక్షిణ్యంగా, నిర్భయంగా బద్దలు కొట్టినాడు. పేద వాడి ఆకలిని, ఆర్తనాదాల్ని నిర్భయంగా చెప్పిన కవి. కాళోజీ అంటే కల్లలకు, కపటాలకు లాలూచి పడని జీవితం. కాళోజీ ముందుగా ఓటర్లు మేల్కోవాలని హెచ్చరించి 'ఓటు పాట' పాడారు.

అభ్యర్థి ఏ పార్టీవాడని కాదు ఏపాటి వాడోచూడు
ఎన్నుకుంటే వెలగబెట్టడం కాదు
ఇందాకా ఏం చేశాడో చూడు
పెట్టుకునే టోపి కాదు, పెట్టిన టోపి చూడు

అన్ని హాస్యాన్ని మేళవించి ఓటర్లు తస్మాత్ జాగ్రత అని ఓటర్లకు సందేశం ఇచ్చాడు. జరిగినదంతా చూస్తూ ఎరగనట్లు పడి ఉండగ సాక్షి భూతాన్ని గాను, సాక్షాత్తు మానవున్ని అని చెప్పుకున్నాడు.

నేను ప్రస్తుతాన్ని - గతానికి శిఖరాన్ని
వర్తమానాన్ని - భావికి ఆధారాన్ని
నేను కవనాన్ని - నేను ప్రస్తుతాన్ని
నేను అక్షరాన్ని - నేను సాగేదాన్ని

అని కాళోజి తనగురించి తాను ప్రకటించుకున్నాడు. నిజాం ప్రభుత్వాన్ని ఎంత ధైర్యంగా ఎదిరించారో, నేటి కుహనా ప్రజాస్వామ్య ప్రభుత్వాల్ని అంత తీవ్రంగా ఎదురించారు. నేనింకా 'నా' నుండి 'మా' వరకే రాలేదు మన అన్నప్పుడు గదా ముందడుగు అంటాడు. 'నానా ఇజాల అడుగున జూడ నా ఇజందే కనిపించును'. నేను నా అనే అహం భావం ఒకటే. అదే నా ఇజం అంటాడు. కాళోజీ కవితలో అసమ్మతి, నిరసన ధిక్కారం, దేశాభి మానం, ప్రాంతీయాభిమానం మొదలైన లక్షణాలు అగుపిస్తున్నాయి.

కాళోజి ఎక్కడ ఉన్నా, యేమి చేసిన ప్రజలమనిషి. ప్రజల గొడవే కాళోజి గొడవ అని దేవులపల్లి రామానుజ రావు ప్రశంసించారు. కాళోజి గొడవ-లొల్లి, ఆగంకు హద్దులు లేవు. అది గాలి వంటిది. కాంతి వంటిది. దావానలం వంటిది.

కాళోజీ కి ఆడంబరాలు లేవు
కాళోజీ కవితకు అంబరాలు లేవు
కాళోజీ మంది మనిషి
కాళోజీ కవిత ప్రజల పరువం

కాళోజీ రూపాన్ని దర్శిస్తే మానవతామూర్తిగా, కన్నీటి కన్నులా, పన్నీటి మాటలా కనిపిస్తారు. కవి, రచయిత కావాలంటే ఋషి కావాలి. అలాంటి లక్షణాలు ఎన్నో కాళోజీకి ఉన్నాయి. కాళోజీ కవిత్వంలో ఉన్న సూటిదనం, నిండుదనం, ఎత్తుదనం, లోతుదనం, వెచ్చదనం, స్పష్టత, క్లుప్తత, ఆప్తత, గుప్తత మరేకవిలో కనిపించవు.

BHAVAVEENA
Vol. 18, Issue. 9, September 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# పి. సరళాదేవి జీవితం, సాహిత్యం – పరిచయం

– డా॥. సారిక విజయలక్ష్మి, లెక్చరర్, తెలుగు విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సీతంపేట, శ్రీకాకుళం.

## ఉపోద్ఘాతం :

తెలుగు సాహిత్య చరిత్రలో 20వ శతాబ్దం విశిష్టతను సంతరించుకుంది. కందుకూరి, గురజాడ, చిలకమర్తి, శ్రీపాద, చలం వంటి సామాజిక సంస్కరణవాదుల వైవిధ్య పూరితమైన కృషి ఫలితంగా స్త్రీల పరిస్థితులలోనూ, ఆలోచనలలోనూ వచ్చిన కొన్ని మార్పులు స్త్రీల ప్రగతికి దోహదం చేశాయి.

20వ శతాబ్దం పూర్వార్ధంలో కనీసం 80 మంది అయినా రచయిత్రులున్నారు. వారిలో 50 మందికి పైగా కవయిత్రులూ, పదిమంది దాకా కథా రచయిత్రులూ, ముగ్గురు నలుగురు నవలా రచయిత్రులూ, మరో పది మంది దాకా నాటక రచయిత్రులూ, మరో పదిమంది వరకు వ్యాస రచయిత్రులూ అచ్చులో కనిపిస్తున్నారు. వీరిలో కొందరు రెండు, మూడు ప్రక్రియల్లో రచనలు చేసిన వారున్నారు.

పురుషులతో పాటు తామూ చదువుకోవాలని, పురుషులు రచనలు చేసినట్లే తామూ చేయాలని అనుకోవడంతో పాటు పురుషుల భావాలనే స్త్రీలు కూడా వ్యక్తం చేసేవారు మొదట్లో తమ రచనల్లో.

క్రమంగా స్త్రీల అనుభవాలు విస్తృతమవుతున్న కొద్దీ, తమ నిజ స్థితిని అర్థం చేసుకోగలిగిన స్త్రీలు కొందరు స్వేచ్ఛాభిముఖంగా ఆలోచించడం, తమ సొంత ఆలోచనలకు అనుగుణంగా రచనలు చేయడం ప్రారంభించారు.

20వ శతాబ్దంలో సాహిత్యరంగంలో కృషి చేసిన కొందరు ప్రముఖ రచయిత్రులలో శ్రీమతి పుత్సల సరళాదేవి ఒకరు. 1955లో కథారచన ప్రారంభించిన సరళాదేవి ఎన్నో కథలు, నవలలు, నవలికలు, సామెతలు, కవితలు, వ్యాసాలు ఇలా అనేక సాహిత్య ప్రక్రియలలో రచనలు చేసి తనదైన ముద్రను వేశారు.

## బాల్యం - విద్యాభ్యాసం :

పి.సరళాదేవి గారి బాల్యం విజయనగరం జిల్లాలోనే సాగింది. 1937 ఆగష్టు 8వ తేదీన పుట్టిన పి.సరళాదేవి పూర్తిపేరు పుత్సల సరళాదేవి. సమాజంలో పి.సరళాదేవి గానే ప్రసిద్ధి పొందారు. తల్లి రాజేశ్వరమ్మ, తండ్రి మల్లిఖార్జునస్వామి. బాల్యంలో విజయనగరంలోని 'ఆశపువీధి'లో రోణంకి అప్పలస్వామి గారి ఎదురింట్లో ఉండేవారు. అప్పలస్వామి గారిని కలవడానికి శ్రీశ్రీ, ఆరుద్ర, చాసో, నారాయణ బాబు వంటి ప్రముఖులు వచ్చి అక్కడ అరుగుపైన కూర్చుని గంటల తరబడి సాహిత్యం గురించి చర్చించుకునేవారని కుటుంబికులు తెలిపారు. అప్పుడు సరళాదేవి చిన్న వయసులోనే ఉన్నారు. అయినా వారందరినీ గమనించేవారని తెలియజేశారు. వారి సాహిత్యపు మాటలు, సమాజం గురించిన చర్చను చిన్నతనంలోనే విని ఆలోచించే వారని కుటుంబీకుల వల్ల తెలిసింది.

పి.సరళాదేవి గారు కేవలం ఇంటర్మీడియట్ మాత్రమే చదివారు. అయినా అపారమైన జ్ఞానం ఆమె సొంతం. కాబట్టే ఇంతటి విలువైన రచనలు చేయగలిగారు. ఈమె ప్రాథమిక విద్య విజయనగరం ప్రాథమిక పాఠశాలలోనూ, ఉన్నత విద్య విజయనగరం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలల్లోనూ పూర్తి చేశారు. ఇక్కడే ఎస్ఎస్ఎల్‌సి పూర్తి చేయగలిగారు. ఆ తరువాత ఇంటర్మీడియట్ విద్యను ప్రయివేటుగా కట్టి ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. ఈమెకు ఉన్నత విద్య పెద్దగా అబ్బకపోయినా, సామాజిక స్పృహ, భావుకత వంటివి తరువాత కాలంలో రచయిత్రిగా నిలబెట్టాయని అర్థమవుతుంది.

## కుటుంబ జీవితం :

పి.సరళాదేవి గారికి పద్దెనిమిది సంవత్సరాలకే

వివాహమైంది. తన మేనమామ అయిన శ్రీకుమార స్వామితో 1955 ఫిబ్రవరిలో విజయనగరంలో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు. పెద్దకుమార్తె శ్రీదేవి. సరళాదేవి గారి ప్రాణ మిత్రురాలయిన 'కాలాతీత వ్యక్తులు' నవలా రచయిత్రి పి. శ్రీదేవి గారిపై ప్రేమతో తన పెద్దకుమార్తెకు ఆ పేరు పెట్టుకుంది. పెద్ద కుమార్తె 1962లో ఫిబ్రవరిలో అనకాపల్లిలో జన్మించింది. ఇక రెండో కుమార్తె 1967లో సామర్లకోటలో జన్మించింది. ఈమె పేరు శర్వాణి. స్త్రీ సమాజంలో అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలనే కోణంలో కూతుర్లిద్దరినీ పెంచి పోషించింది. శర్వాణి "తెలుగులో భావ కవిత్వం - దేవులపల్లి కృష్ణశాస్త్రి కృతులు" అనే అంశంపై పరిశోధన చేసి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పట్టాను పొందారు. ప్రస్తుతం ఈమె విజయనగరం మహారాజా మహిళా కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా ఉద్యోగం చేస్తున్నారు.

## రచనా వ్యాసంగం :

సరళాదేవి గృహిణిగా ఉంటూనే అనేక కథలు రాశారు. భర్త కుమారస్వామి నిరంతర ప్రోత్సాహం, సామాజిక స్పృహ, భావుకత వంటివి రచయిత్రిగా నిలిపాయి. ప్రముఖ రచయిత్రి శ్రీమతి మాలతీ చందూర్ రచనల ప్రభావం ఎక్కుకవగా కనిపిస్తుంది. సరళాదేవి భావాల్లో ఆధునికతకు భిన్నమైన ఆలోచనకు మాలతీచందూర్ గారి 'ప్రమదావనం' దోహదపడింది. ఒకప్పుడు చలంగారి ప్రభావం ఊపిరి సలపనివ్వకుండా చేసిందని ఆమె రాసుకున్న డైరీ సాక్ష్యం.

1955లో కథా రచన ప్రారంభించిన సరళాదేవి అరవై డెబ్బై దశకాలలో ఎక్కువ రచనలు చేశారు. రచయిత్రిగా సరళాదేవి ఎన్నో కథలు, నవలలు రాశారు. వీటితోపాటు కవిత్వాన్ని కూడా వెలువరించారు.

సరళాదేవి రాసిన మొదటి కథ 'బావ చూపిన బ్రతుకు బాట'. ఈ కథ బెంగుళూరు నుండి వచ్చే ప్రజాతంత్ర పత్రికలో 1955 డిసెంబరులో ప్రచురించబడింది. ఆ తరువాత రెండు కథా సంకలనాలు ముద్రించారు. మొదటి కథా సంకలనం 'కుంకుమ రేఖలు'. ఇది 1962లో తొలి ముద్రణ కథా సంపుటి. రెండవది 'సరళాదేవి కథలు'. దీన్ని 1977లో ప్రచురించారు.

1950, 60 దశకాలలో ఖాసా సుబ్బారావు గారు సంపాదకులుగా వున్న తెలుగు స్వతంత్ర పత్రిక, ఆపైన గోరా శాస్త్రి, శ్రీదేవి గార్ల సంపాదకత్వంలో నడిచిన తరువాత ఆగిపోయిన స్వతంత్ర పత్రిక కొత్త రచయితలకు ఆత్మీయ స్వాగతం పలికింది. ఆ కొత్త రచయితలలో పి.సరళాదేవి గారు ఒకరు.

తన తొలి కథతోనే పాఠకులను ఆకట్టుకున్న రచయిత్రి సరళాదేవి. 1956 నుండే కథలు రాయడం ప్రచురించడం మొదలుపెట్టిన సరళాదేవి మొదటగా స్వతంత్ర పత్రికలో ఏడు కథలు ప్రచురించారు. ఆ తరువాత 'కుంకుమ రేఖలు' కథా సంపుటిని ఆవిష్కరించారు. ఈ కథలను ఆకాశవాణి విజయవాడ కేంద్రం ధారావాహికగా ప్రసారం చేసింది.

కథలు విరివిగా రాయడం మొదలెట్టిన తరువాత నవలలు రాయడం కూడా ప్రారంభించారు. 1979లో 'కొమ్మా - బొమ్మా' అనే నవలను రాశారు. దీన్ని 'యువ' మాసపత్రికలో ప్రచురించారు. ఆ తరువాత 2004లో 'చిగురు' అనే నవలను, ఆ తరువాత 'షణ్ముఖప్రియ' అనే నవలను రాసి పాఠకులకు అందించారు.

## కథలు - సంక్షిప్త పరిచయం :

గోరాశాస్త్రి గారి ముందుమాటతో ప్రచురితమైన 'కుంకుమ రేఖలు' కథా సంకలనంలో ఎనిమిది కథలున్నాయి. 'సరళాదేవి కథలు' సంకలనంలో పది కథలున్నాయి.

సరళాదేవి ప్రచురించిన రెండు కథా సంపుటాలలోని పద్దెనిమిది కథల్లో దాదాపు అన్ని స్త్రీల జీవితాలు, ముఖ్యంగా ఆనాటి దిగువ మధ్య తరగతి స్త్రీల జీవితాల చుట్టూ అల్లుకున్నవే.

'కుంకుమ రేఖలు'లో హేమలత అనే అమ్మాయి అమాయకత్వం నుంచీ ముక్కుసూటితనం నుంచీ ప్రపంచపు పోకడలను అర్థం చేసుకుంటూ నొప్పింపక తానొవ్వక బ్రతకడం నేర్చుకున్న వైనం సహజంగా సరదాగా సాగే కథ. డబ్బు పొదుపు, లౌక్యంగా మెసలడంతో మొదలుపెట్టిన సరళాదేవి స్త్రీల లైంగికత, దాంపత్య సంబంధాలు, సమాజం స్త్రీ పురుషులకు కొన్ని ప్రత్యేక లక్షణాలను, విదులను నిర్ణయించినందువల్ల ఆ ఇద్దరూ కూడా కోల్పోతున్న జీవన ఆనందాలు మొదలైన అనేక విషయాల్ని తన కథల్లో చర్చకు పెట్టారు.

ఆమె రాసిన కాలం అప్పుడప్పుడే స్త్రీలు ఉన్నతవిద్యను అందుకుంటున్న కాలం, మధ్య తరగతిలో అప్పటికింకా ఆడవాళ్ళు ఉద్యోగం చేయడం కుటుంబానికి అప్రతిష్ట అనుకునే కాలం - స్త్రీ జీవన గమ్యం వివాహమేనని వాళ్ళకింకా పద్దెనిమిది రాకముందే పెళ్ళి చేయడానికి తొందరపడిన కాలం అయితే ఈ పరిస్థితి అన్ని వర్గాల లోనూ లేదు.

సంపన్నులూ, వివిధ సంస్కరణ ఉద్యమాల వల్ల ప్రభావితమైన వాళ్ళ కుటుంబాలలో ఆడపిల్లల చదువు పట్ల కొంత ఆసక్తి కనపరచడం ఆనాటికే ఉంది. ఈ ఆసక్తిని సరళాదేవి గారి "సరస్వతులను చేయబోతే" అనే కథలో చూడవచ్చు.

మధ్యతరగతి సంసారాలలో కూతుళ్ళకు పురుళ్ళు పోసి పంపడం ఎంత భారవైన విషయమో చెబుతూ కూతుళ్ళెంత బాధ్యతగా ప్రవర్తించారో సూచించిన మంచి కథ "కూతుళ్ళు".

కుటుంబ సభ్యుల పరస్పర ప్రేమల మధ్యనే చిట్టిపెట్టి అసూయలను సహజంగా వర్ణిస్తూ చెప్పిన కథ "తిరిగిన మలుపు".

సరళాదేవి మొదటి సంపుటిలోని కథలకూ, రెండవ సంపుటిలోని కథలకూ స్పష్టమైన పరిణామం ఉంది. ఆమెకు జీవితం పట్ల, స్త్రీ పురుష సంబంధాల పట్ల కల అభిప్రాయాల స్పష్టీకరణ ఉంది.

రెండవ సంపుటం "సరళాదేవి కథలు" (1977)లోని పది కథలలోనూ అవి కాక భూమిక. నూరేళ్ళ పంటలలో ప్రచురణ అయిన రెండు కథలలోనూ ఆమెలో జెండర్ పరిమైన అవగాహన కనిపిస్తుంది.

వివిధ సాహితీ ప్రక్రియలలో రచయిత్రులు, గత శతాబ్దంలో ప్రదర్శించిన సృజనాత్మక ప్రతిభకూ, సాధించిన ప్రగతికీ ప్రతీకగా 53 మంది రచయిత్రుల రచనలతో ఈ సంకలనం రూపొందింది. ఈ సంకలనంలో చేర్చిన రచయిత్రులలో పి.సరళాదేవి కూడా ఒకరు. ఈమె రాసిన "పేచీ" కథ ఈ సంకలనంలో ప్రస్తావించారు. మంచి కథకురాలిగా పేరు తెచ్చుకున్న సరళాదేవి శిల్ప వైవిధ్యంతో రాసిన కథ "పేచీ". ఆడపిల్ల పెళ్ళిలోని ఆర్థికాంశం వల్ల ఇటు తండ్రికి, అటు భర్తకూ మధ్య ఎలా నలిగిపోతుందో సున్నితంగా, ఆ ముగ్గురి స్వగతాల ద్వారా చెప్పిన కథ.

స్త్రీల అంతరంగాన్ని ఎరిగిన సరళాదేవి డెబ్బైల తరువాత వ్రాయడం తగ్గించకపోతే ఎనభైన తరువాత స్త్రీలలో పెరిగిన జెండర్ స్పృహతో ఇంకా మంచి కథలు వ్రాసి ఉండేవారు. సరళాదేవి నవలికలకు ముందుమాట వ్రాసిన మృణాళిని అన్నట్లు ఆమె "ఇంకా వ్రాయవలసిన రచయిత్రి".

# శ్రీమహాభాగవతం - గంగన అర్థాలంకారసౌందర్యం

**డా. జి. శ్రీనివాసరావు,** ఎం.ఏ, ఎం.ఫిల్, పిహెచ్.డి.అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు
శాఖ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పటాన్ చెరువు, సంగారెడ్డి జిల్లా.

**ఉపోద్ఘాతం :** బొప్పరాజు గంగనగారు పంచమస్కంధాన్ని రచించారు. దానిలో రెండు ఆశ్వాసాలలో 349 గద్యపద్యాలు వ్రాశారు. గంగనగారు లభించిన కొద్ది అవకాశంలో అలంకారాలను సమర్థవంతగానే నిర్వహించారు. వ్రాసిన గద్యపద్యాలే 349 కాబట్టి ప్రయోగించిన అలంకారాల సంఖ్య స్వల్పమే అయినా ప్రయోగించినంతలో చక్కని అలంకారాలే వాడారు.

2.విషయ వివరణ:బొప్పరాజు గంగనగారు భాగవతం పంచమ స్కంధంలో కథా సందర్భానికి అనుగుణంగా చక్కటి అర్థాలంకారాలను ప్రయోగించారు. వాటిని సమీక్షించుదాం.

## 1.ఉపమ :

గంగనగారు భాగవతం పంచమ స్కంధంలో 42 ఉపమలు ప్రయోగించారు........రహూగణుండను నారాజుపాసిత వృద్ధజనుండైనను బలాత్కారంబునం బుట్టిన కోపంబునం గోపించి విమర్శదప్పి, నీఱు గప్పిన నిప్పునుంబోలె నెఱుంగరాని బ్రహ్మతేజంబు గల బ్రాహ్మణునికిం గంటకంబుగా నిష్ఠుర వాక్యంబుల నిట్లనియె. (భాగ. 5. ప్ర-142) రహూగణుడు అనే సింధు దేశ రాజు కపిల మహా ముని వలన ఆత్మజ్ఞానం పొందగోరి పల్లకిలో వెళుతుండగా, చేను దగ్గర జడుని వలె నున్న భరతుని చేత పల్లకి మోయిస్తాడు. అనుభవం లేని కారణంగా మిగిలిన వారితో లయాత్మకంగా కలిసి నడుపలేడు భరతుడు. అందుకని దూషిస్తాడు రాజు. అప్పుడు వాడిన ఉపమ వలన భరతుని అంతస్స్వరూపం ఎటువంటిదో తెలుస్తుంది. 'నీఱు గప్పిన నిప్పునుం బోలె నెఱుంగరాని బ్రహ్మ తేజంబు గల బ్రాహ్మణుడు.' భరతుడు బ్రహ్మజ్ఞాని. ఆవిషయం బాహ్యస్వరూపాన్ని బట్టి తెలియదు. పైకి చూడడానికి సామాన్యుని వలె ఉంటాడు భరతుడు. అతన్ని బూడిదచే కప్పబడిన నిప్పుతో పోల్చడం రమ్యంగా ఉంది. నిప్పు ఉంది కాని అది బూడిదతో కప్పబడి ఉంది. నిగూఢమైన వేదాంత విషయాన్ని. చక్కని పోలిక ద్వారా బొప్పరాజు గంగన ఆవిష్కరించారు.

పోలుపగుచున్న విలాసం
బుల నంగజు బాణములను బోలెడి నీ చం
చల సత్కటాక్షవీక్షణ
ముల నెవ్వని నింతి! చిత్తమును గలుచెదవే? (భాగ. 5. ప్ర-29)

అగ్నీధ్రుండు అనే రాజు పూర్వచిత్తి అనే అప్సరసను చూచినపుడు ఆమెతో అంటున్న మాటలివి. మన్మథ బాణములను బోలెడీ చంచల సత్కటాక్ష వీక్షణములు ఆమెవి. బ్రహ్మదేవుడు పంపించగా అగ్నీధ్రుని వద్దకు వస్తుంది పూర్వచిత్తి. ఆ రాజు మోహంలో పడతాడు. ఆమె చూపులు ఎంత నిశితమైనవో ఎంతగా ఆ రాజు హృదయాన్ని చీల్చు సమర్థత గలవో మన్మథ బాణములతో పోల్చడాన్ని బట్టి తెలుస్తుంది..

## 2.ఉత్ప్రేక్ష

.....మన్మథ సామగానముల్ చదివెడు శిష్యులో ? యనగ షట్పద పంక్తులు చేరి మ్రోయగా... (భాగ. 5. ప్ర-30)

అగ్నీధ్రుని వద్దకు పూర్వచిత్తి అను అప్సరస వచ్చినపుడు తుమ్మెదలు ఝుంకారము చేయుచున్నవి. అది మన్మథ సామగానాలు చదువుతున్న శిష్యులేమో అన్నట్లుగ ఉందట. తుమ్మెదలు గానం చేయడం సర్వసాధారణం కాని అగ్నీధ్రుడు పూర్వచిత్తి మరులు గొను సందర్భంలో దాన్ని మన్మథ సామగానం చేస్తున్న శిష్యులేమో అన్నట్లుగా ఉందనడం సందర్భోచిత ఉత్ప్రేక్ష

### 3.రూపకం

అరయు గర్మరూపమగు నవిద్యాజన్మ
మైన హృదయ బంధనాది లతల
నప్రమత్త యోగమను మహాఘురికచే
దెంపవలయునంత దెంపుతోడ (భాగ. 5. ప్ర-70)

గహనమగు వేదాంత విషయాలను చక్కని ఉపమానాలతో వివరించిన పద్యాలలో ఇది ఒకటి. అవిద్య/అజ్ఞానం వలన కలిగిన కర్మరూపంలో ఉన్న హృదయబంధనాది లతలను యోగమనే ఘురికతో ఖండించవలెనని చెప్పబడింది. కర్మలను యోగముచే తొలగించుకోవాలనే విషయాన్ని అందరికీ తెలిసిన ఘురికతో తీగలను కోయడం అనే విషయంతో అభేదం చెప్పడం వలన విషయం సులభతరమవుతుంది.

### 4.అర్థాంతరన్యాసం

వృషలరాజు బ్రాహ్మణుడైన భరతుని కాళీమాతకు బలి ఇవ్వబోగా కాళీమాత రాజును, భృత్యులను సంహరించి భరతుని కాపాడుతుంది. ఆ సందర్భంలో గంగన ఇలా అంటాడు.

ధరలోన నెవ్వరేనియు
ధరణీసురవరుల కెగ్గుదగు దలుచిన వా
రరయగు జెడుదురు నిక్కము (భాగ. 5. ప్ర-135)

భరతుని వృషలరాజు చంపాలనుకొని తానే చనిపోవడం విశేషం. దీన్ని బ్రాహ్మణులకు హాని చేయదలచినవారు చనిపోతారనే విషయంతో సమర్థించడం జరిగింది. కావున ఇది అర్థాంతరన్యాసం. నిజమైనభక్తులను దైవం ఎప్పుడూ రక్షిస్తుందనే విషయానికి ఇది నిదర్శనం.

### 5.అర్థాపత్తి

హరిసేవ ప్రియవ్రతు
డరయుగు గైవల్య పదవినందుట యరుదే?
ధర జండాలుండైనను
హరినామస్మరణు జెందు నవ్యయపదమున్ (భాగ. 5. ప్ర-23)

ఒక కష్టమైన పనే జరిగిందంటే చిన్నపనెంత? అనే భావన రావడం అర్థాపత్తిలో ఉంటుంది. అంతే గాక చిన్న ప్రయత్నంతోనే పెద్దకార్యం సాధిస్తే, పెద్ద ప్రయత్నంతో సాధించడం ఎంత? అనే భావం రావడం కూడా అర్థాపత్తియే. చండాలుడైనా సరే కొంత హరినామ స్మరణ చేస్తే మోక్షం వస్తుండగా నిత్య శ్రీహరి సేవావ్రతునికి మోక్షం రావడం విశేషమేముంది అనడం అర్థాపత్తి.
ఈ అలంకారం వలన శ్రీహరి నామస్మరణ ఎంత మహిమ కలదో తెలుస్తుంది.

### 6.స్వభావోక్తి

''నాభి' అనే రాజు, అతని భార్య విష్ణువు గూర్చి పూజలు చేయగా వారికి ప్రత్యక్షమైన విష్ణువు స్వరూపం స్వభావోక్తికి చక్కని ఉదాహరణ.

అంతరావిష్కఅత కాంత చతుర్భుజం
  బులును పీతాంబరంబును వెలుంగ
శ్రీవత్సకౌస్తుభ శ్రీరమాచిహ్నంబు
  లురమందు రమ్యమై యిరవు వడుగ
శంకచక్రగదాంబుజాత ఖడ్గాది ది
  వ్యాయుధంబులు చేతులందు మెఱయ
నతులిత నవరత్న హాటకాంకిత నూత్న
  ఘనకిరీట ద్యుతుల్ గడలు కొను గ
గర్ణ కుండల కటి సూత్ర కనకరత్న
  హారకేయూర వరనూపురాది భూష
ణముల భూషితు డైన శ్రీ నాయకుండు
దంపతుల కప్పుడెదుర బ్రత్యక్షమయ్యె (భాగ. 5. ప్ర-43)

శ్రీమహావిష్ణువు దివ్యమంగళరూపం వివిధ ఆభరణాల దివ్యసౌందర్యం మనోహరంగా వర్ణింపబడింది కావున ఇది స్వభావోక్తి.

### 7.దీపకం

....తప్పు సైరింపు నే యమ దండమునకు
హరుని శూలంబునకును వజ్రాయుధమున

కనల చంద్రార్క ధనద శస్త్రాస్త్రములకు
వెఱవ విప్రునకేమది వెఱచినట్లు (భాగ. 5. ప్ర-147)

ప్రకృత, అప్రకృతానికి ధర్మాన్వయం చేయుట దీపకం. రహూగణుండు అను సింధుదేశరాజు తెలియక భరతునితో పల్లకి మోయించినందుకు భరతుడు శపిస్తాడేమోనని భయపడి అంటున్న మాటలివి.

బ్రాహ్మణునికి భయపడడం ప్రకృతం. యమదండం, శివుని త్రిశూలం, వజ్రాయుధం, అగ్ని, చంద్ర, సూర్య, కుబేరుల శస్త్రాస్త్రాలు అప్రకృతం. ఇక్కడ ప్రకృతానికి అప్రకృత విషయాలతో ఏకాన్వయం చెప్పబడింది కావున ఇది దీపకం. ఈ దీపకాలంకారం వలన విప్రుడు కోపగిస్తే ఎలాంటి ఉపద్రవం చెలరేగుతుందో అర్థమవుతుంది.

### 8.సార

భూతజాలములందు భూజముల్ వర్యముల్
భూరుహంబుల కంటె భోగి కులము
భోగి సంతతి కన్నబోధ నిష్టులు బోధ
మాన్యుల కన్నను మనుజ పరులు
వీరికన్నను సిద్ధ విబుధ గంధర్వులు
వారికన్న నసురుల్ వారికన్న
నింద్రాది దేవతలిందరికన్నను
దక్షాది సన్మునుల్ దలప నెక్కు
డంతకన్నను భర్గుడాయభవు కన్ను
గమల భవుడెక్కు డాతని కంటె విష్ణు
డధికుడాతుడు విప్రులనాదరించు
గానవిప్రుండు దైవంబు మానవులకు
(భాగ. 5. ప్ర-74)

ఒక వస్తువు కన్న మరొకటి శ్రేష్ఠతరమని చెప్పుట సారాలంకారము. వృక్షములనుండి శ్రీ విష్ణువు వరకు ఒకరికంటే ఒకరు శ్రేష్ఠమని చెప్పడం వలన ఇది సారాలంకారము. అందరికంటే శ్రేష్ఠతమమైన శ్రీవిష్ణువు బ్రాహ్మణుని ఆదరించుట చేత బ్రాహ్మణుడు అందరికంటే గొప్పవాడని చెప్పటం పద్యతాత్పర్యం.

### 9.క్రమ/యథాసంఖ్య

ఒనరనిట్లు యోగయుక్తుండు గురుడైన
భూపుడైన శిష్యపుత్రవరుల
యోగమతుల జేయ నొప్పుగా వలయును
గర్మపరులు జేయు గాదు కాదు. (భాగ. 5. ప్ర-71)

గురువైన రాజైన శిష్యపుత్రవరులు యోగమతులు చేయవలెను. అన్నపుడు గురువు - శిష్యులను, రాజు పుత్రులను యోగయుక్తులుగా చేయవలెనని చెప్పడం జరిగింది. గురువు, రాజులను మరియు శిష్యులను, పుత్రులను ఒక క్రమంలో చెప్పడం వలన ఇది క్రమాలంకారం..

### 10.విభావన

కారణం లేకుండా కార్యం జరుగుట విభావన.

ఇపుడు మేము నీకు నిష్టంబులగు పూజ
లాచరింపకున్ననైన నధిక
మైన నీకృపాకటాక్షవీక్షణములు
జక్కజూచి తగ ప్రసన్నుడగుచు (భాగ. 5. ప్ర-49)

పూజచేయకున్నా విష్ణువు కృపాకటాక్షవీక్షణాలు లభించాయనడం విభావన. దీన్ని బట్టి విష్ణువు ఎంత భక్త సులభుడో తెలుస్తుంది..

### 11.అపహ్నుతి

ఇది ఉపమేయం కాదు ఉపమానమే అంటూ ఉపమేయాన్ని నిషేధించి ఉపమానాన్ని ప్రతిపాదించడం అపహ్నుతి. గయుడు అనే రాజును ఉద్దేశించి చెప్పినది క్రింది పద్యం.

........సత్యమందు మిగుల సత్సేవయందును
ధర్మమందు యజ్ఞకర్మమందు
గయుడు వసుధలోను గంజాక్షుడే కాని
మానవుడు గాఉడు మానవేంద్ర (భాగ, 5. ద్వి-9)

గయుడు అనే రాజు లక్షణాలు పేర్కొంటూ ఆ లక్షణాల ఆధారంగా ఇతడు కంజాక్షుడే (విష్ణువే) కాని మానవుడు కాడు. అని ఉపమేయమైన గయుణ్ణి మానవుడు కాదు

అని నిషేధించి ఇతడు విష్ణువే అని ఉపమానాన్ని ప్రతిపాదించడం జరిగింది.

కావున ఇది ఆపహ్నుతి..

దీనిని బట్టి గయుడు ఎంత శుభలక్షణుడై ప్రసిద్ధి వహించాడో తెలుస్తుంది.

## 3.ముగింపు:

బొప్పరాజు గంగనగారు భాగవతములోని ఐదవ స్కంధాన్ని మాత్రమే తెలనిగించినప్పటికీ తాను ప్రయోగించిన అలంకారాలు కథా సందర్భానికి మనోహరమైన శోభను చేకూర్చుతున్నాయి.

## ఆధార గ్రంథాలు

1. భాగవతవైజయంతిక. 1983. కరుణశ్రీ (సంపాదకుడు)

2. శ్రీమహాభాగవతము. 1994. బమ్మెర పోతన (ఏడవ ముద్రణ)

***

BHAVAVEENA
Vol. 18, Issue. 9, September 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# Lights! Camera! Action! And the Birth of Historical Film

- ***Dr. Sebastian Joseph***, PG & Research Centre in History, UC College, Aluva.

**Abstract**

Films convey the past as a different mode of expression and presentation. The past when translated as visual images in the moving picture, the narrative gets adapted to the massive entertainment structure of popular film. Written history that follows the dictum of positivist historiography stand apart fro this genre of historical film. Where the written text fails, feature films succeed in capturing the emotive heuristics of the past through making plots ands plots in the way of history telling. The mode of presentation in feature film and historical texts do follow different methods to recreate the past, but films engage in the recreation with signs and symbols different from textualised past. On the screen sometimes historical film take the central theme of the problem and without deviating from it, creates certain plots that did not happen in the past. This is done to capture the attention of the spectators. On a pedagogic level the use of films for propagating history seems highly promising in so far as the films make history an affectionate way of narrating the past.

**Key Words :** Representation, Film, Fiction, Spectator

There is a convention in believing representation of the past, professionally called history, as dead past, unmoving and static in words and phrases and in the form of tangible artefacts, always reiterating positivist notions of objectivity and ultimate truth of historical science. In a post literate world too, many cling to this belief in positivist craftsmanship of history writing, a history that replicate the past , to quote Leopold von Ranke , past as it had exactly happened. Rankean traditionalists who were / are acclaimed professional historians, as a community, cherished the idea of projecting history as factual representation of the past in the light of the critical scrutiny and analysis of sources through a scientific methodology that legitimise the claim of history to the status of being called a science. They consider history as a science of the past that comes under the rubric of social sciences. Implicit in these notions is the belief in scientism, that would create a truthful knowledge of the past through eliminating the philosophical rumination or imagination of the historian and rejection of historical imagination that make room for accommodating an emotional world. In their desire for regulating the entry of the emotional world, a coercive restraint is recommended for containing imagination that would fictionalise and in effect weaken the claim of scientific history writing. Emerging from this standpoint epistemology, is the pertinent question of a narrative past like a chemical bond or mathematical equation that is born in the laboratory of the historian, the archives. The archives become a sacred space for the historian and therefore the textualised past of the archives is to be carried forward into the narrative of the historian.

Left to the world of imagination and creative representation, history moves closer to a novel, a story or a film that delegitimise scientific nature of the historical science. Unmoving belief in scientism and penchant desire for retaining the status of history as a science, any

act of representation other than the stereotyped textual past was considered unscientific, biased, imagined and therefore not worthy of calling as qualified history. Even when showing some respect to literary forms of historical representation in sources like novels, stories and autobiographies with affiliation to certain definite historical context, films were usually regarded as highest forms of fictional representation, as the creation and production of films are basically for entertainment. Entertainment is not the work of the historian and it is the work of those people who create a fantasy world through irresponsible story telling, not history writing, it was argued. A mass popular cultural media, the film caters to all thought and lived worlds and therefore stand poised to impress the spectators through fictionalisation of the real lived spaces, people and events and on most occasions representing the miraculous powers and skills of the human world. How can Gandhi come out from the archives through flesh and blood and Pazhassicry on the screen leaving the sacred space of the archives? How can colonialism and forms of European power told as stories? How can history be set to rolling with a cast of people that unfold their emotional, psychic and personal world without recourse to the conventional forms and structures of history writing? Most of these concerns were predicated on the grounds of a dislike and distrust of the filmic representation of the past from quarters affiliated with foundational positivist notions of historiography.

**History as Film and Film as History :**

Modes of representation of the past have changed over times often taking cue from the changes happening in the society. Creation of the motion pictures and the immense possibility that developed in representing life and times of the past offered a visual treat for the people and simultaneously created a plethora of sources for the historian to examine the spirited histories, an exposure that was inaccessible for the historian in the fixed world of the text. This is to argue that history writing and its epistemological dimensions are linked to the changes offered by technologies that simulate historical sense through intensely feeling with the past, instead of knowing the past through texts. All films have a history to communicate, as all films are produced at a specific cultural milieu. And, they do have a history to communicate through stories pinned to emotions like pain, agony, joy, happiness, contempt, solidarity, revenge, cruelty, care and kindness. What was considered as subjective is treated by films as subjective but the subjective representation on their count recreate a lost emotional world which was out of reach of the histories of the texts. Before proceeding to the argument, one must have an understanding about the genre , historical film. Representation of history(past) communicated through a script, moving images, acting, and other connected technologies like music, sound, editing and vfx can be broadly defined as a historical film. It can be a bio pic, period film and even a complex problem oriented film drawing source bases from political, social, ideological, gender and event oriented historical evidence. Like a historian select and analyse past evidence from various sources the film makers represent history through visuals and moving images through a selective use of the data available. As post modern film historians like Robert Rosenstone and Natalie Zemon Davies argue,

historical films proceed with the past taking a central historical problem as the focus of the cinema and also through adding certain stories, invented for the visual pleasure for the spectator who are not always students of history. This invention of plots and sub plots in no way undermine the historicity of the central problem that the cinema is projecting as a different kind of filmic representation.

**The Spectator / Reader Conundrum :**

All spectators are not readers of history. Historical film produced under the rubric of the film industry focusses on this aspect for the success of the film at the box office as well as its intellectual entertainment value. Films when depict history of an era or a period through shots and definite angles do have a perspective to display on the screen. Film makers as a team prioritise on the top the contentment of the viewer of the film through transmitting a message that can be easily digestible for them without reference to other sources and perspectives. Every shot is filmed bearing in mind of the illiterate spectator belonging to the elite , middle and the subaltern classes whose interest of viewing the historical film is based on aspects more psychological and not intellectual. Every shot is to transmit the meaning immediately to the spectator and any hurdle in understanding the meaning will take away the entertainment value of the film that portray a historical context in the form of an event or individual. The spectator is the viewer and reader of the film and since the film is a visual engagement for few hours , the spectator has to leave the cinema hall without any doubt. This is a major constrain of the maker of the historical film and usually the author of a history book is not concerned about the realisation of the contentment of the reader as the readers are selective members from the community who have the capacity to interrogate the author at any point of time. Beyond this , the reader enjoys the freedom of completing the book in days an even in months and sometimes make a selective reading of chapters. Film on the contrary, is an engagement with a very limited time scale, for a maximum of three hours in the case of lengthy films that develop only in progression with the history/ story that it unfolds. While the readers can wait, the spectators of a historical film cannot wait for days and months in completing their viewing of the film. On a different angle this is the major problem in making a historical film that caters to the diverse class based spectators of the historical film making the digestive nature of the history as the primary agenda of the film maker.

Films are basically made for seeing. It is a visual pleasure document created through collaboration among directors, writers, artists, technicians and other crew that belongs even to the mess. Films are at the intersection of seeing and reading for while at the time of seeing it is entirely a different document that make you feel at home or thrown open into the emotive world of discharge. Seeing is highly momentary and sensual, enabling the spectator as one with the actors and conditions on the screen. Once the seeing is open it opens immense possibilities for a reading of the film through repeatedly seeing the film from beginning to end or a selective seeing for analysing the film and its method of story telling. The later seeing of the film, takes the spectator of the film into an exercise of reading the film for making certain

historical films proceed with the past taking a central historical problem as the focus of the cinema and also through adding certain stories, invented for the visual pleasure for the spectator who are not always students of history. This invention of plots and sub plots in no way undermine the historicity of the central problem that the cinema is projecting as a different kind of filmic representation.

**The Spectator / Reader Conundrum :**

All spectators are not readers of history. Historical film produced under the rubric of the film industry focusses on this aspect for the success of the film at the box office as well as its intellectual entertainment value. Films when depict history of an era or a period through shots and definite angles do have a perspective to display on the screen. Film makers as a team prioritise on the top the contentment of the viewer of the film through transmitting a message that can be easily digestible for them without reference to other sources and perspectives. Every shot is filmed bearing in mind of the illiterate spectator belonging to the elite , middle and the subaltern classes whose interest of viewing the historical film is based on aspects more psychological and not intellectual. Every shot is to transmit the meaning immediately to the spectator and any hurdle in understanding the meaning will take away the entertainment value of the film that portray a historical context in the form of an event or individual. The spectator is the viewer and reader of the film and since the film is a visual engagement for few hours , the spectator has to leave the cinema hall without any doubt. This is a major constrain of the maker of the historical film and usually the author of a history book is not concerned about the realisation of the contentment of the reader as the readers are selective members from the community who have the capacity to interrogate the author at any point of time. Beyond this , the reader enjoys the freedom of completing the book in days an even in months and sometimes make a selective reading of chapters. Film on the contrary, is an engagement with a very limited time scale, for a maximum of three hours in the case of lengthy films that develop only in progression with the history/ story that it unfolds. While the readers can wait, the spectators of a historical film cannot wait for days and months in completing their viewing of the film. On a different angle this is the major problem in making a historical film that caters to the diverse class based spectators of the historical film making the digestive nature of the history as the primary agenda of the film maker.

Films are basically made for seeing. It is a visual pleasure document created through collaboration among directors, writers, artists, technicians and other crew that belongs even to the mess. Films are at the intersection of seeing and reading for while at the time of seeing it is entirely a different document that make you feel at home or thrown open into the emotive world of discharge. Seeing is highly momentary and sensual, enabling the spectator as one with the actors and conditions on the screen. Once the seeing is open it opens immense possibilities for a reading of the film through repeatedly seeing the film from beginning to end or a selective seeing for analysing the film and its method of story telling. The later seeing of the film, takes the spectator of the film into an exercise of reading the film for making certain

film. A suitable example can be drawn from the Malayalam movie *Kerala VarmaPazhassi Raja*, a film that showcases the struggles of a historical hero, who in archival terms according to the versions of the British administrators, looked like a monkey. To make things difficult, this is the only textual document about the appearance of the rebel king, who was to be identified when found dead or alive by the British. Again the description goes to say that he was wearing only a dhoti with a red cap and a moustache with no ornaments. According to the original colonial sources Pazhassi moved on the top of elephants as the terrain of the forest was demanding. For a positivist, archival trained professional historian, the cinematic portrayal of the rebel king can be problematic owing to the falsification of the primary sources, the sacred sources available in the repositories.

This issue makes a classic case for understanding 'true invention' as Rosenstone argued. Leaving a serious contestation of the veracity of the primary document, a film historian has to look at the popular perceptions of the rebel king whose heroism and valour are enmeshed in the historical memory of the people of Kerala over the centuries. In the mind and memory of the people the data regarding the physical features of Pazhassi is insignificant, where the heroism of Pazhassi Raja stand out like a fossilised relic in the popular memory or collective consciousness. The film therefore, cannot neglect this popular memory and straight away make a cross over from the archives direct to the screen. The screen is different, it is a space where history is to meet the emotional as well as societal understanding about the historical hero. Whereas, the archives do not have a corroborative cluster of evidence, the film maker instead of being on a slippery ground , turn to the act of a true invention in compressing the entire scheme of the film under the emotion of heroism. Pazhassi Raja is brought to the fore front in the celestial stardom of Mammootty and dispel any possible threat of rejection or nullification on the part of the audience. On the screen 'MammoottyPazhassiRaja'(emphasis mine) makes sense and go hand in hand with the spirit of the film, heroism and popular perceptions. Similarly elephant is replaced by horse as the symbol of the warrior king, attire is recasted with the look of the *Chekovan*of the Northern ballad and gold ornaments became an essential cinematic addition for bringing splendour onto the screen. Heroism, revenge, isolationism, grief and contempt became cinematic moods well reflected on the face of Mammootty and the whole audience literally moved along with him in the film. This felt realisation of the documents is *sine qua non* in historical film and true invention to that realisation is valid stemming from the responsible filmic- historical imagination of the film maker. It is not the super star but a galaxy of stars and other ordinary actors make the historical crowd visible on the screen, because Pazhassi's struggle cannot be visualised on individual terms for his struggle happened on a vast geographic scale moving from the plains to the forest with lot of affiliating people belonging to different classes.

**From Events to Processes: Imperialism in Film :**

Is cinema incapable of presenting complex histories like the texts do? Can such issues be told through stories? Two crucial questions that need attention in understanding the intellectual

as well as educational values of historical film remains as a problem for many historians. How can stories by theoretical? In cinema, theories are adapted into stories without disturbing the pleasure of the spectator, motifs including landscapes, material belongings and even gestures and moods are cinematically arranged to explain serious epistemological questions of the historical film. This cannot be a simplification or wrong sensical application of theory, but a story centric theoretical directionality essential for the pleasure effect of the movie. From the western box, Battleship Potemkin belongs to this genre where rebellion and solidarity are well explained in the Odessa steps, the steps that has phenomenal potential for locating similar movements and actions elsewhere in the world. The Odessa steps scene where people affirming their solidarity with the rebels unfolds the thesis of dissent and the collective consciousness of the masses that come out against dictatorial regimes of power. Hegemony, Imperialism, Dissent are conditions that need a touching scene wise depiction for moving history along the lines of theory, the theoretical *mise en scene* throughcinematic imagination is the only option left for the film maker. In *IyyobintePusthakam,* a Malayalam movie which can be rightly labelled as a historical movie of complex issues of colonialism, hegemony and protest moves along the screen telling the story of landscape transformation, tea imperialism and exploitation in stories affiliated to individuals whose names may not figure out exactly in the archives. They are invented characters for the film, barring the timber merchant AngoorRawther, a timber trader who dictated terms of timber business in the hilly regions. A timber trader as usual became a villain in the film, though available records do not have a trace in it to establish his villainy.

The encounter with the hero Aloysius towards the end of the film is an invented truth for confirming the defeat at the hands of the hero, celebrated star FahadFazil. These inventions in the script do not take away the significance of the film, its historical value in excavating into the deeper layers of the colonial culture that penetrated onto the hills and created images in the self of the native. The European culture on the hills including the culture of a changed ecology is well filmed in sync with the available documents. The hunger for land , be it the European or the Native and the subjugation of the female body as a just pleasure site is visualised by the film, adding educative value fo locating manifestations of power, hegemony, gender and ecology on the screen. This film comes under the genre of problem oriented historical films that have a flair of bringing deeper concepts and ideologies onto the screen. Films belonging to this genre never uses terms and terminologies like hegemony, imperialism or gendering but put forth them through stories intelligible for the audience and along another plane caters to the need of the serious history researcher. More than that the film used immense material from the archives while conceiving the script that take the film closer to the status of being called a filmic critique of colonialism and the power structure it created.

**Real vs the Unreal : Semantics of Historical Film :**

A major question that confronts the historian or history aspirant is the question of the real past in the films. Real and real pasts are a question of imagination even when one look at the original records from the past. Every document that is classified as the original document on the past is created through imagination and perspectives that dominated the then present

in the past. There is a Past/Present context for all documents that are examined through textual analytical tools and methods by the historian and any history that is reconstructed from these documents is a secondary imagination basing on the first and original emotion of the document writer. The sacrosanct nature of the written history draws its instrumental recognition from the rich source base of the archives. Other than this recognition, the written history too is the outcome of imagination at two levels, the first stage when the document is created in the distant past and the second stage when those documents are used for representation by the historian. In both the stages, imagination is at work. It is argued , therefore, that the reality constructed in the written text as well as the filmic representation are the outcome of imagination based on sources in two different modes of representation. Cinema follows the grammar of the visual and imagination at work in cinema is more revealing and spectacular than the imagination conceived in the written text. The real and the unreal are present in the deeper levels of both the engagements, in cinema as well as the text. The structured grammar couched in the definite format of the text makes the real as seemingly closer to the reader, whereas in the film it is dubbed as fantasy or falsification. Both use their own rules of exposition but when cinema does it, it becomes fantasy in the case of historical films. Printed texts too proceed with meaning creation through an emplotment where plots are imagined in the minds of the historian. The same mode of sequential representation is resorted to by the film maker in communicating the historical with all its viewers and a strategy of such a communication is different in cinema. Real and the unreal are knitted together as the unreal is essential for the transmission of historical meaning for the general public. In texts too the unreal appears in the form of conclusions and standpoints taken by the author based on real/unreal documents of the past. Taking all in all , reality is a construct and implicit in it is the question of the presence of the unreal.

**On the Use of Films as Source for History:**

Any film produced in the past become a source base for the historian as it copy from the lifeworld of the real lived spaces. For instance malayalam films produced in the 1970's depict the milieu of Kerala as it was seen in those times. The landscape including the topography, rivers, trees, animals, attire of people, vehicles, roads, buildings, shops, campuses and all that are part of daily life come along with the humans. Even one could gauge the gender relations and social distinctions of living through a critical analysis of the films. The body and notions of aesthetics are visually transacted in the films that call for more critical studies in the social history of the region. One can ask very curious questions about the advent of technology and the question of alienation of the worker in the film *Odayilninnu*, a film that takes into cognisance the deplorable and miserable life of a rickshaw puller in Kerala. It is the arena where the subaltern world and its images are visually reflected on the screen. Here the film portrays not just the subaltern life, but the emotional world of the poor cycle rickshaw puller and the agony and disillusionment that transcends onto the face of the man ( donned by Sathyan) which no records and written narratives can transmit. The film moves into the felt realisation of the poor to a greater degree than the novel

